మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.3.2025



వయసు వెన్నెల

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



పెద్ద మనసు

మాసపత్రిక, ఏప్రిల్, 2025 ₹ 50/-

ISSN 2454–4329

Mismi april25.indd 1 18-03-2025 16:09:10



గోకుల కృష్ణ గోపాల



బనారస్ ఘాట్

Mismi april25.indd 2 18-03-2025 16:09:12

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 36** **సంచిక 4**

ఏప్రిల్ - 2025

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR

**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

**కార్యదర్శి : జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

UGC Care

LCCN 91-903060

ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com

YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఏప్రిల్ నెల సూచికలు...


వినయ భూషణుడు : డైరి ... 3
రాబిన్ ఐలాండ్ : రాపోలు సీతారామరాజు ... 5
మండూక్యోపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ...11
జీవన మకరందం : ఎ.కె. ...14
లలిత సంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ...15
పుచ్చలపల్లి-శ్రీశ్రీ-విశ్వేశ్వరరావు : **మిసిమి** ... 19
స్త్రీల పాటలు : డా. దాసరి విజయకుమారి ... 27
తాత్త్విక కవయిత్రి : ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి... 31
తిక్కన సాహిత్యం : డా.డి.యువశ్రీ ... 35
ద ట్రెయిన్-చలన చిత్రం : టి.వి. ప్రసాద్ ... 39
భర్తృహరి : పి. హరినాథ్ ...44
భాషా ఉషస్సు-శ్రీనివాస ఛందస్సు : భమిడిపాటి గౌరీ శంకర్ ... 45
అన్నమయ్య ముగ్గుల ముచ్చట్లు : ఆచార్య పి. హరిపద్మరాణి ... 47
మాధవి : డా. నల్లపనేని విజయలక్ష్మి ... 50
భాషల యుద్ధం-భావాల దారిద్ర్యం : డా. గుజ్జు చెన్నారెడ్డి ... 55
ఎట్టయాపురం సంస్థానం : డా. సగిలి సుధారాణి ... 57
అర్క స్మృతి : విద్యాసాగర్ అంగలకుర్తి (ఐ.ఏ.ఎస్) ... 63
తెలుగు నుడికి సరికొత్తముడి : డా. బీరం సుందరరావు ... 64
పప్పన్నం : డా. జొన్నలగడ్డ మార్కండేయులు ... 68
ప్రవాస సాహిత్య దీపాల వెలుగులు : చెన్నూరి సీతారాంబాబు ... 73
మధురవాణి డాఫొడిల్స్-పుష్పవిలాపం : డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల ... 74
చింతన, చేతనల కూడలి-బహుముఖ బనారస్ : సి.ఎస్.ఆర్. ... 76
బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్ : ఐ.వి.రామరాజు, ... 77
కథా హృదయం-వాయులీనం : రాజారామమోహన రావు ... 78
చదవండి : **మిసిమి** ... 79




మండేల



రమేష్ ప్రసాద్

### అట్టమీది బొమ్మలు




పెద్ద మనసు



గోకుల కృష్ణ గోపాల
(గిరిధర గౌడ్)



బనారస్ ఘాట్
(శ్రీనివాస గండూరి)



వయసు వెన్నెల

వివరాలు - పుట : 13

# వినయ భూషణుడు

**ఆ**యన – అవును ఆయనే – ఎన్నోసార్లు **మిసిమి** కార్యాలయానికి వచ్చారు. అన్నిసార్లు నేను పనిలో ఉండి ఆయన్ని పట్టించుకోలేదు – అప్పటి రాణితోనో, తర్వాత ఉమాతోనో మాట్లాడి, చందా కట్టటమో, పుస్తకాలు కొనటమో చేసి వెళ్లిపోయేవారు. ఎప్పుడైనా నా ముందు కూర్చుని వినపడి, వినపడనట్లు మాట్లాడేవారు – ఆయనెవరో చెప్పేవారు. నాకు వినపడకో, పనిలోనో కలిసిపోయేవి ఆయన వివరాలు – చాలా సంవత్సరాల నుంచి ఇలాగే జరుగుతోంది. ఎప్పుడైనా ఒకసారి నేను తీరుబడిగా పలకరించితే – చిరునవ్వు నవ్వేవారు – నేను ఫలానా అని చెప్పేవారు – నేను గుర్తుంచుకోక పోవడంతో సిగ్గుపడేవాణ్ణి – ఆయన అయ్యో! మీరు తపస్సులో ఉంటారు – అందుకని శబ్దం చేయనండి అని అంటుంటే మరీ సిగ్గుగా ఉండేది – ఒకటికి రెండుసార్లు ఇలాంటి సందర్భంలోనే ఆయన తన సంగీత ప్రేమను వ్యక్తపరిచారు – తెలుగు, హిందీ – సంగీత దర్శకులు, గాయకులు అవీ, ఇవీ – అయినా నా మొద్దు బుర్రకి ఆయనమీద శ్రద్ధ కలుగలేదు – మరోసారి మీరు మా ఇంటికి రావాలి అని ఆహ్వానించారు – నేనెవర్ని? చుట్టాన్ని కాదు – స్నేహితుడిని కాదు – అని అనుకున్నానే గాని ఆయన ఆంతర్యం తెలుసుకునే శ్రద్ధ పెట్టలేదు – ఇలా ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి – ఈ జనవరి నుంచి రెండుసార్లు ఉమాకి ఫోన్ చేసి సార్ ఉన్నారా అంటే? చాలా ఒత్తిడని చెప్పినట్టుంది – మరో నెలకి అదే ఫోను – ఆ ఉన్నారు అని అనటం విని – వస్తున్నానమ్మా అన్నారు – మరో అరగంటకి మెల్లగా, మెత్తగా నా ముందు కూర్చున్నారు. నవ్వాను. ఈసారి ఆయన పేరు గుర్తు పెట్టుకున్నాను. బాగున్నారా అని కూడా అడిగాను – ఆయన నిశ్శబ్దంగా నవ్వారు – ఎప్పుడు వస్తున్నారు? అన్నారు – నాకు వెంటనే వెలగలేదు – ఏదైనా శెలవు రోజున పెట్టుకుందామని ఆయనే లీడ్ ఇచ్చారు – ఇద్దరం కేలండర్ చూసి ఇదిగో శనివారం – అదిగో ఆదివారం అనుకున్నాం – అప్పుడు ఎంతమంది వస్తారని అడిగారు. ఏమైనా పెళ్లా? స్నేహితులతో మాట్లాడి చెబుతాను – ఆ తరువాత ఎనిమిది మందిని పోగుచేసి ఆయనకు ఫోన్‌లో – నన్ను నమ్మండి ల్యాండ్ లైనే, చెప్పాను 11 గం॥లకు వస్తాం – ఐదుగంటల వరకు ఉంటాం అని అన్నాను. పెద్దవరమే ఇచ్చారు అన్నారు – అదే నవ్వు – ఆయన 5అడుగుల 5 అంగుళాలు ఉంటారు – ఎప్పుడూ తెల్లని, పల్చని ఖద్దరు చొక్కా వేస్తారు – ఆయన కూడా పల్చగానే ఉంటారు – పల్చగానే నవ్వుతారు – నడవడం కూడా నిశ్శబ్దమే – ఒక్కసారే చూసాను. ఆయన చాఫర్ డ్రివెన్ ఇన్నోవాలో రావటం.



సరస్వతి మహల్

ఐతే ఈ ఆదివారం చాలా దూరం ఉంది – మధ్యలో ఎన్నో జరుగుతాయి – కొంత మంది జారిపోతుంటారు – కొంతమంది జేరుతుంటారు – ఆయన మధ్య మధ్యలో ల్యాండ్ లైన్ నుంచి ఫోన్ చేసి హెచ్చరిస్తూనే ఉన్నారు – నన్ను కాదు ఉమాసుందరిని. చాలా కష్టం మీద అష్టదిగ్గజాలు అనుకున్నవారు – మూడు పక్కల నుండి ఓల్డ్ ఆల్వాల్ చేరాం – నేను – నర్సింగరావుని – ఆయన నా బావగారు అంటూ సెల్‌ఫోన్ నుంచి నాకు ఫోన్ చేసి లొకేషన్ పెట్టారు – టాటా హేరియర్‌లో నలుగురం ఎమ్మార్ ఎమ్మార్, రాంబాబు, రామరాజు మరి నేను ఆశ్రమం నుంచి బయలుదేరాం – ఆనందనిలయం కాంపౌండ్ గుమ్మంలో ఆగాం – మాకోసం ఎదురు చూస్తున్న నర్సింగరావు గారు ఆహ్వానించారు – గేటు దాటి అటూ ఇటూ చెట్లు, పూలమొక్కలు, పచ్చటి లాన్ చూస్తూ (గెరాజ్‌లో బెంజీ, టయోటా కార్లు విశ్రాంతి తీసుకుంటున్నాయి) వరండా చేరి ఒక్కసారి అవాక్కయిపోయాం –

ఎందుకంటే అక్కడ వినాయకుడు లేడు – వెంకటేశ్వర స్వామి లేడు – సాయిబాబా లేడు – గురజాడ అప్పారావు గోడమీద వేలాడుతున్నాడు – ఎక్కడ తెలంగాణ, ఎక్కడ పాత ఆల్వాల్ – ఎక్కడ విజయనగరం – ఎప్పటి గురజాడ! ఆ విధంగా గమనించినవారమై ఆశ్చర్యపోతుండగా – ఆయన అదే వినయంతో రండి అశ్వినీగారు అంటూ రెండో అంతస్తుకు లిఫ్ట్‌లో తీసుకెళ్లారు – తీసుకెళ్లారంటే అదొక మహల్ – సరస్వతి మహల్ – అక్కడ సంగీత సరస్వతులు కొలువుదీరి ఉన్నారు – ఓ పక్క సుబ్బులక్ష్మి, మరోపక్క ఘంటసాల మాష్టారు – ఆ పక్క లత – ఆ ప్రక్కనే రఫీసాబ్ – కిందుగా రవి – ఇలా ఎందరి పేర్లని చెప్పను – ఏమని చెప్పను – నన్ను పక్కన కూర్చోపెట్టుకుని 78 ఆర్.పి.ఎమ్. రికార్డు వాగ్దానంలో ఓ పాట వినిపించారు – అయితే ఇది నాకు ఒక టైమ్ షాక్ – పదహారేళ్ల ప్రాంగణంలోకి బంతిపూల తోరణం కిందకి తడి తడి వెన్నెల మడుగులోకి జారిపోయాను – ఇది ఒక ఆర్ద్రమైన మానసిక స్థితి. కాలనేమిలో చిక్కువడిన భౌతిక స్థితి – ఆయన్ను ఆలింగనం చేసుకుని నా ఆనందాన్ని వెలిబుచ్చాను – ఇన్నేళ్లుగా నన్నెందుకు పిలుస్తున్నారో – ఆయన నాలో ఏమి చూసారో తెలుసుకోగలిగాను – ఆయన వినయానికి సిగ్గుతో చచ్చిపోయాను – ఆయన మర్యాదకు కుంచించుకు పోయాను – ఆయనే నక్షత్ర కాంతి కాంతారావు – వినయ భూషణుడు.



శ్రీ కాంతారావు

నాకేమి పాటలు ఇష్టమో అడిగి పెద్ద బ్లూటూత్ స్పీకర్లో వినిపించారు (సాంకేతిక సహాయం రాంబాబు). ఒకోపాట ఏ రాగమో ఆయన వివరిస్తుంటే ఆశ్చర్యపోవటం నావంతయింది. 'మీకు మెలోడి – మోహనరాగం ఇష్టమని తెలుస్తోంది' అంటారు.

వెన్నెల విందు – వారి హాలంత వరండాలో ఎప్పుడో త్వరలోనే అనుకున్నాం – అలాగే వారి ప్రజ్ఞాపురం (ఎలాంటి పేరు గల ఊరు) – మామిడి తోటల్లోకి – వారి గడీ లోకి వెళ్లాలని ప్రణాళికలు రచించాం. నాలుగు గంటలకు వెళ్లాలని అంటే అయిదింటి వరకూ వుంటానన్నారని గుర్తు చేశారు! అంతటి హాలులో చిన్న టి.వి. కూడా లేదు – ఆ నాతో ఉన్న దిగ్గజాలు, శ్రీయుతులు అనుమాండ్ల భూమయ్య – రవి పాడి – చెన్నూరు సీతారాంబాబు – ఇందుకూరి రామరాజు – మునగా రామమోహన రావు – అష్టదిగ్గజాలు అన్నాం కదా! ఇద్దరు జారిపోయారు – పేర్లు ఎందుకులెండి? అదన్నమాట.

**చక్రవర్తి పోషకులు :** రాజపోషకులు ఉంటారు – మహారాజ పోషకులు ఉంటారు – సాహిత్య చరిత్ర చూస్తే కవులను – ప్రబంధ కవులను పోషించి సాహిత్య సేవ చేసింది ఈ మహారాజపోషకులే కదా! – ఇప్పుడు మీకు చక్రవర్తి పోషకుల గురించి చెప్పాలి. అర్ధశతాబ్దం పైగా పత్రికలు నడిపి నల్లరేగడి ముప్పై ఎకరాలు సమర్పించి – అక్కడికీ ఆగక – రాజధానికి వచ్చి – సారస్వత పత్రిక **మిసిమి** ముసుగు తీసి – ప్రకటనలు తీసుకోము – ప్రకటనలు ఇవ్వము అంటే ఈ నెల పత్రిక మార్కెట్లో ఉంది, అని అదే కాదు రాజకీయాలు, సినిమా వార్తలు వెయ్యం – కథలు, కాకరకాయలు వద్దు – కవితలు, వెతలు అసలే ఒద్దు – అంటూ గిరిగీసుకుని **మిసిమి**ని పాఠకులకు ప్రతినెల చేరుస్తూ – కోట్ల రూపాయలు సాహిత్యసేవకు సారస్వత మేళానికి ఇన్నేళ్లుగా సమర్పిస్తున్న వారిని చక్రవర్తి పోషకులే అనాలి కదా! ఆ చక్రవర్తి పోషకుల సామ్రాజ్యాన్ని చూడాలని రావిర్యాల వెళ్లాం – దాదాపు మూడుగంటలు – మూడులక్షల చదరపు అడుగులు – సింగపూర్‌లో ఉన్నామా? హాంకాంగ్‌లో ఉన్నామా అనే రీతిలో యాంబియన్స్ – వోగ్ లాంటి అంతర్జాతీయ మాస పత్రిక ముద్రిస్తున్న ప్రదేశం – ఎయిర్ ఇండియా ఇన్ ఫ్లైట్ మ్యాగజైన్ – ప్రింటవుతున్న ప్రదేశంలో మిషన్ల శబ్దాలు తప్ప మనిషి మాట వినపడని క్రమశిక్షణ. లెగసీ అంటే ఆలపాటి రవీంద్రనాథ్ నాటిన ఓ టేకుమొక్క మానై, ఇంతై ఇక్కడ అందమైన, అద్భుతమైన ఆరడుగుల టేబుల్ రూపంలో మెరిసిపోవటం చూశాం. – అదే రావిర్యాల కళాజ్యోతి ప్రాంగణం – వారే **మిసిమి**కి చక్రవర్తి పోషకులు.

# రాబిన్ ఐలాండ్

– రావోలు సీతారామరాజు



రాబిన్ ఐలాండ్

'రాబిన్ ఐలాండ్' ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక స్థలం, దక్షిణాఫ్రికా చరిత్రలో ఈ ద్వీపానికి ప్రత్యేక స్థానముంది. కేప్‌టౌన్ నగరంలోని పర్వతసానువులు ఎక్కి చూస్తే పదకొండు కిలోమీటర్ల దూరాన అట్లాంటిక్ మహాసముద్రం మధ్యలో అండాకారంలో అందంగా కనిపించే ద్వీపమే ఈ 'రాబిన్ ఐలాండ్' అమాంతం అందుకోవచ్చు నెంత దూరంలోనే ఉన్నట్లు భ్రమింపజేసినా, శతాబ్దాల తరబడి ఈ ద్వీపం జనసామాన్యానికి అందనంత, అందుకోలేనంత దూరంలోనే ఉండిపోయింది. వందల ఏళ్ళపాటు ఈ దీవిని ప్రపంచం పరదా చాటునుండే చూడాల్సి వచ్చింది.

పోర్చుగీసు నావికుడు Bartolomeu Dias 1488లో ఈ ద్వీపాన్ని కనుగొన్నది మొదలు ఇది స్వార్థ సామ్రాజ్యవాద శక్తులకు స్థావరమైపోయింది. 1652లో దచ్చివారు కేప్‌టౌన్‌లోతమ స్థావరం ఏర్పాటు చేసుకున్నాక. ఈ దీవిని కూడా స్వాధీనపరుచుకున్నారు. అది మొదలు 342 ఏళ్ళపాటు అంటే 1994 వరకు ఈ ద్వీపం సామ్రాజ్యవాద శక్తుల కబంధహస్తాల్లోనే పెనుగులాడింది. ఆఫ్రికన్లను అణగదొక్కడానికి కర్మాగారమైంది. పాశ్చాత్యుల క్రూరత్వానికి ప్రయోగశాల అయ్యింది. చెరసాలకు పర్యాయపదంగా నిలిచిపోయింది. పీడనకు కార్యశాలగా, మొత్తంగా మరో నరకకూపంగా పేరుగాంచింది.

తొలినాళ్ళలో పోర్చుగీసు, డచ్, బ్రిటీష్ నావికులు ఈ దీవిని తమ ఓడలకు ఇంధనాన్ని నింపుకునే కేంద్రంగా, చిన్నపాటి విడిదిగా ఉపయోగించారు. తరువాత బానిసలతో పని చేయించుకోవడానికి, యుద్ధఖైదీలను బంధించడానికి వాడుకున్నారు. 1845 నుండి యాభై ఏళ్ళపాటు కుష్టురోగులకు చావుకు ముందే నరకాన్ని చూపించే కాలనీ అయ్యింది. కొన్నాళ్ళు మానసిక వికలాంగుల డంప్‌గా వాడబడింది. రెండో ప్రపంచయుద్ధ సమయంలో సైనిక స్థావరంగా పనిచేసింది. డచ్, బ్రిటీష్ సామ్రాజ్యవాదులు ఈ దీవిని ఎన్నో రకాలుగా ఉపయోగించుకున్నా, ఎదురు తిరిగిన ఆఫ్రికన్లను చెరపట్టడానికి ఒక బందీఖానాగా ఉపయోగించడం మాత్రం ఎన్నడూ ఆపలేదు. ఐదు శతాబ్దాల సుదీర్ఘ కాలంలో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కేవలం ముప్పై ఏళ్ళు మాత్రమే ఇక్కడ చెరసాల అనే మాట వినబడలేదు. కేవలం 575 హెక్టార్ల విస్తీర్ణం మాత్రమే ఉన్నా తరతరాల చరిత్రను నిక్షిప్తం చేసుకుంది ఈ ద్వీపం, ఎంత చెప్పుకున్నా ఒడవని పీడన మూలాలున్నాయిక్కడ. ఎన్నటికీ తరగని పోరాటస్ఫూర్తి పాఠాలున్నాయి. అపార అనుభవ నిధులున్నాయి. ఇంతటి వేదనాభరితమైన చరిత్ర ఉన్నాకూడా ఈ ద్వీపం ప్రపంచానికి చిరపరిచితమైంది. మాత్రం అపార్థైడ్ (వర్ణవివక్ష) వ్యతిరేక పోరాటయోధులను ఇక్కడ బంధించడం వల్లనే. ముఖ్యంగా మండేలాను పద్దెనిమిది ఏళ్ళపాటు బంధించడం వల్లనే.

1994లో జాత్యహంకార వర్ణవివక్ష (అపార్థైడ్) అంతమై దక్షిణాఫ్రికాలో ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడ్డ తరువాత కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం పీడనకు, వివక్షకు, అణచివేతకు, అహంకారానికి ప్రతిరూపంగా ఉన్న ఈ దీవిని గత చరిత్ర తాలూకు చేదు జ్ఞాపకాలను భద్రపరిచే భాండాగారంగా, ఆ గాయాలను మాన్పి ఊరటనిచ్చే సంజీవనిగా, సరికొత్త ఆశకు అలంబనగా, వివక్షపై విజయానికి సంకేతంగా, స్వేచ్ఛకు ప్రతిరూపంగా, జాతి సంపదగా భావితరాలకు అందించాలనుకుంది. అందుకే ఈ ద్వీపాన్ని ఒక వ్యవస్థీకృత మ్యూజియంగా తీర్చిదిద్దింది. ప్రపంచ పర్యాటకుల సందర్శనకు ఆహ్వానం పలికింది.



కేప్ టౌన్ నగరం

అందుకోసం సకల హంగులు, సౌకర్యాలు సమకూర్చింది. 1997 జనవరి 1 నుండి మొదలు ఈ దీవిని ఇప్పటి వరకు ప్రపంచం నలుమూలల నుండి లక్షలాది మంది సందర్శించుకున్నారు. ప్రతి ఏటా దాదాపు యాభైవేలమంది సందర్శిస్తూనే ఉన్నారు. 1999 లో యునెస్కో ఈ ద్వీపాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. అంతటి చరిత్ర కలిగిన రాబిన్ ఐలాండ్ పర్యటనకు అక్టోబర్ 2024 లో బయలుదేరాను. ఇది నా ఆరో పర్యటన, ఐతే ఈసారి మండేలా జీవితచరిత్రను ఆసాంతం అధ్యయనం చేసిన, అపార్థైడ్ పోరాటచరిత్రను చదివిన అనుభవాన్ని వెంటబెట్టుకుని మరీ వెళ్ళాను.

కేప్‌టౌన్ నగరం అంచున అట్లాంటిక్ మహాసముద్రం తీరాన V&A Waterfront అనే విలాసవంతమైన రేవు నుండి ఈ పర్యటన ప్రారంభమవుతుంది. ఈ రేవులోనే 'నెల్సన్ మండేలా గేట్వే మ్యూజియం' అనే భవనం ఒకటి నిర్మించారు. అక్కడి నుండే రాబిన్ ఐలాండ్‌కు ఫెర్రీ (స్పీడ్ బోట్) ద్వారా రాకపోకలు జరుగుతాయి. 2200 చ.మీ. విస్తీర్ణం కలిగిన మూడు అంతస్తుల భవనమిది. రాబిన్ ఐలాండ్లో ఉన్న జైళ్ళ నమూనాను పోలినట్లుండే పెద్ద వరండా, 150 మంది కూర్చోగలిగే ఆడిటోరియం, చిన్న రెస్టారెంట్, టికెట్ కౌంటర్, ఛాయాచిత్ర ప్రదర్శనశాల ఈ భవన ప్రత్యేకతలు, ఇక్కడే టికెట్ కొనుక్కోవచ్చు. కాని ముందస్తుగా ఆన్‌లైన్లో కొనుక్కోవడం ఉత్తమం, టికెట్ ధర దక్షిణాఫ్రికావాసులకు, అంతర్జాతీయ యాత్రికులకు వేరువేరుగా ఉంటుంది. సంవత్సరం పొడుగూతా ఈ దీవి తెరిచే ఉంటుంది. అయితే సందర్శనకు వసంతకాలం, వేసవికాలం అనుకూలమైన రోజులు (సెప్టెంబర్ నుండి మార్చ్ వరకు), అట్లాంటిక్ మహాసముద్రం, కేప్లాన్ నగరం ఈదురుగాలులకు ప్రసిద్ధి. కావున ఈ ద్వీపయాత్ర వాతావరణ పరిస్థితులను బట్టి ఏ క్షణంలోనైనా రద్దయ్యే అవకాశాలుంటాయి. ప్రతిరోజు నాలుగు టూర్లు ఉంటాయి. ఇక్కడ నుండి ఫెర్రీలో రాబిన్ ఐలాండ్కు వెళ్ళడానికి ఒక అరగంట, అక్కడ సందర్శనకు మూడున్నర గంటలు, తిరుగు ప్రయాణానికి అరగంట మొత్తం కలిపి ఈ పర్యటనకు రమారమి నాలుగున్నర గంటల సమయం పట్టొచ్చు. ఆ నాలుగన్నర గంటల ప్రయాణంలో నాలుగు వందల యాభై సంవత్సరాల చరిత్రను తవ్వుకొని అనుభూతిలోకి తెచ్చుకోవచ్చు.

ఈ భవనంలోని ఆడిటోరియంలో దక్షిణాఫ్రికా అపార్థైడ్ వ్యతిరేకోద్యమానికి సంబంధించిన డాక్యుమెంటరీలు ప్రదర్శిస్తారు. ఇక అక్కడున్న ఫోటో గాలరీ ఐతే దక్షిణాఫ్రికా చరిత్ర మొత్తాన్ని క్రమానుగతపద్ధతిలో మనకు వివరిస్తున్నట్లే ఉంటుంది. సాయంత్రం మూడు గంటలకు వెళ్ళాల్సిన మా ఫెర్రీ ఒక గంట ఆలస్యంగా బయలుదేరింది. ఫెర్రీలో నాతో పాటు దాదాపు 250 మంది పర్యాటకులున్నారు. మాకందరికి రాబిన్ ఐలాండ్ దర్శింపజేయటానికి ఫెర్రీ తన నడక మొదలుపెట్టింది. ముందే అన్నట్లుగా ఈసారి దక్షిణాఫ్రికా చరిత్రను, మండేలా జీవిత చరిత్రను అధ్యయనం చేయటం వల్ల, ఫెర్రీ బయలుదేరే ముందు అక్కడున్న ఫోటో గాలరీని నిశితంగా పరిశీలించడం వల్ల దక్షిణాఫ్రికా వర్ణవివక్ష తాలూకు వేదనను మోసుకెళ్తున్న భావనతో మనసు బరువెక్కి కించిత్ దిగులు ఆవహించింది. దానికి తోడు సముద్ర ప్రయాణమన్నా, కుదుపులతో కూడిన ప్రయాణమన్నా నా ఒంటికి పడదు. రెండూ కలగలిపి మానసికంగా, శారీరకంగా డీలా పడిపోయాను. శతాబ్దాల తరబడి ఎంతమంది ఆఫ్రికన్లను ఇలా పడవల మీద బంధించి తీసుకెళ్ళారో? ఎంతమంది విలువైన జీవితకాలం ఆ దీవిలోనే మగ్గిపోయిందో? నా ఆలోచనలతో పాటు ఫెర్రీ నడక కూడా సాగుతూనే ఉంది. పడవలోని చాలా మంది పర్యాటకులు ఆ సముద్రయానాన్ని ఆనందంగా ఆస్వాదిస్తున్నారు. అలలసొగసులతో ఆటలాడుకుంటున్నారు. కొంతమందేమో కునికిపాట్లు పడుతున్నారు.

ఈ దీవిని కనుగొన్న తొలినాళ్ళలో ఇక్కడ వందలాది సీల్ చేపలుండేవి. డచ్ భాషలో రాబిన్ అంటే సీల్ అని అర్థం.. ఐలాండ్ అంటే ద్వీపం అన్న అర్థం తెలిసిందే. ఆరకంగా ఈ దీవికి రాబిన్ ఐలాండ్ అని పేరు వచ్చింది.



నెల్సన్ మండేలా మ్యూజియమ్

సీల్ చేపలతో పాటు అనేక జంతుజీవాలు, అరుదైన వృక్షజాతులతో, ఎటుచూసినా పచ్చదనంతో కళకళలాడుతూ ఉండేదట. మనిషి అడుగుపెట్టడంతో కాలక్రమేణా వాటన్నిటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కొన్నైతే పూర్తిగా కనుమరుగైపోయాయి..

ముప్పై నిమిషాల బరువైన సుదీర్ఘ ప్రయాణం తరువాత ఫెర్రీ రాబిన్ ఐలాండ్‌కు చేరుకుంది. దిగీదిగగానే ఎదురుగా ఉన్న గోడ మీద మొట్టమొదటిసారిగా అపార్థైడ్ వ్యతిరేకోద్యమకారులను చెరపట్టి ఖైదీలుగా తీసుకొచ్చిన పెద్ద చిత్రమొకటి మనను కూడా జైల్లోకి ఆహ్వానిస్తున్నట్లే ఉంటుంది. సుమారు యాభై మీటర్ల దూరంలో దీవి మొత్తం తిప్పి చూపించడానికి మాకోసం బస్సులు ఎదురు చూస్తున్నాయి. ఆ బస్సులో డ్రైవర్‌తోపాటు ఒక గైడ్ కూడా ఉంటారు. దక్షిణాఫ్రికాలో అధికారికంగా పదకొండు భాషలున్నప్పటికీ అనేకంగా వచ్చే అంతర్జాతీయ సందర్శకుల సౌకర్యార్థం ఆ గైడ్ ఇంగ్లీష్‌లోనే మాట్లాడతారు. అన్నట్లు ఇక్కడ చల్లటి ఈదురు గాలులు ఎక్కువగా వీస్తుంటాయి. కాబట్టి వెచ్చదనాన్నిచ్చే దుస్తులు, వాటర్ బాటిల్, చిన్న పిల్లలుంటే తేలికపాటి స్నాక్స్ వెంటతెచ్చుకోవడం మంచిది. బస్సు కదిలింది. లోపలికి వెళ్ళడానికి ముందు ఒక ప్రధాన ద్వారం ఉంటుంది. దాని మీద ఈ దీవిని జైలుగా వాడినప్పటి రోజుల్లో పెద్దక్షరాలతో రాసిన We serve with pride అనే నినాదం కనిపిస్తుంది. ఇంతకంటే పెద్ద ఐరనీ ఇంకెక్కడా ఉండదేమో అనిపించింది.

ఆ ప్రధాన ద్వారానికి కుడిపక్కనే కొన్ని గదులు ఉన్నాయి. ఆ గదులు ఖైదీల ములాఖాత్‌ల కోసం ఉపయోగించేవారట. కొత్త ఖైదీలకు ఆరు నెలలకు ఒక ములాఖత్ మాత్రమే ఉండేదట. సంవత్సరాల తరబడి జైల్లో మగ్గి సీనియారిటీ పెంచుకునే కొద్దీ ములాఖత్ల సంఖ్య పెరిగేదట, విషాదకరమైన విషయమేమిటంటే పది పదిహేనేళ్ళపాటు తమ కుటుంబ సభ్యుల చూపుకు నోచుకోకుండా ఇక్కడ నిస్సారమైన జీవితాన్ని గడిపిన పేద ఉద్యమకారులు కోకొల్లలు, ఈ పర్యటనలో ఈ గదులను చూపించరు. బస్సు కొంచెం ముందుకు కదలగానే ఎదురుగా జైలు భవనాలు కనిపిస్తాయి. ఐతే వీటిని బస్సు పర్యటన పూర్తయిన తరువాత ఆఖర్లో కాలినడకన తీసుకెళ్ళి చూపిస్తారు. కొంచెం ముందుకు వెళ్ళాక శ్మశానవాటిక కనిపిస్తుంది. 1854 నుండి యాభై ఏళ్ళపాటు ఈ దీవిని కుష్టురోగ కాలనీగా కూడా ఉపయోగించారు. ఈ వ్యాధికి ఎటువంటి చికిత్స లేని రోజులవి, కాలనీ అంటే ఆ రోగులను ప్రజలకు దూరంగా ఇక్కడ వారి మానాన వారిని మరణించేదాకా వదిలేయడమన్నమాట. అత్యంత దీనస్థితిలో మరణించిన ఆ రోగుల వేదనకు సాక్ష్యాలే ఆ సమాధులు. ఆ వెంటనే ఒక పురాతన చర్చ్ కనబడుతుంది. ద్వీపం మొత్తంలో ఇదొక్కటే ప్రైవేట్ ప్రాపర్టీ అట. ఇంకొంచెం ముందుకు వెళ్ళాక జైలు వార్డెన్లు, అధికారులు, మిగతా సిబ్బంది నివసించడం కోసం కట్టిన గ్రామం కనిపిస్తుంది. ఆస్పత్రి, పాఠశాల, చర్చ్, ఆటస్థలాలు మొదలైన సకల సౌకర్యాలున్న చిరుగ్రామం అది. గ్రామం మధ్యలో ఉన్న పెద్ద చర్చ్ పెళ్ళిలకు ప్రసిద్ధి అట. ప్రతి ఏడాది వాలెంటైన్స్ డే రోజున ఆసక్తి ఉన్న జంటలు ఇక్కడికి వచ్చి వివాహబంధంతో ఏకమయ్యేవారట. కరోనా ఉత్పాతం తరువాత ఆ తంతు దాదాపుగా ఆగిపోయిందట.

ఆ తరువాత కనిపించేది రాబర్ట్ సాబుక్వేను ఏకాంత నిర్బంధంలో ఉంచిన చిన్న ఇల్లు, మాటకు మహత్తర శక్తి ఉంటుందనడానికి, మాటతో లక్షలాది హృదయాల్ని తట్టిలేపి ఉద్యమం వైపు ఉరకలెత్తేలా చేయొచ్చనడానికి, మాటతో కరడుగట్టిన రాజ్యానికి సైతం భయప్రకంపనలు పుట్టించొచ్చనడానికి రాబర్ట్ సాబుక్వే నిలువెత్తు సాక్ష్యం. రాబర్ట్ సాబుక్వే వర్ణవివక్ష వ్యతిరేకోద్యమకారుడు. ప్యాన్ ఆఫ్రికనిస్ట్ కాంగ్రెస్ వ్యవస్థాపకుడు, అతనికున్న వాగ్ధాటికి, ఛరిస్మాకు ప్రజలు ఆకర్షితులై వర్ణవివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారన్న భయం పట్టుకుంది తెల్లజాతి ప్రభుత్వానికి, అతన్ని ఎలాగైనా కట్టడి చేయాలనుకుంది.

ఏ సాకూ దొరకక, ఏకంగా పార్లమెంట్‌లో సాబుక్వే క్లాజ్ అనే ఒక కొత్త చట్టాన్ని తీసుకొచ్చి ఇక్కడ రాబిన్ ఐలాండ్‌లో ఏకాంత నిర్బంధంలో ఉంచింది. మొదట రెండేళ్ళ కోసమే అని తీసుకొచ్చిన చట్టాన్ని అతని మాట మీదున్న భయంతో ఆరేళ్ళ వరకు (1963 నుండి 1969 వరకు) పొడిగించింది. ఆ ఆరేళ్ళూ చాలక అతను చనిపోయే వరకు గృహనిర్బంధంలో ఉంచింది. అదీ అతని మాటకున్న శక్తి- మండేలాతో సహా అనేక మంది రాజకీయ ఖైదీలు అక్కడ శిక్షననుభవిస్తున్నా, వారందరి పట్ల జైలు అధికారగణం క్రిమినల్ ఖైదీల్లానే వ్యవహరించింది. ఒక్క బుత్వేనే రాజకీయ ఖైదీలా పరిగణించింది. అక్కడి అధికారిక డాక్యుమెంట్లలో కేవలం సాబుక్వే ఒక్కడి పేరే ఎరుపు రంగుతో రాయబడింది. బహుశా శ్వేతజాతి ప్రభుత్వానికి తెలియదేమో ఇక్కడున్న ఖైదీలందరిలో ఉరకలెత్తే ఉద్యమ రక్తం రంగు ఎరుపేనని, ఆ చిన్న ఇల్లు జైలు భవనాలకు, దీవిలోని మిగతా నిర్మాణాలకు దూరంగా ఉంటుంది. అందులో అతనొక్కడే ఉండేవాడు. ఎవ్వరితో మాట్లాడకూడదు. ఎవ్వరినీ కలవకూడదు. రెండు గదులున్న ఆ ఇంటిని మ్యూజియం నిర్వాహక బృందం యధాతథంగా ఉంచే ప్రయత్నం చేసింది. ఈ ఇంటిని కూడా కేవలం బయటనుండే చూడగలం. బస్సు కదులుతూనే ఉంది. గైడ్ వ్యాఖ్యానం వినిపిస్తూనే ఉంది. బస్సు ముందుకు వెళ్తున్న కొద్దీ కాలం వెనక్కు ప్రయాణిస్తున్న భావన కలుగుతుంది. నెల్సన్ మండేలా, వాల్టర్ సిసులు, గొవాన్ మ్‌బెకి, రేమండ్ మ్‌ట్లాబా, అహ్మద్ కత్రాడా, మాక్ మహారాజ్ మొదలైన ప్రముఖ వర్ణవివక్ష ఉద్యమకారులతో పాటు వందలాది ఉద్యమకారులను ఈ దీవిలో సంవత్సరాల పాటు బంధించి ఉంచింది శ్వేతజాతి



రాబర్ట్ సొబుక్వే ఇల్లు

ప్రభుత్వం. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకబ్ జూమా కూడా కొన్నాళ్ళు ఇక్కడ ఖైదీగా జీవితాన్ని గడిపినవాడే.

బస్సు ఇంకొంచెం ముందుకు వెళ్ళాక సున్నపు క్వారీ కనిపిస్తుంది. పైన చెప్పుకున్న నాయకులందరూ ఈ ద్వీపానికి రాజకీయ ఖైదీలుగా తరలించబడ్డవారే. నిబంధనల ప్రకారం వాళ్ళతో శారీరక శ్రమను చేయించకూడదు. ఒకవేళ చేయించినా భారీ శ్రమతో కూడినవి అసలే చేయించకూడదు. అందుకు విరుద్ధంగా అధికారులు వీరిని ఈ సున్నపుక్వారీలో దశాబ్దం పైగా ఒళ్ళు హూనమయ్యేలా పని చేయించారు. ఎర్రటిఎండలో పనిచేయడం కంటే కూడా, సూర్యకాంతి ఆ సున్నపురాయిపై పడి కళ్ళకు హాని కలిగించడమే వీరిని ఎక్కువగా బాధించిన విషయం. ఆ సున్నపుక్వారీలోనే చిన్నపాటి గుహలాంటిది కనిపిస్తుంది. మధ్యాహ్నపు భోజనాన్ని ఆ గుహలోనే తినేవారట. కర్కశత్వం నరనరాన జీర్ణించుకున్న కొందరు తెల్లజాతి వార్డెన్లు వీరు తినేప్పుడు వచ్చి వీళ్ళపక్కనే మూత్ర విసర్జన చేసేవారని మండేలా తన ఆత్మకథలో చెప్పుకున్నారు. అంత కష్టంలో కూడా ఈ దీవిలో ఉన్నన్నాళ్ళు ఈ నాయకులందరూ క్వారీలో పనిచేసే సమయంలోనే ఎక్కువ ఆనందంగా గడిపేవారట. అక్కడ మాత్రమే వీళ్ళకు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం దొరికేది, ఇక్కడ పనిచేస్తున్నప్పుడే వీళ్ళ మధ్యన చర్చోపచర్చలు సాగేవి, ఒకరికి తెలియని విషయాలను ఇంకొకరితో వంచుకునేవారు.

ఆ రకంగా అది వాళ్ళకొక విద్యాలయంగా కూడా పనిచేసింది. అంతేకాదు వర్ణవిషక్ష వ్యతిరేకోద్యమకారులు ఈ దీవిని ముద్దుగా విశ్వవిద్యాలయం అని పిలుచుకునేవారు. ఎందరెందరో నాయకులు ఇక్కడికి ఖైదీలుగా వచ్చి విద్యావిషయక విజ్ఞానాన్నే కాకుండా ఉద్యమపోరాటానికి సంబంధించిన విషయాలను సైతం లోతుగా తెలుసుకున్నారు. ఈ దీవికి వచ్చేనాటికి జాకబ్ జూమాకు ఇంగ్లీష్ చదవడం, రాయడం రానేరాదట. ఇక్కడే నేర్చుకున్నాడట. ఆ తరువాత ఫోటోలు తీసుకోవడానికి ఆసక్తి ఉన్నవాళ్ళ కోసం దీవిలో ఒక మూలన బస్సును ఆపుతారు. అక్కడనుండి కేప్‌టౌన్ నగరం స్పష్టంగా కనిపిస్తుంది. ఇక్కడ నుండి ఈదుతూ ఆ నగరానికి సునాయాసంగా చేరుకోవచ్చు కదా అనే ఆలోచన అనేక మంది పర్యాటకులకు కలగొచ్చు. ఇక్కడున్నది శీతల



నెల్సన్ మండేలా సెల్

ప్రవాహ అట్లాంటిక్ మహాసముద్రం. ఎల్లప్పుడూ ఒళ్ళు జువ్వుమనిపించేంత చల్లదనంతో ఉంటుంది. అందుకే ఈ దీవిలో బంధించబడిన ఒక్క ఖైదీ కూడా ఇక్కడనుండి పారిపోయి బతికి బట్టకట్టిన దాఖలాలు లేవు. ఒకప్పుడు అడుపాజ్జులతో కూడిన కర్ణకఠోరమైన కేకలతో ప్రతిధ్వనించిన, శతాబ్దాల తరబడి పీడనకు, వేదనకు గురైనవారి ఆక్రందనలతో కునారిల్లిన ఆ దీవి నేడు మృదుమధుర స్వేచ్ఛాగీతాలు పాడుకుంటుంది. అక్కడ తిరుగాడుతున్నప్పుడు ఆ రెండింటి మిశ్రమధ్వని ఏదో చెవుల్లో మార్మోగి మనసును ఒక విచిత్ర భావనకు లోనుచేస్తుంది. ఒక్కప్పుడు ఓడల గమనానికి దిశానిర్దేశం చేయడానికి ఉపయోగించిన లైట్ హౌజ్‌ను, రెండో ప్రపంచ యుద్ధసమయంలో ఈ దీవి సైనిక స్థావరంగా పనిచేసిందనడానికి సాక్ష్యాలుగా మిగిలిన బంకర్లు, టాంకర్లను చూపించుకుంటూ బస్సు ముందుకు కదిలి జైలు భవనాల దగ్గర ఆగిపోతుంది.

బస్సు డ్రైవర్, గైడ్ వీడ్కోలు పలికి వెళ్ళిపోతారు. ఇక్కడనుండి జైళ్ళ సందర్శన కాలినడకన సాగుతుంది. బస్సు దిగగానే అపార్థైడ్ కాలంలో ఇక్కడ జైలుశిక్షననుభవించిన పూర్వఖైదీ ఒకరు మనకు స్వాగతం పలుకుతారు. అతనే ఇక ఈ కాలినడక టూర్‌కి గైడ్. తన స్వీయ అనుభవాలతో పాటు అప్పటి జైలు పరిస్థితులు, వాళ్ళ మానసిక స్థితిగతులు మొదలైన విషయాలన్నీ వివరించుకుంటూ మనను ముందుకు తీసుకెళ్తాడు. ఈ జైళ్ళని ఏ,బి,సి అంటూ మూడు సెక్షన్లుగా విభజించారు. ఏ, బి సెక్షన్ జైళ్ళల్లో పెద్ద పెద్ద గదులున్నాయి. ఒక్కోదాంట్లో ఇరవై మంది ఖైదీల వరకు ఉండేవారు. అపార్థైడ్ పోరాటంలో ఉద్యమించిన ప్రముఖ నాయకుల్నందరిని 'సి' సెక్షన్లో ఉంచేవారు. ఇది మిగతా రెండు సెక్షన్‌లు కంటే ఎక్కువ కట్టుదిట్టమైన భద్రతావలయంలో ఉండేది. 'సి' సెక్షన్ జైలు పక్కనే పెద్ద మండువా లోగిలి లాంటిది ఉంటుంది. తొలినాళ్ళలో మండేలా తదితరులతో బండరాళ్ళను కంకరగా కొట్టే పని అక్కడే చేయించారు. సామూహిక భోజనాలు చేసింది అక్కడే. ఆ తరువాత క్రీడలకు అనుమతినిచ్చినప్పుడు టెన్నిస్ లాంటి ఆటలు ఆడింది అక్కడే 'సి' సెక్షన్లో ఒక్కొక్క ఖైదీకి ఒక సెల్. సెల్ అంటే చాలా చిన్న గది, అందులోనే మలమూత్రాదుల కోసం ఒక బకెట్ ఉంటుంది. మండేలా తదితర ప్రముఖ నాయకులు ఈ సెక్షన్లోనే జైలు జీవితాన్ని అనుభవించారు. మండేలా ఉన్న సెల్‌ను ప్రత్యేకంగా చూపిస్తారు. అందులో వాళ్ళు మలమూత్రాదుల కోసం వాడిన బకెట్, పడుకోవడానికి ఉపయోగించే బ్లాంకెట్ నమూనాలు ఉన్నాయి. మండేలా సెల్ నంబర్ 466/64. అంటే 1964లో ఈ దీవికి తరలించబడ్డ, 466వ ఖైదీ అని అర్థం. మండేలా తన ఇరవైఏడున్నర సంవత్సరాల జైలు జీవితంలో పద్దెనిమిదేళ్ళు ఈ దీవిలోనే, ఈ 9'×7' అడుగుల సెల్‌లోనే జీవించాడు. అతను ప్రపంచ ప్రసిద్ధ నాయకుడిగా, దక్షిణాఫ్రికా జాతిపితగా రూపాంతరం చెందింది ఈ సెల్‌లోనే. ఆ పరంపరలో ఇరవైఏడేళ్ళు జైలు శిక్షననుభవించిన ఖైదీలు కూడా ఉన్నారంటే ఆ కాలంలో వివక్ష ఎంతటి స్థాయిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చు.

ఆ జైలుగదుల మధ్య నడుస్తున్నప్పుడు దక్షిణాఫ్రికా చరిత్రలో ఒక వేదనామయ కాలానికి నెట్టివేయబడతాం. ఒక్కో జైలుగది ముందు నిల్చొని లోపలికి చూస్తున్నప్పుడు అపార్థైడ్ పోరాట భావతీవ్రత మన మనసుకు తాకినట్టే అనిపిస్తుంది. ఐతే ఎంత పీడన ఉన్నా కూడా ఈ దీవే కదా, ఈ జైలే కదా ఆ నాయకుల్ని మహానాయకుల్ని చేసింది... ఈ దీవే కదా వాళ్ళలో అంతులేని ఆశావహ దృక్పథాన్ని పాదుకొల్పింది... ఈ దీవే కదా వాళ్ళని వజ్రసంకల్పుల్ని చేసింది అన్న ఆలోచనలు మనల్ని ఉద్వేగభరితుల్ని చేస్తాయి. మనతో పాటు వచ్చే పర్యాటకుల్లో పసిపిల్లలూ ఉంటారు. మనసు పెట్టి చూస్తే వాళ్ళ కల్మషంలేని చిరునవ్వులో ఆ మహానాయకుల చిరునవ్వుల ప్రతిఫలనాలు కనిపిస్తాయి. జైళ్ళు చూడడం పూర్తయ్యాక ఒక వంద మీటర్లు నడిస్తే తిరిగి ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంటాం. ద్వారం దాటి వెనక్కి తిరిగి చూస్తే కనిపించే జైళ్ళు, భవనాలు ఒకప్పటి అమానవీయ చీకటి చరిత్రకు, అంతులేని విషాదానికి సాక్ష్యాలుగా

కనిపిస్తాయి. ఆ మరుక్షణంలోనే ఆ విషాదానికి ఎదురొడ్డి మానవసంకల్పం సాధించిన ప్రజాస్వామ్య విజయమూ దర్శనమిస్తుంది. రాబిన్ ఐలాండ్ దక్షిణాఫ్రికా ప్రజల సమైక్యస్ఫూర్తికి, స్వేచ్ఛా సమానత్వాలకు ఒక గొప్ప సార్వత్రిక చిహ్నం. రాబిన్ ఐలాండ్ సందర్శనం దక్షిణాఫ్రికాలో జరిగిన జాత్యహంకార వ్యతిరేక పోరాటం పట్ల మనకో కొత్త దృక్పథాన్ని, లోచూపును అందిస్తుంది. తిరుగు ప్రయాణానికి సమయం ఆసన్నమైంది. పడవెక్కే ముందు మానవత్వ విలువల కోసం తమ జీవితాలనే అర్పించిన ఆ మహనీయులందరిని తలచుకోవాలి. వారితో పాటు ఈ రాబిన్ ఐలాండ్ ఒక మ్యూజియంగా, సందర్శనా స్థలంగా తీర్చిదిద్ది పర్యాటకులకు ఒక కొత్తరూపును అందిస్తున్న అహ్మద్ కత్రోడాకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఇతను కూడా మండేలాతో పాటు ఇరవైఏడు సంవత్సరాలు జైలుశిక్షననుభవించిన యోధుడు. ఆ మహనీయును 2017 లో మరణించారు. మ్యూజియం నిర్వాహక సిబ్బందికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ పడవెక్కాను. ఒకప్పుడు విపక్ష పేరిట అన్యాయంగా మనుషుల్ని ఖైదీలను చేసి మోసుకెళ్ళిన పడవలే నేడు స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని మోసుకెళ్తున్నాయి. పడవ ముందుకు కదిలింది.

సముద్రుడికి నిద్రాభంగం కాకూడదనో, అట్లాంటికుడి అలలకలలకు అణువంతైన ఇబ్బంది కలగకూడదనో ఏమో నావికుడు పడవను నత్తనడకన తీసుకెళ్తున్నాడు. దూరంగా విద్యుద్దీపాల వెలుగుజిలుగులతో తళుకులీనే కేప్‌టౌన్ నగరం ధగధగాయమానంగా వెలిగిపోతున్న మణిమయ రత్నఖచిత బతుకమ్మలా కనిపిస్తోంది. సాధారణ పర్యాటక ప్రదేశాలలో యాత్రికుడు అక్కడి ప్రాకృతిక అందాల ఆస్వాదనలో మునిగిపోవడమో, లేక ఆ రామణీయకతకు తాదాత్మ్యం చెంది ప్రశాంతచిత్తులు కావడమో జరగొచ్చు కానీ రాబిన్ ఐలాండ్ లాంటి ప్రదేశాలు మాత్రం మనిషిలోని మావత్వాన్ని తట్టిలేపేవి, మనిషిని మనిషిగా మనీషిగా జీవించమని చెప్పేవి. ఈ రకమైన స్థలాలను సందర్శించడం ద్వారా స్వేచ్ఛ విలువ, ఆ స్వేచ్ఛ వెనక ఉన్న త్యాగాల విలువ, జీవితం విలువ తెలుస్తుంది. సాటి మనిషి పట్ల కరుణ, గౌరవంతో మెలగాలని మానవీయ విలువలు బోధించే పాఠశాల 'రాబిన్ ఐలాండ్'. నిజానికి పిల్లలతో కలిసి సందర్శించాల్సిన పుణ్యక్షేత్రమిది.

రాపోలు సీతారామరాజు
చరవాణి : 7093260655

## కమ్మతెమ్మెరలు

ఫిబ్రవరి 25, **మిసిమి** పత్రిక చదివాను. నాకు ముఖ్యంగా రామరాజు గారు legendary శ్రీ పప్పు వేణుగోపాల రావు గారి "నాట్య శాస్త్రం" పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సమీక్షించిన తీరు ఎంతో ఆకట్టుకుంది. అద్భుతమైన పద చమత్కారం ఆసాంతం కనిపించింది. ఈ నాట్య శాస్త్ర గ్రంథం మూడు భాగాలుగా అవతరించటాన్ని "ఆ గోపాలుని వేణువు ఊద లేదుగా పప్పుసార్ తనతో లేరన్న ఆర్తితో-ఆ కన్నీరు సంకేతంగా అకాల వర్షం కురిసింది" అనటం బాగుంది. ఉద్దండ నాట్యాచార్యులు శ్రీ నటరాజ రామకృష్ణ గారికి, నాట్యశాస్త్ర పండితులు శ్రీ పి యస్ ఆర్ అప్పారావుగారి మధ్య చర్చలలో పప్పు వేణుగోపాలు గారిని రాయబారి పాత్రలో ఆవిష్కరించి సుతిమెత్తగా వెన్నముద్దల అల్పాహారంతో, సమస్యా పరిష్కారాలు నివృత్తి చేసేవారనీ, శ్రీ పప్పు గారి జీవితపు-ఉప్పు- నాట్య శాస్త్రంలో అభినయించే భరతముని రగిలించే నిజపు నిప్పుగా ఆ గోపాలుడిచ్చిన - జ్ఞానాభిమానపు వేడిని - హరికథగా భావించడమే - నాట్యశాస్త్రంలో మానవ గానమేమో పదాలు విలక్షణంగా కనిపిస్తున్నా,




ఎంత చక్కటి సమన్వయము, ఇది వ్యాసకర్త రసజ్ఞతకు మచ్చుతునక. అలాగే పప్పు గారు లోకకవి అయిన అందెశ్రీని గోముగా సోదర అన్న పిలుపుని కూడా వ్యాసంలో బిగించారు. ఇలా చాలా చూడముచ్చటి పదాలతో పాఠకులకి ఆరోజు కార్యక్రమాన్ని కళ్ళముందు ఆవిష్కరించారు. పాఠకుడికి తనూ ఆ సమావేశంలో ఉన్నానా అనే అనుభూతిని కలిగించారు. ఇలా చెప్పుకుంటూ పోతే వ్యాసం మొత్తం తిరిగి నిక్షిప్తం చేయవలసి వస్తుంది. ఇంత మంచి విశ్లేషణ అందించిన రామరాజు గారికి మనఃపూర్వక అభినందనలు.

*- డా. మునగా రామమోహన రావు*

# మండూక్యోపనిషత్తు

– ఆచార్య కోదాటి వియ్యన్నరావు

**అ**ధర్వ వేదానికి చెందిన ఉపనిషత్తులలో ఇది మూడవది. ఇంతకుముందు సంపుటాలలో (ఫిబ్రవరి, మార్చి, 2025) ప్రశ్నోపనిషత్తు, ముండక ఉపనిషత్తులను గురించి వివరించడం జరిగింది. మండూకుడనే పేరు గల మహర్షి దీనిని కూర్చినందున అతని పేరున మండూక్యోపనిషత్తుగా ప్రచారంలోనికి వచ్చింది. ఉపనిషత్తులన్నింటిలోనికి ఇది అతి చిన్నదైనది. కేవలం 12 శ్లోకాలు లేదా మంత్రాలతో ఇది కూర్చబడింది. అయినప్పటికీ దీనికి విశేషమైన ప్రచారం లభించడానికి కారణం ఆదిశంకరుడు దీనికి విస్తృతమైన భాష్యం రచించడం. అంతేకాకుండా తన అద్వైత సిద్ధాంత ప్రచారానికి దీనిని ప్రాతిపదిక చేసుకోవడం. ఈ ఉపనిషత్తులో కూర్చబడిన 12 శ్లోకాలలో వివరించబడిన అంశాలు ఈ దిగువన పేర్కొన్న ముఖ్య అంశాలకు చెంది ఉన్నాయి. 1. ఓంకారం యొక్క విశిష్టత. 2. ఆత్మకు – బ్రహ్మనికి లేదా భగవంతునికి గల సంబంధం. 3. ఆత్మ యొక్క స్వరూప విశ్లేషణ దాని భాగాలు లేదా అంగాలు. 4. అంతిమ వాస్తవం (ultimate reality) లేదా పరమ సత్యాన్ని గురించిన విచారం.

ఈ ఉపనిషత్తు యొక్క మరొక ప్రత్యేకత ఏమంటే, విషయం సూటిగా చెప్పబడింది. ఏ ఉదాహరణలు, ఉపమానాలు, పోలికలు ఉండవు. పరిశోధన పత్రం వలె చాలా క్లుప్తంగా ఉంటుంది. ఆ విధంగా క్లుప్తమై యుండటం చేత, ఈ వ్యాసంలో మూల శ్లోకాలను కూడా పొందుపర్చే ప్రయత్నం చేసాను. మాండూక్యోపనిషత్తు ఈ క్రింది శ్లోకంతో మొదలౌతుంది.

**"ఓమిత్యేతదక్షరమిదం సర్వం తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్యదితి సర్వమోంకార ఏవ**
**యచ్చాన్యత్ త్రికాలాతీతం తదప్యోంకారఏవ!"**

ఈ ప్రపంచం యావత్తూ ఓంకారమయమే. గతించినవీ, ప్రస్తుతం ఉన్నవీ లేదా నడుస్తున్నవీ, భవిష్యత్తులో రాబోయేవీ అన్ని ఓంకారమయమే! కాలాతీతమైనది ఏదైనా ఉన్నది అంటే అది ఓంకారమే. కాలానికి, దూరానికి (Time and Space) మించినది, కార్యకారణ సంబంధాలకు మూలమైనది ఓంకారమే.

ప్రశ్నోపనిషత్తులో పిప్పలాదుడు శిబి కుమారుడైన సత్యకామ (ఇతనినే సత్యకామ జాబాలి అని కూడా పిలుస్తారు). అడిగిన ప్రశ్నకు సవివరంగా సమాధానం వెలిబుచ్చాడు. ఓం (ॐ) అన్నది త్రిమాత్రాలతో కూడిన శబ్దమని, ఒక్కొక్క దానిని ఉచ్చరించడం వలన ఒక్కొక్క ఫలితం కలుగుతుందని, త్రిమాత్రోపాసకుడు మాత్రమే బ్రహ్మలోకమును చేరుతాడని పేర్కొన్నాడు. ఓం అన్నది అ–ఉ–మ (A.U-M)ల కలయిక అని, ఏకమాత్ర, అంటే 'అ' ను మాత్రమే ఉపాసించిన వ్యక్తి మరల మానవ జన్మనే బహుమతిగా పొందుతాడని, రెండు మాత్రలు ధ్యానించిన వ్యక్తి ఊర్ధ్వలోకాలు పొందుతాడని, మూడుమాత్రలతో ఓంకారాన్ని ధ్యానించిన వ్యక్తి 'బ్రహ్మత్వాన్ని' బహుమతిగా పొందుతాడు.

సంధ్యావందనంలో ప్రతి ఒక్కరు "ఓం ఇతి ఏకాక్షరం బ్రహ్మ" అని చెప్పుకుంటారు. అట్లే భక్తులు వల్లెవేసే అష్టోత్తరాలు, సహస్రనామాలలో ఓం శబ్దం ముందుంటుంది. పరబ్రహ్మను స్తుతించే 'ప్రణవనాదం' ఓంకారమే. 'తస్యవాచకః ప్రకావః" కాబట్టి పరమాత్మ యొక్క నామమే ఓంకారం. "తజ్జపస్తద భావనమ్" అన్నది మంత్రం. దీనిని మననం జపిస్తూ ముక్తికి దగ్గరగా జరగవచ్చు. ఓంకారంతోపాటుగా బ్రహ్మను 'తత్' అనీ, 'సత్' అని కూడా పిలుస్తారు. 'ఓం, తత్, సత్' మూడింటిని కలిపి పలకడం ఆనవాయితీ. "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అన్న సూక్తి ఓంకారం యొక్క ప్రశస్తిని మరింత ఇనుమడింపు చేస్తున్నది. ఒక్కొక్క అక్షరం (మాత్ర) యొక్క స్వరూపం, సూక్ష్మ, స్థూల రూపములు, వ్యక్తి యొక్క దశలు వాటి మధ్య ఉన్న సంబంధం దిగువ పట్టికలో విపులీకరించడం జరిగింది.

| అక్షరం | సూక్ష్మ రూపం | స్థూల రూపం | వ్యక్తి స్థితి |
|---|---|---|---|
| అ | విశ్వ | విశ్వనర (విరాట్) | మెళకువ (Waking) |
| ఉ | తైజస | హిరణ్యగర్భ | కల (Dream) |
| మ | ప్రజ్ఞ | ఈశ్వర | సుషుప్త (Deep Sleep) |
| అ–ఉ–మ తురియ (ఓం) | | ఆత్మ | బ్రహ్మం |

పైన విశ్లేషణ చూసినట్లయితే ఒక్కొక్క మాత్ర యొక్క సూక్ష్మ, స్థూల రూపాలు అంతిమంగా వ్యక్తి పొందే వివిధ స్థితులు లేదా దశలు సవివరంగా తెలియజేయబడ్డాయి. దీనిని గమనంలో ఉంచుకొని ఓంకారాన్ని ధ్యానించాలి.

మండూక్యోపనిషత్తు రెండు, మూడు శ్లోకాలలో ఆత్మ యొక్క స్వరూపం, దానికి బ్రహ్మంతో ఉన్న సంబంధం వివరించబడ్డాయి.

**"సర్వం హ్యేతద్ బ్రహ్మ అయమాత్మా బ్రహ్మ**
**సోయమాత్మా చతుష్పాత్"**

ప్రపంచం మొత్తం బ్రహ్మమే. ఆత్మ కూడ బ్రహ్మమే.

ఈ విధమైన ఆత్మ నాలుగు దశలుగా పరిణామం చెందుతుంది. ఆ పరిణామక్రమం ఈ విధంగా చెప్పబడింది.

**"జాగరిత స్థానోబహిః ప్రజ్ఞః**
**సప్తాంగ ఏకోన వింశతి ముఖః**
**స్థూల భుగ్ వైశ్వానరః ప్రథమః పాదః"**

మొదటి పరిణామంలో ఆత్మ వైశ్వానరుడు (అంటే విశ్వనరుడు) అనబడుతున్నాడు. అతని బాహ్యరూపంలో ఏడు అవయవాలు, 19 నోళ్ళు కలిగి మొదటి దశ అయిన జాగ్రదావస్థలో బాహ్య జగత్తును తెలుసుకొంటాడు, అనుభవిస్తాడు. విశ్వనరుడు అనే పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి, జీవకోటినంతటిని ఆనందమయ లోకానికి పయనింపజేయడం. రెండు, అందరు సమిష్టిగా కలసి, ఉత్తమ పురుషగా ఉండడం.

వ్యక్తి యొక్క సూక్ష్మ రూపంలో ఏడు అవయవాలు ఈ విధంగా ఉన్నాయి. 1. తల (స్థూలరూపంలో స్వర్గం -Heaven) 2. కన్ను (సూర్యుడు), 3. ప్రాణము (గాలి), 4. మూత్రాశయం (నీరు), 5. మొండెము (ఆకాశము) 6. పాదాలు (భూమి), 7. నోరు (అగ్ని). అట్లే 19 నోళ్ళ యొక్క వివరణ ఈ విధంగా ఉంది. 1. ఐదు జ్ఞానేంద్రియాలు, 2. ఐదు కర్మేంద్రియాలు, 3. ఐదు (పంచ) ప్రాణాలు, 4. మనస్సు, 5. బుద్ధి, 6. అహంకారం, 7. చిత్తము (మేధస్సు). ఇవన్నీ బాహ్య ప్రపంచంలోని సుఖాలను, దుఃఖాలను అనుభవించడానికి ఉపకరిస్తాయి. ఇదంతా వ్యక్తి తాను మెలుకువగా (జాగ్రదావస్థలో) ఉన్నప్పుడు జరుగుతుంది. ఇక రెండవ దశ పరిణామంలో వ్యక్తి యొక్క చేతన లేదా చైతన్యం అంతర్ముఖమవుతుంది. దీనిని 'తైజస' స్థితి అంటారు. దీనినే స్వప్నావస్థ (Dream State)గా చెప్పవచ్చు.

ఈ స్థితిలో వ్యక్తి మానసిక లోకాన్ని అనుభవిస్తాడు.

**"స్వప్నః స్థానోన్తః ప్రజ్ఞః**
**ఏకోన వింశతి ముఖః**
**ప్రవివిక్తభుక్ తైజసోద్వితీయః పాదః**

ఈ స్థితిలో ఇంద్రియాలు క్రియాశీలకంగా ఉండవు. మనసు మాత్రమే చేతనంగా ఉండి, ఊహాలోకాన్ని దర్శిస్తుంది. బాహ్య ప్రపంచంతో అతనికి ఏర్పడిన సంబంధం, అనుభవాలు, ఆలోచనలు అన్ని కలగలిపి 'కలలరూపంలో' ప్రత్యక్షమవుతాయి. వీటిని అతని మనసు ఒక్కటే అనుభవించగలదు, ఆనందించగలదు. మూడవ స్థితి (అంటే సుషుప్తావస్థ)లో అన్ని ఇంద్రియాలు, మనస్సు నిష్క్రియాస్థితిలోనికి జారుకుంటాయి. ఈ స్థితిలోనే వ్యక్తి యొక్క ప్రజ్ఞ ఇనుమడించి, ఈశ్వరజ్ఞానం కలుగుతుంది. దీనికి సంబంధించిన శ్లోకం ఈ క్రింది విధంగా ఉంది.

**"యత్ర సుప్తోన కంచన కామం కాయతేన కంచన స్వప్నం పశ్యతి తత్ సుషుప్తమ్? సుషు ప్తస్థాన ఏకీభూతః ప్రజ్ఞానఘన ఏవానందమయోహ్యనంద భుక్ చేతో ముఖః ప్రాజ్ఞస్తృతీయః పాదః"**

గాఢ నిద్రావస్థలో ఇంద్రియానుభవం ఏమీ ఉండదు.

గ్రహణశక్తి బహిర్గతమై, ఆనందాల ద్వారాన్ని తెరుస్తుంది. అందుచేత వ్యక్తి ఆనంద స్వరూపుడుగా మారతాడు. తానే అన్ని ప్రాణులలో కొలువై ఉన్నానని, సమస్త జగత్తుకు మూలం తానేనని, జీవుల ఉత్పత్తికి, వినాశనానికి కూడా తానే ప్రేరణయని, అంతిమంగా తానే సర్వేశ్వరుడననే జ్ఞానాన్ని పొందుతాడు. ఆ పైన నాల్గవ దశలో ఆత్మ చైతన్యంగా మారుతుంది. అంతర్గత, బహిర్గత స్థితికాని సమత్వ స్థితి సిద్ధిస్తుంది. దీనిని ఈ విధంగా పేర్కొంది.

**"నాన్తః ప్రజ్ఞమ్ నబహిః ప్రజ్ఞమ్ నా భయతః**
**ప్రజ్ఞమ్ న ప్రజ్ఞాన ఘనం**
**నప్రజ్ఞమ్ నాప్రజ్ఞమ్**
**అదృష్టమ్ అ వ్యవహార్యమ్ అగ్రాహ్యమ్ అలక్షణమ్**
**అచిన్త్యమ్ అవ్యపదేశ్యమ్**
**ఏకాత్మ ప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం**
**శివం అద్వైతం చతుర్థం మన్యన్తేస**
**ఆత్మాస విజ్ఞేయః"**

ఆత్మ, అవగాహనకు అంతుచిక్కనిది, ఇంద్రియాలకు అతీతమైనది, ఆలోచనలకు అతీతమైనది, అన్ని దశలలోను, అన్ని రూపాలలోను ఏకాత్మకం (One Self) గా ఉండేది. పైన పేర్కొన్న మూడు దశలకు అతీతమైనది ఈ స్థితియే. సూక్ష్మరూపంలో ఆత్మగా ఉన్న చైతన్యం, స్థూలరూపంలో బ్రహ్మంగా మారుతుంది. శబ్దపరంగా చెప్పాలంటే ఈ దశే ఓంకారం. క్లుప్తంగా చెప్పాలంటే సమస్త జగత్తు ఓంకారం నుండి పుట్టినదే. అదే ఈ జగత్తుకు ఆధారం. పరమసత్యం ఏదైనా ఉందంటే అదే ఓంకారం. ప్రతి జీవిలో ఉన్న ఆత్మయే బ్రహ్మం.

**మాండూక్యోపనిషత్తుపై ఆదిశంకరుని భాష్యం :** ఇంతకు ముందు చెప్పినట్లు ఆదిశంకరుని అమితంగా ఆకర్షించిన ఉపనిషత్తు ఇది. తాను తన అద్వైత సిద్ధాంతానికి దీనిని ఎందుకు ప్రాతిపదిక చేసుకున్నాడో ఇప్పటికే మనకు అర్థమవుతుంది. ఈ ఉపనిషత్తును గురించి ఆదిశంకరుడు చేసిన కొన్ని వ్యాఖ్యలు :

- విశ్వం మొత్తం ఓంకారంలో ఇమిడి ఉన్నది.
- భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు అతీతమైనది. స్థల మరియు సమయ, నియమాలు లేనిది.
- ఆత్మయే బ్రహ్మమై ఉన్నది.
- ప్రజ్ఞయే మొత్తం చైతన్యం అయి ఉంది.
- ఆత్మ-పరమాత్మ అన్న భిన్నత్వం (Duality) లేదు. ఆత్మయే పరమాత్మ.
- చావుపుట్టకలు లేని ఆత్మ ఆకాశమంత అనంత మైనది. బాహ్యప్రపంచంలో అది అనేక జీవులుగా రూపొంది ప్రకృతి గమనాన్ని నడిపిస్తుంది.
- ఆత్మ యొక్క మాయ ద్వారానే చరాచర సృష్టిలో చలనం ఏర్పడుతుంది.
- జ్ఞానమనేది ఏ ఊహకు అందనిది. దానిని ఆత్మ నుండి విడదీయడం సాధ్యం కాదు.
- బ్రహ్మాన్ని తెలుసుకోవడమే జ్ఞానం యొక్క అంతిమలక్ష్యం.

**గౌడపాదుని వ్యాఖ్యానం :** క్రీస్తు శకం 6వ శతాబ్దంలో హిందు తత్వము, అద్వైత వేదాంతములపై విశేష కృషి సల్పి భాష్యం వ్రాసిన ఆచార్యుడు. ఆది శంకరుని అద్వైత సిద్ధాంతానికి ఇతని బోధనలే ప్రేరణ అని చెప్తారు. గౌడపాదుడు మండూక్యోపనిషత్తుపై సవివర వ్యాఖ్యానం వ్రాశాడు. ఇతని వ్యాఖ్యానంలో బుద్ధిజం ప్రభావం ఉన్నదని, కొద్దిమంది అభిప్రాయం. ఇతను మండూక్యోపనిషత్తుపై వ్రాసిన వ్యాఖ్యానాన్ని 'గౌడపాదకారిక' అని 'ఆగమశాస్త్రమని' కూడా పిలుస్తారు. ఈ కారిక చాలా పెద్దది. ఇది మొత్తం నాలుగు అధ్యాయాలుగా కూర్చ బడింది. మొదటి అధ్యాయమైన 'ఆగమ ప్రకరణ'లో మండూక్యోపనిషత్తులోని 12 శ్లోకాలు కూడా కలిసి ఉన్నాయి. గౌడపాదుని భాష్యం ప్రకారం మండూక్యోపనిషత్తుకు సంబంధించి కొన్ని ముఖ్య విషయాలు.

- ఓం అన్నదే బ్రహ్మంగా చెప్పబడుతున్నది.
- ఓం అన్నదే సచ్చిదానందము.
- ఈశ్వరుడు ప్రతివ్యక్తి హృదయంలో నివశించి ఉంటాడు.
- ఆత్మకు సంబంధించి భిన్నత్వము ఏమీ లేదు.
- ఆత్మ అనేది మార్పు లేనిది, సర్వవ్యాపితమైనది, దుఃఖం లేనిది.
- గౌడపాదుని ఉద్దేశ్యంలో కార్యకారణ సంబంధాలకు ఆత్మయే మూలము.
- బ్రహ్మమొక్కటే విశ్వజనీన సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది. అదియే అంతిమ విశ్వాసము, వాస్తవము, శాశ్వతమైనది.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

**గోకుల కృష్ణ గోపాల (2వ అట్ట) చిత్రకారుడు :**
**రాయన గిరిధర గౌడ్ (పుట్టిన తేది : 12 ఆగష్టు,1965),** చదివింది వడ్లమూడి స్కూల్, మైసూర్ ఆర్ట్ స్కూల్ చామ రాజేంద్ర ఎకాడమీ ఆఫ్ విజువల్ ఆర్ట్స్, మైసూర్ యూనివర్శిటీ, 1989 ఫాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, మహారాజా సయ్యాజీరావు యూనివర్శిటీ, బరోడా 1991లో కోర్సు పూర్తయ్యింది. అహ్మదాబాద్‌లో కనోరియా సెంటర్ ఫర్ ఆర్ట్స్ అనే దాంట్లో ఫెలోషిప్ వచ్చింది. వెళ్లకుండా కాలేజీలో అసిస్టెంట్ లెక్చరర్‌గా ఒక సంవత్సరం చేశారు. టీచింగ్ ఇంట్రస్ట్ లేక, కొన్నాళ్లు సర్కస్ చేసేవాళ్లని స్టడీ చేస్తూండేవారు. 1992-93లో ఫెలోషిప్ పూర్తి చేశారు. సిమ్రోజాన్ ఆర్ట్ గేలరీ, బొంబాయిలో ఓవైస్ హుస్సేన్, మరో ఇద్దరు బెంగళూరియన్స్‌తో గ్రూప్ షో చేశారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఇప్పుడు ఏషియాలోనే పేరు గడించిన చిత్రకారులు.


రాయన గిరిధర గౌడ్

**బనారస్ ఘాట్ (3వ అట్ట) చిత్రకారుడు :**
**శ్రీనివాస గండూరి (పుట్టిన తేది : 31 మే, 1967) (బి.ఎస్‌సి. బి.ఇడి.)** చిన్నప్పటి నుంచి చిత్రకళలంటే అభిరుచితో ఇప్పటికి ముప్పైయిదు సంవత్సరాలుగా బొమ్మలు వేస్తూనే వున్నారు. ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటర్ కలర్ మీడియం వీరి ప్రత్యేకత. 2013 నుంచి 2020 వరకు 17 ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. ఎన్నో అవార్డులు, బహుమతులు పొందారు. వరల్డ్ రికార్డ్ - 75 మీటర్ల పొడవైన వాటర్ కలర్ పెయింటింగ్ చిత్రీకరణలో పాల్గొన్నారు. వీరు థానె కళాభవనం, బొంబాయి, ఆర్ట్ ప్లాజా బొంబాయి, జహంగీర్ ఆర్ట్ గేలరీ, బొంబాయి, ఐ.డబ్ల్యు.ఎస్. ద్వి వార్షికోత్సవం, హాంకాంగ్, ఇంటర్నేషనల్ ఆర్ట్ షో, హైదరాబాద్, గ్లోబల్ వాటర్ కలర్ సమ్మిట్ షిలాంగ్ చోట్లలో పాల్గొన్నారు.


శ్రీనివాస గండూరి

# జీవన మకరందం

- ❖ విజ్ఞానం మాట్లాడమంటుంది – జ్ఞానం వినమంటుంది!!
- ❖ జ్ఞాపకాలంటే ఆలోచనల పాదముద్రలు –
  కాలపు గాలిలో మెలమెల్లగా అవి చెరిగి పోతుంటాయి.
- ❖ జ్ఞాపకాలు బాధపెడుతున్నాయా? ఒకసారి నీ చుట్టూ పరికించి చూడు!
  నీ ఆలోచనలు సర్దుకుంటాయి. జ్ఞాపకాలంటే ఆలోచనలే!
- ❖ చెట్టు నీడలో మొక్క పెరగదు.
- ❖ పిల్లలకు (బాలలకు) భయం తెలియదు. అందుకే సాహసాలు చేస్తారు.
- ❖ సంతానం రెండు రకాలు. కొందరు తల్లి తండ్రులకు తమవంతు ప్రేమానురాగాలు పంచుతారు.
  కొందరు తల్లితండ్రుల నుంచి ఎప్పుడూ అన్నీ ఆశిస్తారు.
- ❖ నీ చర్యలకు ఆలోచనలే కారణం – నీ ఆలోచనలకు నీ సంస్కారం మూలం.
  నీ సంస్కారానికి నీ కుటుంబం పాదు!
- ❖ భార్యాభర్తలు నిరంతర విద్యార్థులు. వారికి ఒక పవిత్రమైన బాధ్యత వుంది.
  ఒక కుటుంబం అంటే ఒక చిన్న దేశం.
- ❖ వేదాలు ఉపనిషత్తులు జ్ఞాన భాండారాలు.
  భారత రామాయణాలు భారతీయ సంస్కృతికి మూలస్తంభాలు.
- ❖ భారత రామాయణాలు – మన సాహిత్యానికే కాదు,
  సర్వకళలకు ప్రేరణ. పురాణాలు నవరసాలకు ప్రేరణ.
- ❖ బట్టలు మార్చినట్టు మనసు మార్చగలమా?
  కాని అదే జరుగుతున్నది ఈ రోజుల్లో ఎందుకనో?
- ❖ జ్ఞాని సంసారంలో సన్యాసిలాగానే వుంటాడు!
- ❖ ఎవరినైనా తేలిగ్గా అపార్థం చేసుకోవచ్చు.
  అర్థం చేసుకోవటమే కష్టం. ఇది సర్వసాధారణం!!



- ❖ వేదాంతం అంటే అహాన్ని అంతం చేయటం!
- ❖ విద్య వినయాన్ని పెంచాలి కదా – పాండిత్యం అహాన్ని పెంచుతుందేమి?
- ❖ భక్తి అంటే బాకాలు పెట్టె – మోగటం కాదు – బజారున పడటం.
  భక్తి అంటే అంతర్ముఖం కావటం – నిశ్శబ్దంలో నిన్ను నువ్వు వినగలగటం!
- ❖ భూమ్మీద ఎంత ఎండ వుందో అంత దుఃఖం వుంది.
- ❖ మనిషి బాధ మానవజాతి బాధ!
- ❖ ఈరోజుల్లో కాషాయం ఒక వేషం మాత్రమే.
- ❖ సినిమా ఒక సాంకేతిక భ్రమ – కథానాయకులు నమ్మే పేరు ప్రఖ్యాతులు సబ్బు బుడగలు.
- ❖ జీవితం సాదాసీదాగానే వుంటుంది. సినిమాలోలాగా డ్రామా వుండే సందర్భాలు అరుదు –
  మెలో డ్రామా వుండాల్సిన సన్నివేశాలు అసలే వుండవు!
- ❖ బ్రాండ్ అంటే నీ అహాన్ని తృప్తిపరచటమే.
- ❖ సాధారణంగా జీవించటం కష్టమైన పనే – సామాన్యంగా కనిపించగలగటం శ్రమతో కూడిన పని.
- ❖ గొప్ప ఆవిష్కరణలన్నీ చిన్న ఆలోచనతోనే మొదలవుతాయి!
- ❖ రేపు అనేది ఈరోజు వుండదు – నీవు వర్తమానంలోన వుంటావు!
  ఎందుకో ఆలోచనాపరంగా మనం గతంలో బ్రతుకుతుంటాము.

# లలిత సంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

### 7. తలనిండ పూదండ దాల్చిన

రచన : దాశరథి

సంగీతం, గానం : ఘంటసాల

<u>కల్యాణి–చతురశ్ర</u>

సాకీ: ఆ రజనీకర మోహనబింబము
నీ నగుమోమును బోలునటే
కొలనిలోని నవ కమలదళమ్ములు
నీ నయనమ్ముల బోలునటే
ఎచట చూచిన,ఎచట వేచిన
నీ రూపమదే కనిపించినదే......

పాట:తలనిండ పూదండ దాల్చిన రాణి!
మొలకనవ్వులతోడ మురిపించబోకే ॥తల॥

1. పూలవానలు కురియు మొయిలువో!
మొగలి రేకులలోని సొగసువో! నా రాణి! ॥తల॥

2. నీ మాట బాటలో నిండె మందారాలు
నీ పాట తోటలో నిగిడె శృంగారాలు
నీ మేనిలో పచ్చ చేమంతి అందాలు
నీ నీలవేణిలో నిలిచె ఆకాశాలు. ॥తల॥

**భావం :** నా రాణీ! చంద్రబింబం నీ నవ్వుముఖానికి సాటి వస్తుందా? సరస్సులో అప్పుడే వికసించిన తామరపూల రేకులు నీ కన్నులతో సరితూగగలవా? ఎక్కడ చూచినా, ఎక్కడ కాచుకుని ఉన్నా నీ రూపమే కనిపిస్తున్నది. తలనిండ పూలదండ ధరించిన రాణీ! నీ చిరునవ్వులతో నన్ను మురిపించకు. పూలవాన కురిపించే మేఘానివా? మొగలి పువ్వురేకుల సౌందర్యానివా? నీ మాటల్లో మందారపూలు పరిమళిస్తున్నాయి. నీ పాటలనే తోటలో శృంగారాలు వెల్లివిరుస్తున్నాయి. నీ మేనిలో చేమంతిపూల అందాలు తొంగిచూస్తున్నాయి. నీ నల్లని కురులలో ఆకాశమే వ్యాపించియున్నది.

**అర్థాలు : రజనీకరుడు = చంద్రుడు, మొయిలు = మబ్బు, నిగిడె = వ్యాపించె.**

ఈ పాటను డా॥ దాశరథి రచించారు. అప్పుడప్పుడు ఘంటసాలగారి ఇంటికి వెళ్ళిరావడం దాశరథిగారికి ఒక ఆనవాయితీగా ఉండేది. ఓసారి అలా వెళ్ళినప్పుడు మాటల సందర్భంలో ఘంటసాల “ సినిమాపాటలు సరే, మీ గుండెల్లోంచి ఉప్పొంగి వచ్చిన పాటలేవన్నా ఉంటే ఇవ్వండి” అన్నారు దాశరథితో. వెంటనే దాశరథి ఆనందంగా కొన్ని పాటలు ఇచ్చారు. అందులోనుంచి “తలనిండ పూదండ, వెలిగించవే” అనే పాటల్ని ఘంటసాల ఎన్నుకున్నారు. ‘తలనిండ పూదండ’ అనే ఈ పాట దాశరథిగారి “నవమంజరి” పుస్తకం నుండి తీసుకోవడం జరిగింది. ఈ పుస్తకంలో మొత్తం 47 పాటలున్నాయి. వాటిలోని ‘నగుమోము’ అనే 25వ పాటలోని పల్లవిని ‘నా రాణి’ అనే 23వ పాట పల్లవిని ఘంటసాలగారు గమ్మత్తుగా కలిపి ఈ పాటను రూపొందించుకున్నారు. అంటే,25వ పాట పల్లవిలోని ఆరు పాదాలను సాకీగా చేసి,23వ పాటను ఉపయోగించుకుని సంపూర్ణరూపంతో ఘంటసాలగారు ఆలపించారన్నమాట!

ఈ పాటలోని మొదటి ఆరు పంక్తులను చతురశ్ర గతిలోను,తరువాత ఎనిమిది పంక్తులను ఖండగతిలోను రచించారు. ప్రియురాలిముఖాన్ని చంద్రబింబంతోను, కళ్ళను తామర పూలతోను పోల్చడం సాధారణంగా కవులంతా అనుసరించే సంప్రదాయమే. దీన్ని ‘కవిసమయం’ అంటారు. సాకీలో ఇలాంటి కవి సమయాలను చెప్పి, ప్రధాన గీతంలో చక్కని భావనాబలాన్ని పొదిగారు. నవ్వులలో ఎన్నో రకాలున్నాయి. మనసులో ఏ కల్మషమూ లేని నవ్వులు చాలా అరుదుగా కనిపిస్తుంటాయి. తాను ప్రేమించిన ప్రేయసి, తనను ప్రేమిస్తున్నది అనడానికి ప్రధాన సంకేతం మొలకనవ్వు. విచ్చీవిచ్చని పెదాలతో, కదలికతో, విరిసీవిరియని కన్నులతో ఆమోదముద్రను చూపేదే ఈ మొలకనవ్వు. హృదయం ఆరోగ్యంగా ఉన్నవాళ్ళకే ఈ నవ్వు సాధ్యపడుతుంది. ప్రేయసిని మబ్బుతో పోల్చడం వినూత్నప్రయోగం. దాన్ని ఇతర వర్ణనాంశాలతో సమర్థించడం మహాకవులకుండే ఓ చక్కని అలవాటు. ఈ మబ్బు మామూలు మబ్బు కాదు, ప్రేమ నిండిన మబ్బు. కురిసేది మామూలు వాన కాదు, నవ్వుల పూలవాన. ఆమె నల్లనల్లని కురుల కొప్పును మబ్బుగా భావిస్తే,ఆమె మొలకనవ్వులే పువ్వులవుతాయి. కనుక ఆ

మబ్బు కురిపించేది ఈ నవ్వులే. అందుకే రెండవ చరణం, చివరి పాదంలో 'నీలవేణిలో ఆకాశాలున్నాయి' అన్నారు. ఆ ఆకాశంలోనే ఈ మబ్బులు. ఈ రెండూ నల్లని కురుల రూపంలోనే ఉన్నాయిమరి!

మొగలిరేకుల ముళ్ళను తీసేసి, మడతపెట్టి, అందంగా కొప్పులో అమర్చుకునే విద్య ఆడవాళ్ళకు బాగా తెలుసు. మొగలిరేకులకు ఉండే సొగసు భౌతికమైనది కాదు. ఎన్నో దూరతీరాలకు వ్యాపించే వాటి పరిమళమే అత్యద్భుతమైన సొగసు. అంటే ఆ రాణి ఆంతర్యమంతా సుగుణపరిమళభరితం అని కవి భావం. శారీరక సౌందర్యంతో పాటు హృదయసౌందర్యం కూడా జతగూడితేనే ఆ ప్రేమకు సంపూర్ణసాఫల్యం లభిస్తుంది. మాటలో మందారం, పాటలో శృంగారం, మేనిలో చేమంతి బంగారం. ఇన్ని అందాలను ఒక్కచోట కుప్పబోసిన నవలావణ్యరూపం కవి మనోవీధిలో సాక్షాత్కరిస్తే, అది ఇలాంటి గేయస్వరూపంలో మనందరిని అలరించాలంటే, ఘంటసాల మేష్టారువంటి స్వరమాంత్రికుడు తప్పనిసరిగా అవసరమే. మేష్టారు దీన్ని కల్యాణిరాగంలో, చతురశ్రగతిలో మనసారగ పాడుకున్నారు. కాని తనకిష్టమైన ఈ రాగాన్ని ఎక్కడా సుదీర్ఘరాగాలాపనను తీసుకోకుండా నిగ్రహం పాటించడం చిత్రాతిచిత్రం. దీన్నిబట్టి ఆయన సాహిత్యాన్ని ఎంత బాగా గౌరవించేవారో అర్థంచేసుకోవచ్చు.

ప్రారంభంలో ఉన్న ఆరు పంక్తుల చతురశ్రగతి భాగాన్ని లయతో కాక సాకీలా మార్చుకోవడం మనోహరంగా ఉంది. ఒక పాటను సాకీ చేయడం, ఇంకో పాటను చరణాలుగా చేసి సంపూర్ణగీతంగా రూపొందించడం ఘంటసాల ఆలోచనలో ఉండే ఒక చక్కని విజ్ఞతాపూర్వక క్రమశిక్షణ. అయిదు మాత్రల ఖండగతిని, నాలుగు మాత్రల చతురశ్రగతిలోకి మార్చుకోవడంవల్ల పాటకు మంచి చురుకైన మెరుపు వచ్చింది. మొదటి చరణంలోని 'మొయిలు' ను తారస్థాయి షడ్జమంలో అందుకుని ఒక మెట్టు దిగి నిషాదసంచారంతో భూమిమీది మొగలిరేకులను స్ఫురింపజేయడం ఘంటసాల స్వరశిల్పవిన్యాసం. రెండవ చరణంలో 'అందాలు' దగ్గర ఆలాపన చేసే అవకాశాలు పుష్కలంగా చేతికి వచ్చినా చాలా క్లుప్తంగా ఆలపించి వదిలేయడం 'చేమంతి అందాల' కోసమే కాబోలు! 'నీ నీలవేణిలో నిలిచె ఆకాశాలు' పాడడంలో 'నీ' లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గమనించండి. అందుకే స్వరకల్పనలో వీటిని నిషాదంతోనే సంచరింపజేశారు. 'ఆకాశాలు' దగ్గర షడ్జమాన్ని చేరడమే కాకుండ అక్కడొక స్వరసంపుటిని గాంధారంలో ప్రారంభించి తారలచుట్టే తిప్పారు. ఎందుకంటే, ఆకాశంకదా ! ఇది సాభిప్రాయస్వరకళ. అందుకే సరస్వతీదేవి మన తెలుగువారికిచ్చిన ముద్దుబిడ్డ ఘంటసాల మేష్టారు. ఈ పాట వెనుకవైపు 'వెలిగించవే' పాటను ఘంటసాలగారు లీలతో కలిసి పాడి 1965లో రికార్డుగా విడుదల చేశారు.

### 8. పాడెదను నీకునై

**రచన : అడవి బాపిరాజు**
**సంగీతం, గానం : ఘంటసాల**

**రాగమాలిక–తిశ్ర గతి**

**పాడెదను నీకునై పాటలను దేవీ!**
**వాకలై తేనియలు ప్రవహించు దేవీ! ॥పాడెద॥**

**1. సుమబాల ప్రేమకై తమి తీరి ముగ్ధయై**
**భృంగబాలుడు పలుకు శృంగారకల్యాణి ॥పాడెద॥**

**2. మధుమాస పికరాజు విధురసంకేతియై**
**గళమెత్తి కోయన్న కలరాగిణి తోడి ॥పాడెద॥**

**3. వేసవి నీ పుట్టిల్లు వెడలిరా నలసించు**
**వాహినీ సతికొరకు వగలు పొగలే కడలి**
**వానమౌ దీపకము స్వానమౌ దీపకము ॥పాడెద॥**

**భావం :**ఓ దేవీ ! నీకోసమే పాటలను పాడతాను. తేనెలు ఏరులుగా ప్రవహించేట్లుగా పాడతాను. పుష్పమనే పడతి ప్రేమ కోసం తుమ్మెద అనే పడుచువాడు కోరిక తీరేట్లుగా కల్యాణిరాగంలో శృంగారగీతాలు పాడుతున్నట్లుగా పాడతాను. చైత్రమాసపు కోయిల విరహ సంకేతమివ్వగా, దానికి బదులుగా కోయని గళమెత్తి పాడిన ఆడకోయిలతో కలిసి పాడినట్లు పాడతాను. వేసవికాలంలో సరిగా ప్రవహించని నది అనే భార్యకోసం చింతించే సముద్రుడు ఎండిపోతుంటే ఉద్ధరించేట్లుగా, సముద్రపు హోరును తిరిగి పెంచేటట్లుగా పాడతాను దేవీ ! నీ కోసం పాడతాను.

**అర్థాలు : వాక = ఏరు, తమి = కోరిక, భృంగం = తుమ్మెద, మధుమాసం = వసంత ఋతువు, విధుర= ఎడబాటు గలవారు, ఆలసించు = ఆలస్యం చేయు, పొగలు = చింతించు, వానము = ఎండిపోవు, స్వానము = ధ్వని, దీపకము = వెలిగించేది, నిలయం.**

ఇది సుప్రసిద్ధ కవి, చిత్రకారులు అడవి బాపిరాజుగారి "శశికళ" గేయకావ్యంలోనిది. వీరు 1895లో పశ్చిమ గోదావరి జిల్లా సారిపల్లె గ్రామంలో జన్మించారు. ప్రమోద్‌కుమార్ ఛటర్జీ వద్ద చిత్రకళ అభ్యసించారు. గుంటూరులో కళాపీఠం నెలకొల్పి చిత్రకళలో శిక్షణ ప్రారంభించారు. విశ్వనాథవారి కిన్నెరసాని పాటలకు, నండూరివారి యెంకి పాటలకు చిత్రాలు వేశారు. నారాయణరావు, గోన గన్నారెడ్డి, తుఫాను, కోనంగి, అడవి, శాంతిశ్రీ, హిమబిందు అనే నవలలు రచించారు. విశేషమేమిటంటే, ఈ ఆరు నవలల్లోనూ ప్రేమతత్త్వాన్ని అద్భుతంగా చిత్రించారు. వీరు కవి, రచయిత, పాత్రికేయుడు, చిత్రకారుడు, అధ్యాపకుడు, న్యాయవాది, నటుడు, కళాదర్శకుడు అనే అష్టసిద్ధులను కైవసం చేసుకున్న సర్వకళానిధి అని సగర్వంగా చెప్పుకోవచ్చు.

చక్కని, చిక్కని శైలితోపాటు గాఢత కలిగిన వస్తువు పాటంతా వ్యాపించి యుండడం ఈ పాటలోని ముఖ్య విశేషం. నీ కోసం అనే అర్థంలో 'నీకునై' అనే పదప్రయోగం అచ్చతెలుగు మూలాల అందాన్ని ప్రకటిస్తున్నది. సుమబాల, భృంగబాలుడు అనే ఆరోపక రూపకాలలోని లేతదనం ప్రేమలోని మార్దవాన్ని వ్యాఖ్యానిస్తున్నాయి. ఆడ కోయిలను కలరాగిణిగా సంభావించడం అపూర్వ ప్రయోగం. మూడవ చరణంలోని పదప్రయోగాలు ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తే తప్ప త్వరగా అర్థం కావు. అర్థమైతే వదిలిపెట్టం. వాహినీసతి, కడలిపతి కలయిక గురించిన వగలతో పొగిలే తీరును వానము, స్వానము అనే అపురూపశబ్దాలతో నిర్వచించడం బాపిరాజుకే సాధ్యమనిపించేలా ఉంది.

ఎండకాలం నదులకు పుట్టిల్లనడం కొత్త ఊహ. ఎండలకు ఎండిపోయిన నది ఉన్నచోటునుండి ఎలా కదులుతుంది? సముద్రుడిని ఎలా చేరుకుంటుంది? అలాంటి పరిస్థితిలో నదిని జలవంతం చేసేది పాటే, సముద్రుడిని ఓదార్చి ఇల్లు నిలబెట్టేదీ పాటే. అని ఎంతో గుంభనంగా చెప్పిన ఈ భావనను పరిశోధిస్తున్నాకొద్దీ వస్తురత్నజాలమంతా బైటపడుతూనే ఉంటుంది. అంతటి భావనిధి ఉన్నది ఈ చరణంలో. బాపిరాజుగారు సర్వకళానిధి కనుక తనలోని సంగీతాభినివేశాన్ని ప్రకటిస్తూ మొదటి చరణంలో కల్యాణిరాగాన్ని, రెండో చరణంలో తోడిరాగాన్ని, మూడో చరణంలో దీపకరాగాన్ని సూచించడం ఎంతో ప్రశంసనీయం. ఈ వైదుష్యానికి సమపాత్రులైన ఘంటసాల మేష్టారు, బాపిరాజుగారు సూచించిన రాగాలను తూచా తప్పకుండా విలక్షణ సంవిధానంతో బాణీచేశారు (దీపకం తప్ప). కాని రచనలో కనిపించే ఖండగతిని మాత్రం త్రిశ్రగతిలోకి మార్చుకున్నారు. అయినా నడకను కుంటుపడనీయలేదు. కల్యాణిరాగం తన అభిమానరాగం కనుక ప్రారంభం లోనే చక్కని ఆలాపన చేశారు. తారస్థాయి సంచారంలోని 'సానిరీసా' దగ్గర కొద్దిగా శుద్ధసారంగ్ తొంగిచూడడం విశేషం. పల్లవిలోని 'పాడెదను' పదాన్ని పంచమంనుండి ప్రారంభించడం సాభిప్రాయ విశేషం. కల్యాణిరాగానికి ఉన్న జీవస్వరాలలో గాంధారం ముఖ్యమైంది. చాలాసేపటిదాకా షడ్జమం తగలకుండా రాగాన్ని రక్తిగా పాడుతున్నప్పుడు రాగసౌందర్యాన్ని నిలబెట్టే స్వరాలలో గాంధారం అతిముఖ్యమైనది. అందుకే మేష్టారు కల్యాణి పాడాల్సి వచ్చినప్పుడల్లా ఈ గాంధారంమీదనే ఎక్కువగా నిలుపుదలను ప్రదర్శిస్తారు. ఈ పాటలోకూడా అటువంటి సొగసునే చూపారు. మొదటి చరణాన్ని గాంధారంతోనే ప్రారంభించి 'ముగ్ధనై' ని అక్కడే నిలిపారు.

రెండవ చరణంలో 'గళమెత్తి' అన్నచోట నిజంగానే తారస్థాయిలో గళమెత్తి పాడి 'కో' అనిపించారు. 'కలరాగిణి తోడి' ని పాడిన సంగతిలో ఘంటసాల ముద్ర మధురంగా వినిపిస్తుంది. ఇదే గమకముద్ర 'ఎదురుచూసే కళ్ళలో' (పెద్దక్కయ్య) అనే సినిమాపాటలో 'తొలి వలపుల వెన్నెల తునక' అనేచోట 'తునక' అనే పదంమీద మనోహరంగా వినిపిస్తుంది. ఇందులోనే 'రాజు' పదంమీద సుశీలమ్మ ఇదే గమకాన్ని ముద్దుగా పాడారు. 'కలరాగిణి తోడి' ని రెండోసారి పాడుతూ ఆధారషడ్జమంలోకి చేరడమే కాక, అదే రాగంలో పల్లవిని పాడాలనిపించిందేమో, కొనసాగించారు. అలా ఊరుకోలేదు. 'దేవి' ని అంతరగాంధారంతో స్పృశిస్తూ పాడడం అంటే దేవి ఆంతర్యంలోకి తొంగిచూడడమేకదా! ఎంతటి రసభావ గాంభీర్యం!

"కర్ణాటకసంగీతంలో చాలా ముఖ్యమైన రాగాలు ఐదున్నాయి. అవి-కల్యాణి, తోడి, శంకరాభరణం, భైరవి, కాంభోజి. వీటిలో ఏదో కనీసం ఒక్కటైనా లేకుండా సంగీతకచేరీ ఉండదు.'' అని ప్రముఖ సంగీత మహామహోపాధ్యాయులు డా॥ నూకల చిన సత్యనారాయణ గారు తన 'రాగలక్షణసంగ్రహం' అనే సంగీత గ్రంథం

(పుటనెం46) లో అన్నారు. సరిగ్గా ఈ అయిదింటిలో మొదటి రెండు రాగాలు ఈ పాటలో కుదురుకోవడం మహనీయుల వచోవైభవం. ఈ రెండవ చరణంలో 'విధురసంకేతియై' అని ఉంది. విధురుడు అంటే వియోగబాధను అనుభవించేవాడు అని అర్థం. విదురుడు అంటే తెలిసినవాడు, భారతంలో ఒక పాత్ర. పాటలో ఉన్నది విధురుడు. కాని ఘంటసాలకు లభించిన పాట ప్రతిలో 'విదురుడు' ఉన్నదేమో అనిపిస్తున్నది. మూడవ చరణంలో కవి సూచించిన రాగం పేరు 'దీపకము'. ఇది 51వ మేళకర్త అయిన కామవర్ధని రాగజన్యం.

దీని ఆరో : సగమపదపస

అవ : సనిదనిపమగరిస.

ఈ రాగంలో 'కళల నేర్చిన' అనే త్యాగరాజకీర్తన ఒకటే కనిపిస్తున్నది. ఇతర వాగ్గేయకారులెవ్వరూ ఈ రాగంలో రచనలు చేసినట్లు రుజువులు లేవు. కాని ఈ రాగాన్ని గానం చేసి తాన్‌సేన్ మహాశయుడు రాజమహల్‌లో (సంగీతపరీక్షలో) దీపాలు వెలిగించాడని ప్రతీతి ఉన్నది. సామాన్యప్రజానీకంలో ఈ రాగం అంతగా ప్రచారంలో లేనందుకేమో,ఘంటసాల ఈ రాగం మీద దృష్టి పెట్టలేదు. మూడవ చరణాన్ని తిరిగి కల్యాణిరాగంలోనే తారస్థాయిలో అందుకుని ఏదీ రిపీట్ చేయకుండా చకచకా పాడుకుంటూ వెళ్ళారు, బహుశా 'మద్రాసు రేడియో' లో పాడడంవల్ల వారి సమయాభావం కావచ్చు.

మూడు చరణాలూ మూడు ఎత్తుగడలతో, మూడు రకాల బిట్‌వర్క్స్‌తో ముచ్చటగా వినిపించే ఈ గీతం గురించి ఇంకెంతో లోతైన పరిశోధన జరుగవలసి ఉన్నది. ప్రేమతత్త్వాన్ని చాటించే సాహిత్యం, మాధుర్యాన్ని ప్రవహింపజేసే సంగీతం రెండూ ఈ పాటలో అద్భుతంగా పోటీపడుతున్నాయి.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

---

Statement about ownership and other particulars of **MISIMI**

**FORM IV (SEE RULE - 8)**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of Publication | : | Hyderabad |
| 2. | Periodicity of Publication | : | Monthly |
| 3. | Printer's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : | ALAPATI BAPANNA |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |
| 5. | Editor's Name | : | VALLABHANENI ASWINI KUMAR |
| | Whether citizen of India | : | Yes |
| | Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |
| 6. | Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

March-31, 2025

**ALAPATI BAPANNA**
Publisher

# పుచ్చలపల్లి శ్రీశ్రీ విశ్వేశ్వర రావు

– **మిసిమి**




విశ్వేశ్వర రావు

*"నలభై ఏళ్ల నుండి ప్రింటింగ్ రంగంలో ఉంటూ..ఆ రంగంలోని ఒడిదుడుకులను తట్టుకుంటూ సాగిపోయే విశ్వేశ్వరరావు గారిని పలకరిస్తే ప్రేమ ఆప్యాయతలు మనలను చుట్టేస్తుంటాయి. శ్రీశ్రీ మీద ప్రేమతో తన ప్రెస్‌ను శ్రీశ్రీ ప్రింటర్స్‌గా మార్చుకున్నారాయన.. తను వెళ్ళేదారి సన్నగా మూసుకుపోతోందని తెలుసు.. అయినా పుస్తకం పట్ల, ప్రింటింగ్ పట్ల ఆయనకున్న నిబద్ధత, పేషన్ ఆయన్ని దారిమళ్లించలేదు. నిర్మొహమాటం.. నిర్మోహత్వం కలగలిసిన ప్రత్యేక వ్యక్తిత్వం వారిది.. వారితో* ***మిసిమి*** *సంపాదకులు అశ్వినీ కుమార్ జరిపిన సంభాషణ నుంచి కొన్ని భాగాలు..* ***మిసిమి*** *పాఠకుల కోసం.*

**మిసిమి : విశ్వేశ్వరరావుగారు నమస్కారం. ప్రింటింగ్ అనే ఈ వ్యాపకంలోకి ఎలా దిగారు మీరు?**

**విశ్వేశ్వర రావు :** నేను ప్రత్యేకంగా దిగలేదు అశ్వినీ గారు.. మొదటినుంచి నాకు తెలిసిన వ్యాపకం ఇదే..

**మిసిమి : మొదటినుంచి అంటే ఎప్పుడు?**

**విశ్వేశ్వర రావు :** బహుశః 1974వ సంవత్సరం నుంచి అనుకుంటాను. 78నుంచి పబ్లిషర్ గా పుస్తకాలు వేయటం మొదలు పెట్టాను. అప్పట్లో చిన్న పుస్తకాల షాపు నడిపిస్తూ ఉండేవాడిని. అదే సమయంలో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ పెడదామని సి.కె.నారాయణరెడ్డిగారు, గీతారామస్వామి గారు నా పుస్తకాల షాపు దగ్గరకు వచ్చారు. మీ పుస్తకాల షాపు నడిచే వ్యవహారం కాదు. మీరు కూడా మాతో వస్తే బావుంటుంది.. కలిసి పనిచేద్దాం అని అడిగారు. అలాగే అని హైదరాబాద్ వెళ్ళాను. హిమాయత్ నగర్‌లో ఆఫీసు.. రెండు, మూడు సంవత్సరాలు వారితో ఉన్నాను. 1983లో శ్రీశ్రీ మరణించాడు. అది నన్ను ఇబ్బంది పెట్టింది. బెజవాడ వెళ్ళిపోదామమని నిశ్చయించుకున్నాను. సి.కె.గొడవ చేశాడు, వెళ్లొద్దని. కాదండీ శ్రీ శ్రీ చచ్చిపోయాడు.. నేను బెజవాడ వెళ్ళిపోవలసిందే అని పట్టుబట్టాను. బెజవాడ వెళ్లి ఏం చేస్తావ్ నువ్వు అంటాడాయన. ఏదో ఒకటి చేయాలి అంటాను నేను. అప్పటికింకా నా ఆలోచనలు ఓ కొలిక్కి రాలేదు.. బెజవాడ వచ్చేశాక మిత్రుడు రాంప్రసాద్‌తో కలిసి ఒక ప్రెస్ పెట్టాలనుకున్నాం. వాళ్ళ నాన్న అతనికి కాస్త డబ్బు ఇచ్చాడు.(నవ్వు). దాంతో పనిమొదలెట్టేశాం. ఉషశ్రీ ప్రింటర్స్ అని జైహింద్ టాకీస్ రోడ్డులో ఉంది. తొంభై ఐదు వేలకు బేరంచేసి అరవై వేలు అప్పు పెట్టాం.. మూడు నెలల్లో తీర్చేసేటట్టు. నార్ల వినయ్ కుమార్ ఆయన పార్ట్‌నర్ మరేం మాట్లాడకుండా ప్రెస్ మాకప్పగించివెళ్ళిపోయారు. ఆ ప్రెస్‌లో చలనచిత్ర పత్రిక ప్రింటవుతూ ఉండేది. తర్వాత ఎప్పుడో సి.కె., గీత బెజవాడొచ్చారు. ప్రెస్‌ను అంత తక్కువలో కొన్నందుకు ఆశ్చర్యపోయారు.. సి.కె.అయితే మూడు లక్షలు పెట్టుబడి పెట్టినా ఇలాంటి ప్రెస్ రాదన్నాడు. అయ్యా, వాళ్ళు నడపలేక మాకిచ్చిపోయారని చెప్పాం. హైదరాబాద్ నుండి బెజవాడ వచ్చేశాక అలా ప్రింటింగ్ రంగంలోకి వచ్చాను. 1983 సెప్టెంబర్ 18న మా ప్రెస్ ప్రారంభమయ్యింది. అప్పటివరకూ ఉన్న ఉషశ్రీ ప్రెస్ ఆరోజు నుంచి శ్రీ శ్రీ ప్రింటర్స్‌గా మారింది. దేవిప్రియ చరితా ప్రింటర్స్ అని పేరు పెట్టమని సలహా ఇచ్చాడు కానీ అది కుదర్లేదు. దేవిప్రియ మా దగ్గర నెలల తరబడి మకాం చేస్తుండేవాడు. మేమంటే ఎంతో ప్రేమ. ఆ చనువుండేది మాకు.. ఇక్కడ ప్రెస్ గురించో విషయం

చెప్పాలి.. ప్రెస్ మొదలుపెట్టాం కానీ, ఎలా నడపాలో మాకు కొంత అవగాహన కావాలనిపించింది. సత్యనారాయణపురంలో వేణుగోపాలరావు గారని అప్పట్లో గాయత్రి ప్రెస్ నడుపుతుండేవారు. వారు బాగా పరిచయం.. నా భార్య ప్రమీలకి ఆయన ట్రైనింగ్ ఇచ్చారు. నిజానికి ఆయన ఆ ప్రెస్ తనచేత నడిపిద్దామనుకున్నారు కానీ, నేనొప్పుకోలేదు.. ప్రెస్ నిర్వహణంతా ఆవిడే చూసుకోవాలి.. మన్నించండి అని చెప్పేశాను. ఎవరైనా వచ్చినప్పుడు ఏ పేపర్ వాడతారు, జి.ఎస్.ఎమ్ ఎంతుండాలి వంటి టెక్నికల్ అంశాలన్నీ తనకు బాగా తెలుసు. అలా ప్రెస్ నడుస్తున్న సమయంలో 1984లో మా ప్రెస్ కోర్టు కేసులో ఉందని తెలిసింది. జంధ్యాల శంకర్ గారి అన్నగారు నుంచి లీజు తీసుకుని నడిపిస్తున్నారు.. తర్వాత ఏవో పొరపొచ్చాలొచ్చి కోర్టుకు వెళ్ళారు వారు.. చివరికి తమకు అనుకూలంగా డిక్రీ పొందారు వారు.. వారు హైదరాబాద్‌లో ఉండేవారు మొదట లీజు కొనసాగించటానికి ఒప్పుకోకపోయినా, నాలో ఏం నచ్చిందో మొత్తానికి ఒప్పుకున్నారు. ప్రత్యామ్నాయంగా నేను కూడా, మాకు ఎంత కావాలో అంతే తీసుకుని మిగిలినది వారికే వదిలేశాను.ప్రెస్ నడిపేటప్పుడు ఇలాంటి గొడవలు కూడా ఉంటాయి. సమయస్ఫూర్తితో పరిష్కరించుకోవాలి (నవ్వు). ఇలా కొంతకాలం గడిచాక ఆ స్థలం వదిలేసి ఇప్పుడున్న పెద్దిభొట్ల వారి సందులోకి వచ్చాం. ఇక్కడ కూడా రవి ప్రెస్ అని ఇంకో ప్రెస్ లీజుకు తీసుకుని రెండు ట్రెడిల్స్ నడిపి, బానే పనిచేశాం.. ఇక్కడ దాదాపు ఇరవై ఏళ్ళు ఉన్న తర్వాత కొంచెం చిక్కులొచ్చాయి. అక్కడినుండి ఇప్పుడున్న మసీదు వీధిలో ప్రెస్ నడుపుతున్నాం.. ఇక్కడికి వచ్చి కూడా ఇరవై ఏళ్ళు అయ్యింది..

**మిసిమి** : **నలభై రెండేళ్ళ ప్రెస్ ప్రయాణంలో మీరు అనేక వర్క్స్ చేశారు.. పుస్తకాలు, వివిధ సందర్భాల్లో కార్డులు లాంటి స్పెషల్ వర్క్స్ చేశారు.. మీకు సంతృప్తి ఉందా?**

**విశ్వేశ్వర రావు :** మాకు పోటీ ఎవరూ లేరండీ.ఒకసారి మా దగ్గరికి వచ్చినవారు ఇంకోచోటుకి వెళ్ళే ప్రశ్న లేదు. అది మేము సంపాదించుకున్న గుడ్ విల్ అనండి..అభిమానం అనండి.. ఇంకో విషయం మేము స్పెషల్ వర్క్స్ చేయమండీ.. ప్రతి వర్క్ స్పెషల్‌గా చేస్తాం.. అదే మా ప్రత్యేకత. దినం కార్డు కూడా అందంగా వేస్తానని నాకు పేరుంది.

**మిసిమి** : **మీరు ఆర్టిస్ట్ కాదు.డిజైనర్ కాదు.. ఎలా చేయగలుగుతున్నారు?**

**విశ్వేశ్వర రావు :** నాకు చేయటం రాదు. చేయించుకోవటం వచ్చు. లెటర్ ప్రెస్ రోజులనుంచి ఇదే పద్ధతి ఫాలో అయ్యేవాడిని. ఇప్పుడు కంప్యూటర్ మీదే గదా వర్క్ అంతా. నాకు ఫాంట్ దగ్గర్నుంచి పేజ్ మేకప్ వరకు ఎలా చేస్తే బావుంటుందో జడ్జ్ చేయగలుగుతాను.అదిచాలు కదా..పుస్తకమైనా, కార్డు అయినా అందంగా రావటానికి.. కానీ మా ఆవిడకి ప్రింటింగ్‌లోని టెక్నికల్ అంశాలు బాగా తెలుసు. బుక్ వర్కులో నాకు పోటీ లేదు.

**మిసిమి** : **మీరు బుక్ వర్క్ ఎక్కువ చేస్తారా? జాబ్ వర్క్ ఎక్కువ చేస్తారా?**

**విశ్వేశ్వర రావు :** బుక్ వర్క్ ఎక్కువ చేస్తాను. కంప్యూటర్లు వచ్చాక స్టేషనరీ జాబ్ వర్క్స్ తగ్గిపోయాయి. ఇప్పటికీ చిన్న చిన్న బ్రోచర్స్, పెళ్ళి కార్డులు వేస్తాం కానీ తక్కువ.

**మిసిమి** : **బైండింగ్ ఎలా చేస్తారు.. బుక్ వర్క్‌కు అవసరం ఉంటుంది కదా..**

**విశ్వేశ్వర రావు :** సెంటర్ పిన్నింగ్ నేనే చేస్తాను.బైండింగ్ వర్క్ చేసే కుర్రాడు మా పక్కనే ఉంటాడు.అద్భుతంగా చేస్తాడు.

**మిసిమి** : **బుక్ వర్క్స్ చేస్తామన్నారు.ఎవరివి ఎక్కువ చేస్తారు? రచయితలవా! పబ్లిషర్స్ వా?**

**విశ్వేశ్వర రావు :** పబ్లిషర్‌వి నేనసలు చేయను. నేను వేసే బుక్స్ అన్నీ రచయితలవే. పబ్లిషర్స్ బేరాలన్నీ కష్టంగా ఉంటాయి. నాకర్థం కాదు. ఒకసారి చుక్కపల్లి పిచ్చయ్య గారు చెప్పాడు. నువ్వు పద్దెనిమిది పైసలు చెబుతున్నావు. వాళ్ళు పదహారు పైసలు చెబుతున్నారు అంటూ.. అంటే పేపర్ కూడా ఇచ్చాక పేజీ ప్రింటింగ్ కాస్ట్ అన్నమాట. అప్పుడు నేను చెప్పాను. ఇవన్నీ నాకు తెలియదు.ప్రింట్ చేసి బిల్లు ఇస్తాను..అని చెప్పాను. అది ఆయనకు నచ్చలేదు.

**మిసిమి** : **ఒకప్పుడు ఏలూరు రోడ్డులో చాలామంది పబ్లిషర్స్ ఉండేవాళ్ళు.. బాగా సంపాదించారు. సినిమాలు కూడా తీశారు. మీరు రాకముందు..**

**విశ్వేశ్వర రావు :** అంత సంపాదించలేదు సార్. మెరుగ్గా బతికారు అంతే. అయితే వారికి వేరే ఆదాయమార్గాలుండేవి. నవోదయా రామమోహనరావు ఉన్నాడు. ఆయన సంపాదించిందంతా బాపు రమణలకు ఖర్చు పెట్టడానికి సరిపోయింది.

నవభారత్, నవోదయా, నవజీవన్ పబ్లిషర్స్ ఉండేవారు. ఒకరు యండమూరి వీరేంద్రనాథ్ పుస్తకాలు వేసేవారు, ఒకరు రంగనాయకమ్మ పుస్తకాలు వేసేవారనుకుంటే ఆరోజుల్లో మాదిరెడ్డి సులోచన, యద్దనపూడి సులోచనారాణి పుస్తకాలు మూడునుంచి ఐదువేల కాపీలు వేసేవారు. ఇప్పుడంటే ఆ సంఖ్య తగ్గిపోయింది కానీ.. యండమూరి పుస్తకాలు పది, పదిహేను సార్లు రీప్రింట్ అయ్యుంటే, సులోచనారాణి సెక్రటరీ రెండువందలసార్లన్నా రీప్రింట్ అయిఉంటుంది.ఇప్పటికీ అమ్ముడు పోతుంటుంది. నేను పతంజలి "గెలుపుసరే" పుస్తకం పదిసార్లు వేసుంటాను. అదే శ్రీ శ్రీ మహాప్రస్థానం సంవత్సరానికి పదివేల కాపీలన్నా అమ్ముడవుతుంది. విశాలాంధ్ర వారు ప్రతి సంవత్సరం వేస్తారు. దానికి పోటీ లేదు. ఏదీ దాని సాటి రాదు.సెక్రటరీ దానికి సమీపంలో కూడా ఉండదు. దాని విలువ వేరే.దీని విలువ వేరే.. ఈమధ్య రాజ్యాంగ పీఠిక పుస్తకం వేశాను. ఐదునెలల్లో రీప్రింట్ వచ్చింది.

**మిసిమి** : **విశ్వేశ్వరరావు గారు.. శ్రీ శ్రీ పేరు పెట్టుకున్నారు.. మీకేమైనా పబ్లిషింగ్ హక్కులున్నాయా?**

**విశ్వేశ్వర రావు :** నాకెవరి రచనల మీదా హక్కులు లేవండి.అసలు హక్కులేమిటండీ?

**మిసిమి** : **నేనో పుస్తకం ప్రచురించానుకోండి.ఆ పుస్తకం మీద హక్కులు నావేకదా.**

**విశ్వేశ్వర రావు :** మీరు అలా అంటున్నారు.. ఏ రచయితకూ రాసిన తర్వాత హక్కులు లేవండి. ఒకసారి పుస్తకం అచ్చయిన తర్వాత ఇక హక్కులేమిటండీ. మీరు హక్కులు అంటే గుర్తుకొచ్చింది. శ్రీశ్రీ మహాప్రస్థానం పెద్ద పుస్తకం మేం పుస్తకం వేశాక ఆయన వారసులు అడిగారు, పర్మిషన్ లేకుండా ఎలా వేశారని. ఇదే సమాధానం చెప్పాను. హక్కులు మావే కదా అన్నారు. మీవే అని పుస్తకంలో వేశానని చెప్పాను. పుస్తకం వేసినప్పుడు రెండు కాపీలు పంపించానని వారికి మనవి చేశాను.

**మిసిమి** : **సరే ఆ విషయం వదిలేసి మళ్ళీ మనం ఏలూరు రోడ్డులో ఉండే పబ్లిషర్స్ దగ్గరకు వద్దాం. ఇప్పుడు ఎవరు కనిపించరేమిటి?**

**విశ్వేశ్వర రావు :** ఇప్పుడు చదివే అలవాటు తగ్గిపోయింది కదా సార్.. దాంతోపాటు ప్రచురణలు తగ్గిపోయాయి.

**మిసిమి** : **మరి మీరు పుస్తకాలు వేస్తున్నారు కదా. మానేయలేదుగా?**

**విశ్వేశ్వర రావు :** ఇప్పుడు జనాల రీడింగ్ హేబిట్‌లో మార్పు వచ్చింది కదా సార్. ఇప్పుడు గైడ్స్ కూడా లేవు. అంతా కంప్యూటర్‌లో చూసుకుంటున్నారు. తగ్గిపోయి తగ్గిపోయి ఇట్టా మిగిలాం మేమూ, రచయిత. యాభైకాపీలు, వంద కాపీలు, రెండొందల కాపీలు.. ఒకప్పుడు యాభై రీముల పేపర్ కొంటే.. ఇప్పుడు ఐదు రీములకు పడిపోయింది. అయితే మేమూ బతుకుతున్నాం.. ఆళ్ళూ బతుకుతున్నారు (రా పేపర్ అమ్మేవారు). అప్పులు చేస్తూ బతుకుతున్నాం.. ఉంటం కోసం.. తింటం కోసం..ఇంకో పనిచేయటం చేతకాక ఇందులోనే మిగిలిపోయాం(విరక్తిగా నవ్వారు).

**మిసిమి** : **ఒకప్పటి దబ్బు,దాబూ లేవిప్పుడు.. ఒప్పుకుంటాను.క్లారిటీ వచ్చింది.అంటే హేండ్ టు మౌత్ అంటారు. ఆ పరిస్థితిలో ఉన్నామంటారు..**

**విశ్వేశ్వర రావు :** ఈ కుర్చీ, ఈ బల్ల ఉషశ్రీ ప్రింటర్స్ కొన్నప్పుడు ఇవి కూడా మాకొచ్చాయి. ఇలాంటివి ఇంకో నాలుగు బల్లులు, కుర్చీలు కూడా వచ్చాయి. అవన్నీ రకరకాలుగా మారిపోయాయి. ఒక రోజ్ వుడ్ టేబుల్, ఆ బిల్డింగ్ ఓనర్ శాస్త్రి గారికి అడిగితే ఇచ్చేశాను. ఇక ఈ బల్లను మాత్రం మార్చలేదు. అలాగే ఉంచాను. సొరుగులే తప్ప తాళాలు లేవు.

**మిసిమి** : సెంటిమెంట్ కోసం ఉంచుకున్నారా?

**విశ్వేశ్వర రావు** : ఏ సెంటిమెంట్ కోసం లేదు.

**మిసిమి** : **మీరొక పేషన్‌తో పనిచేస్తున్నారని నేను నమ్ముతున్నాను.**

**విశ్వేశ్వర రావు** : అక్షరాలా నిజం. ఇష్టం తప్ప మరేమీ లేదు.

**మిసిమి** : **వృత్తిపరంగా వచ్చిన ఈ వస్తువులను ప్రేమిస్తున్నారు. బావుంది.. మరి ఈ వృత్తిలో ఉన్న మనుషులను..**

**విశ్వేశ్వర రావు :** ఇంతకు ముందే చెప్పాను మీకు, ఒకసారి నా దగ్గరకు ప్రింటింగ్ కోసం వచ్చినవారు, మళ్ళీ జన్మలో ఇంకో పబ్లిషర్ దగ్గరకు వెళ్ళరని. నేను కవిత్వాన్ని ఇష్టపడేవాడిని. 1999లో నాదగ్గరకు కవులొచ్చారు.

అఫ్సర్ ని మేడే సందర్భంగా పిలిచాను. అఫ్సర్ ఏమన్నాడంటే.. విశ్వేశ్వరరావు పోయి, పోయి రచయితలతో పెట్టుకున్నాడు.. జాగ్రత్తగా ఉండాలి అన్నాడు.. నేను జాగ్రత్తగా ఉండటం కాదు. వాళ్ళే నాతో జాగ్రత్తగా ఉండాలి అన్నానేను. నేను పుస్తకం వేయటానికి అడ్వాన్స్ తీసుకోను. పుస్తకం వేశాకే డబ్బుచ్చుకుంటాను. ఒక్క రచయిత కూడా నాకు డబ్బు ఎగ్గొట్టలేదు. అది చాలదా, నాపై వారి నమ్మకానికి..

**మిసిమి : సరే మీకు కవులతో పేచిల్లేవు. బావుంది. మీరు దాదాపు పాతికేళ్ళుగా ప్రతి సంవత్సరం మే ఒకటిన మీ కవితా వార్షిక తెస్తున్నారు. కవిత్వాన్ని ఎంకరేజ్ చేయడానికో ఫంక్షన్ పెడుతున్నారు.!**

**విశ్వేశ్వర రావు :** నేను కవులను ఎంకరేజ్ చేయడం కోసం ఆ పుస్తకం తేవడం లేదు. నాకు కవిత్వం అంటే ఇష్టమని వేస్తున్నాను. ఇరవై రెండు సంవత్సరాలుగా మే ఒకటో తేదీనే ఆ ఫంక్షన్ జరుపుతున్నాను.

**మిసిమి : మే ఒకటినే జరపటానికి ప్రత్యేక కారణమేమన్నా ఉందా?**

**విశ్వేశ్వర రావు :** మే ఒకటి పుచ్చలపల్లి సుందరయ్య గారి జయంతి. అలాగే నార్ల చిరంజీవి గారి జయంతి. సరే మేం డే ఎలాగో ఉంది. అది నాకిష్టం. ఈ మూడు కలిపితే కవిత వార్షిక సంచిక వెలువడే రోజు. ఆ రోజున ముప్పై మంది కవుల చేత నేను ఆ పుస్తకంలోని కవితలు చదివిస్తాను. పుస్తకంలో ఉన్నవాళ్లు, లేనివాళ్ళు కూడా చదువుతారు.

**మిసిమి : తర్వాత మిమ్మల్ని కలవటానికి తనికెళ్ళ భరణి లాంటి ప్రముఖులు వస్తారని నాకు తెలుసు. ఇలా రచయితలు, ఆర్టిస్టులు మీ దగ్గరకు ఎందుకొస్తారు?**

**విశ్వేశ్వర రావు :** ప్రత్యేకమైన కారణం ఏమీ లేదండి. నాతో కాసేపు మాట్లాడదామని వస్తారు. నాతో మాట్లాడితే వాళ్ళకేమొస్తుందో కూడా నాకు తెలియదు. మా ప్రెస్ ముప్పై ఏళ్ల ఫంక్షన్‌కు ప్రగతి ప్రింటర్స్ హనుమంతరావు గారిని పిలిచాం. వస్తాను కానీ, నా ఖర్చులు నావే అన్నాడు. అదేసమయంలో వాళ్ళ ప్రెస్ ఫంక్షన్ ఉండటంతో వారం ముందరే మా ఫంక్షన్ జరిపాం. ఆయన ఐలాపురం హొటల్లో మకాం చేశాడు. మా ఫంక్షన్ కూడా అక్కడే పెట్టాం. నాలుగు రోజులున్నాడు. ఒకరోజు ఆదివారం నాడు మా ప్రెస్‌కి వెళ్దాం పద అన్నాడు. అప్పుడే విజ్ఞాన్ రత్తయ్య మీతో కాఫీ తాగాలనుందని హనుమంతరావు గారిని అడిగాడు. మాతో ప్రెస్‌కు రండని ఆయన్ని కూడా తీసుకెళ్ళాం. బాబాయ్ (హనుమంతరావు) ఓ అరగంట ఉండి వెళ్ళిపోయాడు. రత్తయ్య గారు గంటసేపు కూర్చున్నాడు. వెళ్ళిపోతూ ఓ మాట అన్నాడు. విశ్వేశ్వరరావుగారు ఎప్పుడన్నా మనసు బావుండకపోతే కాసేపొచ్చి కూచుంటాను అని చెప్పి వెళ్ళాడు. ఒకసారి జె.డి.లక్ష్మీనారాయణ ఊళ్ళోకొస్తే ఓ మిత్రుడితో కలిసెళ్ళి శ్రీ శ్రీ మహాప్రస్థానం ఇచ్చొచ్చాను. ఇది జరిగిన రెండు నెలలకు ఆయన విజయవాడొచ్చి ఓ మనిషిని పంపించాడు. ఆ వ్యక్తి సార్ వస్తానంటున్నాడు అంటే ఫోన్ చేసి వద్దు సార్.. నేనే వస్తాను అంటుండగా ఫోన్ కట్ చేశాడు.. కట్ చేస్తే మా గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు ఆయన. మిమ్మల్ని డిస్ట్రబ్ చేయను. పదినిముషాలుండి వెళ్ళిపోతాను అన్న వ్యక్తి ముప్పావుగంట ఉండి వెళ్ళాడు. అదే మండలి బుద్ధప్రసాద్, భరణి వస్తే జనం చుట్టూ మూగిపోతారు. బుద్ధప్రసాద్ గారొస్తే జనం చేతులు కట్టుకు నిలబడతారు. భరణితో ఇంకో గొడవ. దారిపోయే జనాలను పిలిచి ఫొటోలు దిగుతాడు. ఫొటో షూటింగ్ సరిపోతుంది. మీరన్న ప్రశ్నకు ఇవన్నీ గుర్తుకొచ్చాయి.

**మిసిమి : ప్రమీలగారి పాత్రేమిటి?**

**విశ్వేశ్వర రావు :** పాత్రేమీ లేదు. మొత్తం ఆవిడే చూసుకుంటుంది. నేనే నా సీట్ పోతుందని రానివ్వను (నవ్వు). అదేం కాదు కానీ ఇప్పుడు ఆరోగ్యం అంత బాగోలేదు. ఎక్కువసేపు కూర్చోలేక పోతోంది. అందుకే రావటం తగ్గించింది.

**మిసిమి : మీ కెరీర్‌లో మీరు చాలా మందిని కలిసుంటారు. వారి ప్రభావం మీమీద ఎంతుంది. శ్రీశ్రీ పేరు పెట్టారు అంటే ఊరికే పెట్టరు కదా..**

**విశ్వేశ్వర రావు :** మీకు కొంత నా బ్యాక్ గ్రౌండ్ గురించి చెప్పాలి. అరవై తొమ్మిదిలో నేను ఎస్.ఎస్.ఎల్.సి.కి వచ్చాను. ఆ సమయంలో నాకు చదువు మీద విరక్తి కలిగింది. ఎనిమిది, తొమ్మిది తరగతుల నుంచి నాలో ఓ డిస్ట్రబెన్స్ జరుగుతోంది. మా టీచర్ కేమీ తెలియదన్న నమ్మకం రోజూ పెరిగి పోతోంది. రెండుసార్లు టీచర్ కొట్టాడు. మీకు తెలియని విషయం చెబితే మీకు కోపం వస్తోంది.. ఇది మీరు తెలుసుకుంటే మంచిదన్నాను. ఇంకో

సందర్భంలో హిందీ టీచర్‌ని ఎదిరించాను వాళ్ళాయన తెలుగు మాస్టారు. నాకావిడ పనిష్మెంట్ ఇస్తే నేను చేయలేదు. ఆయన నన్ను బ్రతిమాలాడు. సార్, మేడంను ట్రాన్స్ఫర్ చేయిద్దాం అనంటే, నిజంగానే ఆవిడకి ట్రాన్స్ఫర్ వచ్చింది. అదికూడా వాళ్ళమ్మ గారి ఊరు పెనమలూరు. ఓరోజు క్లాస్‌లో ఆవిడొచ్చి నాచేయి పట్టుకుని నువ్వు గొప్పోడివిరా అంది. నిజానికి నేను చేసిందేమీ లేదు.. అలాగే మా హెడ్మాస్టర్‌తో గొడవ. రిపబ్లిక్ డే నాడు, ఆగస్టు 15న పిల్లలకు ఖర్చు పెట్టాల్సిన బడ్జెట్ సొంతానికి వాడుకున్నాడు. నేను స్కూల్ లీడర్‌గా దాన్ని అడ్డుకొని దెబ్బలు తిన్నాను. ఇవన్నీ నామీద ప్రభావం చూపించి, చదువంటే వెగటు పుట్టించాయి. మా నాన్నతో చెప్పాను.. ఇంక నేను చదవనని. ఆయనా మొండాడే.. అయితే ఇంట్లోంచి వెళ్ళిపో అని మా అమ్మను పిలిచి రెండు జతల బట్టలు, ఇరవై రూపాయలు ఇమ్మన్నాడు. అక్కడినుండి బెజవాడ మా అక్కయ్య ఇంటికొచ్చాను. ఆవిడ పాలిటెక్నిక్ చదివి ఇంజనీర్‌గా స్టేట్ గవర్నమెంట్‌లో పనిచేస్తోంది. నేను చెప్పిందంతా విని చదువుకోకపోతే నేను ఇంట్లో ఉండనివ్వను అంది. నాకు మా అక్క చెబితే తెలిసింది. మా నాన్నకు నేను డి.ఫార్మసీ చదివి, ఆ మందుల షాపు మెయింటెయిన్ చేయాలని కోరిక. నేను చూస్తే ఇలా. మా అక్కయ్య ఇంట్లో ఉండటం కోసం ఐటిఐలో చేరాను. అది ఆవిడకి ఇష్టం లేదు. నెమ్మదిగా కొంతమంది మిత్రులతో కలిసి రూం తీసుకున్నాం. కండిషన్ ఏమిటంటే నన్ను డబ్బులడగకూడదు. ఒప్పుకున్నారు పాపం. అలా ఆ కోర్సు అయిపోయింది. రాజమండ్రి స్పిన్నింగ్ మిల్లులో చేరాను. అది కాందిశీకుల కోసం నిర్దేశించింది. వారానికి నాలుగు రోజుల పాటు పనిచేయాలి. పదిరూపాయలొచ్చేది. నెలకు నలభై రూపాయలు.. అది బర్మా కాందిశీకుల కోసం ఏర్పాటు చేసింది. మనకివ్వరు. ఆ స్పిన్నింగ్ మాస్టర్తో నాకు పరిచయముంది. నన్నుగుర్తుపట్టి అవకాశమిచ్చాడు. రాజమండ్రిలో బుచ్చయ్యచౌదరి గారి మావగారు మా నాన్న క్లాస్మేట్స్. ఆయన దగ్గరకు వెళు తుండే వాడిని. అక్కడే ఒక డాక్టర్ గారు పరిచయమయ్యాడు. ఆయన నా వివరాలు తెలుసుకుని స్పిన్నింగ్ మిల్స్‌లో డబ్బులేమిస్తారు.. అడ్డతీగలలో మాకో బేంబూతోట ఉంది. దాన్ని చూసుకో అని అడిగాడు. అడ్వెంచర్ అంటే ఇష్టంతో సరే అన్నాను. ఒక గొంగడి, తలకు చుట్టుకునే గుడ్డ తెప్పించాడు. రాత్రి ఆయన దగ్గర పడుకుంటే, పొద్దున్నే లారీ ఎక్కించాడు. పదహారువందల ఎకరాల వెదురు తోట. చాలా లోపల ఉన్న దట్టమైన అడవి. రెండేళ్ళు ఉన్నానక్కడ. రెండు అడుగుల దూరంలో పులిని చూశాను.. పిల్లలతో ఉన్న ఎలుగుబంటిని చూశాను. అలా కొంతకాలం గడిచింది జీవితమక్కడ. (నవ్వు)

**మిసిమి** : **మనం డీవియేట్ అవుతున్నాం. శ్రీశ్రీ మీద ఇష్టంతో మీ ప్రెస్‌కు ఆయన పేరు పెట్టారు.బావుంది. శ్రీశ్రీని చదివారా?**

**విశ్వేశ్వర రావు :** ఈ ప్రయాణక్రమంలో శ్రీ శ్రీ తగిలాడెక్కడో. మహాప్రస్థానం హైస్కూలులో ఉండగానే చదివాను. అర్థమవలేదు. ఇప్పటికీ అవదు కానీ చదివితే ఒక ఎక్సైట్‌మెంట్. ఆయన పోయే మూడు, నాలుగు సంవత్సరాల ముందు కలిశాను. సరదాగా మాట్లాడాడు. మహాప్రస్థానం ముందు మాటొచ్చి పదేళ్ళయినా ఆయన పుస్తకం వేయలేదు. ఎందుకు వేయలేదంటే కారణాలు చెప్పాడు. ఆయనకు పెద్దగా పుస్తకం రావాలని కోరికుండేది. ఆయన కోరిక తీర్చాలనుకున్నాను. పదేళ్ళు ఆగాను దానికోసం. ప్రగతి నరేంద్రను సంప్రదించాను. అప్పుడే మా అమ్మాయి పద్మ ఓ మాటంది. బాబాయి.. మూడు కోట్ల డెబ్బైలక్షలు పెట్టిన డబుల్ క్రౌన్ మిషన్ కొన్నాం. నువు బయట బుక్ వేయిస్తాను అనటం నచ్చలేదు అంది. అలాగేమ్మా మన దగ్గరే వేయిద్దాం అని డబుల్ క్రౌన్ సైజ్‌లో మహాప్రస్థానం తెచ్చాం.

**మిసిమి** : **శ్రీ శ్రీ కాకుండా ఇంకా ఎవరు ఇష్టం మీకు?**

**విశ్వేశ్వర రావు :** చలం, కుటుంబరావులంటే ఇష్టం. చలం దగ్గర వారంరోజులున్నాను. ఆయన మొహమాటం పెట్టేస్తాడు. కదలనివ్వడు. పారిపోయి వచ్చేశాను పి.రామకుష్టారెడ్డి తెలుసుగా.ఆయనకీ మాట చెబితే నేను మూడునెలల ఉన్నానని పగలబడి నవ్వాడు. చలంగారిల్లు ఒక సత్రం లాంటిదండీ. ఎవరైనా రావొచ్చు. తినొచ్చు. పొద్దున్నే ఏడింటికి టిఫిన్ రెడీ అంటారు. మళ్ళీ పదకొండు గంటలకు భోజనం రెడీ అంటారు. ఎలా నడిపిస్తారు ఏమిటో కానీ.. మనలనేమీ డబ్బులడగరు.. కానీ ఎవరో సర్దుబాటు చేస్తారు. జరిగిపోతుంది. కొడవటిగంటి కుటుంబరావును కలవటం కోసం చందమామ ఆఫీసుకు వెళ్ళిపోయాను.. ఆయన సాయంత్రం ఇంటికి వెళదామా అన్నాడు. ఒకరాత్రి వాళ్ళింట్లో పడుకున్నాను. నా కోరిక ఏంటంటే, వీళ్ళు ఏం తింటారు, ఎలా ఉంటారు.. పుస్తకాల్లో రాసినట్లు

ఉంటారా! తేడా ఉంటుందా! ఇది నా క్యూరియాసిటీ. కొన్ని సంవత్సరాల తరువాత సి.వి.గారిని కలిశాను. అంటే సి.వరహాలరావు. ఆయన కస్తూరిబాయిపేటలో మా భారతక్క ఇంటి పక్కనే ఉండేవాడు. ఖాళీటైంలో వెళుతుండేవాడిని. ఆయన రాసుకుంటుండేవాడు. రెండు, మూడు సంవత్సరాలు కలిశాను అలా ఆయన్ని. శ్రీ శ్రీ, చలం, కుటుంబరావు కంటే సి.వి.బాగా నచ్చాడు నాకు. మనలాంటి మనిషి. చాలా సిన్సియర్ కూడా.

**మిసిమి** : **మీమీద లెఫ్ట్ ప్రభావం చాలా ఉందని అర్థమైంది. మరి భరణి లాంటి వారితో మీ ప్రయాణం ఎలా సాగింది?**

**విశ్వేశ్వర రావు :** భరణితో ఏం జరిగిందో తెలీదు కానీ మేమిద్దరం ఒకే రోజున పుట్టాం.. జూలై పధ్నాలుగున. ఐదారేళ్ళపాటు ప్రతి పుట్టినరోజుకు హైదరాబాద్ వెళ్ళేవాడిని.

**మిసిమి** : **పుట్టినరోజుకు అవార్డులిస్తుండేవాడు కదా.**

**విశ్వేశ్వర రావు :** కొన్ని సంవత్సరాలపాటు ఇచ్చాడు. ఆ తర్వాత చిన్న డిస్టబెన్స్ వచ్చి మానేశాడు. నాకంటే ఐదారు సంవత్సరాల చిన్నాడు. మొదటి అవార్డు వేగుంట మోహన్‌ప్రసాద్‌కు ఇస్తానన్నప్పుడు, యంగ్ పొయెట్‌కు ఇస్తానని ప్రకటన ఇచ్చాడు. నేనేదో కేజువల్‌గా మోహన్‌ప్రసాద్ కొత్త పుస్తకం పోస్ట్‌లో పంపిస్తే తెగ నచ్చేసింది తనకు. మోహన్‌ప్రసాద్‌కు ఇచ్చేద్దామా అని ఫోన్ చేశాడు. నువ్వు యంగ్ పొయట్‌కు ఇస్తానన్నావు.. ఆయనకు అరవై తొమ్మిదేళ్లు అన్నాను. పొయెట్‌గా యంగేలే అన్నాడు. సరే నీ ఇష్టం అన్నాను. అవార్డు వచ్చిందని మోహన్‌ప్రసాద్ ఫోన్ చేసిచెబుతూ పుస్తకం మీరిచ్చారా అని పొంగి పోయాడు. ఆ ఫంక్షన్ చాలా గొప్పగా చేశాడు భరణి బంగారు పూలను అక్షతలు చేసి చల్లారు.. యాభైవేల నగదు ఇచ్చారు.

**మిసిమి** : **ఆ తర్వాత ఆయన తొమ్మిది రోజులే ఉన్నాడు.**

**విశ్వేశ్వర రావు :** నా షష్టిపూర్తికి విజయవాడ వచ్చాడు. మళ్ళీ హైదరాబాద్ వెళదామనుకున్నాడు. ఆరోజు రాత్రి మా ఫంక్షన్ అయ్యాక ఉదయాన్నే ఇంట్లో మంచంమీంచి దొర్లి పడటం, తలకు గాయం కావటం, అది బ్రెయిన్ హేమరేజ్‌కు దారితీయడం జరిగాయి.(అది జరిగే ముందు రోజే పన్నాల సుబ్రహ్మణ్య భట్టు గారు అడిగారుట.. ఏమిటి.. అమ్మాయి దగ్గరకు వెళుతున్నారా అని. ఇంత బతుకు బతికి కూతురు దగ్గర ఛస్తామా అన్నారుట.. ఆతర్వాత రోజే ఇది జరిగింది. భట్టుగారు ఇలా జరిగిందేమిటి అని చాలా బాధపడ్డారు).

**మిసిమి** : **కవులతో కలిసి ప్రయాణం చేశారు. దానివలన మీకిష్టమైన ప్రవృత్తి నుంచి మీరు డీవియేట్ అయ్యే ఉద్దేశం మాకర్థమయిందిలెండి. డిజిటల్ యుగం వచ్చాక.. ఈ వృత్తిలో మీ దారి సన్నగా నడవలేనంతగా అయిపోతోంది.. మీకు చేతినిండా పనుందా?**

**విశ్వేశ్వర రావు :** చేతినిండా పనిలేదండీ. కరోనా వచ్చివెళ్ళిపోయి మూడేళ్ళయింది కదా. ఇప్పటికీ నా ఖర్చులు సరిపడా డబ్బులు రావటం లేదు. అప్పయిపోతోంది. మా ఆవిడ రెండు నెలల నుంచి గొడవ పెడుతోంది. అప్పులు చేస్తూ పోతే ఎలా అని. దానికి సమాధానంగా నేనేం చెప్పానంటే.. ఎక్కడా అప్పు చేయలేదు..బాకీపడ్డానని.. పేపర్ కొట్టాయన పేపర్ ఇస్తున్నాడు..అది బాకీయేగా అంటాను.. మరెందుకు నడుపుతావు అంటుంది.. ఇంటికాడ కూచుంటే ఎక్కువ పోట్లాడుకుంటాం కదా అదే ఇక్కడికొస్తే ఇద్దరికీ రిలీఫ్ అంటాను.(నవ్వు). అలా మెయింటెయిన్ చేస్తున్నాను.. జీతాలకు కూడా డబ్బు రానప్పుడు ఎందుకు నడపాలి అని తనంటుంది.. నాకు రోజు గడుస్తుంది కదా అని నేనంటాను.

**మిసిమి** : **మీరు పిడివాదం చేస్తున్నారు.ఎన్నిరోజులుగడుపుతారు ఇలా..ఇది లూజింగ్ గేమ్ అని మీకూ తెలుసు..అవునా!**

**విశ్వేశ్వర రావు :** అదేమీ లేదండి.. మీ పక్కనున్న అబ్బాయి మాకు పేపర్ ఇస్తాడు. పదిలక్షలు బాకీ పడినా అడగడు.. ఇక మా పద్మ కూడా 'బాబాయ్ డబ్బులు ఎప్పుడిస్తావ్' అని అడగదు. ఉదాహరణకు చెబుతున్నాను. ఎవరో ఒక ముప్ఫైవేలు తెచ్చిచ్చారు.. అవి ఇతన్ని పట్టుకెళ్ళమన్నాను. ఇతనికి నలభై వేలు కావాలి. నలుగురికి ఇవ్వాలనుకుందాం. ముగ్గురికి ఇస్తాడు. ఇంకొకళ్ళకి రేపిస్తాడు. ఇలా అనుకోవటం తప్ప ఇంకో ఆల్టర్నేటివ్ లేదు కదా..

**మిసిమి** : **యాభైఏళ్ల మీ చరిత్ర విన్నాక ఇప్పుడర్థమయింది ప్రింటింగ్ మీకెంత పాషనో..**

**విశ్వేశ్వర రావు :** చిన్న సవరణ.. యాభై ఆరేళ్ల జీవితం..69లో ఇంట్లోంచి వెళ్ళిపోయాను కదా. నేనో రెండు నిమిషాలు తీసుకుని నా జీవితంలో పుచ్చలపల్లి సుందరయ్య గారి ప్రభావం గురించి చెప్పాలి. మా ఇద్దరికీ సిద్ధాంతపరమైన బంధం లేదు. తెలీకుండా వ్యక్తిగత అనుబంధం ఎలా ఏర్పడిందో చెబుతాను. 1962లో కడియాల గోపాలరావు గారు ఉయ్యూరు ఎలక్షన్స్‌లో నిలబడ్డాడు. ఆయనకు ప్రచారం చేయటం కోసం పుచ్చలపల్లి సుందరయ్య గారు, లీల గారు వచ్చారు. లీలగారికి తెలుగు రాదు. కలకత్తా వారిది. సుందరయ్యగారికి రెండు జీపులుండేవి. మొదటిదాంట్లో మైక్ సామాగ్రి ఉండేది. రెండో జీపులో ఆయనుండేవాడు. అలా మొదటిసారి ఆయన్ని చూశాను. 1964లో రెండోసారి చూశాను. అప్పుడు పార్టీలో చీలికలొచ్చాయి. గందరగోళంగా ఉంది. ఆయన మా ఊరొస్తుంటే నన్ను తీసుకు రమ్మని పంపారు. ఆయన ఉయ్యూరు నుంచి బస్సులో రావాలి. అరగంటైనా రాడు. ఆ బస్సొచ్చి వెళ్ళిపోయింది కూడా. ఇంకో బస్సులో వస్తాడనుకుంటే జట్కా బండిలో దిగాడు. ఆయన్ని మీటింగ్ దగ్గరకు తీసుకొని వెళ్ళాను. ఆయన అడిగినప్పుడల్లా మజ్జిగ, మంచినీళ్ళు సప్లై చేయటం నాకప్పగించిన డ్యూటీ. ఆయన అన్నం తినడు. ఆయనకేదో జీర్ణకోశ వ్యాధి ఉంది. పొద్దున్న తొమ్మిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు మాట్లాడుతూనే ఉన్నాడాయన. ఆ తర్వాత బస్సెక్కి వెళ్ళాడు. కామ్రేడ్ మానికొండ సుబ్బారావు గారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నందమూరులో దింపమన్నాడు. సైకిలుమీద ఆయన్ని తీసికెళుతూ ఓ కిలోమీటర్ దూరం పోయాక ఆపాను. ఏంటి కాళ్ళు నెప్పులా అన్నాడు. కాదు బాబాయ్..సుందరయ్య గారు వరల్డ్ పాలిటిక్స్, చైనా అంటూ ఏవేవో మాట్లాడాడు. నాకేమీ అర్థం కాలేదు అన్నాను. అరగంటసేపు తేటతెల్లంగా నాకు తెలిసేట్టు చెప్పాడు. ఆయన స్థాయి తెలిసింది. 64లో మేమిద్దరం కలిశాక సుందరయ్య గారు నన్ను బాగా గుర్తుపెట్టుకున్నాడు. 72,74లో చాలాసార్లు కలిశాను. ఒకరోజు మనిషితో కబురు చేశాడు.కస్తూరిబాయిపేటలో ఓ పూరిల్లు అరుగుమీద చూరుకింద కిరసనాయిలు బుడ్డి దీపం వెలుగులో ఆయన ప్రకాశిస్తున్నాడు. పక్కనే మానికొండ సుబ్బారావు గారు ఉన్నాడు. నా చేయి పట్టుకొని పాతికేళ్ళు వచ్చాయి.పెళ్ళి చేసుకోవా అని అడిగాడు. ఎవరినైనా అనుకున్నావా అన్నాడు. లేదన్నాను. అయితే నేను చెప్పిన అమ్మాయిని చేసుకో అని ఒక పేరు చెప్పాడు. నాకు ఆ అమ్మాయి తెలుసు. పెద్ద పరిచయం లేదుగానీ. ఆ అమ్మాయి హైదరాబాద్‌లో మంచి ఉద్యోగం చేస్తోంది. అందుకని నన్ను హైదరాబాద్ వెళ్ళమన్నాడు. నేను వెళ్ళనన్నాను. ఆ ఊరు నాకిష్టం లేదని చెప్పాను. నీ జీవితం బావుంటుంది వెళ్ళు అంటాడాయన. ఆ సంవత్సరం మార్చిలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో నా పెళ్ళికి ఏర్పాట్లు జరిగాయి. ఆ తర్వాత నన్ను బెంగుళూరు వెళ్ళమన్నాడు. బెంగుళూరులో ఎస్.వి.నర్సయ్యగారని ఇండస్ట్రియలిస్ట్ ఉన్నాడు. నీకు ఉద్యోగమిస్తాడు. రేపు నీకు ఇంటర్వ్యూ అన్నారు. నర్సయ్య గారి అత్తగారి ఊరు పెనమలూరు. నర్సయ్యగారు నన్ను అడిగిన ఒకే ప్రశ్న.. మీరు బెంగులూరు ఎప్పుడొస్తారు.. మీకు ఇల్లు చూసి కార్డు రాస్తాను అని.. ఇంటర్వ్యూ అయిపోయింది (నవ్వు) ఆయన కంపెనీ పేరు హింద్ హై వ్యాక్యూమ్స్.. ఇప్పుడది చాలా పెద్ద కంపెనీ.. సరే నర్సయ్య గారు కార్డు రాశారు. నేను బెంగుళూరు వెళ్ళి చేరాను కానీ నాకు నర్సయ్య గారు నచ్చలేదు. 1975జూన్ 24న సుందరయ్య గారు బెంగుళూరు వచ్చారు. నాతో మాట్లాడతానంటున్నారని నర్సయ్య గారు సమాచారం ఇచ్చారు. నాకు నర్సయ్య గారి ఇంటికి వెళ్ళటం ఇష్టం లేదు. డైరక్ట్‌గా రైల్వేస్టేషన్‌కు వచ్చి కలుస్తానని చెప్పాను. రైలుగంట ఆలస్యంగా వచ్చి నాకు సావకాశంగా సుందరయ్య గారితో మాట్లాడే అవకాశం ఇచ్చింది. నర్సయ్యగారిని పంపించేయండి మీతో మాట్లాడాలంటే అనగానే సుందరయ్య గారు ఆయన్ని వెళ్లిపొమ్మన్నారు. నర్సయ్య గారి పద్ధతి నాకు నచ్చలేదు. మీరు నాకో పిల్లనిచ్చి పెళ్లి చేశారు. ఆ అమ్మాయి కూడా నాకు నచ్చలేదు. మీరేం చెప్పి పెళ్లి చేశారో నాకు తెలియదు. ఆళ్ళు నేను బాగా చదువుకున్నానని అనుకున్నారు. నాకు చదువు పెద్దగా లేదని మీకు తెలుసు. వాళ్ళకి చెప్పాలి కదా. మీరు చెప్పలేదు అన్నాను. ఇంతకీ ఏం చేయమంటావు అన్నాడు అనునయంగా సుందరయ్య గారు. ఉద్యోగమూ వద్దు.. పిల్లా వద్దు..ఇది నా సమాధానం.. సరే ఈరాత్రికి నేను వెళుతున్నాను కదా. నేను మాటల్లాడతాలే అన్నాడు. ఆ మరుసటిరోజు ఎమర్జెన్సీ ప్రకటించారు. ఆయన అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోయాడు. జూలై మొదటి వారంలో బెజవాడ వచ్చేశాను. లీలగారు నన్ను కాంటాక్ట్

చేశారు. లావు బాలగంగాధరరరావు గారు, ఉద్దరాజు రామంగారు, లీలగారు.. ముగ్గురు కమిటీగా ఏర్పడి విశ్వేశ్వరరావు సమస్య పరిష్కారం చేయాలని సుందరయ్య గారు వర్తమానం పంపారు. అలా రెండు నెలలు జరిగిన చర్చలు నాకు విడాకులు ఇచ్చేట్టు, నాకు నచ్చిన ఉద్యోగంలో చేరేట్టు చేశాయి. ప్రజావైద్యశాల భాస్కరరావు గారి దగ్గర చేరాలని నిర్ణయించుకున్నాను. నేను చేరటం భాస్కరరావు గారికిష్టం లేదు. నువ్వు వెళ్ళిపోతావు.. ఎక్కువ కాలం ఉండలేవు అంటాడాయన. నేనక్కడే పనిచేస్తానని లీల గారికి చెప్పాను. ఆయనేమో నన్నొద్దంటున్నాడు అనికూడా చెప్పాను. ఉదయాన్నే తొమ్మిది గంటలకు ఆవిడొచ్చారు. భాస్కరరావు.. విశ్వేశ్వరరావు ఇక్కడే ఉంటాడు అని చెప్పి ఆవిడ లేచి వెళ్ళిపోయింది. అలా ప్రజా వైద్యశాలలో ఉంటుండగా ఆర్టీసీలో మెకానిక్ ఉద్యోగాలు పడ్డాయి. షీట్ మెటల్ వర్క్ వచ్చినవాళ్ళు వారికి అవసరం. ఎక్కువమందిలేరు.. నాకేమో ఆ పని వచ్చు. దాంతో నాకు అప్పాయింట్ మెంట్ ఆర్డర్ పోస్ట్‌లో వచ్చింది. భాస్కరరావుగారు.. ఒరేయ్ నీకేదో కవరొచ్చింది చూడు అన్నారు. చూస్తే ఈ ఆర్డర్.. చింపేసి బుట్టలో వేశాను. అదేమిటి అలా చేశావు అన్నాడు. మీకు మాటిచ్చాకదా ఇంకోచోటుకి వెళ్ళను అన్నాను. అలా అక్కడ ఐదేళ్ళున్నాను..

**మిసిమి** : మరి పెళ్లి..

**విశ్వేశ్వర రావు :** ఈలోగా నేను విడాకులిచ్చిన అమ్మాయికి ఇంకో సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి పెళ్ళి అయిన తరువాత నేను బొమ్మారెడ్డి గారి ద్వారా ప్రమీల ప్రపోజల్ వస్తే అప్పుడు తనని వివాహమాడాను. ఇంతకీ నేను చెప్పాలనుకున్నదేమిటంటే సుందరయ్య గారిని ఒకసారి అడిగాను.. నామీద ఇంత ఎఫర్ట్ పెడుతున్నారు దేనికని.. ఆయన నా వీపుమీద చిన్నగా తట్టి నువ్వేం చేశావో మాకు తెలుసు.. నీకు తెలీదు కదా అన్నారు.. అలా అవుటాఫ్ ది వే వెళ్లి నాకు చాలా సాయం చేశారాయన. పార్టీవాళ్ళు చాలా మంది అడిగేవారు ఏమిటిదని.. నాకూ తెలియదు.. నాకిష్టమైంది ఇచ్చాడు.. అడిగింది చేసేవాడు అని మాత్రమే చెప్పేవాడిని. ఆయనతో 62లో మొదలైన అనుబంధం 85లోని ఆయన చివరిరోజు వరకు కొనసాగింది. ఒక్క మాటలో చెప్పాలంటే మా నాన్న నాకేం చేయాలో అవన్నీ సుందరయ్య గారు నాకు చేశారు (ఈమాట అంటుంటే ఎప్పుడూ నవ్వుతూ ఉండే విశ్వేశ్వరరావు గారి కళ్ళలో చిన్న కన్నీటి జీర తొంగి చూసింది)

**మిసిమి** : **మీ జీవిత పుస్తకాన్ని తెరిచి చూపించారు విశ్వేశ్వరరావు గారు.. మీకు కృతజ్ఞతలు**

**విశ్వేశ్వర రావు : నన్ను ఓపికగా భరించిన మిసిమి పాఠకులకు నా నమస్కారాలు.**

*శ్రీశ్రీ విశ్వేశ్వర రావు చిరకాల మిత్రుడు. కష్టాల్లో, పుస్తకాల్లో, నార్ల చిరంజీవి – పతంజలితో, కావలి కాలేజీతో, మహాప్రస్థానంతో ఆయన ఎంతో సాన్నిహిత్యంగా ఉండేవారు. ఆ వార్తలన్నీ నాకు చెబుతూ ఉండేవారు కూడా. ప్రమీల గారికి మాయరోగం వస్తే వైద్యం, తగ్గడం, డాక్టర్లు అన్నీ కలిసినపుడు చెబుతుండేవారు. అయినా కవితా ని ఆపలేదు – మేదేని చేస్తూనే ఉన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లిలో పుస్తకావిష్కరణలకు జోరున వర్షం పడుతున్నా బెజవాడ నుంచి రావడం ఆపలేదు. ఆయన కవి కాదు – కథకుడు కాదు – రచయిత కానే కాదు – పెద్ద చదువరీ కాదు – మరి? ఆయనకు పుస్తకాల వాసన – రచయితల రాపిడి కావాలి. అదే ఆయన పిచ్చి (Passion) అదే ఆయన్ను నడుపుతున్నది – పరిగెత్తిస్తున్నది. పడవ మునిగిపోతున్నా తెడ్డు వేయమంటుంది – విచారంగానైనా నవ్వమంటుంది – రాని రచయితల కోసం – వస్తున్న మిత్రుల కోసం వేచి ఉండమంటుంది.*

*ప్రపంచంలో తెలుగు పుస్తకానికి చాలా చిరునామాలు ఉన్నాయి.*

*అందులో ఏలూరు రోడ్, మసీదు వీధిలో శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు ఓ కొండ గుర్తు. అదేనండీ! మొగల్రాజపురం కొండ చూశారు కదా! – బెజవాడలో, దుర్గమ్మ నీడలో, కృష్ణమ్మ ఒడిలో, ఆంధ్రదేశంలో.....*

**సంభాషణ : అశ్వినీకుమార్**

**ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు**

# స్త్రీల పాటలు

– డా. దాసరి విజయకుమారి

నందిరాజు చలపతిరావుగారు తాను సేకరించిన స్త్రీల పాటలను మూడు సంపుటాలుగా ముద్రించి తెలుగు పాఠకులకు అందించారు. కానీ కాలక్రమేణా ఆ పాటల సంపుటాలు మనకు లభించడం లేదు. ఈ కొరతను తంగిరాలవారి విశేష కృషి తీర్చింది. తనకు లభించిన నందిరాజు చలపతిరావుగారి స్త్రీల పాటలు మూడు సంపుటాలను కలిపి 2024 అక్టోబరులో సమగ్ర సంపుటంగా తీసుకొచ్చారు. తంగిరాలవారు చేసిన ఈ కృషిని నందిరాజు చలపతిరావుగారి స్త్రీలపాటలు అనే పేరుతో అజో–విభొ–కందాళం ఫౌండేషన్ వారు ప్రచురించారు.

ఈ పుస్తకానికి తంగిరాల వెంకట సుబ్బారావుగారు దాదాపు 150 పుటలతో కూడిన సుదీర్ఘమైన పీఠికను రాశారు. దీనిలో జానపద విజ్ఞానంలో ఉన్న ప్రధాన శాఖలను తెలుపుతూనే వాటిలోని ఉపశాఖలను కూడా తెలియజేశారు. ఆయా శాఖలకు చెందే జానపద విభాగాలను వివరించారు. మొత్తం జానపద సాహిత్యంలో ఏడు శాఖలు ఉంటాయని చెబుతూ పురాగాథలు, ఐతిహ్యములు, జానపద కథలు, జానపద గేయాలు (భావాత్మకములైనవి), జానపద కథాగేయాలు (కథాత్మకములైన), సామెతలు, పొడుపుకథలు అనే వాటిని పేర్కొన్నారు. ప్రస్తుతాంశం గేయాలకు సంబంధించినది కాబట్టి భావాత్మకములైన జానపదగేయాలు పనిపాటలు, పారమార్థిక గేయాలు (తత్త్వాలు), బాంధవ్య గీతాలు (స్త్రీలపాటలు), పిల్లల పాటలు, వేడుక పాటలు లేక పెండ్లిపాటలు లేక స్త్రీలపాటలు, వలపు పాటలు, హాస్యగీతాలు, కన్నీటి పాటలు అని ఎనిమిది రకాలుగా ఉంటాయని తెలియజేశారు. తర్వాత కథాత్మకములైన జానపద గేయాలు లేక జానపద కథాగేయాలను స్త్రీల కథాగేయాలు, వృత్తిగాయకుల గేయకథలు అని రెండు రకాలను తెలియజేశారు. స్త్రీల కథాగేయాలను వీరు 'గృహసంబంధములైన జానపద కథాగేయాలు' అని పేర్కొన్నారు. కథతో కూడిన జానపద గేయమే Ballad కాబట్టి వీటిని DomesticBallads అని కూడా అనవచ్చును అని చెప్పారు. దీన్నిబట్టి తంగిరాల వారికి ballad ప్రక్రియ పట్ల ఎంత లోతైన పరిజ్ఞానం ఉందో తెలుస్తుంది.

ఇక రెండవది వృత్తిగాయకుల గేయకథలు లేక కథాగేయాలు. ఈ వృత్తిగాయకులు వీథులలో వాద్య సహితంగా పాడే జానపద కథాగేయాలకే తంగిరాల వెంకట సుబ్బారావుగారు వీరగాథలు HeroicBallads అని పేరుపెట్టారు. ఈ వీరగాథలపై "తెలుగు వీరగాథా కవిత్వము" పేరుతో విశేషమైన పరిశోధన చేశారు.

జానపద సాహిత్యంలో స్త్రీలపాటలు ఒక ప్రత్యేకమైన శాఖగా విరాజిల్లుతున్నాయి. ఇవి కథలేని పాటలు, కథతో కూడిన పాటలు అని రెండు రకాలు. వీటిని నందిరాజు చలపతిరావుగారు చిన్నపాటలు, పెద్దపాటలు అని, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు స్త్రీలపాటలు, స్త్రీల కథల పాటలు అని అన్నారు. తంగిరాలవారు వీటిని భావాత్మకములైన స్త్రీల పాటలు, కథాత్మకములైన స్త్రీల పాటలు అని పేర్కొన్నారు. లాలి పాటలు, జోల పాటలు, వరస పాటలు, పెండ్లి పాటలు, నలుగు పాటలు, తలుపు దగ్గర పాటలు, గంధము పాటలు, అలక పాటలు, అప్పగింతల పాటలు, మంగళహారతులు మొదలైనవి కథలేని స్త్రీల పాటలకు, ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణదేవర నవ్వు, సీతగడియ, కుశలవకుచ్చల కథ, ధర్మరాజు జూదము, సుభద్ర సారె, పారుజాత పల్లవి, శ్రీకృష్ణుని చల్దులు మొదలైనవి కథతో కూడిన స్త్రీలపాటలకు ఉదాహరణలుగా పేర్కొన్నారు.

**1. కథలేని స్త్రీలపాటలు :** కథలేని స్త్రీల పాటలను పేర్కొంటూ నందిరాజు చలపతిరావుగారు సేకరించి ముద్రించిన స్త్రీల పాటలు మూడు సంపుటాలులోని ఉన్న కథారహిత గేయాలను చెప్పారు. మూడో భాగంలో కథలేని పాటలు 11 మాత్రమే ఉన్నాయని, మిగిలినవి పెద్దపాటలే అని చెప్పారు. పుస్తకం చివర వచనంలో 34 నోముల కథలు, వాటి తర్వాత శ్రీరామనామ రామాయణం, శ్రీ వేంకటేశ్వర వ్రతకథ ఫలము, శ్రీ వేంకటేశ్వర

దీపారాధనము ఉన్నాయని చెప్పి అవి పాటలనిపించుకోవని తెలియజేశారు. నందిరాజు చలపతిరావుగారి మూడు స్త్రీల పాటల సంపుటాల్లోనూ ఉన్న దైవప్రార్థనలు గురించి చెప్పి వాటిలో కొన్ని సంస్కృతంలో ఉన్నాయని చెప్పారు. ఇది వీరి ఉభయభాషా ప్రావీణ్యాన్ని తెలియజేస్తుంది. అంతేకాక ఆ ప్రార్థనలు, పాటలన్నీ ఏ రాగంలో ఉన్నాయో, ఏ తాళంలో నడుస్తున్నాయో చెప్పారు. ఇదంతా వీరి నిశిత పరిశీలనకు నిదర్శనం. వీటితోపాటు ఈ పాటలు ఏ ఛందస్సులో ఉన్నాయో చెప్పి, ఆ ఛందో లక్షణాలను, వాటి గణాలను, యతిప్రాసలను పేర్కొన్నారు. ఇదంతా వీరి ఛందో పరిజ్ఞానానికి తార్కాణం. ఈ క్రమంలోనే 'కరణి' మొదలైన సంస్కృత ఛందస్సులను గురించి తెలియజేశారు.

నందిరాజు చలపతిరావుగారు శిశువులను నిద్రపుచ్చటానికి పాడే లాలి పాటలు, జోల పాటలతో పాటు నిద్దుర పాటలనే మరో వర్గాన్ని ఇచ్చారు. ఈ పాటలలో లాలీ, జో! జో! అనే పల్లవులు ఉండవుకాని ఇవి కూడా శిశువులైన బాలబాలికలను ఊయలలో పడుకో పెట్టి ఊపుతూ నిద్రపుచ్చటానికి పాడే పాటలే! అని తంగిరాల వారు నిద్దుర పాటలను వ్యాఖ్యానించారు. కృష్ణశ్రీ గారు సేకరించిన కుశలవుల తొట్టె అనే నిద్దుర పాటను ఈ పుస్తకంలో అనుబంధంగా ఇచ్చారు. ఇక పెండ్లి పాటలు గురించి చెపుతూ స్త్రీల పాటలు మొదటి భాగంలో పెండ్లి పాటలు పేరుతో ఎనిమిది పాటలున్నాయని గుర్తించారు. వీటితోపాటు నందిరాజు చలపతిరావుగారు నలుగు పాటలు, వరుస పాటలు, తలుపు దగ్గర పాటలు, చెండ్ల పాటలు, అలక పాటలు, గంధము పూసెడి పాటలు, కామేశ్వరి పాటలు, శోభనపు పాటలు, అప్పగింతల పాటలు, మంగళహారతులు అనే మరో పది వర్గాల పాటలు ఇచ్చారని, ఇవన్నీ కూడా ఐదురోజుల పెళ్ళిళ్ళలో చేసే వేడుకలలో పాడే పాటలే కాబట్టి వీటిని కూడా పెండ్లి పాటలలోని అంతశ్శాఖలుగానే మనం గ్రహించాలని తెలియజేశారు. అంతేకాక ఈ పాటలన్నిటిని తనదైన శైలిలో నిర్వచించారు. స్త్రీల పాటలు మూడు సంపుటాల్లోనూ ఏఏ పాటలు ఎన్నెన్ని ఉన్నాయనే విషయాన్ని తెలియజేశారు.

**2. కథతో కూడిన స్త్రీలపాటలు :** నందిరాజు చలపతిరావుగారు ముద్రించిన స్త్రీలపాటలు మూడు భాగాల్లోనూ కథతో కూడిన స్త్రీలపాటలు అనేకం ఉన్నాయి. కానీ వీటినన్నిటిని ఎలాంటి వర్గీకరణ లేకుండా కలగాపులగంగా కలిపి ఇచ్చేశారు. ప్రస్తుతం తంగిరాల వెంకట సుబ్బారావుగారు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు తన సిద్ధాంతగ్రంథం "తెలుగు జానపద గేయసాహిత్యము"లో నాలుగు రకాలుగా చేసిన స్త్రీల కథాగేయాల వర్గీకరణను (1. రామాయణ సంబంధములు, 2. భారత సంబంధములు, 3. భాగవత సంబంధములు, 4. ఇతరములు) అనుసరించి నందిరాజు చలపతిరావుగారు సేకరించిన స్త్రీల కథల పాటలను విభజించుకొని మనకు పరిచయం చేశారు.

**1. రామాయణ సంబంధములు :** నందిరాజు చలపతిరావు గారి స్త్రీలపాటల్లో సీతాకళ్యాణం, సీత వసంతము, సీత అలక, సీత గడియ, ఋషుల ఆశ్రమము, లంకాయాగము మొదలైన కథాగేయాలు ఉన్నాయని తెలియజేసి, ఊర్మిళాదేవి నిద్ర, లక్ష్మణ దేవర నవ్వు, సీత గడియ, సీత దాగుడుమూతలు, లంకాయాగము, గుహ భరతుల అగ్నిప్రవేశము, శ్రీ రామపట్టాభిషేకము, సీత సురటి, కుశలవ కుచ్చుల కథ అనే తొమ్మిది స్త్రీల కథాగేయాల గురించి తంగిరాల సుబ్బారావుగారు విశేషమైన విమర్శ చేశారు.

**స్త్రీల పాటలు – జానపదుల కల్పనలు :**

**ఊర్మిళాదేవి నిద్ర:** వాల్మీకి మొదలు వివిధ భాషల్లో రామాయణాలు రాసిన కవులందరూ మహాసాధ్వి అయిన ఊర్మిళాదేవిని మరిచిపోయారు. కానీ తెలుగు స్త్రీలు మాత్రం ఆమెను మర్చిపోలేదు. జానపదులు తాము పాడుకొనే రామాయణ సంబంధిత గేయాల్లో లక్ష్మణుడిని, అతని ఇల్లాలు ఊర్మిళాదేవిని మిక్కిలి త్యాగమూర్తులుగా కొనియాడారు. సుబ్బారావుగారు ఈ ఊర్మిళాదేవి నిద్ర అనే స్త్రీలపాటను ఆంధ్రుల ప్రత్యేక ధనమని కొనియాడారు. అంతేకాకుండా ఈ పాటను గురించి బిరుదురాజు రామరాజుగారు తమ సిద్ధాంత గ్రంథంలో చర్చించారని చెపుతూనే, వారికంటెముందే బందా కనకలింగేశ్వరరావు, అడిదము రామారావు, ఇల్లిందల సరస్వతీదేవి వంటి విమర్శకులు దీనిని గురించి రాశారని విమర్శించారు. ఈ పాటను గురించి దేవేంద్ర సత్యార్థిగారు ఆంగ్లంలో

రాసి భారతదేశానికంతటికీ చాటిచెప్పి, ఆంధ్రుల ప్రత్యేకతను కొనియాడిన విషయాన్ని మరోసారి మనందరికీ గుర్తుచేశారు.

ఊర్మిళాదేవి నిద్రకు గల కారణాన్ని చెప్పి, అన్నగారి సేవలో మునిగిపోయి భార్యను మరచిన లక్ష్మణుడిని జానపద స్త్రీలు తీవ్రంగా విమర్శించిన తీరును తెలియజేశారు. అలాగే ఈ గేయంలో ఉన్న చక్కటి సాంఘికాచారాన్ని తెలియజేస్తూ ఇలా పేర్కొన్నారు. "మన యిండ్లలో పూర్వం స్త్రీలు బావగారి పేరును, భర్త పేరును నోటితో ఉచ్చరించకూడదు. ఆ ఆచారాన్ని పాటిస్తూ ఊర్మిళ బావగారైన రాముని 'మాయక్కబావ' అనీ, తన భర్తయైన లక్ష్మణుని 'మాయక్కమరిది' అనీ సంబోధించింది". దీనితోపాటు జానపద స్త్రీలు పాడుకొనే ఈ పాటలో దొర్లిన అనౌచిత్యాలను కూడ పేర్కొన్నారు.

**కుశలవ కుచ్చుల కథ :** ఇక్కడ కుచ్చుల శబ్దానికి రవిక, కంచెల అనే అర్థాలు నిఘంటువులో ఉన్నాయని చెప్పి, ఆ అర్థాలు ఇక్కడ సరిపోవని, ఆ శబ్దానికి తనకు కృష్ణశ్రీగారు చెప్పిన బాల్యము అనే అర్థాన్ని చెప్పుకోవాలని తెలియజేశారు. ఇదే పాటలో దంపతుల అనురాగం, అన్నదమ్ముల అనుబంధం, వదినె మరదళ్ళ దెప్పిపొడుపులు మొదలైనవి కనిపిస్తాయి. ఈ పాటలో స్త్రీలు రాముడు చేసిన సీతాపరిత్యాగానికి చాకలివాని నింద కథకన్నా ఎంతో బలవత్తరమైన కారణాన్ని కల్పించారు. అదేంటంటే అడవిలో రామలక్ష్మణుల్నిమోహించి, ముక్కు చెవులు కోల్పోయిన చుప్పనాతి శూర్పణఖ సీతారాముల్ని విడగొట్టడానికి పెద్ద పన్నాగం పన్నుతుంది. యతివేషాన్ని ధరించి అడవిలో వేటాడుతున్న రాముడు దగ్గరకు వెళుతుంది. తన మహిమలను గురించి రామునితో చెప్పి తన విద్యలను చూడమంటుంది. ఆ దొంగ సన్యాసిని మాటలను నమ్మిన రాముడు అంగదుడిని పిలిచి ఈ యోగినిని అంతఃపురానికి తీసుకు వెళ్ళమంటాడు. ఆ మాయా యోగినిసీతను అనేక కష్టాలు పెడుతుంది. అంతఃపుర స్త్రీలు ఆ యతికి రత్నాలు, మాణిక్యాలు, కనకపు చీరలు, సొమ్ములు బహుమానంగా ఇస్తారు. అప్పుడు శూర్పణఖ ఇవన్నీ యతినైనా నాకెందుకు? రావణుడి పటం గీసిస్తే వెళ్ళిపోతాను అంటుంది. అప్పుడు శాంత సీతతో రావణుని పటం వ్రాయమంటుంది. సీత తానెన్నడు రావణుడి ముఖం చూడలేదని కేవలం కాలి బొటనవేలు మాత్రమే వ్రాసిస్తుంది. జానపద స్త్రీలు సీత పాతివ్రత్యాన్ని చాటిచెప్పే ప్రయత్నంచేశారు.అప్పుడు ఆ మాయాయతి మిగిలిన చిత్రపటాన్ని పూర్తిచేసి బ్రహ్మదేవుని దగ్గరకు తీసుకువెళ్లి అతన్ని బతిమాలి రావణుని చిత్రపటానికి ప్రాణం పోయిస్తుంది. తర్వాత ఆ పటాన్ని తెచ్చి అయోధ్యలో వదిలిపెట్టి ఆకాశమార్గాన మాయమైపోతుంది. ఆ రావణ పటం సీతకు ఎదురుగా వచ్చి నిలబడి రావే సీతా! లంకకు పోదాం! అని పీడించడం మొదలు పెడుతుంది. అంతఃపుర స్త్రీలందరూ భయపడి ఆ పటాన్ని పెద్దపెద్ద రాళ్లు వేసి కప్పిపెట్టారు. నూతిలో పడేశారు. కానీ ఆ మాయాపటం ముందు అవేమి నిలవలేకపోయాయి. సీత మిక్కిలి దుఃఖించింది. చివరకు ఆ చిత్రపటాన్ని రాముని హంసతూలికాతల్పం కింద దాచిపెట్టారు. వేట నుండి తిరిగివచ్చిన రాముడు సీతతో సరససల్లాపాలలో ఉండగా, తల్పం క్రింద ఉన్న రావణపటం మంచం మీద నుండి రామున్ని నేలమీదకి పడగొడుతుంది. రాముడు ఆశ్చర్యంతో సీత మోటుసరసం ఆడింది అనుకుంటాడు. వెంటనే రాముడు పైకిలేచి పట్టెమంచంపై కూర్చునే సరికి రావణపటం వచ్చి ముందు నిలబడుతుంది. దానితో రాముడు సీత శీలాన్ని శంకించాడు. సీతను అడవికి తీసుకొనిపోయి ఆమె శిరస్సును ఖండించమని లక్ష్మణుడిని ఆజ్ఞాపించాడని స్త్రీలు అద్భుతమైన కథను కల్పించారు.

**2. మహాభారత సంబంధములు:** నందిరాజు చలపతిరావుగారు సేకరించిన స్త్రీలపాటలలో మహాభారత సంబంధమైన కథాగేయాలు 1. సముద్ర మథనం 2. సర్పయాగము 3. శకుంతల సీమంతము 4. ధర్మరాజు జూదం 5. కీచకవధ 6. సుభద్రసారె 7. శశిరేఖ పెండ్లిపాట అనే ఏడింటిని తంగిరాలవారు పీఠికలో పేర్కొన్నారు.

**3. భాగవత సంబంధములు :** నందిరాజు చలపతిరావు గారి స్త్రీలపాటలలో భాగవత సంబంధములైన వామనచరిత్ర పాట, శ్రీకృష్ణుని జననము, గుమ్మడుపాట, శ్రీకృష్ణుని చల్దులు, పారుజాతప్రసవము, సత్యభామ సరసము, రుక్మిణీదేవి ముచ్చట అనే ఏడు కథాగేయాలను గురించి పీఠికలో తంగిరాల వారు చర్చించారు.

**4. ఇతరములు :** నందిరాజు చలపతిరావుగారి స్త్రీల పాటలలో రామాయణ, భారత, భాగవత సంబంధములైన

పాటలే కాక సారంగధర చరిత్ర పాట, గోవుపాట, గంగా – గౌరీ సంవాదము: సవతుల కయ్యము, ధర్మాంగద చరిత్ర–పాముపాట అనే పాటలు కూడా ఉన్నాయి.

"నందిరాజు చలపతిరావుగారి స్త్రీలపాటలు" అనే ఈ గ్రంథాన్ని చదువుతున్నపుడు నాకు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారిలో విమర్శకులు, ఆలంకారికులు, తులనాత్మక అధ్యాపకులుకనిపించారు. వారు ఎవరు ఏ గేయాన్ని సేకరించారో అనే విషయాలను రాసినపుడు ఎంతో నిజాయితీగా వ్యవహరించారు. ఆయన జానపద సాహిత్యంలో చేసిన కృషి ప్రశంసనీయమైనది. వారు జానపద సాహిత్యమే ప్రాచీనమైనదని తన పరిశోధన ద్వారా నిరూపించారు. తొంభై ఏళ్ళ వయసులో ఆయన ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండ, తరతరాల వరకు పరిశోధనాంశాలుగా ఎంచుకుని పంచుకునే ఉద్గ్రంథాలను తెలుగువారికి అందించారు. వారి త్యాగం శ్లాఘనీయ మైనది. ఈ స్త్రీలపాటలు గ్రంథం పరిశోధనాపరంగా నేటి యువతకు అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. వీరు సేకరించి, పొందుపరిచిన గ్రంథాలు భవిష్యత్తరాల వారికి కూడా మార్గదర్శకమవుతాయని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరం జానపద సాహిత్యాన్ని ప్రాంతాలవారిగా, ప్రక్రియాపరంగా సేకరించి, భద్రపరిచే ప్రయత్నం చేద్దాం. అదే వారికి మనమిచ్చే గౌరవం.

అజో – విభొ – కందాళంఫౌండేషన్ వారు నందిరాజు చలపతిరావుగారి స్త్రీల పాటలను సమగ్ర సంపుటంగా ముద్రించి, 2025 జనవరి 5వ తేదీన ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ఇచ్చి విజయవాడలో తంగిరాల వారిని ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా స్త్రీల పాటల పుస్తకంపై మాట్లాడమని స్వయంగా వారు నాకు ఫోన్ చేసి అడిగారు. ఆయన సమక్షంలో ప్రసంగించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాకు ఇంతటి మహదావకాశాన్ని ఇచ్చిన అజో – విభొ– కందాళం ఫౌండేషన్ వారికి కృతజ్ఞతాభి వందనాలు. ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు 2025 జనవరి 25వ తేదీన తుదిశ్వాస విడిచారు. "వీరగాథల సవరాల జిమ్మడు" గా ప్రసిద్ధిగాంచిన ఆయన మరణం జానపద సాహిత్యానికి తీరని లోటు. భౌతికంగా ఆయన మన మధ్యలేనప్పటికి తెలుగు సాహిత్యంలో ఆయన చేసిన కృషి చిరకాలం నిలిచి ఉంటుంది. ఈ సమీక్షా వ్యాసం జానపద సాహిత్య అధ్యాపకురాలిగా నేను వారికి సమర్పించే అక్షర కుసుమాంజలి.


**డా. దాసరి విజయకుమారి**
**అసిస్టెంట్ ప్రొఫెసర్, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్,**
**ఫోన్ : 9491877705**


## కమ్మతెమ్మెరలు

మార్చి **మిసిమి** మాసపత్రికలో స్వాతి బలరాం గారితో మీ ముఖాముఖీ చదవటం జరిగి ఇది వ్రాయవలసి వచ్చింది. అసలు దానిని మంచిపత్రిక అనడం పొరపాటు. గత ముప్పదియేళ్ళుగా దానిని చూసిన వానిగా చెపుతున్నాను. వంశీ బాపు రమణ లాంటి వారు వ్రాసిన మాత్రాన అది గొప్ప పత్రిక అయిపోదు. కొన్ని కుటుంబాలలో ఎవరైనా ఆ పత్రిక చదువుతుంటే పెద్దవాళ్ళు కేకలేయడం నాకు ప్రత్యక్షంగా తెలుసు. బస్సుల్లో, రైళ్లల్లో ఎవరిచేతులోనైనా ఉంటే వాళ్ళమీద చాలా చీప్ ఇంప్రెషన్ కలిగేది. (అభిసారిక మ్యాగజిన్ చదివినవారికెవరైనా, సమరంగారి సమాధానాలు చాలా తక్కువ స్టాండర్డుతో ఉన్నట్టు చెప్పగలరు. (ఇక్కడ కంటెంట్ గురించి గాదు ప్రెసెంట్ చేసినవిధానం గురించి మాత్రమే చెప్పబడింది.) చాలా హైస్టాండార్డ్స్ వున్న **మిసిమి**లో ఈ ముఖాముఖీ చూసి వేదనతో వ్రాయవలసి వచ్చింది. ఒక స్వాతి తెలివిగల పారిశ్రామిక భావజాలం వున్నవారిచే నడపబడింది. అంతవరకే దాని విలువ. **మిసిమి** నిర్వాహకులకు అభినందన మాలలు.



*- తాడేపల్లి సుబ్రహ్మణ్యం*

# తాత్త్విక కవయిత్రి

– ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి



బుఝ్ఝా సూరమాంబ

**ఆ**మె ఒక విలక్షణమైన వ్యక్తిత్వం గల మహామనీషి. ఆమె ఒక మేధామూర్తి. ఆమె తాను విశ్వసించిన సిద్ధాంతాలనే తన జీవన విధానాలుగా మలచుకున్న మహనీయ స్ఫూర్తి. ఆమె స్వయంకృషితో ఆంధ్ర భాషా, సాహిత్యాలపై సాధికారత సాధించిన విదుషి. గీతాసారాన్ని నిజజీవితంలో సమన్వయించుకొని వర్తించిన వేదాంతి. ఆమె ఆధ్యాత్మిక తాత్త్విక కవయిత్రి శ్రీమతి బుఝ్ఝా సూరమాంబ.

“హరితస గోత్రోద్భవ సోమంచి వంశ రాకా సుధాకర భీమ శంకర తనూభవ’నని, ‘భారద్వాజగోత్రోద్భవ శ్రీ బుఝ్ఝా రాజలింగ ద్వితీయపుత్ర దేవేంద్రనాథ ధర్మపత్ని’నని తాను రచించిన ‘సావిత్రీవిజయం’ కావ్యాంత గద్యలో సూరమాంబ తన్ను గురించి చెప్పుకున్నది. వీరిది ఉన్నత విద్యావంతుల కుటుంబం. 1890లో గోదావరి జిల్లాలోని ఏలూరు పట్టణంలో ఈమె జన్మించింది. ప్రముఖ న్యాయవాది శ్రీ సోమంచి భీమశంకరం గారి ఏకైక పుత్రిక. పండిత కవి అయిన తన తండ్రిగారి వలన బాల్యంలోనే తెలుగుభాషలో చక్కని పరిజ్ఞానమూ, కవితాశక్తి ఆర్జించినది. స్వయంకృషితో విద్యాభివృద్ధి సాధించి కవయిత్రిగా ప్రఖ్యాతి వహించినది. స్త్రీ విద్య లేని ఆకాలంలో విద్యనభ్యసించి, పురుషులతో సరి సమానంగా కావ్యరచన చేపట్టిన కవయిత్రులలో బుఝ్ఝా సూరమాంబ ఎన్నదగినది. ఈమె కవితారీతి “తేనె సోక నోరు తీయనయుగురీతి’లో మాధుర్య, ప్రసన్నగుణ శోభితమై అలరారుతుంది. జన్మ సంస్కారం వలన అబ్బిన ఆధ్యాత్మిక భావనా బలంతో పాటు తాత్త్వికతను సైతం రంగరించి సాహిత్య సృజన చేశారు.

“భారతీస్తవ స్తబకము, హరినాథ నందనార శతకము, ప్రహ్లాద నాటకము, హరనాథ శతకము, శ్రీకృష్ణబోధామృతము, సావిత్రీ విజయము, మధుగీత, శ్రీ భక్తవత్సల శతకము, భగవద్భజన కీర్తనలు, సూరమాంబ కృతులు. బాల్యంలోనే రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టిన ఈ కవయిత్రి 1980లో స్వర్గస్థురాలయేంత దనుక తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించినారు. మధుగీత, శ్రీ ప్రహ్లాదనాటకం, భక్తవత్సల శతకం, కీర్తనలు మాత్రమే లభ్యకృతులు.

**మధుగీత:–** ‘విజయగోపాల సంవాదము’ అనే నామాంతరం గల సంపూర్ణ వచన నాటకం. రచనా ప్రారంభంలో కవయిత్రి తాను ఈ మధుగీతను పండితులకై రచించినది కాదని, భరత భూమిలో జన్మించిన బాల బాలికల కోమల హృదయాలలో భక్తి విజ్ఞానాలను నాటినచో వారు బాల్యం నుండి సద్వర్తనను అలవరచుకొని తమ భావి జీవితాలను శాంతిమయం కావించుకొని భవ సాగరాన్ని సులభంగా తరించగలరనే ఆశతో వ్రాసితినని పేర్కొనినారు. ప్రపంచ వాఙ్మయంలో భగవద్గీతకు ఒక అపూర్వమైన స్థానం ఉన్నది. మహాభారతంలో శ్రీకృష్ణ భగవానుడు యుద్ధరంగంలో అర్జునునికి బోధించిన గీత శిఖర సదృశమైనది. భారత కథలో వేదవ్యాసుడు లోకానికి బోధించదలచిన జీవన సందేశ సారమే గీతా సందేశసారం. భారతీయ తాత్త్వికతా సముద్ధరణకు సాగిన ప్రయత్నాలలో భగవద్గీతారచన ఒకటి. అత్యంత దుర్లభమైన మానవ జన్మ చరితార్థతకు ఆవశ్యకమైన వివిధ ధర్మాలను వివరించే లఘు గీతలు కూడ భారతకావ్యంలో ఉన్నాయి. ప్రధానమైన భగవద్గీతతో పాటు ఉతథ్యగీత, వామదేవగీత ఇత్యాది పదునారు గీతలు భారతంలో చోటు చేసుకున్నాయి.

ధర్మరాజు పట్టాభిషేకానంతరం శ్రీకృష్ణ భగవానుడు ద్వారకానగరానికి పోవనుద్యమించినాడు. అర్జునుడు కృష్ణునికి నమస్కరించి సంగ్రామ రంగంలో తనకు కావింపబడిన జ్ఞానోపదేశాన్ని తాను మరచితినని, ఆ సందేశాన్ని మరియొకమారు తనకు వినిపింపవలసినదని ప్రార్థించినాడు. ఆ సందర్భంలో కృష్ణుడు బోధించినది అనుగీత. ఆనాడు యోగబలంతో బోధింపబడిన ఆ ధర్మం తిరిగి యథాతథంగా బోధింపశక్యం కాదని, తద్విషయ పరిజ్ఞానాన్ని కలిగించే ఇతిహాసాన్ని వచించెదని సోదాహరణంగా ధర్మప్రబోధం కావించినాడు. గీతను అనుసరించి భగవానుడు మరల ఇచ్చిన సందేశం కనుక ఇది అనుగీత. భారత అశ్వమేథ పర్వంలోని అనుగీత పద్ధతిలో సూరమాంబ గారు 'మధుగీత'గా సంవాద రూపంలో రచించినారు.

తెలుగులో కావ్యరచన పురుడు పోసుకున్న నాటి నుండి నేటి వరకు ఎందరెందరో పండితులు, కవులు యథాశక్తి భగవద్గీతను పద్య, గద్య, వ్యాఖ్యా రూపాలలో అనువదిస్తూనే ఉన్నారు. అనేక విమర్శ గ్రంథాలూ వెలువడినాయి. మరల నిదేల ఈ మధుగీత? అని ప్రశ్నించుకుంటే- ఇది ప్రశ్నోత్తర రూపంలో, సంవాద రూపంలో, నాటక ఫక్కీలో రచింపబడినది. ప్రధాన గీతాసందేశంలోని కొన్ని ముఖ్య శ్లోకాలను ప్రస్తావించి అర్జునుడు కొన్ని సందేహాలను వెలిబుచ్చగా శ్రీకృష్ణుడు సందేహ నివృత్తి కావించినాడు. నాటి భారతంలో శ్రీకృష్ణుడు పౌరాణిక గాథలను దృష్టాంతాలుగా స్వీకరించి అనుగీతను బోధించగా సూరమాంబ గారు ఈ వచన నాటకంలో ఈనాటి జనజీవన సంబంధమైన, లౌకికమైన దృష్టాంతాలను స్వీకరించి గహనమైన తాత్త్విక విషయ వివరణను అందించారు. ఆధునిక గీతగా మధుగీత పిలువబడుతుంది.

భగవద్గీతలో అర్జునుడు పొందిన విషాదం కేవలం ఒక్క అర్జునునికే పరిమితం కాదు. ఒక విచిత్ర సన్నివేశంలో ధర్మాధర్మాలను నిర్ణయించుకోలేక, అధర్మాన్ని ఆచరించలేక, శ్రేయోమార్గంలో ప్రవర్తించదలచిన జీవుడు పడే వేదన అర్జున విషాదం. ఏ యుగమైనా, ఏ కాలమైనా అది అనివార్యం. నేటి సమాజంలో సంక్లిష్ట పరిస్థితుల నడుమ జీవించే వ్యక్తి తన వేదనను తొలగించుకొని శ్రేయోమార్గంలో పయనించటానికి మరల భగవద్గీతయే దారిదీపం అవుతుంది. ఆ రహస్యం బాగా తెలిసిన తాత్త్విక కవయిత్రి సూరమాంబగారు నేటి జీవన ప్రమాణాలకు అనుగుణంగా ఈ నాటక రచన కావించారు. భారతంలోని అనుగీతను అనుసరిస్తూ కొంత స్వతంత్రతను, ఆలోచనలను కవయిత్రి ఈ నాటకంలో ప్రవేశపెట్టినారు.

**"అనన్యాశ్చింతయంతో మాం యే జనాఃపర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాంయోగక్షేమం వహామ్యహమ్."**

– భగ. 9–22

అని గీతలో భగవానుని సందేశం. ఆ విషయాన్ని గురించి అర్జునుడు ప్రశ్నించాడు. "కృష్ణా! నన్ను ధ్యానించే వారి యోగక్షేమాలు నేనే చూసుకుంటానన్నావు కదా! చిన్నప్పటి నుండి నీమీదే ప్రాణాలన్నీ పెట్టుకొని నిన్నే నమ్ముకున్న గోపికల్ని నీవు రేపల్లె విడిచిన తరువాత ఒక్కసారైనా చూశావా?"–ఈ ప్రశ్నకు సమాధానంగా మోహానికి, ప్రేమకు నడుమ కల అంతరాన్ని, గోపికలకు కృష్ణుని యెడల ఏర్పడిన భావం భక్తియోగమని, వారికి తాను చిన్నతనంలోనే తత్త్వబోధ చేసినానని కృష్ణుడు సందేహ నివృత్తి కావించినాడు. ఈ సందర్భంలో కవయిత్రి భావ వ్యక్తీకరణ తాను సాధించిన తాత్త్విక జ్ఞాన ప్రతీకగా నిలిచింది. భగవద్భక్తిని, భగవంతునికి భక్తులపై నెలకొనే వాత్సల్య భావాన్ని పరిపూర్ణంగా అవగతం చేసికొన్న ఒక భక్తవరేణ్యగా కవయిత్రి పరిశోధకుల దృష్టికి అందుతున్నది.

**"సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ**
**అహంత్వా సర్వపాపేభ్యోమోక్షయిష్యామి మాశుచ"**

భగ. 18–66

కృష్ణా! నీవు చెప్పినట్లు నిన్నే ధ్యానిస్తూ, ముక్కు మూసుకొని కూర్చుంటే మా జీవితాలకు అవసరం అయిన పనులు ఎవరు చేస్తారు? అని అర్జునుని ప్రశ్న. ఆ ప్రశ్నకు శ్రీకృష్ణుడు నమస్త జనులకు నిత్యజీవితంలో ఆచరణీయమైన విధానాన్ని ప్రబోధించినాడు. భగవానుడు ఎవ్వరిని తమ కర్తవ్యం నిర్వహించక ఏ కర్మాచరణ చేయక కళ్ళు మూసుకొని ఉండమని చెప్పలేదు. ఏ పని చేస్తున్నా, ఏది అనుభవిస్తున్నా వాటి వలన కలిగే లాభనష్టాలు మొదలైన వాటి వలన కలిగే సుఖదుఃఖాలలో మునిగిపోక సమస్తమూ ఈశ్వరేచ్ఛ వలననే సంభవించినదని భావించటమే మానవ కర్తవ్యం. మనిషి జీవన రథాన్ని మనిషియే జాగ్రత్తగా నడుపుకోవలసి ఉన్నది. రథం ఎక్కిన తరువాత రథాశ్వాల కళ్ళాలు పట్టుకొని సన్మార్గంలో నడుపుకోవటమే మనిషి విధ్యుక్త ధర్మం. ఈ విధంగా

మానవుని కర్తవ్యాచరణను సరళసుందరమైన శైలిలో చక్కని వచన రూపంలో కవయిత్రి అందించిన తీరు ఎన్నదగినది.

ప్రాచీన తత్త్వ విధానాలు వర్తమానకాలంలో సమాజాన్ని సన్మార్గంలోనికి కొనిపోవటానికి దోహదకారులు కావాలి. తాత్త్విక చింతన నడుస్తున్న కాలంలోని జనుల ఆలోచనా విధానంలో మార్పులు తేగలిగి ఉండటం ఆవశ్యకం. తాత్త్విక చింతన ఒక సజీవ స్రవంతి. దాని ఒడుపును జాగరూకతతో పట్టుకొన్న కవయిత్రి సూరమాంబ. ఒక విలక్షణమైన ధోరణిలో, సామాన్య పాఠకులకు సైతం తాత్త్విక చింతనాసక్తిని రేకెత్తించిన రచన సూరమాంబ గారి 'మధుగీత.'

**శ్రీ ప్రహ్లాద నాటకం:–** శ్రీహరి నృసింహావతారం ధరించి భక్తప్రహ్లాదుని రక్షించిన వృత్తాంతం ఇందలి ఇతివృత్తం. పురాణ ప్రసిద్ధమైన ఈ కథ సూరమాంబ కలం నుండి 4 అంకాల రసవత్తరమైన పద్యనాటకంగా అవతరించినది. ఆద్యంతమూ భక్తిభావ తరంగాలలో కవయిత్రి ఓలలాడుతూ ప్రేక్షకుల మానసాలను సైతం ఆధ్యాత్మిక భావలహరిలో మునకలు వేయించిన నాటకం. సూరమాంబ గారి వచన రచనకు "మధుగీత" ఒక నిదర్శనం కాగా పద్య నాటక రచనాశైలికి ఇది ప్రముఖ తార్కాణం. 1929లో ఈ నాటకం నిర్మింపబడినది.

రామాయణ కవయిత్రి ఆతుకూరి మొల్ల "కావ్య సంపద క్రియలు, నిఘంటువులును, క్రమము లేవియు" తాను ఎఱుగనని తన వినయగుణ ప్రకటన కావించి సరళ మధుర ఫణితిలో రామాయణ కావ్యాన్ని తెలుగువారికి అందించింది. "వేంకటాచల మాహాత్మ్య" కావ్య కవయిత్రి తరిగొండ వేంగమాంబ "నాచిన్ననాట నోనామాలనైన నాచార్యుల చేతనే చదువలేదు" అని తాను గురుముఖతః విద్యనభ్యసించలేదని పలికి భక్తితత్పరతతో అనేక కావ్యాలను తెలుగు సాహిత్యానికి కానుక చేసింది. అదే విధంగా సూరమాంబ తాను ఎట్టి కావ్యాధ్యయనం చేయలేదని పేర్కొన్నారు. సకల సద్గుణ సమన్వితుడును, సకల జనాదర్శన ప్రాయుడునగు ప్రహ్లాదుని యందు తనకు గల భక్తి గౌరవాలను బట్టి తన అల్పజ్ఞానం తోడనే నాటక రచన కావించితినని అత్యంత వినయంతో పేర్కొన్నారు.

నాందీ ప్రస్తావనలలో నటి సూత్రధారుల సంభాషణలో నటి పలుకులలో కవయిత్రి తన వినయగుణాతిశయాన్ని ప్రకటించిన తీరును పరికింపవచ్చు.

**"ఛందస్సు మొదలుగా సాహిత్యమార్గముల్**
**వినియైన నెఱుగని వెలదిగాన**
**మున్ను శాశ్వతకీర్తి గన్న పొత్తమ్ముల**
**పేరైన నెఱుగని నారిగాన**
**కావ్యమ్ములామర కాండత్రయం బైన**
**కన్నార గాంచని కలికిగాన**
**కవితాప్రవీణుల కడజేరి సరియైన**
**వెఱవైన నెఱుగని గరితగాన**
**అట్టి ఆసాధ్వి విరచించినట్టి దాన**
**నెట్టి లోపంబు లెన్ని చూపట్టనగునా**
**యంచు మనమింత సందియంబందు చుండె**
**ధైర్య మొక్కింత తాళని తరుణిగాన."**

అధిక విద్యాభ్యాసిని కాకున్నను తన ఆంతరంగికమైన స్వచ్ఛమైన భక్తి బలం చేత అల్లిన భగవచ్చరిత్ర నీరసం కాదు కదా అని తన గాఢ భక్తితత్పరతను వివరించినారు.

ప్రహ్లాదుని ఎదదనిండి పొంగి పొరలుతున్న భక్తిభావవేగాన్ని వర్ణించిన సందర్భంలో కవయిత్రి తన భక్తి ఆవేశగరిమను అనుసంధానించి గేయరచన కావించినారు. ప్రహ్లాద హిరణ్యకశిప సంభాషణలో భాగవత గ్రంథంలో పోతన రచనను తలపించే భావసౌకుమార్యమూ, శైలీ విన్యాసమూ సహృదయులను తలలూపింప చేసినవి. 'నిరంతరానంద దాయకమగు హరిసేవామృత మరందపాన పరవశంబగు' తన చిత్తం ఇతరాసక్తం కాదని తండ్రికి విన్నవించుకున్న ప్రహ్లాదుడు

**"ఘోరసంసార సాగరోత్తారకంబు**
**హరిపదాంభోజయుగచింతనామృతంబు**
**గ్రోలి మత్తిలి యానందలోలుడైన**
**జీవుడిహచింతనల గోరబోవునొక్కొ?**

కవి సమాజానికి చేర్చదలచిన సందేశాన్ని నాటక ప్రక్రియ సమర్థంగా అందించింది. కన్యాశుల్కం, వరవిక్రయం వంటివి నాటి సామాజిక దురాచారాలపై అక్షరశరాలై పోరాడిన సుప్రసిద్ధ నాటకాలు. అనయమూ ఐహికేచ్ఛారతిలో ప్రొద్దులు పుచ్చుతున్న ప్రేక్షకుల మనోవీధులలో ఒకింత భక్తి, జ్ఞాన వైరాగ్యాంకురాలను నాటవలెనన్న లక్ష్యంతో, తత్ప్రయోజన సాధనకు దృశ్యకావ్యమే శక్తిమంతమైన సాధనమని విశ్వసించి ప్రహ్లాద నాటక రచనకు పూనుకొంటినని కవయిత్రి పేర్కొని తదనుగుణంగా ఫలవంతమైన భక్తి భావ బీజాలను ఈ

నాటకక్షేత్రంలో నాటినారు. సమాజ వ్యక్తిత్వ వికాసానికి సార్వకాలిక మార్గోపదేశకమైన గీతాసందేశాన్ని 'మధుగీత'గా, బాల్యం నుండి సనాతన ధర్మ విశిష్టతను అనుసరించటమే పరమార్థంగా 'శ్రీ ప్రహ్లాద నాటకము' సార్థక రచనలుగా పేరు వడసినవి.

**భక్తవత్సల శతకం:-** 1971లో రచింపబడిన శతకం. సూరమాంబ తండ్రి భీమశంకరం గారు తీవ్రమైన మేహవాతంతో దురపిల్లుతున్న రోజుల్లో తన తండ్రికి సేవలు చేస్తూ పరమాత్మునిపై చిత్తం నిలిపి తదేకనిష్ఠతో 'భక్తవత్సలా!' మకుటంతో భక్తవత్సలుని ఆర్తితో వేడుతూ ఈ శతక రచన కావించినారు. అదే సమయంలో ఆమె కుమార్తె విషజ్వరం బారినపడి కోలుకున్నది. భగవదనుగ్రహం వలననే ఇటు తన తండ్రి అటు కుమార్తె అనారోగ్యం నుండి రక్షింపబడినారని పరమానంద భరితురాలైనారు.

**"నీ పదసేవ చేయంగను నేరనిహస్తము సుప్రశస్తమే**
**నీపయి సత్కృతింబలుక నేరని నాలుకతోలదేలొకో**
**నీ పయి భక్తి వీడి పరనిందలొనర్చెడి మేను మానుకా**
**దే పరమాత్మ నిన్నుగను దేహులె మాన్యులు భక్తవత్సలా!"**

సుకుమార భక్తిభావ ప్రకటనం ఈ శతకం అంతటా మరుమల్లె పరిమళంలా ప్రసరించింది.

**కీర్తనలు :-** జన్మసంస్కారవశం చేత సర్వేశ్వరుని కృపావిశేష జనితమైన భక్తి భావోద్రేకంతో పదునారు వత్సరాల వయసు నుండి కవయిత్రి హృదయం నుండి జాలువారిన తాత్త్విక భావసుమమాలలు కీర్తనలుగా వెల్లువెత్తినవి. ఉపనిషత్సారంతో పండింపబడిన ఈ భగవద్భక్తి కీర్తనలు సూరమాంబ ఉదాత్త వ్యక్తిత్వ వైభవానికి పట్టిన హారతులు.

**భారతీస్తవస్తబకము :-** 25 పద్యరత్నాలలో భాషాస్వరూప, వాగ్దేవిని అత్యంత భక్తిభావ బంధురంగా కావించిన స్తుతి. 'భారతీ!' మకుటంతో అల్లబడిన ఈ పద్యాలు సుకుమారమైన శైలీ సౌభాగ్యంతో విరాజిల్లుతున్నాయి.

**"భూరిగుణావలంబ! సురభూరుహమా! భవదీయ సత్పదాం**
**భోరుహచింతనంబు దలపోయుచు నన్యమెఱుంగ నన్నికే**
**తీరున బ్రోచెదో యిపుడిదే సమయంబు సుమీ! లతాంగి స**
**న్గారము సూపి నాయమిత కామితసిద్ధి నొసంగు భారతీ!"**

వంటి పద్యాలు భారతీస్తవ ప్రఖ్యాతాలు.

**సావిత్రీ విజయము :-** లలిత సుందరమైన చిన్న పద్యకావ్యం. పతివ్రతామతల్లి అయిన సావిత్రి చరితమే ఇందలి ఇతివృత్తం. స్త్రీ సహజమైన, సహజోక్తిసుందరమైన వర్ణనలు ఈ కావ్యంలో అలరిస్తాయి.

**"చానకు మంగళ స్నానంబు గావించి**
**చెలగి రాసుతునకు జలకమార్చి**
**జిలుగు బంగరు వన్నె చీని చీనాంబ్రముల్**
**సరిగపూలతల వస్త్రములు గట్టి**
**ఘనసారమిళిత చందనలేపనమొనర్చి**
**గిరిజకు మ్రొక్కింపసురుచిరముగ**
**మంగళసూత్రంబు రంగారగా గట్టి**
**చాల ముత్యపుదలబ్రాలు పోసి**
**బంధుజనులకు నచట తాపసులకెల్ల**
**వందనంబిడి వారి దీవనలనంది**
**పంచబాణుని సరసనుమించి వెల్గు**
**నల రతీసతియనబొల్చు నవ్వెలంది"**

ఇత్యాది వర్ణనలు సుకుమార శృంగార భావ రంజితాలై ఒప్పుతున్నాయి.

**హరి శతకము :-** 'హరీ!' మకుటంతో కవయిత్రి మనఃఫలకంపై చిత్రించుకున్న పరంధాముని పట్ల సమర్పణ భావ బంధురమైన శతకం. కందపద్యాలలో అందంగా ఒదిగిపోయిన శతకం. "హరినాథనందనార శతకము, హరనాథ శతకము, శ్రీకృష్ణబోధామృతము" అనునవి అలభ్య గ్రంథాలు. భక్తి తాత్త్వికతలను రంగరించి పూర్వ కవుల శైలిని తలపించే రచనతో ఛందోవైవిధ్యంతో పద్యకావ్యాలను, పద్యనాటకాన్ని తెలుగు సాహితీ భారతికి రత్నహారాలుగా సమర్పించి చరితార్థతగన్న కవయిత్రి శ్రీమతి బుఱ్ఱా సురమాంబ. సూరమాంబ గొప్ప సామాజిక బాధ్యత కల సమున్నత హృదయ. ఆంతరంగిక వ్యక్తిత్వ వికాస దోహదకరమైన రచనలే కాక ఆమె నివసించిన శ్రీకాకుళంలో బాలికా విద్యాభివృద్ధికై స్వయంగా విద్యాసంస్థల కోసం కృషిచేసిన ఉదారగుణ సంపన్నురాలు. అనాథ బాలబాలికల సంరక్షణకై ప్రత్యేక సంస్థను స్థాపించి తన సేవలనందించిన సౌమ్యురాలు. వీరి ప్రపౌత్రులు ప్రస్తుతం విశాఖపట్నంలో న్యాయవాదులుగా స్థిరపడినారు.

కవయిత్రిగా, సామాజిక సేవాతత్పరురాలిగా, ఉత్తమ గృహిణిగా, సనాతన సంప్రదాయాభిమానిగా శ్రీమతి బుఱ్ఱా సూరమాంబగారు ఆంధ్రులకు, ఆంధ్ర సాహితీ వేత్తలకు చిరస్మరణీయురాలు.

ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి
ఫోన్ : 9394113848

# తిక్కన సాహిత్యం

– డా. డి. యువశ్రీ

ప్రాచీన కాలం నుంచీ కూడా మానవ వ్యక్తిత్వ వికాసం జరుగుతూనే ఉంది. దానికి ఉపకరించే పలు అంశాల్లో సాహిత్యం ప్రధానంగా భాసిస్తు ఉంది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, కాల్పనిక సాహిత్యం, గేయాలు, వ్యాసాలు ఇలా అన్నీ కూడా మానవ వికాస లక్ష్యంతోనే ఆవిర్భవించి ప్రవర్తిల్లుతూ ఉన్నాయి.

సాహిత్యానికి ప్రాణం సందేశం. ఇటువంటి సందేశ ప్రబోధానికి వస్తువు, దాన్ని చెప్పేతీరు సమప్రాధాన్యం వహిస్తాయి. విషయం ఎంత ముఖ్యమో దాన్ని చెప్పేతీరు కూడా అంతే ముఖ్యం. చెప్పేతీరు మనోరంజకంగా ఉంటే విషయం పాఠకుడి మనసులో సులభంగా ప్రవేశిస్తుంది. ఆలోచింపజేస్తుంది. కాబట్టే చెప్పే విషయంతో బాటు చెప్పే తీరుకు ప్రాధాన్యం హెచ్చింది. చెప్పే తీరునే శిల్పమని వ్యవహరిస్తారు. ఆంగ్లంలో దీన్ని Style అని కూడా అంటారు. చెవికింపుగా చెప్పడం, నాటకీయంగా చెప్పడం, కళ్ళకు గట్టినట్టు చెప్పడం, తర్వాతి సంఘటనలను సూచించే విధంగా చెప్పడం, రసం ఉట్టిపడే విధంగా చెప్పడం, మూలానికి మార్పులు చేసి చెప్పడం మొదలైనవి శిల్పంలోని కొన్ని విభాగాలు. ప్రాచీన ఆంధ్ర సాహిత్యంలో నన్నయ, నన్నెచోడుడు, పాల్కురికి సోమన, పండితారాధ్యుడు, తిక్కన, ఎఱ్ఱన, నాచన సోమన, శ్రీనాథుడు, పోతన, ప్రబంధ కవులు, క్షీణయుగ కవులు ప్రాచీన సాహిత్యాన్ని వెలయించిన వారుగా ప్రసిద్ధి వహించారు. వీరిలో తిక్కన శిల్పవైఖరిని ఈ వ్యాసం ఆవిష్కరిస్తుంది. ఆంధ్రసాహిత్య చరిత్రలోని యుగకర్తల్లో తిక్కన తృతీయుడు. బహుముఖప్రజ్ఞలో అద్వితీయుడు. ఉత్తర రామాయణాన్ని నిరుత్తరంగా నిర్వచనంగా రచించాడు. ఆంధ్రుల హృదయాలకు హత్తుకొనేలా భారత కథ ఆంధ్రుల సొంత కథగా రచించి రక్తి కట్టించాడు. 'భారతంలో లేనిది ఎక్కడాలేదు' అన్న నానుడిని తన కవిత్వం ద్వారా సార్థకం చేసిన సార్థక జీవి తిక్కన.

'తెలుగు వాళ్ళకి సంతోషం కలిగే విధంగా ఈ కావ్యం వ్రాస్తున్నాను' అని చెప్పిన మొదటి కవి తిక్కన. కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు అనే బిరుదులు గల తిక్కన క్రీ.శ. 1210-1290 మధ్యకాలంలో జీవించాడని చరిత్రకారులు నిర్ణయించారు. ఈయన మనుమసిద్ధి ఆస్థానకవి. నిర్వచనంగా ఉత్తర రామాయణాన్ని రాశాడు. ఒకచేతి మీదుగా ఆంధ్రమహా భారతంలోని పదిహేను పర్వాలను 16,457 గద్య పద్యాలల్లో రస బంధురంగా, రమణీయంగా రచించిన ప్రతిభాశాలి తిక్కన. తన కాలం నాటి తెలుగు నుడికారపు విరజాజుల సౌరభాన్ని నేటికీ తన కవితారస సుగంధ ద్రవ్యాలతో భద్రపరిచాడు. తన సర్వతోముఖ ప్రతిభను భారతంలో అడుగడుగునా ప్రదర్శించి దానిని అద్వితీయం చేశాడు. ఆంధ్రమహాభారతాన్ని తిక్కన హరిహరనాథునికి అంకితమిచ్చాడు.

**॥ఉ॥ "శ్రీయనగౌరినాఁబరగు చెల్వకు జిత్తము పల్లవింప భ ద్రాయితమూర్తియై హరిహరంబగు రూపము దాల్చి "విష్ణు రూ పాయ నమశ్శివాయ" యని పల్కెడు భక్తజనంబు వైదిక ధ్యాయిత కిచ్చు మెచ్చు పరతత్త్వముఁగొల్చెద నిష్టసిద్ధికిన్"** *(శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము - ప్రథమాశ్వాసము పద్యం:01)* అని హరిహరాద్వైతాన్ని ప్రతిపాదించి "విష్ణురూపాయ నమఃశ్శివాయ" అని ప్రకటించాడు. తాను ఉభయకావ్య శిల్ప పారగుడని నిర్వచనోత్తర రామాయణ పీఠికలో *"అమలోదాత్త మనీష నేనుభయ కావ్యప్రౌఢి పాటించు శిల్పమునం బారగుడ గణావిదుడ"* నని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

**కమనీయ కథన శిల్పము :** వచ్చిన పదాలే మళ్ళీమళ్ళీ రావడం, వచ్చిన అక్షరాలే మళ్ళీమళ్ళీ రావడం చెవికింపు గొలుపుతుంది. పోతన కవిత్వంలో ఇటువంటి పద్యాలు కోకొల్లలు. తిమ్మన కవిత్వంలోనూ తక్కువలేవు. తిక్కన కవిత్వంలో సైతం అక్కడక్కడా ఇవి కనిపిస్తాయి. తిక్కనలో సంస్కృత మాటలకంటే కూడా తెలుగు మాటలే ఎక్కువగా వాడడం కనిపిస్తుంది. అటువంటి పద్యాల్లో కొన్ని అక్షరాలు మళ్ళీమళ్ళీ రావడం గోచరిస్తుంది. ఈ పద్యాన్ని వింటున్నంత సేపూ చెవికీ మనసుకూ కూడా ఆనందం కలుగక మానదు. అలాంటి వాటిలో మచ్చుకొకటి ఇక్కడ ఉదహరించడం జరుగుతుంది.

**॥చ॥ "తన మును బద్ధబన్నములుఁ దమ్ములపైఁగల కూర్మి పేర్మి నీ**
**జనపతి సైఁపకున్నె? యది సక్కనబీ రాజ్యము పాలులేక తీ**
**ఱున కొడఁబాటు గల్గిన నెఱుంగమి వెట్టరె? 'చాలరైరి వీ'**
**రన రొకొ?నానలేమి యని యాడరె లోకమువారు కేశవా?"**
*(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము-తృతీయాశ్వాసముబీ పద్యం:102)* రాయబారానికి వెళ్ళే ఉద్దేశంతో కృష్ణుడు కృష్ణ (ద్రౌపది) దగ్గరికి వెళ్ళాడు. తన ప్రయత్నాన్ని తెలియజేశాడు. అప్పుడు ద్రౌపది స్పందించిన తీరును తిక్కన ఒక చక్కని పద్యంలో వ్యక్తం చేసిన వైనం వహ్వా! అనిపిస్తుంది. అదే ఈ పద్యం-

**ఉ. "ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి, వెంద్రుకల్**
**దా వలచేతఁబూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో**
**నావిలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాద రోషముల్**
**గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై."**
*(శ్రీమదాంధ్రమహాభారతము, ఉద్యోగపర్వము-తృతీయాశ్వాసముబీ పద్యం:114)*

**నాటకీయ శిల్పము :** తిక్కన భారతాన్ని శ్రవ్యకావ్యంగా రచించినప్పటికీ దానిలో దృశ్య శ్రవ్య పోకడలెన్నిటికో అవకాశం కల్పించాడు. తాను స్వయంగా కథ చెప్పినట్లేగాక ఆయా పాత్రల ద్వారా కూడా కథ నడిపించాడు. పాత్రల చేత హావభావాలు ప్రదర్శింపజేశాడు. విరాటపర్వంలోనూ, ఉద్యోగపర్వంలోనూ తిక్కన నాటకీయత స్పష్టంగా గోచరిస్తుంది. ద్రౌపది మహాసాధ్వి. ఉత్తమ పతివ్రత. పాండవుల పట్టమహిషి. ఉన్నత శ్రేణికి చెందిన ఆమెను సుదేష్ణ కల్లు కడవ తెమ్మని పంపింది. అందునా దుర్మార్గుడైన కీచకుడి ఇంటికి పంపింది. ఇది ద్రౌపదికి నచ్చలేదు. కానీ రాణి ఆజ్ఞ తోసిపుచ్చడానికి వీలులేదు. అప్పటి ఆమె మానసిక స్థితిని తన చేష్టల ద్వారా కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించింది. అదే ఈ పద్యం -

**॥చ॥ "అలమటఁబొంది మాయ విధియా! యని దైవము దూఱు, నిత్తతిం**
**గలరొకొ నాకు దిక్కను, మొగంబున నశ్రులు వెల్లిగొల్పుఁ, దొ**
**ట్రిలఁబడు, జల్లనం జెదరు డెందముఁగూడఁగఁదెచ్చి నన్నుఁగే**
**వలమున ముట్ట నెవ్వరికి వచ్చుననుం,గలఁగున్, వెనుంబడున్"**
*(శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము-ద్వితీయాశ్వాసము పద్యం:104)* భారతములోనే గాక తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణంలోనూ ఈ నాటకీయత చోటుచేసుకొంది. కుబేరుడి దూత రావణాసురుడి దగ్గరకు వచ్చాడు. తన ఏలిక మనోగతాన్ని యథాతథంగా వివరించాడు. దాన్ని వినగానే దశకంఠుడికి కోపం వచ్చింది. అప్పుడతని తీరు అభివ్యక్తమైన వైనం నాటకీయంగానే కనిపిస్తుంది.

**॥తేట॥ "అనిన నిరువది కన్నుల నదరు కెంపు**
**పద్మవనగత బాలాతపంబుఁబోల**
**భ్రుకుటి వికటలలాట విస్ఫూర్జదుద్ర**
**కోపభీకరుఁడగుచు రక్షోవిభుండు"**
*(తెలుగు సాహిత్య సమీక్ష-ప్రథమసంపుటము పుట:260)*

**॥కం॥ "ఏమేమీ ననుఁజెడుదని,**
**నాముందటఁగొంకులేక నాలుక తుదకీ**
**వీమాటఁదెచ్చి, తజువర**
**మేమిగఁదలచితొకొ? నీకు నిదివిధి, యనుచున్"**
*(తెలుగు సాహిత్య సమీక్ష-ప్రథమ సంపుటము పుట: 260*

**వర్ణనా శిల్పము :** "వర్ణనా నిపుణః కవిః" అని కవి శబ్దానికి నిర్వచనం. కళ్ళకు కట్టినట్టు కళలను వర్ణించేవాడే కవి అని అభిప్రాయం. మనకవులందరూ ఎక్కడో ఒకచోట ఏదో ఒకవిధంగా వర్ణనలు చేశారు. ఇంతెందుకు కావ్యలక్షణాల్లో వర్ణన కూడా తప్పకుండా ఉండాలని లాక్షణికులు నిర్దేశించారు. ప్రతికావ్యంలోనూ 18 వర్ణనలు ఉండాలని నన్నెచోడుడు తన కుమార సంభవంలో పేర్కొన్నాడు.

**"వనజలకేళీ రవి శశి తనయోదయ మంత్ర గతి రత క్షితిప రణాం**
**బునిది మధు ఋతు పురోద్వాహ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్**
**పరిపూర్ణంబై దశప్రాణంబుల సప్రాణంబై నవసర భావ భరితంబై షట్త్రింశ**
**దలంకారాలంకృతంబైర మణీయంబైన దివ్య కథా రంభమున కభిముఖుండనై"**
*(తెలుగు సాహిత్య సమీక్ష-ప్రథమ సంపుటము, పుట:136)*

తిక్కన కూడా తన ప్రబంధమండలిలో సందర్భోచితంగా, సముచితంగా వర్ణనలనేకం చేశాడు.వాటివల్ల కూడా వాసికెక్కాడు. తిక్కన వర్ణనలు వర్ణ్యవస్తువును మనోదృగ్గోచరం చేస్తాయి. మచ్చుకు ఒకటి.

కీచకుడు సైరంధ్రిని కామించాడు. తన ఆలోచనను అక్క సుదేష్ణకు తెలియజేశాడు. ఆమె నివ్వెర బోయింది. *డెందాన్ని దోచే సుందరాంగులెందరో కందోయికి*

విందుజేస్తూ అందుబాటులోనే ఉంటే వాళ్ళను కాదని నీరస నీరజాక్షి కోసం నీమనసునెందుకు పారవేసుకొంటావని సుదేష్ణ తమ్ముణ్ణి సున్నితంగా మందలించింది. ఆ సందర్భంలో కీచకుడి అంతఃపురంలోని అన్నువమిన్నలను గూర్చి, వారు ప్రదర్శించే హావభావాలు గూర్చి, అంద చందాలు గూర్చి ఆమె అతనితో చెప్పింది. హృద్యమైన ఈ పద్యం వారి వైనాన్ని ఎంత చక్కగా ఆవిష్కరిస్తుందో గమనించదగి ఉంది.

॥సీ॥ "లలితంబులగు మట్టియల చప్పుడింపార
నంచకైవడి నడ నల్ల వచ్చి,
యెడ మేని నెత్తావి సుడియంగఁబయ్యెద
సగము దూలించి పై మగుడఁదిగిచి,
సోలెడు నెలదీఁగె లీలఁ గ్రాలుచు వింత
చెలువంబు దలకొనఁజేరి నిలిచి
తెలిగన్నుఁగవకు నెచ్చెలియైన లేఁతన
వ్వొలయంగ సరసంపుబలుకు పలికి,
॥తే॥ **మెఱయు చెయ్వుల రాగంబు మెయికొనంగ
నెడఁద సొగయించు మాటల నెలమి మిగుల
నిన్ను ననురక్తిఁగొలుచు నన్నెలఁత లుండ
నీరసాకార సైరంధ్రిఁగోరఁదగునె?"**

*(శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము-ద్వితీయాశ్వాసము పద్యం: 64)*

కరుణరసం ఉట్టిపడే విధంగా కూడా తిక్కన వర్ణనలు కనిపిస్తాయి. భారతయుద్ధం ముగిసింది. తమ ఆత్మీయుల శవాల కోసం కౌరవ కాంతలు కదలివచ్చారు. అప్పటి వారి వాలకం ఎంత దయనీయంగా ఉందో ఈ పద్యం తెలియజేస్తుంది.

॥సీ॥ "చేతులు నడుదల సేర్చు టుత్కటశోక
మాకారములు దాల్చి నట్టులుండ
విరిసిన వేనలుల్ వెన్నులఁ బ్రక్కల
నెఱసి చూపఱ దృష్టి నీఱు సేయ
నందంద దొరఁగెడు నశ్రుజలంబుల
పెంపున మోములు ముంపఁబడఁగ
నేమియుఁదొడవులు లేమిఁబాడతియున్న
యంగంబులందు దైన్యంబు నెఱయఁ
॥తే॥ బతుల నన్నలఁ దమ్ముల సుతుల హితులఁ
బేరుకొని వాతు లెండంగఁ బ్రేముడించి
పనవు పలుకులు వినువారి వనటఁదేల్పఁ
గురుకుమార నారీజనకోటి వచ్చె"

*(శ్రీమదాంధ్ర మహాభారతము, స్త్రీపర్వము-ప్రథమాశ్వాసము, పద్యం:98)*

**భావి కథాసూచక శిల్పము :** తర్వాత వచ్చే సంఘటనలను ముందుగానే సూచించే విధంగా కూడా తిక్కన రచన చేశాడు. అది ఆలోచించే కొద్దీ ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించక మానదు. శ్రీకృష్ణుడు పాండవుల తరపున రాయబారిగా కౌరవుల దగ్గరకు వెళ్ళాడు. తన వాదన వినిపించాడు. పాండవులకు తమ పిత్రార్జిత భూభాగాన్ని ఇచ్చి తీరవలసిందే అని నొక్కి చెప్పాడు. అలా జరక్కపోతే కౌరవులకే కాదు వారికి సహాయం చేసే వారికి కూడా నష్టం వాటిల్లక తప్పదని సూచించాడు.

**॥ఉ॥ "సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁ బాతినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసిరది వారల చేటగుఁగాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభ దాయక మయ్యును దైవ ముండెడున్"**

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము-తృతీయాశ్వాసముబీ పద్యం:273)

శ్రీకృష్ణుడు కౌరవుల దగ్గరికి రాయబారిగా వెళ్ళేటప్పుడు పాండవుల అభిప్రాయాలను, ద్రౌపది అభిప్రాయాన్ని తెలుసుకొన్నాడు. ఆ సందర్భంలో కృష్ణుడు రాయబారిగా వెళ్ళడం నిరర్థకమని సహదేవుడు నిర్ద్వంద్వంగా చెప్పాడు. ఈ పద్యంలో రాయబారానికి వెళ్ళినా దుర్యోధనుడు పాండవులకు రాజ్యభాగం ఇవ్వడని రాబోయే కథను సూచించడం జరిగింది. ఆ పద్యమిది-

**॥ఉ॥ "రక్కెస మాటలాడెదరు రాజును దమ్ములుబీ వానిలోన నీ
వొక్కటియైనఁ గాదనక యూఁకొనుచుండుట యంతకంటె మే
లక్కట! యిట్లు వేఁడికొననైనను బోయెదువోబీ సుయోధనుం
డెక్కడ? భూమిలోన సగమిచ్చుట యెక్కడ? దానవాంతకా!**

*(శ్రీమదాంధ్రమహాభారతము, ఉద్యోగపర్వము-తృతీయాశ్వాసము, పద్యం:94)*

**రస శిల్పము :** 'రసం' తొమ్మిది రకాలని భరతుడు తన నాట్యశాస్త్రంలో తెలియజేశాడు.

**॥శ్లో॥ "శృంగార హాస్యకరుణ రౌద్ర వీర భయానకాః
భత్సాద్భుత శాంతశ్చ నవనాట్యే రసాస్మృతాః॥"**

ఈ శ్లోకంలో తొమ్మిది రసాలని తెలుపబడుతూ ఉంది. తిక్కన తన భారత 15 పర్వాల్లోనూ ఆయా రసాలను ఆయాపట్టుల పోషించాడు. మచ్చుకు రెండు. ద్రోణుడు, భీముడు యుద్ధం చేస్తున్నారు. ద్రోణాచార్యుడు

అస్త్రవిద్యానిపుణుడు. అతనికి ధీటుగా బాణప్రయోగం చెయ్యడం సాధ్యపడేపని కాదు. ఓటమిని అంగీకరించడమో, వైదొలగడమో అప్పటి కర్తవ్యం. అలా చెయ్యడం భీముడిలాంటి వీరుడికి శోభస్కరం కాదు. అందువల్ల తన ధోరణిలో ద్రోణుణ్ణి ఎదుర్కోవడానికే భీముడు నిశ్చయించాడు. ద్రోణుడి శరపరంపరను తట్టుకొంటూనే లెక్కచేయకుండానే రథం దిగి ద్రోణుడి రథం దగ్గరకి వెళ్ళాడు. ఆ రథాన్ని విసిరి కొట్టాడు. దానితో ద్రోణుడు కిందబడ్డాడు. భీముడు అప్పటికి హమ్మయ్య! అనుకొన్నాడు. ఈ సన్నివేశం ఎవరికైనా నవ్వు పుట్టించక మానదు. ఆ పద్యమిది–

**॥చ॥ "అరదము డిగ్గి యప్పటు శరావళి కోర్చి మొగంబు వాంచి స**
**త్వరుఁడయి వానపైఁగురియ వంచిన మస్తక మొప్పఁబోవు సుం**
**దర వృషభంబు లీలఁజని దర్ప మెలర్పఁగ నొక్కచే నొగల్**
**వెరవునఁ బట్టి తేరు ప్రజ విస్మయ మందఁగ వీచి వైచినన్"**

*(శ్రీమదాంధ్ర మహాభారతము, ద్రోణపర్వము– చతుర్థాశ్వాసము, పద్యం:154)*

కర్ణుడు యుద్ధం చేస్తున్నాడు. అతని శరలాఘవం అద్భుతావహంగా సాగింది. రాధేయుడు ఒక్కొక్కసారి అరవై బాణాలను ఒకేసారి ప్రయోగిస్తున్నాడు. అది చూపరులకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

**॥కం॥ "అఱువది యఱువదియమ్ముల**
**నెఱఁకులు నోనాడ నేసి నిలిపి తన రయం**
**బెఱిఁగించె ముచ్చురకు న**
**త్తెఱఁగద్భుత రసము వెల్లిఁ దేల్చె జనములన్"**

*(శ్రీమదాంధ్రమహాభారతము, ద్రోణపర్వము– చతుర్థాశ్వాసము, పద్యం:298)*

**ఔచిత్య పరిపోషణా శిల్పము :** భారత కవిత్రయం వారు మూలభారతాన్ని యథాతథంగా తెలుగులో రాయలేదు. కొన్నిచోట్ల పెంచి రాశారు. కొన్ని చోట్ల తగ్గించి రాశారు. మరికొన్ని చోట్ల మార్చి రాశారు. కొన్ని చోట్లయితే కొత్తగా కల్పించి రాశారు.ఇలా చెయ్యడం వల్ల భారతం అనువాదేతిహాసంగా గాక ఒక స్వతంత్ర కావ్యంగానే రూపుదిద్దుకొంది.తిక్కన మూలభారతంలో కనిపించే అనౌచిత్యాలను పరిహరించాడు. సందర్భోచితంగా, సముచితంగా రాసుకుపోయాడు. అర్జునుడు బృహన్నలగా విరటుడి కొలువులో అడుగు పెట్టాడు. తాను ఉత్తరకు నాట్యం నేర్పుతానన్నాడు. రాజు వెంటనే అంగీకరించలేదు. తన ఆస్థానంలోని స్త్రీలను కొందరిని రప్పించాడు. బృహన్నల స్త్రీయా, పురుషుడా, నపుంసకుడాయని పరీక్షింపజేశాడు. ఇది మూల భారత కథనం. అయితే తిక్కన ఇక్కడ మార్పు చేశాడు. అందగాడైన అర్జునుడిని అనువుగాని ఆడవాళ్ళచేత పరీక్షింపజేయడం పద్ధతికాదని ఆయనకు అనిపించినట్టుంది. అందువల్ల ఆ పరీక్షను రద్దుచేసి ఉత్తరను పిలిపించాడు. ఆ పద్యమిది–

**॥చ॥ "అనుడు విషణ్ణమైన హృదయంబున గారవ మొంద నైపుణం**
**బున నుచితంబుమై నరసి పొచ్చెము లేమిఁదదీయ సేవ గై**
**కొనుటకు నిశ్చయించి తన కూఁతు విరాటుఁడు పిల్వఁబుచ్చె న**
**ర్తనమునకై బృహన్నలకుఁ దత్పరతం దగ నప్పగింపఁగన్."**

*(శ్రీమదాంధ్రమహాభారతము, విరాటపర్వము– ప్రథమాశ్వాసము, పద్యం:243)*

అజ్ఞాతవాసం పూర్తయిన తర్వాత పాండవులు తమ నిజరూపాలతో విరాట మహారాజుకు కనిపించారు. అజ్ఞాతవాసంలో తమకు ఆశ్రయం ఇచ్చినందుకు అభినందించే ధోరణిలో, కృతజ్ఞత తెలిపే ధోరణిలో ఆ రాజుతో మాట్లాడారు. గర్భవాసంలో ఉన్న విధంగా తామక్కడ సుఖంగా ఉన్నామని చెప్పినట్టు మూలంలో ఉంది. ఆ అంశాన్నే యథాతథంగా తెలుగులో రాస్తూ కొంత విశేషించి కూడా రాశారు. ఇది గమనించదగి ఉంది. మూలమున "గర్భవాస ఇవప్రజాః" అను ఉపమానము వాడబడినది.దాని ఔచిత్యమును గ్రహించి తిక్కన,

**॥తే॥ "చాల దుస్తరమైన యజ్ఞాతవాస**
**వత్సరంబు భవద్గర్భవాస గుప్తి**
**వలనఁ గడపితి మతి సుఖావాప్త చిత్త**
**వృత్తి నేము నిర్భయులమై విందులట్ల"**

*(శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము– పంచమాశ్వాసము, పద్యం:344)*

తిక్కన అనల్ప కల్పనా శిల్ప నైపుణ్య సంపన్నుడు. ఆయన రచనంతా శిల్పసౌందర్యం గోచరిస్తుంది. హృదయపరాగం గుబాళిస్తుంది.ఆయనే చెప్పుకొన్నట్టు ఉభయకావ్య శిల్పమే కాదు బహువిధ శిల్పం కూడా ఆయనకు పట్టుబడి ఉంది. మహా విస్తృతమైన ఆయన శిల్ప సౌందర్యాన్ని మాటల్లో చెప్పుకోవడం కుదరదు. ఇంత చిన్న వ్యాసంలోనూ ఇమడ్చడం వీలయ్యేపనికాదు. యథాశక్తి యథాజ్ఞానతః సంక్షేపంగా చెప్పడం మాత్రమే నా ప్రయత్నం. దీన్ని ఆధారం చేసుకొని పాఠకులు తిక్కన శిల్పసౌందర్య విభిన్నాంశాలను గ్రహించ పూనుకోగలరని దృఢ విశ్వాసం.

డా. డి. యువశ్రీ
సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,
తిరుపతి, చరవాణి: 9885940011

# ద ట్రెయిన్ - చలన చిత్రం




– టి.వి. ప్రసాద్

**క**ళాదోపిడీ కుట్ర, భగ్నం ఇతివృత్తంతో తీసిన ద ట్రెయిన్, 1964 నాటి యుద్ధ సినిమా. సినిమాలో యుద్ధ దృశ్యాలు ఏమీ కన్పించవు కానీ అంతకుమించి వ్యూహాలు, ప్రతివ్యూహాలు, కుట్రలు. వాటిని భగ్నం చేయడాలతో అడుగడుగునా ఉత్కంఠ కలిగిస్తుంది. కళా సంపదను తరలిస్తున్న ట్రెయిన్ గమ్యం (బెర్లిన్) చేరకుండా పారిస్ చుట్టూ తిరిగి తిరిగి ఫ్రాన్స్‌లోనే ఉండిపోతుంది. ఇదీ స్థూలంగా సినిమా కథ. ఈ సినిమాను అర్థం చేసుకోవడానికి, ఆనందించడానికి ఈ సినిమా వెనక వున్న చారిత్రక నేపథ్యం తెలుసుకోవడం ఉపయోగపడుతుంది.

దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు గెలిచిన దేశాలు, ఓడిన దేశాల సంపదను దోచుకోవడం, యుద్ధ ఖైదీలను చిత్ర హింసల పాల్జేయడం లేదా చంపేయడం సహజం. దోచుకునే వీలులేని సాంస్కృతిక చిహ్నాలను, కళా సంపదను, మతానికి ప్రాతినిధ్యం వహించే దేవాలయాలనూ, మందిరాలనూ కూల్చివేసి, వాటిలోని శిల్ప సంపదను విరగ్గొట్టడం చరిత్రలో ఎన్నో చూస్తాము. నిన్న మొన్నటి సంఘటనలు, తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్ (Bamiyan) లోయలోని 185-125 అడుగుల ఎత్తున్న బుద్ధ ప్రతిమలను 570 CE నాటి వాటిని బాంబులతో సర్వనాశనం చేయడం మనకు తెలుసు.

దక్షిణ భారతదేశంలో శివాలయాల్లోని రాతి శిల్ప స్తంభాలు, నంది విగ్రహాల మొండేలు, చెవులు, కాళ్లు, తోకలు తెగి, మెడలోని గంటలు విరిగిపోయి కన్పిస్తాయి. ఆంగ్లేయులు పరిపాలించిన కాలంలో మన దేశ మ్యూజియాల్లోని అమూల్యమైన శిల్ప సంపదను, దేవాలయాల్లోని విగ్రహాలను, మన సంస్కృతీ ప్రతికలను తమ దేశానికి తరలించడం మనకు తెలిసిన విషయమే.

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పై వాటిని తలదన్నే నాజీ సైన్యాల దౌర్జన్యాలు దోపిడీలు, మారణకాండకు అంతే ఉండదు. ఇతర దేశాల (కళా) సంపదను దోచుకోవడం, నాశనం చేయడం, 1933 నాటి యూదుల ఆస్తిపాస్తులను కొల్లగొట్టడం వారి మారణహోమంలో ఒక భాగం మాత్రమే. మారణ హోమం (holocast)లో లక్షలాది యూదుల్ని కాన్‌సెన్ట్రేటెడ్ కేంప్‌లలో సజీవ దహనం చేయడంతోపాటు వారి సంస్కృతీ ప్రతీకలను, కళా సంపదను విచక్షణారహితంగా దోచుకున్నారు. నాజీలు ఆక్రమించుకున్న దేశాల్లోని కళను కాపాడడం అనే నెపంతో, దాన్నంతా జర్మనీకి తరలించారు. ఈ కపట నాటకాల్ని అమలు చేయడం కోసం కళా పరిరక్షణ బృందాల (kunts-chutz) ఏర్పాటు జరిగింది. యుద్ధానంతరం నాజీలు కొల్లగొట్టిన కళా కృతులను మిత్రమండలి (Allies) కొంతవరకు రాబట్టుకోగలిగింది. దోచుకోబడిన మాన్యుమెంట్లను, ఆర్కీవ్‌లను 1944లో ఆయా దేశాలకు తిరిగి అప్పగించడం జరిగింది. కానీ అవి వాటి అసలు యజమానులకు చేరలేదు. కళా ప్రేమికుల దర్యాప్తు విభాగం (ALIU) నవంబర్ 21, 1944న ప్రారంభమయింది. హిట్లర్ విధానాలను అమలు చేసి నాజీలు ఆక్రమించుకున్న (నాజీ నెట్‌వర్క్) వివరాలతో 175 పేజీల రిపోర్టు తయారు చేసింది. యుఎస్ ప్రభుత్వం తెలిపిన దాన్ని బట్టి నాజీలు సాగించిన నిరంతర దోపిడీలు రష్యా, పోలెండ్, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, చెక్, డెన్మార్క్ దేశాలు ముఖ్యమైనవి.

నాజీల దృష్టిలో మోడరన్ ఆర్ట్ నీచ, భ్రష్ట, పతన కళ. మూడవ రైక్ (Reich) అని గొప్పగా చెప్పుకునే నాజీ పాలనలో జర్మనీ మ్యూజియాల్లో ఉన్న మోడరన్ ఆర్ట్ పెయింటింగుల్ని అమ్మి వేయడమో, నాశనం చేయడమో జరిగింది. అమ్మగా వచ్చిన డబ్బుతో ఆస్ట్రియాలోని నిలిన్జ్ నగరంలో యూరోపియన్ ఆర్టు మ్యూజియాన్ని స్థాపించడం వారి లక్ష్యం. నాజీ ఉన్నతాధికారులు, విదేశీ మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులు కొందరు దీన్ని అవకాశంగా తీసుకొని తమ సొంత కళా సేకరణను పెంచుకోగలిగారు. వీరిలో హెర్మన్ గోరింగ్ ముఖ్యుడు. నాజీ అధికారుల్లో చాలా శక్తిమంతుడు ఇతడు. తర్వాత యుద్ధ నేరస్తుడిగా న్యూరెంబర్గ్‌లో మరణ శిక్షకు గురయ్యాడు. రైక్ హౌలో కాస్ట్‌లో నాజీ లూటింగ్ ఆర్గనైజేషన్, ఆర్ట్‌లూటింగ్ ఇన్వెస్టిగేషన్‌ల ద్వారా వివిధ దేశాల్లోని యూదులు తమ సర్వస్వాన్ని కోల్పోయారు.

నాజీల కళాసంపద లూటీలో ఒక్క పోలెండే ఎంత నష్టపోయిందో తెలిస్తే ఒళ్ళు జలదరిస్తుంది. 1939 నాటి దాడిలో పోలెండ్ సాంస్కృతిక, వారసత్వ సంపదకు చెందిన ఐదు లక్షల కళాకృతులు దోచుకోబడ్డాయి. దోపిడీ బారిన పడిన కళా సంపద కేటలాగ్ ప్రకారం, వివిధ దేశాల్లో దొరికిన కళా కృతులు పోలెండ్‌కు ఇవ్వబడ్డాయి. ఐనా వందలాది ఆర్టిస్టుల వేలాది విలువైన పెయింటింగులు ఇంకా మిగిలిపోయాయి. జాతీయ సాంస్కృతిక వారసత్వ విభాగ మంత్రిత్వ శాఖ 2013లో తయారు చేసిన జాబితాను బట్టి అప్పటికి 63 వేల వస్తువుల లెక్క తేలింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజియాలజీ కలెక్షన్ ప్రొటెక్షన్‌కు, పోలెండ్ రాయబార కార్యాలయాలకు, కేంద్ర సమాచార సంస్థకు, ప్రపంచంలోని వందలాది మ్యూజియంలకు పై సమాచారం అందించింది. అంతేకాదు కనబడకుండాపోయిన చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఫొటోగ్రాఫ్‌ల వివరాలను కూడా గుర్తించింది. పోలెండ్ సాంస్కృతిక, కళామంత్రిత్వ శాఖ తయారు చేసిన కళాకృతుల లిస్టననుసరించి వాటిని ఎక్కడవున్నా గుర్తించి తిరిగి రాబట్టుకునే ప్రయత్నం చేసింది.

దోపిడీకి గురైన అమూల్య సంపదను తిరిగి తమకు ఇచ్చివేయాలని పోలెండ్ ప్రపంచ దేశాలను అభ్యర్థించింది. నాజీ లూటీ పర్యవేక్షకాధికారి ఒకడు పోలెండ్‌కు చెందిన 16వ శతాబ్దపు అలశాండో టర్కోదిగా భావించబడుతున్న మడోనా–బిడ్డ పెయింటింగ్‌ను సొంతం చేసుకున్నాడు. విచిత్రంగా ఈ పెయింటింగ్ ఎట్టకేలకు స్వదేశం చేరుకుంది. టోక్యోలో జరిగిన ఒక కార్యక్రమంలో పోలిష్ అధికారులకు ఇది అందజేయబడింది. పోలెండ్ విజయవంతంగా సాధించిన ఆరు వందల కళాఖండాల్లో ఇది ఒకటి, ఐనా వేలాది కళాకృతులు ఇంకా స్వదేశం చేరవలసి వున్నాయి అని బిబిసి జూన్ 2, 2023 నాటి వార్త. పోలెండ్ మరో కొత్త కార్యక్రమాన్ని గూడా చేపట్టింది. నాజీలు దోచుకున్న వందల వేల కళాకృతుల్ని, సాంస్కృతిక ప్రాధాన్యత కల్గిన ఇతర వస్తువులనన్నీ తిరిగి యివ్వాలనీ, 1.3 ట్రిలియన్ డాలర్ల నష్టపరిహారం యివ్వాలనీ జర్మనీని కోరింది. నాజీల ఇంతటి మారణకాండకు, కళా విధ్వంసానికి, దోపిడీకి కారణం తెలిస్తే ఆశ్చర్యపోక తప్పదు. అడాల్ఫ్ హిట్లర్ ఆర్టిస్టుగా విజయం సాధించలేకపోవడం ఈ విధ్వంసానికి ఒక కారణమైతే, యూదు విద్వేషం మరో కారణం. హిట్లర్ తొలి యవ్వనదశలో వియన్నా ఫైనార్ట్ అకాడమీలో ప్రవేశం కోసం ప్రయత్నించినా, ఆర్టిస్టుగా పనికిరాదని అకాడమీచే తిరస్కరించబడతాడు. దాంతో హిట్లర్ అహం దెబ్బ తింటుంది. ఫలితంగా హిట్లర్ తనను తాను కళా పండితునిగా భావించుకుని, 20వ శతాబ్దపు మోడరన్ ఆర్ట్ అంతా హీన కళ అనీ, క్యూబిజం, ఫ్యూచరిజం, దాడాయిజాలు కుక్కమూతి పిందెలనీ విమర్శిస్తాడు. 1933 జర్మనీ ఛాన్సలర్ అవగానే తన కళాభిప్రాయాన్ని ఆచరణలో పెట్టి మోడరన్ ఆర్ట్‌కు స్థానం లేకుండా చేయాలనుకుంటాడు. రెండో కారణం యూదుల మీద ద్వేషం. చిన్నతనం నుండే యూదుల పై ద్వేషాన్ని (amtisemetism) పెంచుకోవడానికి కారణాలు అనేకం ఐనా ముఖ్యమైనది జాత్యహంకారం. అందువల్ల వారిని సమూలంగా నాశనం చేయాలనుకుంటాడు. నాజీలకు హిట్లర్ మాటే శాసనం కాబట్టి ముందుగా జర్మనీ మ్యూజియాల్లోని మోడరన్ ఆర్ట్ కృతుల్ని కొన్నింటిని నాశనం చేశారు, మరి కొన్నింటిని అమ్మి వేశారు. 1925లో హిట్లర్ రాసిన నా పోరాటం, స్వీయచరిత్ర లాంటి మేనిఫెస్టోలో వెలిబుచ్చిన అభిప్రాయాలు నాజీల్ని ఇతర దేశాల కళాసంపదపై దాడికి, యూదుల ఊచకోతకు పురికొల్పాయి. ట్రెయిన్ చలన చిత్ర నిర్మాణం వెనక ఇంతటి పూర్వరంగ చరిత్ర వుంది.

**ద ట్రెయిన్ (The Train) నిర్మాణానికి మూలాలు :** రెండో ప్రపంచ యుద్ధపు చివరి దశలో జరిగిన సంఘటనల సమాహారం దట్రెయిన్ కథకు ఆధారం. ఆగస్టు 2, 1944 నాడు పారిస్‌లో జరిగిన కథ. అప్పటికి జర్మనీ దళాలు

ఫ్రాన్స్‌పై దాడి చేసి పారిస్‌ను ఆక్రమించుకుని 1511 రోజులు అవుతుంది. రెండు మూడు రోజుల్లో మిత్ర రాజ్యాల సైన్యం పారిస్‌కు విముక్తి కలిగించడం తప్పదు అన్న దశ. అందుకని ముందు జాగ్రత్తగా జర్మనీ సైన్యం, యుద్ధ శకటాలు తిరోగమన మార్గంలో ఉంటాయి. ఈ లోగానే జర్మన్ నాజీ అధికారి కల్నల్ ఫ్రాంజ్‌వాన్ వాల్డ్ హెయిమ్ పారిస్ మ్యూజియాల్లోని కళాసంపదను బెర్లిన్‌కు తరలించే ఏర్పాట్లలో వుంటాడు. ప్రఖ్యాత కళాకారుల కళాఖండాలను భద్రంగా చెక్కపెట్టెల్లో పెట్టి ట్రెయిన్‌లో జర్మనీకి తరలించడం అతని లక్ష్యం. ఫ్రెంచి ప్రతిఘటన బృందాలు తమ ప్రాణాలొడ్డి ఫ్రెంచి గౌరవానికి, సాంస్కృతిక సంపదకు ప్రతీకలైన అమూల్యమైన కళాఖండాలను కాపాడుకోవడం కోసం, వాటిని తరలిస్తున్న ట్రెయిన్‌ను అనేక విధాలుగా అడ్డుకోవడం, ఈ ప్రయత్నంలో వందలాది రైల్వే సిబ్బంది సహకరించడం, ప్రాణాలు పోగొట్టుకోవడం, ఈ కుట్రకు కారణమైన నాజీ కల్నల్‌ను ఫ్రెంచి రైల్వే అధికారి లబూష్ కాల్చివేసి దేశ కళాసంపదను కాపాడుకోవడం సినిమా సారాంశం.

1961 నాటి వాస్తవాలను తెలిపే రోజ్ వాలండ్ పుస్తకం కళా ముఖ చిత్రం (Le Front de Art ) ట్రెయిన్ సినిమాకు ఆధారం. రోజ్ వాలండ్ ఫ్రెంచి ఆర్టు క్యూరేటర్, ఫ్రెంచి ప్రతిఘటన సభ్యురాలు, కళా రచయిత కూడా! దోచుకోబడిన కళా ఖండాలను ప్రాణాలకు తెగించి కాపాడుతుంది. మ్యూజియాల్లో దాచిన పెయింటింగులను, వ్యక్తిగత సేకరణలను, నాజీలు దోచుకున్న కళా ఖండాల లిస్ట్ తయారు చేస్తుంది. ఆమె లిఖిత సాక్ష్యం కూడా ట్రెయిన్ చిత్రానికి ఉపకరిస్తుంది.

**ఫ్రెంచి ప్రతిఘటన బృందాలు :** ప్రతిఘటన సభ్యులు చిన్న చిన్న బృందాలుగా యేర్పడి నాజీలు ఆక్రమించుకున్న ప్రాంతాల కోసం పోరాటం చేస్తారు. ఆయుధాలు ధరించిన ఆడా, మగా సభ్యులు గెరిల్లా యుద్ధం చేస్తారు. రహస్యంగా పత్రికనూ నడుపుతారు.

**ద ట్రెయిన్ సినిమా కథ :** నాజీ కల్నల్ ఫ్రాంజ్ వాన్ వాల్డ్‌హెయిమ్ 1944 ఆగస్ట్ 2వ తేదీన నాజీ సైన్యం తోడ్పాటుతో పారిస్ మ్యూజియంలోని కళా సంపదను జర్మనీకి తరలించే ఉద్దేశంలో కళాకారుల పెయింటింగు లను జాగ్రత్తగా కార్టన్‌లలో సర్దించడంతో సినిమా ప్రారంభమవుతుంది. పికాసో, సెయిజాన్, డెగాస్, రెన్వా, గౌగేన్, వాంఘో, జాన్ మరో ల్లాంటి ప్రఖ్యాత కళాకారుల పెయింటింగుల్ని పేక్ (pack) చేసిన కార్టన్‌లపై ఆయా కళాకారుల పేర్లను స్టెన్సిల్ పెయింట్ చేయిస్తాడు. మ్యూజియం క్యూరేటర్ మేడమ్ రోజ్ విలార్డ్ దీన్ని ప్రతిఘటించినా బాంబు దాడిలో నాశనం కాకుండా ఆర్టిస్టుల పెయింటింగుల్ని సురక్షిత ప్రాంతానికి తరలించడం తన ఉద్దేశం అని చెబుతాడు, కానీ వాటిని జర్మనీకి తరలించడం అతని అసలైన ఉద్దేశం.

ఈ విషయాన్ని క్యూరేటర్ మేడమ్ విలార్డ్ ప్రతిఘటన సభ్యులకు తెలియజేసి, వాటిని కాపాడండి అని అభ్యర్థిస్తుంది. కళాఖండాల పెట్టెలను (కార్టన్‌లను) రైల్వేవాగన్‌లో నింపి ప్రత్యేక ట్రెయిన్‌లో తరలించాలని కల్నల్ ప్లాన్. ఫ్రెంచి జాతీయ రైల్వే ఉద్యోగులు రెసిస్టెన్స్‌తో సంబంధం కలిగిన వారే అవడం చేత ట్రెయిన్‌ను కొద్ది రోజులపాటు ఆపడానికి ప్రయత్నిస్తారు. ఈలోగా మిత్ర దేశాల సైన్యం పారిస్ చేరుకుంటే, కళాఖండాలను కాపాడుకోవచ్చని వారి ఆశ. ఐతే టైం ప్రకారంనడిచే రైళ్ళను, ప్రత్యేకంగా కల్నల్ పర్యవేక్షణలో జర్మనీకి బయలుదేర వలసిన, జర్మనీ సైనికుల రక్షణలో వున్న ట్రెయిన్‌ను ఆపడం చాలా ప్రమాదంతో కూడిన పని. ఈ ప్రయత్నం (operation)లో ప్రాణ నష్టం జరిగే అవకాశం ఎక్కువ. ఐనా వారు కళా సంపదను కాపాడ్డం దేశ ప్రతిష్టగా భావిస్తారు.

ఫ్రెంచి రైల్వే ఏరియా ఇన్‌స్పెక్టర్ పాల్ లబీష్ (Paul Labiche) మొదట ఈ ప్లాన్‌ను తిరస్కరిస్తాడు. అతని దృష్టిలో కళా సంపదను కాపాడుకోవడం కన్నా మనిషి ప్రాణాలు విలువైనవి. తన కన్నా సీనియర్ ఉద్యోగి స్పినెట్ ప్రతిపాదించిన కళారక్షణ కార్యక్రమాన్ని తిరస్కరిస్తాడు. ఐతే లబీష్ కూడా రెసిస్టెన్స్ బృంద సభ్యుడే అవడం చేత, తర్వాత మనసు మార్చుకుని నాజీ కల్నల్ కుట్రను భగ్నం చేసే బాధ్యతను తలకెత్తుకుంటాడు. తనకు గురువులాంటి పాపా బౌల్, (లోకోమోటివ్ డ్రైవర్) ట్రెయిన్‌ను కదలకుండా చేసే ప్రయత్నంలో దొరికిపోయి, కల్నల్ ఆజ్ఞ ప్రకారం నాజీలచే కాల్చి చంపబడతాడు. ఇక్కడ నుండి కథ ఉత్కంఠ భరితంగా ముందుకు సాగుతుంది. లబీష్ సహోద్యోగులు, రెసిస్టెన్స్ టీంలతో చేతులు కలిపి తన సొంత ప్రణాళికను ఆచరణలో పెడ్తాడు. చాలా క్లిష్టమైన ప్లాన్‌తో రైలు మార్గాన్నే మార్చి వేస్తాడు జర్మనీ ఎస్కార్ట్‌ను తప్పుదోవ పట్టించి. స్టేషన్ పేర్లనే మార్చేసి ట్రెయిన్ జర్మనీ వైపు ప్రయాణం చేస్తున్నట్లు (నాజీలను) నమ్మిస్తాడు. కానీ నిజానికది పారిస్ చుట్టూనే తిరుగుతూ వుంటుంది. రైల్వే లైన్ మార్చడం, పట్టాలు తొలగించడం, ఇంజన్ ఆగిపోవడం మొదలైన జిత్తులతో రైలును ముందుకు

సాగకుండా చేస్తాడు. రైలు ప్రమాదాన్ని సృష్టిస్తాడు. రివే-రైన్ అనే రైల్వేస్టేషన్ దగ్గర ట్రెయిన్ ఆగిపోవలసి వస్తుంది. ఈ సంఘటనల్లో కళాసంపద వున్న బోగికి ఏమాత్రం దెబ్బతినకుండా జాగ్రత్త పడతాడు. కల్నల్ పేల్చిన తుపాకి గుండు లబీష్ కాలిలో దూరినా ఆ చిన్న పాదల్లోకి మాయమై స్టేషన్ దగ్గరున్న హెూటల్ యజమానురాలు క్రిస్టీ సాయంతో తప్పించుకుంటాడు. మిగతా రెసిస్టెన్స్ బృంద సభ్యులతో పాటు స్టేషన్ మాష్టర్ కూడా మరణిస్తాడు. అదే రోజు రాత్రి - స్టేషన్‌లో నిలిచివున్న రైలులోని మూడు వాగెన్‌ల పై భాగాన్ని తెల్ల పెయింట్‌తో నింపి వేస్తారు. తెల్లారి మిత్ర పక్షాల విమానాలు బాంబు దాడి చేసినా వాటికి ప్రమాదం జరగకుండా రైల్వే వర్కర్లు, స్నేహితులతో కలిసి యువకుడైన రాబర్ట్ ఈ పనికి పూనుకుంటాడు. పెయింట్ చేయడం పూర్తి అవుతున్న దశలో నాజీలు పసిగట్టి వారిని కాల్చి చంపుతారు. కానీ అతడు చేసిన తెల్లపెయింట్ వల్ల ట్రెయిన్ కాపాడబడుతుంది.

ఇక నుండి మిగిలిన లబీష్ ఒక్కడే ఒంటరి పోరాటం చేస్తాడు. రైలు మార్గాలన్నీ (Tracks) క్లియర్ కాగానే ప్లాస్టిక్ బాంబులతో లోకో మోటివ్ (రైలు ఇంజన్)పై దాడి చేసి ట్రెయిన్‌ను ముందుకు సాగకుండా ఆపివేయాలను కుంటాడు. పట్టుబడిన ఫ్రెంచి యుద్ధ బందీలు కూడా అదే ట్రెయిన్‌లోని ఒక సీల్ చేసిన వాగెన్‌లో ఉన్నారని తెలిసి వారిని కాపాడ్డం కోసం రైలు మార్గాన్నే పేల్చి వేసి, దీనితో కల్నల్ కోపం తారాస్థాయికి చేరుకుంటుంది. లబీష్‌ను కన్పిస్తే కాల్చి వేయండని తన సైనికులను ఆదేశిస్తాడు. లబీష్ జర్మనీ సైన్యానికి దొరక్కుండా పక్కనే వున్న కొండపైకి చేరి పైనుండి అంతా గమనిస్తుంటాడు. రైలు పెట్టెలకు ఏమాత్రం హాని జరగదు కానీ రైలు పట్టాలు తప్పి ట్రాక్ మధ్యలో ఆగిపోతుంది. కల్నల్‌కు ట్రెయిన్‌ను కదలకుండా చేస్తాడు. ట్రాక్ బాగు చేయించాలన్నా, క్రేన్‌తో ఇంజన్‌ను పైకెత్తి పట్టాల మీద పెట్టించాలన్నా ఏ సాయమూ అందుబాటులో వుండదు.

కొండ కింద వున్న రైలు మార్గానికి సమాంతరంగా కొండ పాదానికి మధ్యలో రోడ్డు వుంటుంది. ఆ రోడ్డు వెంట జర్మనీ దళాల ట్రక్కులు తిరిగి వెళ్తుంటాయి. ట్రెయిన్ రక్షణ దళం సాయంతో ట్రెయిన్‌లోని కళా ఖండాలున్న పెట్టెలను దింపించి, తిరిగి వెళ్తున్న ట్రక్కుల్లో జర్మనీకి తరలించడమొక్కటే మార్గం అనుకుంటాడు కల్నల్. వెళ్తున్న ట్రక్కులను ఆపి ఆ కాన్వాయ్ కమాండర్‌కు చెక్కపెట్టెలను జర్మనీకి చేర్చే పని చెప్తాడు. దీనికి కాన్వాయ్ కమాండర్ ఒప్పుకోకపోవడంతో, రైలు వెంట వున్న జర్మనీ రక్షణ దళం బందీలుగా దొరికిన ఫ్రెంచి సైనికులందర్నీ చంపేసి తిరిగి వెళ్తున్న (రిట్రీటింగ్) సైనికుల్లో కలిసి వెళ్ళిపోతారు. కల్నల్ వాల్ట్ హెయిమ్ ఒక్కడే ఆగిపోయిన ట్రెయిన్ దగ్గర మిగిలిపోతాడు. రైలు మార్గానికి, రోడ్డు మార్గానికి మధ్యన, చెల్లాచెదురుగా చెక్కపెట్టెలు, వాటి పక్కన చనిపోయిన ఫ్రెంచి సైనికులు పడి వుంటారు. ఇదంతా గమనిస్తున్న లబీష్ తెరపైకి వస్తాడు. తుపాకి గుండు తగిలిన కాలితోనే పాకుతూ కొండ దిగి, కుంటుతూ లబీష్, చెక్క పెట్టెలను, రైలును కాపాడుతున్న కల్నల్‌కు ఎదురుపడతారు.

లబీష్‌కు ఆర్టు విలువ తెలియదనీ, అందం సౌందర్యం ఆనందించే వారికే సొంతమనీ, అవేవీ తెలియని శుద్ధ మొద్దుకు ఆర్ట్ గొప్పదనం అర్థంకాదనీ, ఐనా అకారణంగా ట్రెయిన్‌కు అడ్డంకులు కలిగించాడనీ కల్నల్ లబీష్‌ను మాటలతో అవమానించి, రెచ్చగొడ్తాడు. లబీష్ మాటా పలుకూ లేకుండా చనిపోయిపడివున్న యుద్ధ బందీలవైపు చూస్తూ కల్నల్‌ను కాల్చి చంపుతాడు. చనిపోయిన వారి శరీరాలు, కళాఖండాలున్న చెక్కపెట్టెల మధ్య నుండి రక్తమోడుతున్న కాలితో ముందుకు సాగుతాడు. యుద్ధ ఖైదీల శవాలను, కళాఖండాల పెట్టెలను మార్చి మార్చి చూపడం మనల్ని ఆలోచనలో పడేస్తుంది. మనిషి ప్రాణాలు, దేశ సంపదగా భావించబడే కళాసంపద, వీటిలో ఏది గొప్ప? కళాఖండాలను కాపాడ్డం కోసం ఎందరో రైల్వే ఉద్యోగులు, ఇతరులు ప్రాణాలు పోగొట్టుకుంటారు. అంత ప్రాణనష్టం అవసరమా? కట్టుదిట్టమైన ప్రణాళికతో కళాసంపద దేశం విడిచి పోకుండా చేయడంలో రైల్వే అధికారి లబీష్ ప్రాణాలకు తెగించి పోరాడి, విజయం సాధించడంతో చిత్రం ముగుస్తుంది.

**ఫిల్మ్ నిర్మాణం :** ఈ చలనచిత్రానికి ఫ్రాంకెన్ హెయిమ్ దర్శకుడు కావడం కూడా విచిత్రంగా జరుగుతుంది. మొదట అనుకున్న దర్శకుడు ఆర్థర్‌పెన్. మూడు రోజుల షూటింగ్ తర్వాత నిర్మాత జూల్స్ బ్రికెన్ దర్శకుణ్ణి తొలగించి, దర్శకత్వ బాధ్యతను ఫ్రాంకెన్ హెయిమ్‌కు అప్పగిస్తాడు. కారణం లబీష్ పాత్రకు ప్రాధాన్యత నిచ్చి మిగతా అంశాలు ట్రెయిన్‌ను ఆపడం, దారిమళ్ళించడం, పట్టాలు తప్పించడం, రైళ్ళు ఢీకొనడం మొదలైన వాటి మీద శ్రద్ధ పెట్టకపోవడం అందువల్ల ఆర్థర్‌పెన్ దృక్పథం నచ్చక అతణ్ణి తొలగించి అతని స్థానంలో ఫ్రాంకెన్ హెయిమ్‌ను నియమిస్తాడు. దీంతో నిర్మాణ వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుంది.

**ట్రయిన్ రైల్వేస్టేషన్ దృశ్యాల చిత్రీకరణ :** తెరనిండుగా రైల్వేస్టేషన్. రైల్ మార్గాలు వచ్చే పోయే రైళ్ళు అన్నింటినీ ఒకే దృశ్యంలో చూపించడానికి డీప్ ఫోకస్ లెన్స్ కెమెరా వాడబడింది. దీన్ని సినిమాటోగ్రాఫర్లు – జీన్ టర్నర్, వాల్టర్ వాటిజ్‌లు అద్భుతంగా చిత్రించారు. సినిమా అంతా నలుపు, తెలుపులో నిర్మితం. దీన్ని గురించి దర్శకుడు మాట్లాడుతూ– "బహుశా బ్లాక్ అండ్ వైట్‌లో నిర్మించబడిన భారీ ఏక్షన్ సినిమా ఇదే కావచ్చు. వ్యక్తిగతంగా నేను ఇందుకు ఎంతో ఋణపడి వుంటాను, సినిమా అసాధారణంగా రావడానికి ఇది నలుపు తెలుపులో నిర్మించబడటం అంటాడు.

**ఫిల్మ్ విశేషాలు :** సినిమాలో ఉపయోగించిన రైలు ప్రమాదంలో చూపించిన దెబ్బ తిన్న రైలు ఇంజన్లు కూడా నిజమైనవే. పనికిరావని మూలనపడేసిన రైలు ఇంజన్ నెంబర్ 517. అలాగే మరో ఇంజన్ క్లాస్ 141ఆర్ 2-8-2. రెండూ నిజమైనవే. ప్రమాదంలో ముక్కలైన రైలు పెట్టెలు మాత్రం కార్డ్‌బోర్డ్ అట్టలతో తయారైనవి – చిత్రం ఘన విజయం సాధించి నిర్మాతకు లాభాలార్జించి పెట్టకపోయినా విడుదల నాటికి పెట్టిన 6.7 మిలియన్ డాలర్లకు గాను, ఫ్రాన్స్, అమెరికా, ఇంగ్లండు దేశాల్లో మొత్తం మీద 9 మిలియన్ డాలర్లను నార్జించి పెట్టింది. 1965లో యుకెలో బాగా ప్రజాదరణ పొందిన 13 సినిమాల్లో ఇది ఒకటిగా ఎన్నికయింది.

**అవార్డులు :** ఉత్తమ కథ, స్క్రీన్‌ప్లేలకు అకాడమీ అవార్డులకు నామినేట్ చేయబడింది. బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అవార్డుకు ఉత్తమ చిత్రంగా జాన్ ఫ్రాంకెన్ హెయిమ్ ఉత్తమ నటుడిగా నామినేట్ చేయబడినా, ఉత్తమ నటనకు బర్ట్ లాంకాస్టర్ లారెల్ అవార్డుకు ఎంపికవుతాడు. నేషనల్ బోర్డ్ ఆఫ్ రివ్యూ అవార్డు కోసం ఎంపికైన 10 అత్యుత్తమ చిత్రాల్లో దీనికి 9వ స్థానం లభించింది.

**మరికొన్ని విశేషాంశాలు**

- రెండవ ప్రపంచ యుద్ధం నాటి ఆద్యంతం ఉత్కంఠత కలిగించే చిత్రం.
- ఉన్నతమైన నటన, యదార్థ వాతావరణం, రైల్వేస్టేషన్లు, వాటి చుట్టూ తిరిగే రైళ్ళు మొదలైన సంఘటనలు ఊపిరి సలపనివ్వని గొప్ప విషయాలు.
- సాంస్కృతిక వారసత్వ సంపదగా చెప్పుకునే కళాకృతుల్ని కాపాడుకోవడం కోసం ఫ్రెంచి వారు చేసిన పోరాటం, వారి పట్టుదలకు సినిమా సాక్ష్యంగా నిలుస్తుంది.




ట్రయిన్ చిత్రంలో ఒక సన్నివేశం

- అద్భుతమైన ఆశ్చర్యం కలిగించే ఫొటోగ్రఫీ, వివిధ కోణాలనుండి చూపే రైళ్ళ కదలికలు, ప్రమాదాలు, లైటింగ్ సాంకేతికత మంత్రముగ్దుల్ని చేస్తాయి.
- ఊహించని మలుపులు, ఎత్తులు పై ఎత్తులతో ఉక్కిరిబిక్కిరి చేసే సినిమా.
- మేటి ఛాయాగ్రహణానికి దీటైన శబ్దగ్రహణం. మళ్ళీ మళ్ళీ తిరిగరాసిన నిర్దిష్టమైన స్క్రీన్‌ప్లే సినిమాకు వరాల్లాంటివి.
- అభినయ, పోరాట సినిమాలకు ఒరవడిగా ఇది నిలుస్తుంది.
- చారిత్రక నిర్దిష్టతకు ప్రాధాన్యతనిచ్చి నిర్మించిన చిత్రం.
- మనిషి పట్టుదలకు, పోరాట పటిమకు వీలునామా లాంటిది.
- రంగుల, స్కోప్‌లో నిర్మించిన చిత్రం కాకున్నా తెలుపు నలుపు చిత్రాల్లో ఉన్నత ప్రమాణాలు పాటించిన చిత్రం.

సినిమాలో ఇన్ని విశేషాంశాలున్నా – విమర్శకులు నిడివి ఎక్కువ (133 నిముషాలు) అనీ, ట్రెయిన్ ఎక్కడికో పరుగులు పెట్టినట్లు చూపించినా, ఎక్కడికీ వెళ్ళదు అనీ విమర్శించారు.

**గార్డియన్ పత్రిక :** "విచక్షణా రహితంగా, ఉన్మాదంతో చేసే కళా విధ్వంసం వర్తమాన ఔచిత్యాన్ని, ప్రాసంగికతను కలిగి వుంది. కళాఖండాలను ధ్వంసం చేసే ఆటవిక, అనాగరిక చర్య. దాని నుండి వాటిని కాపాడుకోవలసిన బాధ్యతను ద ట్రెయిన్ సినిమా గుర్తు చేస్తుంది" అని ఘాటుగా స్పందించింది.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# అర్థం-పరమార్థం

– ఆచార్య పి హరినాథ్

పురుషార్థాలు నాలుగింటిలో దేనికదే విలువైనవి. దేనికదే బలమైనది కూడా. అర్థం ప్రధానంగా భావించే వాళ్ళు ఎలా భావిస్తూ ఉంటారో భర్తృహరి చెబుతాడు.

**జాతిర్యాతు రసాతలంగుణగణస్తత్రాప్యధో గచ్ఛతాత్**
**శీలం శైలతటాత్పతత్వభిజనస్సందహ్యతాం వహ్నినా**
**శౌర్యే వైరిణి వజ్రమాశు నిపత త్వర్థోపి నః కేవలం**
**యే నైకేన వినా గుణా స్తృణలవప్రాయా స్సమస్తా ఇమే**

ఏజాతిలో పుట్టాము? ఆ జాతికి ఉన్న గౌరవ మర్యాదలు ఏమిటి? ఇలాంటి ఆలోచనలన్నీ ఎక్కడో అధోలోకానికి పోనీ! ధైర్యము, దానగుణము, ఉదార స్వభావములాంటి గుణాలు అంతకంటే కిందికి దిగజారనీ! మంచితనం రుజువర్తన వంటివి కొండపైనుంచి దూకిపడనీ. వంశం తగలబడిపోనీ శూరత్వం నెత్తిన పిడుగు పడనీ. మాకు కేవలం అర్థం ఒకటే పరమార్థం. ధనం ఉంటే చాలు. అదిలేకపోతే ఈజాతి, శౌర్యం, వంశం వంటి గుణాలు ఏవి పనికిరావు. అవి గడ్డిపరక అంతే. దీన్ని మరింత బలంగా చెబుతూ కవి అంటాడు.

**యస్యాస్తి విత్త స నరః కులీనః/స పండిత స్స శ్రుతవాన్ గుణజ్ఞః/స ఏవ వక్తా స చ దర్శనీయః/సర్వే గుణాః కాంచన మాశ్రయంతి**

ధనం అనేది ఉంటే అవగుణాలను కూడా గుణాలుగా చూస్తారు. ధనముంటే వ్యక్తులను ఉన్నత వంశంలో పుట్టినవారు అంటారు. వాళ్ళను గొప్ప పండితులు అంటారు. శాస్త్రజ్ఞులు అంటారు. గుణవంతులు అంటారు. సుందరులు అంటారు. కలవాల్సిన వ్యక్తులు అని అంటూ ఉంటారు. ఈ అన్ని గుణాలు ధనాన్ని ఆశ్రయించి ఉన్నాయి కదా. మరి ఇంత ప్రాధాన్యం ఉన్న ధనం ఎప్పటికీ భద్రంగా మనతోనే ఉంటుందా? లేదు.

**దానం భోగోనాశస్తిస్రోగతయో భవంతి విత్తస్య**
**యో నదదాతి న భుంక్తే తస్య తృతీయా గతిర్భవతి**

ధనం మూడువిధాలుగా కదులుతూ ఉంటుంది. దానము, భోగము, నాశము అని దాని గతులు. సమాజానికి ఉపయోగపడేలా పదిమంది మంచికోసం చేసేది దానం. దానివల్ల పాత్రులైన వారికి సహాయం అందుతుంది. ఇది మొదటిది. లోకంలో ఉండే సుఖాలను అనుభవించడం దానికై ధనాన్ని వెచ్చించడం–ఇది రెండవది. ఇక మూడవది ఉంది. అది నాశనం–అంటే దొంగల బారిన పడి, దుర్మార్గుల పన్నాగాలకు లోబడి, సర్వం కోల్పోవడం. ఒకరికి దానం చేయకుండా, తాము అనుభవించకుండా ధనార్జనచేసే వారి ధనం ఏమవుతుంది? మూడో గతికి చెందుతుంది. అంటే నాశనం అవుతుంది అని కవి హృదయం.చెడు మార్గం పట్టిన ప్రతిదానికి చేటు తప్పదు. వేటు తప్పదు.

# ఆత్మగౌరవం

ఒక రెండు భిన్న మనస్తత్వాల గురించి రెండు శ్లోకాలు చెబుతాడు భర్తృహరి. తన స్థితికి తన గౌరవానికి మర్యాద దక్కని పనిని ఏమాత్రం చేయనివాళ్ళు కొందరు ఉంటే, మర్యాద గురించి మ న్నన గురించి పట్టించుకోకుండా ముందుకు పోయే వాళ్ళు కొందరు. వీరి గురించి దృష్టాంతాలతో చెబుతాడు కవి.

**క్షుతామోపి జరాకృశోపి శిథిల ప్రాయోపి కష్టా దశా**
**మాపన్నోపి విపన్న దీధితిరపి ప్రాణేషు నశ్యత్స్వపి**
**మత్తేభేంద్ర విభిన్న కుంభ పిశితగ్రాసైక బద్ధ స్పృహః**
**కిం జీర్ణం తృణమత్తి మాన మహతా మగ్రేసరః కేసరీ**

మాన శౌర్య పద్ధతిలోని శ్లోకం ఇది. ఆకలి తనను దహించినా, ముసలితనం పైనబడినా, శక్తిని సడలింప చేసినా, కష్టం కలిగినా, కాంతి తప్పినా, ప్రాణాలు పోతున్నా కూడా సింహం ఎండుగడ్డిని తినదు. మదించిన ఏనుగు కుంభ స్థలాన్ని చీల్చి తినే శౌర్యం తప్ప గడ్డికి ఆశించదు..'మత్తేభేంద్ర విభిన్న కుంభ పిశిత' అని ఒకటిచెప్పి మరొక దానిని 'జీర్ణంతృణం' అని తెల్చి చెప్పడంలోని కవి చతురత ఉంది. సింహం నీచ జంతువు కాదు దాని ప్రవర్తన వేరు.పరంపరగా తనకు సంక్రమించిన ఉత్తమ శీలాన్ని కాపాడుకోవడం, ఎవరి సహాయము కోరకుండా శత్రుసంహరణ సాగించే సామర్థ్యం ఉండడం–శౌర్యం. ఈ రెండూ ఉంటే అది మాన శౌర్యం. దీనికి భిన్నంగా ఉండే మనస్తత్వాన్ని చూపిస్తూ ఉత్తములకు, నీచులకు ఉండే వ్యత్యాసాన్ని మరో దృష్టాంతంతో చెబుతాడు కవి

**లాంగూల చాలనమధశ్చరణావఘాతం/భూమౌ నిపత్య వదనోదర దర్శనంచ/శ్వా పిణ్డదస్య కురుతే గజ పుంగవస్తు ధీరం విలోకయతి చాటుశతైశ్చ భుంక్తే**

కుక్కకు పిడికెడు అన్నం పెట్టినవాడిదగ్గర తోకనాడిస్తుంది. అలాగే నేలపై పడి దొర్లుతుంది. కడుపుని చూపిస్తుంది. అదే ఏనుగు అయితేనో? ధైర్యంతో అటూ ఇటూ చూస్తూ ఉంటుంది. దానికి తియ్యని మాటలు చెప్తూ, బుజ్జగిస్తూ తినిపిస్తూ ఉంటే అది దర్జాగా తింటూ ఉంటుంది. నీచుడికి, ఉన్నతునికి ఉన్న వ్యత్యాసాన్ని ఇక్కడ ఒక ఉపమానంతో చెప్పాడు కవి. కుక్క, ఏనుగు రెండూ తమ యజమానుల దగ్గర ప్రర్తించే విధానంలో తేడా ఉంది. వ్యక్తులు కూడా ఇంతే. తమ ఆత్మగౌరవం నిలుపుకునే మహాత్ములు ఇలాగే ప్రవర్తిస్తారు.

ఆచార్య పి. హరినాథ్, మైసూర్, ఫోన్ : 9480443108

# భాషా ఉషస్సు - శ్రీనివాస ఛందస్సు



ప్రతివాద భయంకర శ్రీనివాస్

*- భమిడిపాటి గౌరీశంకర్*

'ప్రతివాద భయంకర శ్రీనివాస్ ఇలా చెబితే ఎవరీయనని అడుగుతారు. 'ఓహో గులాబి బాల 'అందాల ఓ చిలుకా' పాటలు పాడిన మధుర గాయకుడని చెబితే ఓహో పి.బి. శ్రీనివాస్ గారా అంటారు. పి.బి. శ్రీనివాస్ గారు గాయకులుగా ఎంతో మందికి తెలుసు. ఆయన జీవిత చరిత్ర కూడా అందరికి తెలిసినదే. కాని.. ఆయన గురించి తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా తెలుగు భాష కోసం ఆయన చేసిన సేవ అనన్య సామాన్యమని ఎరిగిన వారెంతమంది ఉన్నారో... 'ఆర్ద్రత్వ మార్ద్ర భాషాచ, నాల్పస్య తపః ఫలమ్'ని త్రికరణ శుద్ధిగా నమ్మి ఆంధ్ర దేశానికి దూరంగా నివసించినా ఆ నమ్మకాన్ని నానావిధ భాషలలో అభివ్యక్తీకరించి ఆనందించి, ఆనందింపజేసిన ధన్యజీవులాయన.

పి.బి. శ్రీనివాస్ 1930 సెప్టెంబర్ 22వ తేదీన శ్రీ పతివాది భయంకరం వేంకటలక్ష్మణ ఫణిస్వామి, శేష గిరమ్మ దంపతులకు తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జన్మించారు. వీరికి పూర్వీకులైన ప్రతివాది భయంకరం అణ్ణంగరాచార్యుల సంతతి 15వ శతాబ్దంలో ఆంధ్ర దేశానికి తరలి వచ్చారు. సామర్లకోటలో ప్రతివాది భయంకరం తిరువేంగళాచార్యుల వారని గొప్ప పండితులు 19వ శతాబ్దంలో సుప్రసిద్ధులు. 1862లో భాను మిత్రుని 'రసమంజరి'కి తాత్పర్యమంజరని వ్యాఖ్యను వ్రాసారు. చిన్నతనంలో శ్రీనివాస్ గారికి మూడో ఏడు వరకు మాటలు రాలేదు. తల్లిదండ్రులు ఆవేదన చెందారు. కళామతల్లి, సరస్వతీ మాతలు చిన్నతన మనుకున్నారేమో. ఆయన గొంతులో మాటల జడిని కురిపించారు. తెలుగు భాషను మురిపించారు. పసివాడి గొంతుతో 'పసి'వాడని స్పష్టమైన వాక్కు ప్రవహించింది. విద్యాభ్యాసమంతా కాకినాడ, ఏలూరులో సాగింది. బికాం చదివారు. కామర్స్ వంటపట్టలేదు. 'కామ్'గా సంగీత సాహిత్యాలను కౌగిలించుకున్నారు. తల్లే మొదటి గురువు. ఆమె విదుషీమణి. కోయిల గొంతు. రఫీ, మన్నాడే, ముఖేష్, తలత్ మహమూద్ పాటలు వినటం, తల్లిగారి వద్ద సాధన చెయ్యటం ఆయన దినచర్య. సంస్కృతాంధ్రల్లో పట్టు సాధించారు. ఆయన భవిష్యత్ గురించి జ్యోతిష్యులు పెదవి విరిచినా తండ్రి ఫణీంద్ర స్వామిగారికి కొడుకు గాత్రం పైన నమ్మకం. ఆయన శ్రీనివాస్ గారిని నాటి కాకినాడ సబ్ రిజిస్ట్రారయిన ప్రముఖ వీణా నాదములు బ్రహ్మశ్రీ ఈమని శంకర శాస్త్రిగారి వద్దకు తీసుకొని వెళ్ళారు. ఆయన పి.బి.గారి గొంతు విని ఆశీర్వదించారు. తరువాత చరిత్ర తెలుగు, కన్నడ, హిందీ తదితర ఎనిమిది భాషల చలన చిత్ర పరిశ్రమకు, ప్రేక్షకులకు అవగతమే!

చెన్నైలో శ్రీనివాస్ గారికి శ్రీ బులుసు వెంకట రమణయ్య గారు, శ్రీ తీర్థం శ్రీధర మూర్తిగారు, శ్రీ వి. రాఘవన్ వంటి మహనీయుల సన్నిధి, కవిత్వ రంగ ప్రవీణులై చలన చిత్ర రంగంలో లబ్ధ ప్రతిష్ఠులైన దేవులపల్లి కృష్ణ శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీశ్రీ, దాశరథి, అనిసెట్టి వంటి వారి విభిన్న తరహా కవితా ప్రముఖుల స్నేహం లభించింది. అకాశవాణి, సినిమా, జర్నలిజం వంటి రంగాలలో ప్రసిద్ధులైన వారి స్నేహం వలన శ్రీనివాస్ గారు మూడింటిలోనూ 'మైత్రీ' (MY THREE) తనకు దొరికిందని ఆయనే చాలా సందర్భాల్లో చెప్పుకున్నారు. పి.బి. వారు ఆధునికతను అభిమానించే వారు. 'ప్రాతయనిపించు సరిక్రొత్త పథము నాది' అనేది ఆయన అభిప్రాయం. సంగీతంలో ఆయన సంప్రదాయకతను అనుసరిస్తూనే ఆధునికతను పాటించారు. కాని.. భాషా విషయంలో మాత్రం శాస్త్ర ప్రమాణాన్ని 'శాసన' ప్రమాణంగానే స్వీకరించాలని ఆయనకు గురువు 'దొరసామి శర్మాగారు చెప్పారంటారయన.

ఆ సంస్కార ఫలంగా శ్రీనివాస్ గారు 'ఛన్దో హీనో నశబ్దోస్తి, నచ్ఛందః శబ్ద వర్జితః' అన్న నమ్మకంతో భాషను అభ్యసించారు. అభిమానించారు. రావూరి దొరసామిగారి వలననే ఛందస్సులో క్రొత్త క్రొత్త ప్రయోగాలు చేసారు. స్వతహా దొరసామి గారు ఛందో వ్యాకరణాల పైన పరిశోధనాత్మ గ్రంధాలు వ్రాసారు. వీటి ప్రభావంతో శ్రీనివాస్ గారు ఏదైనా క్రొత్తది కనుగొనాలనే ఉత్సుకతతో వర్ణ మేరువు, వర్ణ పతాక, మాత్రా మేరువు, మాత్రా పతాక, వర్ణ మర్కటి, మాత్రా మర్కటి వంటి ప్రసార క్రమాలను

కూలంకుషంగా అధ్యయనం చేసారు. కన్నడంలోని ఛందో సంప్రదాయాలలో జరిగిన పరిశోధనలను తెలుసుకున్నారు. ఆరుద్రగారి ఇంటికి సమీపంలో బి. నాగరాజారావు గారని సుప్రసిద్ధ కన్నడ పాత్రికేయులు ఉండేవారు. ఆయన గారి సౌజన్యంతో శ్రీనివాస్ గారు షట్పదీ ప్రకరణాలలో కృషి చేసారు.

పి.బి. శ్రీనివాస్ గారు కన్నడ ఛందస్సులోనూ విపరీతమైన పరిశోధనలు చేసారు. "మేరు ప్రస్తారం ఉక్త నుంచి ఉత్కృతి వరకు, షడ్వింశతిచ్ఛందాలకే ప్రసిద్ధంగా ఉన్నా, ఇరవై ఆరుకు పైగా అక్షర ఛ్చందస్సులున్నయని గురించారు. లాక్షణికులు ఇరవై ఏడు నుంచి నలభై అయిదు దాకా గుర్తించిన వాటిని పరిశీలించారు. త్రిభంగ్యాదులు, ఉద్దుర మాలలు, ఉపరివృత్తాలు, దండకాదులు ఉన్నాయి. ఆ కృషిని ఇంకా కొనసాగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనే 'గాయత్రీ వృత్త' మంటారు. డా. ఏల్చూరి మురళీధరరావు. 'గాయత్రీ వృత్తము' పి.బి. శ్రీనివాస్ గారి మానసిక మేధా పుత్రికయిన ఈ వృత్తములో షడ్వింశతిచ్ఛందాలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్కటి ప్రతీకగా 26 గణాలను తీసుకున్నారు. ఈ ప్రక్రియ ఇంకా విస్తరించే అవకాశం ఉందని అందుకు 'గురుస్థానం' తమదేనని సూచించటానికి ఒక 'గురువు 'ను ఆపైన నిలిపారు. అనగా మొత్తం 26×3= 78+1= 79 అక్షరాలతో భారతీయ పద్య సాహిత్య చరిత్రలో అపూర్వమైన గాయత్రి వృత్తమును 1979లో ఆయన రచించారు. 'అందువలననే కావచ్చు 79 అక్షరాలు కూర్చి ఉంటారంటారు. (డా. ఏల్చూరి వారు) "ముందుగా నాలుగేసి గణాలతో పదహారు అక్షరాల చొప్పున ఆఱు గణ పతాకాలను" కూర్చుకున్నానని శ్రీనివాస్ గారు చెప్పుకున్నారు. అవి ఇరవై నాలుగు గణాలు అంటే 72 అక్షరాలు. ఆపైన రెండు లఘువులు, ఒక గురువు, మూడు లఘువులు, ఒక గురువు మొత్తం ఏడు అక్షరాలు వేసారు. మొత్తం 79 అక్షరాలు.

గణాల క్రమమిది తస, మయ, యజ, యమ, యజ, తమ, తస, యమ, యజ, యమ, తర, యమ IIU IIIU. వీటిని ఒక అనుక్రమణికలో 'పాదం' పరంగా చూస్తే కొన్ని వైచిత్రిలు కనిపిస్తాయి. శ్రీనివాస్ గారి ఆంతర్యం ఏమిటో అర్థం కాదు. 'నా చిత్ర రచనలు నావి' అని దేవులపల్లి వారి తరహాలో అనుకొని ఉంటారనుకోవచ్చు. (విపులంగా వివరిస్తే స్థలాభావమని భావించాను) లాక్షణిక పద్ధతిలో అనుపాఠం గణక్రమం తస, యమ, యజ, యమ, యజ, తమ, తస, యమ, యజ, యమ, తర, యమ, నన, గ అని ఉదహరించుకోవాలి. వీటిలో 'త-స-య-మ 'గణాలని 'అంభోజాలి' అని సమవృత్తమని దుఃఖ భంజనుడు వాగ్వల్లభ ఛ్చందస్సులో వివరించాడు. (దీనికి "విశాలాంభోజనుడు అని కూడా పేరుంది.)

ఈ క్రమంలో చూస్తే పి.బి. శ్రీనివాస్ గారి గాయత్రి వృత్తము వివిధ లఘు ఛ్చందాల సమాహార వృత్తమవుతుంది. పద్య పాదాలలోని యతి స్థానాన్ని కూడా శ్రీనివాస్ గారు నిర్దేశించారు. 79 అక్షరాల పాదంలో 1-13-25-37-49-61 యతి స్థానాలు మొదటి అక్షరం కాక ఐదు యతులు. వృత్తం కాబట్టి ప్రాయ వియతం దీనిని తల్లిదండ్రులకు అంకితం చేసి 'జననీ జనక గాయత్రీ వృత్తమ'న్నారు. 'అపూర్వ ప్రాశస్త్యోద్ధృతి' కారణంగా ఈ వృత్తం ప్రసిద్ధి కావాలని ఆకాంక్షించారు. కరపత్ర గ్రంథ రూపంలో పి.బి. శ్రీనివాస్ గారు ప్రచురించిన తొలి పుస్తకం ఇదే. ఇది 1979లో ప్రచురితమయింది. గాయత్రీ వృత్తములోని ఒక పద్యంలోని ఒక పాదమును మాత్రమే ఉదహరించి వ్యాసాన్ని ముగిస్తాను. ఇందు కుండలీకృతాలుగా ఉన్నవి యతి స్థానాలు. (శ్రీ)మంతుడను నేను శ్రీ గాయత్రీ న(తృ)వన్, దేవి పేర వినూత్న ఛ్చందంబుల్ (సృ)జింపంగా, నేడు నాచేత నేటన్, నే(తృ)త్వం బొసంగి, దేవి, నాకీ రీతిన్ ధా(తృ)శక్తిన్ వరంబుగ నిచ్చెన్ శ్రీ గాయ(త్రీ) భవ్య భావ్య దివ్య మాహాత్మ్యంబున్, వర్ణన సేయదరమే? ఇదే కాక పి.బి. శ్రీనివాస్ గారు సరిక్రొత్తగా పింగళుడు, కేదార భట్టు మొదలైన ప్రాచీనుల ధోరణిలో 'శ్రీనివాస వృత్తము'. అనే మరో క్రొత్త సృష్టిని చేసారు. ఆయన గొప్ప గాయకులు, పరిశోధకులు, భాషాభిమాని తెలుగు వారు కావటం మనందరికి గర్వకారణం. గాయకుడుగా ఆయన మొదటి చిత్రం 'జాతక ఫలం' (1954) సుమారు మూడు వేలకు పైగా పాటలు పాడారు. తమిళనాడు ప్రభుత్వం 'కలైమా మణి ' కర్ణాటక ప్రభుత్వం పురస్కారం, శ్రీ రాఘవేంద్ర మఠం వారి 'సంగీత కళానిధి ' పురస్కారం మరియు ఆస్థాన సంగీత విద్వాంసునిగా, కంచి జగద్గురు పీఠం 'సంగీత రత్న' 'సంగీత నాథమణి' బిరుదులు, ఆరిజోనా విశ్వ విద్యాలయం నుంచి 'డాక్టరేట్' గౌరవాన్ని అనుకున్నారు. రచ్చ గెలిచినాయనకు 'తెలుగింట' తగిన గుర్తింపు రాలేదు...

భమిడిపాటి గౌరీ శంకర్, ఫోన్ : 9492858395

# అన్నమయ్య ముగ్గుల ముచ్చట్లు

**– ఆచార్య పి. హరిపద్మరాణి**

తెలుగు సంస్కృతి నుంచి విడదీయలేని కళారూపం ముగ్గు. కానీ ఈ కళారూపాన్ని గురించి వివరించే సమగ్రమైన పుస్తకాలు, వ్యాసాలు ఉన్న దాఖలాలు ఎక్కడ కనిపించవు. ప్రాథమిక శోధనలో, ఒక తెలుగు ఆచార్యులు ఇచ్చిన సమాచారం ప్రకారం,ఎప్పుడో ఒక పరిశోధకురాలు, కొన్ని దశాబ్దాల క్రితం ఏదో విశ్వవిద్యాలయం నుండి ముగ్గులపై పరిశోధించి పీహెచ్‌డి పట్టా పొందినట్టు తెలిసింది. అంతకు మించి, ఇప్పుడు అంతర్జాలంలో లభించే ప్రాథమిక సమాచారం తప్ప ముగ్గులపై ఏ విధమైన రచనలు కనిపించటం లేదు. చారిత్రకంగా, సామాజికంగా, తాత్వికంగా, ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా, పర్యావరణ, యోగ, గణిత, సౌందర్య శాస్త్రాల పరంగా, మహిళల జీవన విధానంలో అంతర్భాగమై ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ కళారూపానికి తగిన గ్రంథస్థమైన గుర్తింపు కనిపించదు. దానికి కారణాలు ఏమై ఉండవచ్చు అనేది పరిశోధించవలసిన అంశము. ఇది ప్రధానంగా మహిళలకు చెందిన కళారూపం కావటం, చదువుతో సంబంధం లేకుండా పెద్దవాళ్లు వేస్తుంటే చూసి బాలికలు నేర్చుకునే సంప్రదాయానికి చెందిన కళ కావటం వల్ల మన పితృస్వామ్య సమాజంలో ఈ కళకు నిర్దిష్ట రచనా పరమైన గుర్తింపు కరువ వటానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది.

రెండు దశాబ్దాల క్రితం వరకు ముగ్గుల పుస్తకాలు, అంటే ముగ్గులతో నిండిన పుస్తకాలు మార్కెట్లో విరివిగా దొరికేవి. అయితే అంతర్జాలంలో సాంఘిక మాధ్యమాల యుగం ప్రారంభమైన తర్వాత వంటల పుస్తకాలు, పాటల పుస్తకాలు లాంటి అనేక ఇతర పుస్తకాలతో పాటు ముగ్గుల పుస్తకాలు కూడా అంతర్జాల స్థాపితం చేయబడి భౌతికంగా కనుమరుగయ్యాయి. అయితే గత ఆరేడు సంవత్సరాలలో, సామాజిక మాధ్యమాలలో ముగ్గుల వీడియోలు, చిత్రాల విస్ఫోటనాన్ని, వాటి వీక్షణల సంఖ్యని గమనిస్తే, ముగ్గుకి పెరుగుతున్న ఆదరణ స్పష్టంగా కనిపిస్తుంది.ముగ్గు అనేది మన తెలుగు రాష్ట్రానికి,తెలుగు సంస్కృతికి మాత్రమే పరిమితమైన కళారూపం కాదు. స్వల్ప తేడాలతో వివిధ పేర్లతో భారతదేశం అంతా వ్యాపించి ఉన్న ప్రత్యేక భారతీయ కళారూపం. అయితే భారతదేశం నుండి వివిధ దేశాలకు వెళ్లి స్థిరపడిన భారతీయుల ద్వారా ఈ కళారూపాన్ని శ్రీలంక, థాయిలాండ్, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, అమెరికాలాంటి దేశాలలో సైతం మనం చూడవచ్చు. ముగ్గుని తమిళులు 'కోలమ్' అని, మరాఠీ కన్నడిగులు "రంగోలి" అని రాజస్థానీయులు 'మందన' అని, బెంగాలీలు 'అల్పన/ ఆల్పన' అని అంటారు. అలాగే ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ మధ్యప్రదేశ్‌లలో నేల గోడల మీద వేసే ముగ్గులను 'చౌక్ పూ.రణ్'/ 'చౌక్ పురాణ' అని అంటారు.

'మ్రుగ్గు' అనే పదానికి రూపాంతరమే ముగ్గు అంటుంది శబ్ద రత్నాకరం (1912). ముగ్గుకి 'రంగవల్లి', 'పరిక'అనే పేర్లు కూడా ఉన్నాయని పర్యాయపదం నిఘంటువు (జి.యన్.రెడ్డి) చెబుతుంది. 'ముగ్గిపోయిన' 'పక్వానికి వచ్చిన' అనే అర్థాలతో "ముగ్గు" పదం క్రియగా కూడా వాడబడుతుంది. ఉదాహరణకు 'పంట ముగ్గి పోయింది. ఇక కొయ్యవచ్చు' రంగోలి, రంగవల్లి అలాగే కోలమ్, పదాలకి సంబంధించిన చరిత్ర కొంత అంతర్జాలంలో లభ్యం అవుతుంది. కానీ తెలుగు సంస్కృతికి ప్రత్యేకమైన 'ముగ్గు' అనే పదం ఎప్పటినుంచి వాడుకలో ఉంది? ఈ కళారూపానికి సంబంధించిన మన ప్రత్యేక చరిత్ర ఏమిటి అని తెలుసుకోవాలన్న కుతూహలంమన పద కవితా తాతయ్య అన్నమయ్య దగ్గరకు తీసుకుని వెళ్ళింది. మనకు లభ్యమౌతున్న సుమారు 15 వేల సంపూర్ణ రచనల నిధిని శోధిస్తే, 'ముగ్గు' గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి:

ముగ్గు అనే పదం ఆధారంగా తెలుగులో ఉన్న జాతీయాలు ఎక్కువ మందికి తెలిసినవి రెండే.

1. ముగ్గు బుట్ట 2. ముగ్గులోకి దించటం

ఇప్పటి వారికి ముగ్గు బుట్ట అంటే కూడా తెలియకపోవచ్చు. ముగ్గుపిండిని వేసుకునే బుట్టని వారు చూసి ఉండక పోవచ్చు. 40, 50 సంవత్సరాల క్రితంముగ్గుని (సున్నపు రాయి పొడిని) ఒక బస్తా కొనుక్కొని

ఇంట్లో నిలువ ఉంచుకునేవారు. ఈ బస్తాలో నుంచి వాడుక కోసం ఒక చిన్న వెదురుతో చేసిన చేతి బుట్టలో ముగ్గు తీసుకుని, దానికి కొంచెం వరి పిండి కలిపి ప్రతి రోజు వాడుకునేవారు. ఈ బుట్టలో పిండి మామూలు రోజుల్లో చిన్న ముగ్గులు వేసేటప్పుడు ఒక నాలుగైదు రోజులు వస్తే, పండుగ నెలలో మాత్రం రోజుకు ఒక బుట్ట కూడా చాలని సందర్భాలు ఎన్నో ఉండేవి. ఈ ముగ్గు బుట్టలో నుంచి ముగ్గు పిండి జారిపోకుండా ఉండటానికి ఈ బుట్టకు మెంతులు కాగితాలు కలిపి రుబ్బిన పిండిని పూసేవారు. సంవత్సరాల తరబడి అదే బుట్టని వాడటం వల్ల బుట్ట కూడా ముగ్గురంగులో తెల్లగా ఉండేది. జుట్టు నెరిసిపోయిన తలని చూపిస్తూ "తల ముగ్గు బుట్ట అయ్యింది" అని వాడటం సాధారణంగా వినిపించేది.

తాంత్రిక పూజలు చేసేటప్పుడు ముగ్గు వేసి ఎవరినైతే లోబర్చుకోవాలనుకుంటారు వారిని ఆ ముగ్గు మధ్యలోకి తీసుకువస్తారు. దానినే ముగ్గులోకి దించటం అంటారు. 'మాయమాటలతో ప్రలోభ పెట్టి తమ అవసరాలు తీర్చుకోవడం' అనే అర్థంతో 'ముగ్గులోకి దించారు' అనే జాతీయాన్ని మామూలుగా వాడుతుంటాం. అన్నమయ్య పద కవితా నిధిలో, ముగ్గు అనే పదం మొత్తం మీద 40 సార్లు వాడబడింది. కాబట్టి అన్నమయ్య కాలం నాటికి అంటే 600 సంవత్సరాలకి పూర్వం ముగ్గు అనే పదం తెలుగులో విస్తృతంగా వాడుకలో ఉన్నట్టు మనకి అర్థమవుతుంది. తన కీర్తనలలో ముగ్గు అని వాడిన 40 ప్రయోగాలలో, ఆరు ప్రస్తావనలు, మనం మాట్లాడు కుంటున్న ముగ్గుకి సంబంధం లేని ప్రయోగాలు. ఉదాహరణకి 1."తగ్గు ముగ్గులయిన వేళ" (1-210) 2. చంచలపు విషయాల సగ్గుడ ముగ్గుడు గాక (1-378) 3. తగ్గు ముగ్గు లేక నీ తలపు లీడేరెనా(13-402) 4. తగ్గు ముగ్గులెల్ల బాసె తలపు లీడేను (16-352)

మిగిలిన 36 ప్రయోగాలలో, ముంగిట ముగ్గులు అనే అర్థంతో ఏడుసార్లు వాడబడింది: 1. ముచ్చటలే నగవుల ముంగిట ముగ్గులు పెట్టి 2. ముంగిల ముగ్గులు వెట్టి ముత్యాల పందిలికింద 3. మునుకొని ముంగిటను ముత్యాల ముగ్గులు వెట్టి 4. ముంగిట ముగ్గులు గదే ముదిత నీ సింగారము 5. పొంచి నీవు చూచే చూపుల ముంగిటి ముగ్గులనే 6. ముంగిటి ముగ్గులాయ మునుకున్న సిగ్గులు 7. ముంగిటి నవ్వులు మంచి ముగ్గులోయమ్మా ముగ్గు ముందు ముత్యాలు జోడించిన 'ముత్యాల ముగ్గు' ప్రయోగం మనకు సుపరిచితమే. కానీ దీని అర్థం ఏమై ఉంటుందా అని నలుగురు తెలుగు పండితులను అడిగాను. నాలుగు ఆసక్తికర సమాధానాలు దొరికాయి. ఏది ఖచ్చితమైనదో తెలియదు.

1. ముత్యాలతో వేసిన ముగ్గు 2. ముత్యాల లాగా అందంగా ఉండే ముగ్గు. 3. తెల్లని పిండితో ముగ్గు వేసినప్పుడు మధ్యలో చుక్కలు ముత్యాల లాగా కనిపిస్తూ ఉంటాయి కాబట్టి ముత్యాలముగ్గు. 4. ముగ్గు వేయటానికి ఆల్ చిప్పల ( కాకి చిప్పలు అని కూడా అంటారు.) పొడిని వాడేవారు. ఆల్చిప్పలలో ముత్యాలు దొరుకుతాయి. ఆల్చిప్పల పొడి కూడా సున్నమే (కాల్షియం). ముత్యాలు లభించే చిప్పల పొడితో వేసే ముగ్గు. అన్నమయ్య కీర్తనల్లో 'ముత్యాలముగ్గు' అనే ప్రయోగం నాలుగు చోట్ల వాడబడింది. 1. మువ్వంక సాస ముత్యాలముగ్గులు వెట్టేను 2. మునుకొని ముంగిటను ముత్యాల ముగ్గులు వెట్టి 3. ముత్యపు ముగ్గులాయను మోహములెల్లా 4. చెక్కిట ముత్యాలముగ్గు చెలి నీ సిగ్గు ఏది ఏమైనా మనకి ముత్యాలముగ్గు అనే ప్రయోగం తప్ప వేరే ప్రయోగాలు తెలియవు. కానీ అన్నమయ్యను చదివితే 'కప్పురపు ముగ్గు', 'మాణిక్యముల ముగ్గు', 'కందువ ముగ్గు', 'వెన్నెల ముగ్గు' 'పంచవన్నె ముగ్గు' ' నవ్వుల ముగ్గు' వంటి మరి కొన్ని ఆసక్తికరమైన ప్రయోగాలు తెలుస్తాయి: 1. గాటపు నానగువలె కప్పురపు ముగ్గు 2. మొదల మాణిక్యముల ముగ్గులు వెట్టగ బోల 3. కడలేని మురిపేల కందువ ముగ్గులు వెట్టి 4. వేకపు వెన్నెల ముగ్గు వేడుక నా మోము నిగ్గు 5. బాయిట బెట్టెనంటే పంచవన్నె ముగ్గు గాదు 6. నలుగడ నెలవుల నవ్వుల ముగ్గు వెట్టవే అన్నమయ్య ముగ్గు ప్రయోగాలలో మనకు కనిపించే మరొక ఆసక్తికరమైన అంశం ముగ్గులు ఎక్కువగా 'నవ్వులు', 'సిగ్గులు'తో జత గూడి కనిపించటం.

1. పిక్కటిల్లు నవ్వులనే పెట్టే ముగ్గులు 2. ముగ్గుల నవ్వుల మురిసీ గాక 3. ముగ్గు వంటి నవ్వులు నా ముందర నీకేటికే 4. మొలక నవ్వులనే ముగ్గులు వెట్టుకున్నది. 5. మొనపి సిగ్గులను ముగ్గులు వెట్టి 6. మురిపెపు సిగ్గులనే ముగ్గులు నీకు బెట్టె 7. చెలి నీవు వచ్చేవంటా సిగ్గుల ముగ్గులు వెట్టి "నవ్వుల ముగ్గులు", "ముగ్గుల నవ్వులు" అనే రెండు ప్రయోగాలు కనిపించడం విశేషం. సిగ్గులు, నవ్వులు,ముగ్గులు మూడూ కూడా ఒకే పంక్తులో కనిపించడం కూడా విశేషమే.

"అయాలు దాకే సిగ్గులు అంటే నవ్వుల ముగ్గులు."

'నువ్వు ఎంత అందంగా ఉన్నావో" అని చెప్పే దానికి అన్నమయ్య "ముంగిట ముగ్గులు గదే ముదిత నీ

సింగారము" అనే రూపకాలంకార ప్రయోగం ద్వారా ముగ్గులు అందానికి ప్రతీకలని కూడా మనకు తెలియజేస్తున్నాడు. "ముగ్గు వెయ్యి"/ "ముగ్గు వేయి" అనే ప్రయోగం మనం ఎక్కువగా వాడతాము. కాని అన్నమయ్య పదాలలో "ముగ్గు వేయి" అనే ప్రయోగం ఒకసారి మాత్రమే కనిపిస్తుంది. మిగతా చోట్ల "ముగ్గు వెట్టి/ వెట్టె/ పెట్టే/", అనే ప్రయోగమే ఎక్కువగా కనిపిస్తుంది. ముగ్గుకు అప్పటి సంస్కృతిలో ఉన్న స్థానానికి, ప్రాధాన్యతకు నిదర్శనంగా మరికొన్ని ప్రయోగాలు ఉన్నాయి.

1. ముగ్గు పిండి అట్లకు మొదలయ్యీనా – ముగ్గు పిండి అట్లకు పనికి వస్తుందా అనే అర్థం. 2. ముగ్గు వంటిది వయసు మొరగి దాచరాదు – ముగ్గు యొక్క అశాశ్వత ఉనికిని వయసుతో పోల్చటం 3. ముసుగులు వెట్టితేను ముగ్గు వేయదా – ముగ్గులు వేయడంలో దిట్టయైన మహిళ ముసుగు వేసినా ముగ్గు వేయగలదు.

ఇలా అన్నమయ్య పదాలలో ముగ్గుల ప్రయోగాన్ని గమనిస్తే మనకు ప్రస్ఫుటంగా బహిర్గతమయ్యే విషయం ఒకటి: ఇప్పటికన్నా ఎంతో విస్తృత పరిధిలో అన్నమయ్యకాలంలో ముగ్గు అనే పదం వాడబడింది. 'ముగ్గు వంటిది వయస్సు, ముగ్గు పిండి ,అట్లకు పనికివస్తుందా?" లాంటి ప్రయోగాలతో పిటు, వెన్నెల ముగ్గులు, కందువ ముగ్గులు, మాణిక్యాల ముగ్గులు లాంటి ప్రయోగాలు కూడా అందుకు నిదర్శనం. జె. ఆర్. ఫర్త్ అనే ఆంగ్ల భాషావేత్త "యు షల్ నో అ వర్డ్ బై ద కంపెనీ ఇట్ కీప్స్" అంటాడు.అంటే ఒక పదాన్ని అర్థం చేసుకోవాలంటే ఆ పదం సరసన వాడబడిన పదాలను తెలుసుకోవాలి అని. అలా అన్నమయ్య పాటలలో ముగ్గు సరసన వాడబడిన పదాలను పరిశీలిస్తే " వెన్నెల, ముత్యాల, పగడాల, మాణిక్యాల, పంచ వన్నెల, కందువ, నవ్వుల, సిగ్గుల, శింగారము, ముంగిట, "శబ్దాలు కనిపిస్తాయి. ఇవన్నీ అందానికి, ఆనందానికి, సహజత్వానికి, అమూల్యమైన విలువకు చిహ్నాలు కావటం వలన, ముగ్గు కూడా వాటి సరసన అవే గుణాలకు ప్రతీకగా కనిపిస్తుంది. కాబట్టి అన్నమయ్య పద కవితలలో ముగ్గుల ప్రస్తావనను అధ్యయనం చేసిన తరువాత, ఒక్క వాక్యంలో ఈ అధ్యయనాన్ని కుదించమంటే ఇలా చెప్పుకోవచ్చు: "ముగ్గు వంటిది అన్నమయ్య పద కవితల శింగారము".

ఆచార్య పి. హరిపద్మరాణి
శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటి, తిరుపతి
ఫోన్ నెం. 8309153285

## కమ్మతెమ్మెరలు

**మిసిమి** మార్చ్ 2025 సంచికలో వేమూరి బలరామ్ గారి, **మిసిమి** అశ్విని కుమార్ గారి ఆసక్తికర పెద్ద సంభాషణ ఆద్యంతం చదివాను. వీరిరువురి భావోద్వేగపు ఇంటర్వ్యూ గురించి రెండు మాటలు రాయకుండా ఉండలేక పోతున్నాను. ఇద్దరూ పెద్దవారే. ఆ రోజుల్లో 'స్వాతి' వార పత్రికకు ఒక ప్రత్యేక స్థానముండేది. పాఠక దేవుళ్ళు వారం తిరక్కముందే కొత్త పత్రిక రాక కోసం పడిగాపులు కాసేవారు.'స్వాతి' పత్రికలో ఒక పేజీని ప్రత్యేకంగా సెక్స్ సమస్యల గురించి, వాటికిచ్చే సమాధానాల గురించి కేటాయించేవారు. కొందరు ఆ పేజీ కోసమే పత్రికను కొంటూ ఉండేవారు. అవును ఇది నిజం. బలరామ్ గారి ఫోటో చూస్తుంటే అలనాటి S.V. రంగారావు గారు గుర్తొస్తున్నారు."నవ్వు, ఏడుపు మిళితమైన స్వరంలో" అంటూ చెప్పిన వారి మాటలు మిసిమి పాఠకుల హృదయాలను కదిలించి వేశాయి. పాత రోజుల్లో విలువలకుండే ప్రాధ్యాన్యత విత్తానికి ఉండేదికాదు. బలరామ్ గారు "ఆ చప్పట్లే కదరా... ఆకలిగొన్న కళాకారుడికి పంచభక్ష్య పరమాన్నాలు" అని సగౌరవంగా చెప్పటం అక్షర సత్యం. నిజంగా, ప్రేక్షకుల చప్పట్లతోనే కదా కళాకారుల కడుపు నిండిపోయేది. ఆనంద బాష్పాలు రాలేది. 'అరేయ్' అనే చనువు వీరిద్దరి మధ్య ఉన్న స్నేహానుబంధాన్ని చెప్పకనే చెబుతుంది. ఈ రోజుల్లో ఏ కొద్ది మందో ఇలా ఇప్పటికీ ఉన్నారని చెప్పాలి. బలరామ్ గారు "అవును రాజా" అని పదే పదే అంటుంటే పోసాని గారు గుర్తొస్తున్నారు. "అశ్రు గంగ చిప్పిల్లింది" అన్నారు. చిప్పిల్లటమనే పద ప్రయోగం కొత్తగా అనిపించింది. దీని అర్థం ఏమిటో చెబుతారా? వ్యాపారానికి కస్టమర్లు దేవుళ్ళు ఎలాగవుతారో, పత్రికకు పాఠకులే దేవుళ్ళు కదా! వీరిరువురి సంభాషణలో మధ్య మధ్య బలరామ్ గారి కళ్ళు చెమర్చటం, గొంతు జీర పోవటం వారి సున్నిత మనస్తత్వానికి నిదర్శనం.



*- డా. షేక్ మొహమ్మద్, పి.హెచ్.డి., ఫోన్ : 9849334621*

# మాధవి

– డా. నల్లపనేని విజయలక్ష్మి

'యదిహాస్తితదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్' ఇందులో ఉన్నదే అంతటా ఉంది. ఇందులో లేనిది మరెక్కడా లేదు అని వ్యాసుడు స్వయంగా భారతం గురించి చెప్పిన ఈ మాటలను ఏ కోణంలో నుండి అయినా మనం చూడవచ్చు. ఎన్నో రకాల మనుషులు ఎన్నో రకాల ప్రవర్తనలు భారతంలోని పాత్రల రూపంలో మన ముందుకు నడిచి వస్తాయి. స్వార్థం, అసూయ, ద్వేషం, లోభం, అహంకారం– ఇలా మనుషులలో ఉండే అనేక దుర్గుణాలు ఎలాంటి ముసుగులు లేకుండానే కనిపిస్తాయి. వాటి మీద సాత్విక గుణాలు విజయం సాధించవలసిన అవసరం వర్ణించబడటం కనిపిస్తుంది. ఇది ఒక కోణం. అంటే మానవ మనస్తత్వాన్ని అధ్యయనం చేయటానికి కూడా ఇది మనకు ఆధార గ్రంథం.




సమాజం ఎలా మార్పు చెందుతూ వస్తున్నది? ఎన్ని రకాల మార్పులు కాలానుగుణంగా చోటు చేసుకున్నాయి? ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలలో, సంతానాన్ని పొందే విషయంలో వచ్చిన మార్పులు ఏమిటి? వావి వరుసలు పాటించని సంబంధాల నుండి ఈనాడు మనం పాటిస్తున్న వివాహ వ్యవస్థ వైపు పడిన అడుగులు, రకరకాల పద్ధతుల్లో సంతానాన్ని పొందిన విధం, వారికి గల పేర్లు, రకరకాల వివాహ పద్ధతులు (ఎక్కడో హిమాలయాల సమీపంలో ఉండే గిరిజన తెగలో గల వివాహ పద్ధతి ఇందులో ప్రధానంగా చిత్రించబడటం విశేషం) ఇందులో చిత్రించబడ్డాయి. ఇది మరో కోణం. అంటే మానవ మనస్తత్వానికి, మానవ సమాజానికి సంబంధించి భారతంలో ఉన్నదే అంతటా ఉన్నది ఇందులో లేనిది మరెక్కడా లేదు. అందువల్లనే భారతం ఆనాటి నుండి ఈనాటి వరకు ఎంతో మంది రచయితలను, సామాజిక శాస్త్రవేత్తలను, మనస్తత్వ పరిశీలకులను ఆకర్షిస్తూనే ఉంది. ముఖ్యంగా ఇరావతి కర్వే అనే సామాజిక శాస్త్రవేత్త భారతంలోని పాత్రలను, అందులోని ముఖ్యమైన విశేషాలను వివరిస్తూ రాసిన 'యుగాంత' అనేకమంది రచయితల మీద ఎంతో ప్రభావం చూపింది. ఈ ప్రభావం తెలుగు రచయితల మీద కంటే కన్నడ రచయితల మీద చాలా ఎక్కువ కనిపిస్తుంది. ఎస్.ఎల్. భైరప్ప 'పర్వ', అనుపమ నిరంజన 'మాధవి' 70వ దశకంలో వెలువడిన రచనలు. ఇప్పటికీ మహాభారత పాత్రలను వారి కథలను పునర్మూల్యాంకనం చేస్తూ అనేక రచనలు కన్నడంలో వస్తున్నాయి. తెలుగులోకి అనువదించబడుతున్నాయి.

'మాధవి' నవలను ప్రముఖ కన్నడ రచయిత్రి అనుపమ నిరంజన రచించారు. మహాభారతంలో వచ్చే ఒక ఉప కథను తీసుకొని ఆ కాలంనాటి సమాజపు నీతి నియమాలను మన కళ్ళ ముందు ఉంచటానికి ఆ నీతి నియమాల ఒరవడిలో పీడనకు గురైన స్త్రీల పరిస్థితిని/దుస్థితిని తెలియజెప్పడానికి అనుపమ ఈ నవలను రచించారు. ఎటువంటి మానవాతీత అంశాలను, అద్భుతాలను చిత్రించకుండా ఒక స్త్రీ కోణం నుంచి కథను చెప్పారు.

38 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఉన్నత విద్యారంగంలో బోధకురాలిగా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన కళ్యాణి నీలారంభం 'మాధవి' నవలను తెలుగులోనికి అనువదించారు. కన్నడం నుండి త్రివేణి రచించిన 'పునర్జన్మ', 'సంఘర్షణ', 'చిగురు' నవలలు బి.యు. గీత రచించిన 'మిథ్య' నవలను కూడా వీరు అనువదించారు. దాదాపు పదిహేను కథల వరకు వీరు అనువదించారు.

భారతంలో కనిపించే అనేక స్త్రీ పాత్రలలో మాధవి పాత్ర ప్రత్యేకమైనది. మహాభారతంలోని ముఖ్య కథలో కనిపించే స్త్రీపాత్ర లందరికీ ఆమె పూర్వ్వరాలు. ఎందుకంటే యయాతి కురువంశపు మూలపురుషుడు.

అతడికి భీష్ముడికి మధ్య ఆరు తరాల అంతరం ఉంది. యయాతి కూతురు మాధవి కనుక ఆమె కథ మహాభారతంలో వర్ణించబడిన మూల కథకు చాలా ముందు కాలంలో నడిచిందని తెలుస్తుంది. దాదాపు మూడు శతాబ్దాల ముందు. భారతంలోని ఉద్యోగపర్వంలో 'గాలవోపాఖ్యానం' కనిపిస్తుంది. గాలవుడు విశ్వామిత్రుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. తన విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత విశ్వామిత్రునికి గురుదక్షిణ చెల్లించాలనుకున్నాడు. తనకే గురుదక్షిణా వద్దని విశ్వామిత్రుడు చెప్పినా వినకుండా మొండిపట్టు పట్టాడు గాలవుడు. అందుకు కోపించిన విశ్వామిత్రుడు శరీరమంతా తెల్లగాను ఒక చెవి మాత్రం నల్లగా ఉంటే 800 గుర్రాలను గురుదక్షిణగా ఇవ్వమన్నాడు. ఆ విషయంలో యయాతి సహాయాన్ని అర్థించాడు గాలవుడు. అటువంటి గుర్రాలు ఉంటే ఇవ్వమని లేకుంటే అలాంటి గుర్రాలను కొనటానికి కావలసిన ధన కనక సహాయమైనా చేయమని అడిగాడు. అటువంటి గుర్రాలు యయాతి వద్ద లేవు. ధన కనకాలు అందరు రాజుల వద్ద ఉండేవే కాబట్టి వాటిని తీసుకొని రాజులు గుర్రాలనిస్తారనే నమ్మకం లేదు. ఏదైనా లోకోత్తరమైన వస్తువు అయితేనే వారు గుర్రాలను ఇస్తారు. కాబట్టి యయాతికి గుర్తుకొచ్చింది లోకోత్తరమైన వస్తువుగా అద్భుత సౌందర్యరాశి అయిన కుమార్తె మాధవి. ఆమెను ఒక వస్తువుగా భావించాడు కనుకనే యయాతి మాధవిని దానం చేసే విషయంలో ఆమె అభిప్రాయాన్ని అడగలేదు. ఏమాత్రం ప్రేమాస్పదురాలు కాలేకపోయిన మాధవిని వదిలించుకోవటం, కూతుర్నే దానం చేసిన దానశూరుడు అనే పొగడ్తలు పొందటం అనే రెండు లాభాలు అతడికి కనిపించాయి. మాధవిని గాలవునికి దానం చేసి ఆమెను ఎవరైనా మహారాజుకు ఇచ్చి అతడికి కావలసిన అశ్వాలను కన్యాశుల్క రూపంలో సంపాదించుకొమ్మని చెప్పాడు.

ఒక స్త్రీని ఆమె ఇష్టానిష్టాలతో పని లేకుండా ఆ విధంగా ఉపయోగించుకోవటం తప్పని గాలవునికి అనిపించలేదు. అతడిది కేవల స్వార్థం. తాను ఎలాగైనా విశ్వామిత్రునికి గురుదక్షిణ సమర్పించి విముక్తుడు కావటమే అతడి లక్ష్యం. అందువల్ల మాధవిని దానంగా గ్రహించాడు. యయాతి ఎవరైనా మహారాజుకు ఆమెని ఇచ్చి కన్యాశుల్కంగా కావలసిన గుర్రాలను పొందమని మాత్రమే చెప్పాడు. గాలవుడు మరింత ముందుకు వెళ్లి ఒక రాజు వద్ద తనకు కావలసిన గుర్రాలు లభించకపోతే ఆమెను ముగ్గురు రాజులకు అప్పగించాడు. ఒక్కొక్క సంవత్సరం పాటు హర్యశ్వుడికి, దివోదాసుకు, ఉశీనరుడికి అప్పగించి ఒక్కొక్కరి నుండి 200 చొప్పున 600 గుర్రాలను మాత్రమే సంపాదించగలిగాడు. చివరికి తాను సమర్పించలేక పోయిన రెండు వందల గుర్రాలకు బదులుగా ఒక సంవత్సరం పాటు మాధవిని విశ్వామిత్రునికి అప్పగించాడు. తనకు కావలసిన గుర్రాలను సంపాదించటం కోసం, విశ్వామిత్రునికి గురుదక్షిణ చెల్లించటం కోసం గాలవుడు మాధవిని ఒక వస్తువు వలె ఉపయోగించుకున్నాడు. తన కోరిక తీరగానే ఆ వస్తువును తీసుకొని వెళ్లి తిరిగి యయాతి మహారాజుకు అప్పగించాడు. ఈ క్రమంలో మాధవి ఎటువంటి బాధను అనుభవించి ఉంటుంది? మనసుతో సంబంధం లేకుండా ఒక స్త్రీ తనకంటే వయసులో ఎంతో పెద్దవారైనా పురుషులతో గడపవలసి రావటం ఎంత దుర్భరంగా ఉంటుంది? బిడ్డలు పుట్టగానే ఆ బిడ్డలను వదిలిపెట్టి వెళ్ళిపోవలసి రావటం స్త్రీలోని మాతృ హృదయాన్ని ఎంతగా గాయపరుస్తుంది? ఇంత వేదన, బాధ అనుభవించిన స్త్రీ తిరిగి మనసును కూడదీసుకో గలుగుతుందా?- ఇన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పకనే చెప్పారు అనుపమ 'మాధవి' నవలలో.

తండ్రి మాటను జవదాటకుండా పదునాలుగేళ్ళు అరణ్యవాసం చేసిన రాముడిని దేవుడిగా ఆరాధించిన మనం, తండ్రి మాటను నిలబెట్టటం కోసం తన జీవితాన్ని బలి చేసుకొన్న మాధవిని ఒక్కసారి కూడా తలచుకోలేదు. మరల మరల రామకథను పాడుకున్న మనం మాధవి కథను ఆర్ద్ర దృష్టితో చూడనే లేదు. తెలుగులో ఇద్దరు రచయితలు మాత్రమే మాధవి కథను స్పృశించారు. అనుపమ 'మాధవి' నవలను 1976లో రాస్తే తెలుగులో 1999లో బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె గారు 'విషాద మాధవి' దీర్ఘకావ్యం రాశారు. ఆ తరువాత తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి గారు 'మాధవి' నాటకం రాశారు. వీరిరువురు అనుపమ 'మాధవి' ని చూసి ఉండే అవకాశం ఉంది.

బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె మాధవి వేదన పట్ల గొప్ప సహానుభూతిని చూపగలిగాడు.

**ఎక్కడి భూతలేశ్వరులు**
**నెక్కడి మౌనిశిఖావతంసు లిం**
**కెక్కడి ధర్మశాస్త్రములు**
**నెక్కడి సజ్జన సంప్రదాయముల్**
**చిక్కిన చాలు నొక్క సర**
**సీరుహలోచన, సర్వధర్మముల్**
**గ్రక్కున ద్రోచి యెమ్ములకు**
*గ్రమ్మెడు కుక్కలు గారె యెల్లరున్ (విషాద మాధవి-77)*
**ఏ కులంబైన నెవ్వరి యింతియైన**
**పుత్రవతి యైన వావి సభోగ్యయైన**
**తిరిపముగ వచ్చు నాడుది దొరకెనేని**
**బమ్మకైనను బుట్టును రిమ్మతెగులు**

*(విషాద మాధవి-80)* అంటూ బాలసుబ్రహ్మణ్యం స్త్రీల విషయంలో పురుషుల ప్రవర్తన ఎంత హీనంగా ఉంటుందో మాధవి నోట పలికించాడు. 800 గుర్రాలకు బదులుగా ఈమెను స్వీకరించండి అని ముందే నా వద్దకు తెచ్చి ఉంటే బాగుండేది! నేనే ఈమెను అనుభవించి నలుగురు శ్రేష్ఠులైన కుమారులను పొంది ఉండేవాడిని అన్న విశ్వామిత్రుడిని, శుల్కంతో స్త్రీకి వెల కట్టిన రాజులను యెమ్ములకు గ్రమ్మెడు కుక్కలుగా చిత్రించాడు.

**ఏ కుమారుడు నా యెద్దకేల వచ్చు**
**తలపవాడును మగవాడె తప్పు లేదు**
**తండ్రిచే వచ్చు నాభిజాత్యంబు గలుగ**
**తల్లి ప్రేమకై వాడేల తల్లడిల్లు**
*(విషాద మాధవి-93)*

నలుగురు పుత్రులను కని నాలుగు రాజవంశాలను నిలిపిన తల్లి ఒక్క బిడ్డైనా తనను తలచుకోలేదని ఎంతగా తల్లడిల్లి ఉంటుందో వర్ణించాడు. పతంజలి శాస్త్రి మాత్రం 'మాధవి' నాటకంలో తాను చెల్లించవలసిన గురుదక్షిణ నిమిత్తం మాధవిని వెలయాలిని చేసిన గాలవుని మాధవి ప్రేమించినట్టుగా చూపాడు. కేవలం తన పట్ల మిగిలిన వారివలె కాముకదృష్టిని ప్రదర్శించనందుకే తన జీవితాన్ని నరకప్రాయం చేసిన పురుషుని ఏ స్త్రీ అయినా ప్రేమించగలదా? తన స్వార్థం తప్ప మరొకటి ఎరుగని గాలవుని ప్రేమించి, అతడిని ఋణవిముక్తుని చేయటం కోసం మాధవి స్వయంగా విశ్వామిత్రుని వద్దకు వెళ్లి అతడితో కాపురం చేసిందని శాస్త్రి కథను మార్చాడు. మాధవి వేదన పట్ల ఆయనకు సానుభూతి ఉన్నట్టుగా కనిపించదు. గాలవుడి పాత్రను ఉదాత్తీకరించి, మాధవిని సైతం తిరస్కరించినవాడిగా అతడిని నిలపడానికి ఆయన ప్రయత్నించారు. అయితే ఒక స్త్రీగా మాధవి పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసి పురుషస్వామ్య ప్రపంచం చేతిలో మాధవి ఏ విధంగా పీడనకు గురయిందో అనుపమ వివరించగలిగింది.

నలుగురు పేరు వేరు వ్యక్తులతో కాపురం చేసి వారికి బిడ్డలు కనిచ్చే క్రమంలో మాధవి అనుభవించిన శారీరక మానసిక హింసను విపులంగా వర్ణించింది అనుపమ 'మాధవి' నవలలో. అయోధ్య రాజైన హర్యశ్వుడికి మాధవిని అప్పగించాడు గాలవుడు. తన తండ్రి వయసు వాడైనా హర్యశ్వుడితో జీవితాన్ని పంచుకోవడం ఇష్టం లేకపోయినా సర్దుకుపోయింది మాధవి. తన శేష జీవితం అక్కడే గడుస్తుంది అని భావించింది. తనకు ఒక బిడ్డ కలగగానే మళ్లీ గాలవుడు వచ్చి తనను తీసుకువెళ్లి మరొక రాజుకు అప్పగిస్తాడని తెలియగానే స్తంభించిపోయింది. బిడ్డను వదిలిపెట్టి వెళ్ళలేక రోదించింది. రెండవసారి కాశీ రాజైన దివోదాసుకు మాధవిని అప్పగించాడు గాలవుడు. అది ఒక సంవత్సరం పాటు మాత్రమే ఉండే బంధం అని ముందే తెలియటం, తన ఇష్టానిష్టాలతో పని లేకుండా తాను ఒక వస్తువుగా బేరసారాలకు గురవుతున్నదన్న దుఃఖం కలిసి వివశను చేయడం వల్ల ఆమె స్తబ్దంగా ఉండిపోయింది. మూడవసారి భోజరాజైన ఉశీనరుడికి మాధవిని అప్పగించాడు గాలవుడు. అక్కడ తామరాకు మీద నీటి బొట్టులాగే ఉండిపోయింది మాధవి. ఉశీనరుడు యుద్ధానికి వెళ్లి జయించడం, ఓడిపోయిన రాజు తన కుమార్తెను ఉశీనరుడికి ఇచ్చి వివాహం జరిపించడం తదితర కారణాలతో ఉశీనరుడు చాలా కాలం మాధవికి దూరంగానే ఉండిపోయాడు. గర్భవతి అయిన మాధవి మహారాణి ద్వేషానికి, రాజు గారి కొత్త భార్య ద్వేషానికి గురై ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. అది విఫలమైంది. మూడవ బిడ్డ పుట్టాడు. మళ్లీ వచ్చిన గాలవుడు మరెక్కడా తనకు కావలసిన గుర్రాలు దొరకకపోవడంతో మిగిలిన రెండు వందల గుర్రాలకు బదులుగా మాధవిని విశ్వామిత్రుడికి అప్పగించాడు. ఒక సంవత్సరం పాటు విశ్వామిత్రునితో కాపురం చేసి మరొక బిడ్డకు తల్లయింది

మాధవి. అప్పటికి గురుదక్షిణ భారాన్ని దించుకున్న గాలవుడు మాధవిని తీసుకొని వెళ్లి యయాతికి అప్పగించాడు. ఆశ, నిరాశ, నిర్లిప్తత, నిరాసక్తత, కుంగుబాటు, తుదకు సర్వ బంధాల పరిత్యాగం – ఇలా మాధవి మనసు అనుభవించిన సర్వ ఉద్వేగాలను ఒక క్రమ పరిణామంతో పాఠకుల ముందు నిలిపింది అనుపమ. స్త్రీని సంపదగా మాత్రమే చూసినపుడు, వినిమయ వస్తువుగానే చూసినపుడు ఏమి జరుగుతుందో మాధవి పాత్రను చూసినపుడు అర్థమౌతుంది. రాజులు రాజ్యవిస్తరణలో భాగంగానో, కేవలం కాముకత్వంతోనో అనేకమందిని పెళ్ళాడినా అందరూ భార్యల పట్ల, వారి బిడ్డల పట్ల సమానంగా ప్రేమను చూపటం సాధ్యం కాదు. యయాతికి ఎంతోమంది భార్యలు. దేవయాని, శర్మిష్ఠల గురించి అందరికీ తెలుసు. వారికి పుత్రులు మాత్రమే ఉన్నట్టుగా భారతంలో వర్ణించబడింది. కాబట్టి మాధవి మరొక భార్య కుమార్తె అని తెలుస్తుంది.

ఏ తండ్రైనా యయాతి చేసిన విధంగా తన ప్రియ కుమార్తెను దానం చేయగలడా? ఏ సందర్భం, ఏ పరిస్థితి అతడిని ఆ విధంగా చేయడానికి పురిగొల్పి ఉంటాయి? అన్న ఆలోచన రచయిత్రిని కదిలించి ఉంటుంది. అందుకే అనుపమ మాధవిని పుడుతూనే తల్లిని పోగొట్టుకున్న అభాగ్యురాలిగా చిత్రించింది. తల్లిని పొట్టన బెట్టుకుందన్న కోపంతో యయాతి ఆమెను ఎప్పుడూ దగ్గరకు తీయలేదని చెప్పటం ద్వారా తండ్రీ బిడ్డల మధ్య ఏర్పడాల్సిన ప్రేమానుబంధం ఏర్పడకపోవటానికి కారణం ఏర్పరచింది. రాజభోగాలలో ఉన్నా, దాసి (అవ్వ) చేతులలో పెరిగిన మాధవిని ప్రేమ రాహిత్యం ఎలా బాధించిందో వర్ణించటం ద్వారా మాధవి హృదయం తనను ప్రేమించే భర్తను ఎంతగా కోరుకుంటుందో సూచించింది. తనకు కాబోయే భర్త వీరుడూ, ఉదారుడూ, ధర్మపరుడూ, వినయశీలీ అయి ఉండటంతో పాటు ఏకపత్నీవ్రతుడై ఉండాలనీ, తనను తప్ప మరొక స్త్రీని కన్నెత్తి చూడకూడదని మాధవి కోరుకున్నదని చెప్పటం ద్వారా ప్రతి స్త్రీ భర్త విషయంలో ఎటువంటి ఆశలు, కోరికలు కలిగి ఉంటుందో తెలియజెప్పింది.

ఈ విధంగా కథను ప్రారంభించటం వల్ల భారతంలో చెప్పబడినట్లుగా మాధవి సంతోషంగా గాలవుని వెంట వెళ్ళటానికి అవకాశమే లేదని, తనను ఆయా రాజులకు సమర్పించి కావలసిన గుర్రాలను పొందమని మాధవి గాలవుని ప్రోత్సహించినట్టుగా చెప్పటం స్త్రీ మనస్సును అర్థం చేసుకోలేని పురుష రచయితలు వారి ఆలోచనలను స్త్రీ పాత్రల మీద రుద్దటమే నని అర్థమౌతుంది.

పుట్టినింట మాధవి ప్రేమను పొందలేదు. కాపురం చేసిన నలుగురు వ్యక్తులతో ఆమెకు మానసికమైన సాన్నిహిత్యం కాని, ప్రేమ కాని లభించలేదు. వారు ఆమెను భోగవస్తువుగానే చూశారు. నలుగురు బిడ్డలకు తల్లైనా ఏ ఒక్క బిడ్డ ఆలనాపాలనా చూసే అవకాశం కానీ, వారి ప్రేమను పొందే అవకాశం కానీ ఆమెకు లభించలేదు. అందుకే తిరిగి వచ్చిన తరువాత యయాతి ఆమెకు స్వయంవరం ఏర్పాటు చేసినపుడు ఎవరినీ వరించటానికి ఇష్టపడలేదు. తపస్వినిగా శేషజీవితం గడపాలని నిర్ణయించుకున్నది. మరొకసారి భోగవస్తువుగా మారే ప్రమాదాన్ని తప్పించుకొని ఆత్మవిశ్వాసంతో జీవితగమ్యాన్ని నిర్దేశించుకొన్నది.

హేతుబద్ధత లేని విషయాలను అనుపమ నవలల్లో ప్రస్తావించడానికి ఇష్టపడలేదు. పుత్రకామేష్టి సమయంలో ఏ దేవతా పురుషుడు పాయసపు గిన్నెతో అగ్నిలోంచి ఉద్భవించడు. అది ప్రజల భ్రమ కావచ్చు లేదా మునులు సామాన్య జనుల్లో గౌరవం, భయం కలగాలని సృష్టించిన తంత్రమైనా కావచ్చు అని వ్యాఖ్యానించిన అనుపమ దానికి తగినట్టుగానే పుత్రకామేష్టి యాగం జరిగిన తీరును వర్ణించారు. పుత్ర కామేష్టి యాగం జరిపించిన భారద్వాజుల వారు యజ్ఞం నుంచి గొప్ప కాంతిగల పురుషుడు (దేవత) ఉద్భవించాడు చూడమని చెప్పినప్పుడు దివోదాసుకు అక్కడ ఎవరు కనిపించలేదు. దేవతలు గొప్పవారి కళ్ళకే కనిపిస్తారని విని వున్న దివోదాసుకు తనకు దేవత కనిపించలేదని అందరి ముందు చెప్పడానికి మనసు అంగీకరించలేదు. అది తన గొప్పతనాన్ని తగ్గించుకోవడం కాబట్టి అతడు ఆ పురుషాకృతిని దర్శించినట్టుగానే ప్రవర్తించాడు. దేవతలు ఆశీర్వదించి ఇచ్చిన పాయసం మూడు వంతులు తాగిన సత్యవతి గర్భవతి కాలేదు. పాయసం ఒక్క చుక్క కూడా దక్కని మాధవి గర్భవతి అయింది అని వర్ణించడం ద్వారా మూఢనమ్మకాలకు బలాన్ని చేకూర్చే అంశాలను అనుపమ

కథ నుండి తొలగించారు. అదేవిధంగా ఒక ఋషి మాధవికి ఆమె ఎన్నిసార్లు ప్రసవించినా ప్రసవం జరిగిన కొన్ని రోజుల్లోనే కన్యాత్వాన్ని పొందుతుందని వరం ఇచ్చినట్లుగా మూలంలో చెప్పబడిన విషయాన్ని కూడా పరిహరించారు. ప్రసవం స్త్రీకి పునర్జన్మతో సమానం. స్త్రీ శరీరం ఆ సమయంలో ఎన్నో మార్పులకు గురవుతుంది. మళ్లీ యథాతథస్థితికి రావడం అనేది అసంభవమైన విషయం. కనుక ఈ వరాన్ని గురించిన ప్రస్తావన ప్రక్షిప్తమై ఉంటుందని, మాధవికి అన్యాయం జరగలేదనే అభిప్రాయం కలిగించడం కోసం ఈ ప్రస్తావనను కల్పించారని రచయిత్రి భావించడం వల్ల దానిని విడిచిపెట్టారు. పాతివ్రత్యానికి కన్యాత్వానికి ఎప్పటికప్పుడు తమ స్వార్థానికి అనుగుణంగా పురుషస్వామ్య ప్రపంచం ఎలా నిర్వచనాలు మార్చుకుంటూ వచ్చిందో తెలియజెప్పే కథలు భారతంలో అనేకం కానవస్తాయి. అన్నదమ్ముల్లో ఐకమత్యాన్ని నిలపడం కోసం ఐదుగురు భర్తల్ని కట్టబెట్టి (ఆమె ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా) పంచ కన్యలలో ఒకరిగా ద్రౌపదిని కొనియాడిన సమాజం, ఇంటికి వచ్చిన అతిథులను అన్ని విధాలా సంతోషపెట్టటమే పాతివ్రత్యమని చెప్పి ఓఘవతిని ఒప్పించిన సమాజం, రాజవంశాలను నిలుపుకోవటం కోసం నియోగ పద్ధతిని ప్రోత్సహించిన సమాజం స్త్రీని తరతరాలుగా మనసుతో పని లేని వస్తువుగానో, బిడ్డల్ని పండించే క్షేత్రంగానో చూడటం గమనించవచ్చు. అయితే భారతంలో కనిపించే మిగిలిన స్త్రీ పాత్రలందరికీ ముందు తరం స్త్రీ అయిన మాధవి అనుభవించిన కష్టం, వేదన ఎన్నో రెట్లు ఎక్కువ. అయినా ఏ ఒక్కరి సానుభూతికి నోచుకోకపోవటం విచిత్రం. పురుషుల చేతిలో ఒక వినిమయ వస్తువుగా మారిన మాధవి దృఢచిత్తంతో తన భావి జీవితాన్ని నిర్ణయించుకున్న తీరు హిమాలయ శిఖరమంత ఉన్నత వ్యక్తిత్వాన్ని మన ముందు నిలుపుతుంది. అనుపమ ఆ ఉపేక్షిత పాత్ర జీవితంలోని చీకటి మీద వెలుగును ప్రసరించి ఉండకపోతే ఈ మాత్రం ఆర్ద్రదృష్టితో ఎవరూ అవలోకించకుండానే ఆ పాత్ర కాలగర్భంలో కలిసిపోయి ఉండేది.

డా. నల్లపనేని విజయలక్ష్మి
ఫోన్ : 9701667350

## బాపు బొమ్మలు






ప్రతులకు : మిసిమి కార్యాలయం,
ఫోన్ : 9949516567

# భాషల యుద్ధం - భావాల దారిద్ర్యం

– డా. గుజ్జు చెన్నారెడ్డి

ప్రాణులు తమ భావాలను సరళమైన ఉచ్చారణ ద్వారా వ్యక్తపరచడానికి ఉపయోగించే సాధనమే భాష. జంతువు నుండి విడివడిన మనిషి నాగరికతవైపు నడుస్తూ అప్పటివరకు గందరగోళంగా ఉన్న అరుపులలో భాష ఉందని గ్రహించి, కేకలనే భాషగా మలుచుకున్నాడు. మరి జంతువులకు, పక్షులకు భాష ఉందా అంటే ఉందోలేదో తెలియదుకాని, లేదనడానికి వీలులేదు. జంతువులు, పక్షులు అరుస్తున్నాయి అని మనం అనుకుంటే మనుషులు పొద్దస్తమానం అరుస్తూనే ఉన్నారని అని అనుకోవడంలేదని మనం అనుకోలేం. మనిషి మొదట మాతృభాషలోనే అరుస్తాడు లేదా ఉచ్చరిస్తాడు. తన అరుపులో భాష ఉందని వినికిడి ద్వారా మెల్లగా గ్రహిస్తాడు. వినికిడి లేని వారికి మాటరాదు.

భాషను కనిపెట్టి మాట్లాడడం నేర్చుకున్న అనేక సంవత్సరాల తరువాత తమ భావాలను, విశేషాలను భావితరాలకు అందజేయాలని భాషకు లిపి కనిపెట్టాడు మనిషి. అది ఒకరిద్దరి సాధనాఫలితం కాదు. భాష మాట్లాడడం పెద్ద పాండిత్యం కాదుగాని, లిపి కనిపెట్టడం పాండిత్యమే. అలా ఒకప్పుడు రాళ్ళు, రప్పలమీద రాసిన రాతలే నేడు చరిత్రకు ఆధారాలైనాయి. వాళ్ళు అప్పుడు ఏమిరాసి ఉన్నా అది మనకు చరిత్రే. అయితే అప్పుడు అందరూ మంచివారేనట, నిజం రాసి ఉంటారు. సరే వారి రాతలన్నీ మనం చదివేసామా అంటే అదీలేదు. రెండువేల సంవత్సరాల క్రితం సింధులోయ నాగరికతను తెలియజేస్తూ అప్పుడు సింధుప్రజలు రాసుకున్న లిపిని చదవగలిగిన పండితుడు ఇంకా పుట్టలేదు. పుడతాడో లేదో తెలీదు! ఒక ప్రాంతానికి ఒక భాష లేదా దేశానికి ఒకభాష ఉంటాయి. అలాగే ఒక తెగకు లేదా ఒక కులానికి ఒకభాష ఉంటుంది. ఏభాష ఉపయోగించినా అదృష్టవశాత్తు ఒకేభావం వస్తుంది. మనుషులు యుద్ధాలు చేసినట్లు భాషలు కూడా ఘర్షణలు పడుతుంటాయి. రెండు వేరువేరు మాతృభాషలు మాట్లాడుకునేవారు పెళ్ళిచేసుకున్నా బిడ్డలు మొదటిగ నేర్చుకునేది తల్లిభాషే. మాతృభాషే ఉందిగాని, పితృలోకానికి అక్కడ నిరాశే. ఆ నిరాశ జాతిపిత దగ్గర తీరినట్లుంది. అప్పుడు సీతారాములు, పార్వతీ పరమేశ్వరులు, వారి సతులపేర్లు ముందు ఉపయోగించి గౌరవిస్తే అందుకు ప్రతిగా నేడు కొందరు సతులు భర్తపేర్లు తమపేర్ల చివరవాడి గౌరవిస్తున్నారు.

ప్రాంతీయభాష, జాతీయభాష, అంతర్జాతీయభాషగా భాషలు వాటి ఉనికి కోసం ప్రాకులాడాయి. వందల సంవత్సరాల క్రితం లాటిన్, ఇటాలియన్, ఆంగ్లభాషలు వాటి వ్యాప్తికోసం ప్రాకులాడాయి. భాషావ్యాప్తికి వలస వాదానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. వ్యాపార, ఇతర అవసరాల కోసం ఒకభాష ఒకరు తెలుసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఇతర ఐరోపాదేశస్తులను అధిగమించి అంగ్లేయుల వ్యాపారాలు కొనసాగిస్తూ దేశాలనే స్వంతం చేసుకున్నారు. వారిభాష ఆయా దేశస్తులు నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి ఆంగ్లభాష అగ్రతాంబూలం అందుకుంది. భారతదేశంలో ఆంగ్లేయులు వారి భాషనే కాకుండా వారి విద్యావిధానాన్ని ప్రవేశపెట్టారు. అది ఎంతగా వేళ్ళూనుకుందంటే ప్రస్తుతం భారతీయులు తమకు ఒక విద్యావిధానం ఉందని తెలుసుకోలేనంతగా. మనకు మాతృభాషలు, ప్రాంతీయభాషలు, ఉపప్రాంతీయ భాషలు, తెగలభాషలు, కులాల భాషలు ఉన్నాయి. ఈ భాషల మధ్య గొడవలు చూసి మనకి జాతీయభాషంటూ లేదని కోర్టు తేల్చిచెప్పింది.

ఒకేభాష ఎక్కువమంది, ఎక్కువ విస్తీర్ణంలో మాట్లాడితే మాండలీకాలు ఏర్పడతాయి. హిందీభాషలో అనేక మాండలీకాలు ఉన్న దేవనాగరలిపిలో ఉన్న హిందీయే సరైనదని పండితులు చెప్పారు. ఇక మన తెలుగుభాషకు వస్తే పాత కృష్ణాజిల్లాలో పట్టణ ప్రాంతాలలోని ప్రజలు మాట్లాడేది సరైన తెలుగుగా భావిస్తారు. ఇక్కడ

అభిప్రాయాల ఘర్షణ ఉంది. అన్నిరంగాలలో ఎంతో ముందుకు మానవుడు పోయాడు అంటారు. మరి వేలమంది మాట్లాడే లంబాడి భాషకు ఎందుకు లిపి కనిపెట్టలేకపోయాడో తెలీదు. ప్రపంచంలో ఎక్కువమంది పేదలు, నిరక్షరాస్యులు భారతదేశంలో ఉన్నారని ప్రపంచ సంస్థలు గుర్తించాయి కాని ఎక్కువమంది అమాయకులు ఉన్నారని ఇంకా గుర్తించలేదు. మనదేశ సంపదలో నలభైశాతం ఒకశాతం మంది ప్రజలచేతిలో ఉంటే చివరన ఉన్న ఏభైశాతం మంది చేతిలో మూడుశాతమే ఉందని గణాంకాలు తెలియజేస్తున్నాయి. భారతరాజ్యాంగ పీఠికలో ఆర్థిక న్యాయం జరగాలని రాసి ఉందని కనీసం వందకోట్లకు పైగా భారతీయులకు తెలియకపోవడం అమాయకత్వం కాక మరి ఏమౌతుంది? ఇది ఇక్కడ అప్రస్తుతం అయినా, భాషల వ్యాప్తి అక్షరాస్యతలో కూడా ఇలాంటి వెనుకబాటుతనం ఉందని నా అభిప్రాయం. తెలుగురాష్ట్రాల్లో ఆదిమతెగలు, గిరిజనులు ఉపయోగించే అనేక భాషలకు లిపిలేదు. చంద్రునిపైన విల్లాలు కట్టేస్తాం అని జబ్బలు చరిచేవారున్నారు. చాట్ జీ.పీ.టీ.ని సృష్టించినవారు ఉన్నారు. జ్ఞానానికి ప్రతిరూపంగా భావించే కృత్రిమమేధ ఉపయోగించేవారు ఉన్నారు. అవన్నీ ప్రపంచ పేదరికాన్ని ఒకశాతమైనా తగ్గించకపోతే ప్రయోజనం ఏముంటుంది? అంతటి జ్ఞానం మనుషులు మాట్లాడుకునే భాషలకు లిపి పెట్టకపోతే ప్రయోజనం ఏముంటుంది? ఒకభాషకు చాన్నాల్లు లిపి లేకపోతే అది మృతభాషల జాబితాలో చేరిపోదూ? ఒకభాష చనిపోయిందంటే అది నాగరికమా?

బడిలో పిల్లలకు ఆ భాషే నేర్పించాలని, లేదు ఈ భాషే నేర్పించాలన్న ఘర్షణలు ఉన్నాయి. ప్రపంచీకరణ అయిపోయింది, వెనక్కి రావడం సరికాదు, ఈభాషే నేర్పించాలని కొందరూ, తల్లిభాష కళ్ళులాంటిది, పరభాష కళ్ళద్దాలు లాంటిది అనేవారు మరికొందరు. కంటిచూపు తగ్గినవారు కళ్ళద్దాలు లేకపోతే చదవలేరు. అసలు కళ్ళే లేకపోతే చదువేలేదు. భాషా పాలసీల మధ్య భాషలు ఏమౌతున్నాయో తెలియదుగాని పిల్లలు నలిగిపోతున్నారు. అతను గద్దెక్కితే ఒక పాలసీ, ఇతను గద్దె ఎక్కితే ఇంకోపాలసీ. గద్దెనెక్కిన వారేమైనా భాషాపండితులా? ఉపాధ్యాయులా? ఆచార్యులా? ఏభాష ఎక్కడివరకు, ఎంతవరకు అవసరం అని చెప్పగలిగినవాళ్ళు ఆప్రాంత భాషాశాస్త్రజ్ఞులు. మన ఇంజనీర్లు ప్రాజెక్టు సరిగా కట్టలేకపోతున్నారని విదేశీ నిపుణులను తీసుకొస్తున్నారు. మరి పాలకుల్లో నాణ్యత ఎంత? అమాయకప్రజలు నాణ్యమైన పాలకులను ఎప్పుడు ఎక్కడనుండి ప్రజలు తీసుకొస్తారో వేచి చూడాల్సిందే.

- డా॥ గుజ్జు చెన్నారెడ్డి
ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
ఫోన్ : 9849254826

## కమ్మతెమ్మెరలు

ఈసారి మార్చినెల **మిసిమి** ఎలాంటి జాప్యంలేకుండా అందుకున్నాను. పరీక్షముందు అమ్మణి ముఖచిత్రం,పేజీ తిప్పగానే నేను నేనే అనే ముద్దగుమ్మ చిత్రం ఆకట్టుకుంది. వెంటనే చివరి పేజీల వైపు దృష్టి వెళ్ళింది. కృష్ణా నీవే నేనంటూన్న భామిని, పరీక్షల తరువాత విలాసంగ వస్తున్న విలాసిని చిత్రం చూసి పులకరింత కలిగింది. లోపలి పేజీలలోకి వెళితే ఎడిటర్ డైరి సభల విశ్వరూపాన్ని చూపించారు అశ్వినీకుమార్ గారు. జీవనమకరందపు వాక్యాలు ఎప్పటికీ గుర్తుంచుకునేలా ఉన్నాయి. సిద్ధార్థ్ నటుడే అనుకున్నాను అతనొక వక్త రచయితన్న విషయం తెలిసింది. స్వాతి బలరామ్ గారితో ముఖాముఖి ఎన్నెన్నో కొత్తవిషయాలను తెలుసుకునేలా చేసాయి. అన్నింటికి మించి ఈసంచికకే అత్యంత విషయాలను తెలియజేసింది "ఓ సాయంత్రం-సత్సంగం". పాణిని వ్యాకరణ సూత్రాలు కంప్యూటర్ సైన్సుకు ఆధారమన్నవిషయం తెలిసింది. రమేష్ ప్రసాదుగారు విశ్లేషిద్దామన్న జంధ్యాలపాపయ్య శాస్త్రిగారి పద్యం ఇంగ్లీషులో మధురవాణి దృక్పథంతో రాస్తే చదవడానికి కుతూహలంగా వుంది. షరా మామూలుగా మిగతా అంశాలన్ని కొత్తపుంతలతో వెలువరించారు. **మిసిమి** నిర్వాహకులకు అభినందన మాలలు.



*- దోసపాటి వేంకటరామచంద్రరావు, విజయనగరం, ఫోన్ : 7780594995.*

# ఎట్టయాపురం సంస్థానం

– డా. సగిలి సుధారాణి




రాజచిహ్నం

**భా**రతదేశాన్ని పాలించిన మొఘలుల గురించి, సుల్తానుల గురించి ప్రపంచ దేశాలను పరిపాలించిన ఐరోపా తదితరఖండాల పాలకుల వివరాలు మనకు తెలుసు కానీ, భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న 500 సంస్థానాల అధిపతుల మూలాలు మనలో ఎంతమందికి తెలుసు?

కాల్డ్వెల్ మహాశయుడు 'ఎట్టయాపురం పాస్ట్ అండ్ ప్రెజెంట్' (Etaiyapuram past and present) అనే పుస్తకానికి ముందుమాట రాస్తూ "దక్షిణాది జమిందారీ వ్యవస్థలో మొట్టమొదటి సంస్థానంగా అనుసంధానమైనది, ఆదర్శనీయమైనది ఎట్టియాపుర సంస్థానం"గా అభివర్ణించాడు. తెలివిగల రాజులు ప్రతిష్టాత్మకంగా పరిపాలించరనడానికి ఇది చక్కటి ఉదాహరణ. భారతదేశ జమీందారీ వ్యవస్థలో మొదటి వరుసలో ఉండేవారు ఎట్టయాపురం జమీందారులు. వీరు ప్రజలకు, బ్రిటిష్ పాలకులకు ఆదర్శప్రాయులై నిలిచారు.

దక్షిణ భారతదేశంలో ఎట్టయాపురం సంస్థాన ప్రస్తుత (42వ) వారసుడు 'ఎట్టియాపుర అమర శ్రీ రాజ రాజ జగధీర ముత్తుతంగ కుమార రామ పుష్పరాజ వెంకటేశ్వర రాజ ఎట్టప్ప నాయకన్. ఎట్టయాపురం సంస్థానాధీశులు సాహిత్యం, కళలను ఆదరించారు. ప్రముఖ వాగ్గేయ కారుడు ముత్తుస్వామి దీక్షితులు, తన కవితలో సుందర తెలుగని తెలుగును ప్రశంసించిన మహాకవి సుబ్రహ్మణ్య భారతి ఈ సంస్థానాధీశుల ఆదరణ పొందినవారే!

**ఎట్టయాపురం సంస్థానాధీశుల ప్రస్థానం :** విజయనగర రాజుల పాలనకు ముందు శేషాచల కొండల మధ్య ప్రాంతంలోని స్వర్ణముఖీ నదీ తీరాన (ప్రస్తుతం చంద్రగిరి చుట్టుపక్కల ప్రాంతం) క్రీ. శ. 8వ శతాబ్దంలో (803 సం. నుండి 1304 వరకు) కొంతమంది యాదవ రాజులు పరిపాలించారు. వీరిలో ముఖ్యంగా తెల్ల, నల్ల అనేవి రెండు ప్రధాన శాఖలు. వీటిలో కూడా అనేక ఉపశాఖలు ఉన్నాయి. నల్ల శాఖలో పెద్దప్ప నాయకుడు ముఖ్యుడు.

**ఎట్టప్ప ప్రస్థానం :** కుమార ముత్తు నాయకునికి ఇద్దరు కుమారులు ఒకరు నల్లమ నాయకుడు మరొకరు వడలింగమ నాయకుడు. నల్లమ నాయకుడి పాలనా కాలంలో(క్రీ.శ.1306సం.) తుంగభద్ర నదీతీరంలోని పాలకుడు శంభురాజు ఆహ్వానించగా, ఒక శుభకార్యానికి నల్లమనాయకుడు వెళ్ళాడు. ఆ సమయంలో కోటలోని దక్షిణ ద్వారం వైపు వెళ్ళాలంటే మల్లయోధుడు సోమన్నను గెలిచి లోపలికి పోవాలి. లేకపోతే ఎడమకాలికి వున్న బంగారు గొలుసులోంచి దూరిపోవాలి. నల్లమ నాయకుడు మల్లయోధునితో పోరుకు సిద్ధమైనాడు. సోమన్న పోరులో మల్లయోధుని తలకొట్టి, తన బరిసెకు తలనుగుచ్చి కోటలోపలికి అడుగు పెట్టాడు. రాజు అతని పరాక్రమానికి ఆశ్చర్యపడి ఒక బంగారు తలను తయారు చేయించి దానిని నల్లమనాయకునికి బహుమతిగా అందజేశాడు. సోమన్న ఎనమండుగురు సోదరులు నల్లమ నాయకునికి 'దాసోహం' అన్నారు. నల్లమనాయకుడు ఆ ఎనిమిదిమంది సోదరులను దత్తకు తీసుకొని వారికి 'అయ్య' అయ్యాడు. రాజు సకల మర్యాదలు చేసి ఎట్టయ్య అని బిరుదాంకితుడిని చేసి నల్లమనాయకుడిని సాగనంపాడు. నాటినుండి వారి వంశానికి 'ఎట్టయ్య' అనే బిరుదు పారంపర్యంగా కొనసాగుతూ వస్తోంది. 'ఎట్టు' అంటే ఎనిమిది అని అర్థం. 'ఎట్టయాపురం' పాఠశాలల్లోని విద్యార్థులు తరగతులలో అంకెలు నేర్చుకొనేప్పుడు ఇటీవలి కాలం వరకు 1,2,3,4,5,6,7 తరువాత 8 అని అనరు. 7 సంఖ్య

తరువాత 'మహరాజా నం(డి' (ధన్యవాదాలు) అని అంటారు. ఎట్టప్ప నాయకునిపై తమకు గల గౌరవాన్ని నేటికీ చాటుకోవడం విశేషం. ఇది నాస్వీయ అనుభవమని శివగంగకి చెందిన రాణి మధురాంతకి నాచ్చియార్ పేర్కొన్నారు. రాజు బిరుదు 'ఎట్టయ్య' 'ఎట్టప్పన్'గా కాలాంతరంలో మారిపోయినా, సంస్థానం పేరుమాత్రం 'ఎట్టయాపురం'గానే కొనసాగుతుండటం విశేషం. ఆ తరువాత 12 వ వారసుడు నల్ల ఎట్టప్ప నాయకుడు (క్రీ.శ.1344 -1379 వరకు) 41 సం.లు పరిపాలించాడు. ఈయన పాలనకాలంలో ఒక ముఖ్య సంఘటన జరిగింది. మహ్మదీయ పాలకుడు మహ్మద్ అల్లా ఉద్దీన్ ఖిల్జీ విజయనగర సంస్థానంపై దాడి చేశాడు. ఆ సమయంలో చంద్రగిరి నుండి ఎట్టయ్య నాయకుడు తన సేనతో దక్షిణాది వైపు పయనమైనాడు.

**స్వర్ణముఖి నదీతీరం నుండి కావేరీ నదీ తీరానికి.......**

కావేరీ నదీ పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది. వెదురు చెట్ల సహాయంతో కావేరీ నదిపై వారధి ఏర్పాటు చేసుకొని ఆవలిగట్టుకు చేరుకొన్నారు. అక్కడ పరిపాలన చేస్తున్న ఆదివీర పరాక్రమ పాండ్యుడితో సాన్నిహిత్యం ఏర్పడినది. ఖిల్జీ దాడినుండి తప్పించుకొని, తమవారిప్రాణ రక్షణార్థం దక్షిణాది చేరుకొన్నామని వివరించాడు. సానుకూలంగా స్పదించిన పాండ్యుడు ఎట్టయ్యనాయకుడిని తమరాజు దగ్గరకు తీసుకొని వెళ్ళాడు. పాండ్యరాజు కొన్నిభూములను, కొన్ని గ్రామాలు అనయూరు, కార్ కోటనపట్టి ప్రాంతాలను, మధురకు పడమటి ముఖద్వారం పుత్తూరు దగ్గర భూము లను దారదత్తం చేశాడు. వీటికి సంబంధించిన వివరాలు తెలియజేస్తూ 'వాల సముద్రం' సమీపంలో ఒక శాసనాన్ని వేశారు. నల్ల చిల్లమ ఎట్టయ్యనాయకుని పాలనాకాలం (క్రీ.శ, 1379-1420)లో ప్రజల సమస్యలను పరిష్కరించే వాడు. చాలాకాలం వరకు సంతానం కలగకపోవడంతో పుత్తూరులో సుబ్రహ్మణ్యస్వామి గుడికట్టి దానికి 'కుమార సుబ్రహ్మణ్య స్వామి' అని పేరు పెట్టాడు. తన కుమారుడికి కుమార ఎట్టప్పనాయకుడనే పేరుపెట్టాడు. అంతకుపూర్వం చంద్రగిరి ప్రాంతాన్ని పాలించినందుకు గుర్తుగా విష్ణు వాహనమైన గరుడపక్షి తరువాత సుబ్రహ్మణ్య స్వామి దయతో తమవంశాకురం అభివృద్ధి చెందినదని గుర్తుగా సుబ్రహ్మణ్య స్వామి వాహనమైన నెమలి బొమ్మలతో కూడిన రాజచిహ్నంపై తెలుగులో 'శ్రీకృష్ణ షణ్ముగ సంస్థానం' అని రాయబడి ఉండటం విశేషం. ఆనాడు దక్షిణ భారత దేశంలో 'రాజభాష'గా తెలుగు ఉండేదనడానికి ఇది నిదర్శనం. ఇరువురు దేవుళ్లు మాకు రెండు కళ్లు అని ఎట్టప్పనాయక సంస్థానాధీశులు చెబుతారు.

**బందిపోట్ల దొంగల బెడద ఎక్కువగా ఉండేది!**

కుమార ఎట్టప్ప నాయకుని పాలనాకాలంలో (క్రీ.శ.1420-1443) మరవ ప్రాంతంలో 'మౌరాయన్' అనే గజదొంగ కోట కట్టుకొని ఉండేవాడు. కుమార ఎట్టప్పనాయకుడు ఆ కోటను నాశనం చేసి ఆదొంగను పట్టుకొని వధించాడు. పాండ్యరాజు మెచ్చి కుమార ఎట్టప్పకు 'సుందర పాండ్య ఎట్టప్పనాయకుడు' అనే బిరుదును ఇచ్చాడు.

గుడిపల్లి (కోవిల్పట్టు) వ్యవసాయ ప్రాంతాన్ని పాండ్యరాజు ఎట్టప్పనాయకునికి అప్పజెప్పాడు. ఆ సమయంలో సాతూర్ ప్రాంతానికి వచ్చి నల్లనాయకుడిని సామంతుడిని చేసి అక్కడ కోటకట్టి, 'నల్లనాయకుని కోట' అని నామకరణం చేసారు. సాతూర్‌కు తూర్పున నదీ తీరంలో ఈ కోట ఉండేది. ఇప్పుడు అది శిథిలమై పోయింది. కానీ ఈ ప్రాంతాన్ని 'నల్ల నాయక కోటై' అని స్థానికులు నేటికీ వ్యవహరిస్తారు.

నల్ల నాయకుని పాలనకాలంలో వన్నియర్ల కులం వారికి 300 పుట్ల జొన్నలు ఇచ్చేవారు. సంస్థానాదీశులు ఇప్పటికీ 48 పుట్ల వడ్లు, 250.రూ.లు రొక్కం వన్నియర్లకు ఇవ్వడం పరంపరగా కొనసాగిస్తున్నారు. తిరుమల నాయకుని పాలనకాలంలో 'పాళేగార్ వ్యవస్థ' ఏర్పడింది. క్రీ.శ.1567 సం.లో తామ్రఫలకంపై ఎట్టప్ప నాయకులకు ఎంతవరకు పాలన పరిధి ఉందో రాసిచ్చారు. జగవీర కుమార ఎట్టప్ప నాయకుడు 1567 సం.లో ప్రస్తుత కోటను నిర్మించారు. ఆ సమయంలోనే మధురను పాలించిన నాయక రాజు కుమార కృష్ణప్ప నాయకుడు ఆధ్వర్యంలో ఎట్టప్ప నాయకుడు'ట్రావెన్‌కోర్'పై దండెత్తాడు.

ఆ దండయాత్రలో ఎరనీర్ కోటను ఆక్రమించుకొని వుండగా, ఊత్తుమలై దగ్గర జగవీర కుమార ఎట్టప్ప మీద శత్రువు వెనుక నుంచి బాణంవేయడంతో ప్రాణాలు కోల్పోతాడు. మధురరాజు చాలా చింతించి 'కళుగు మలై' ప్రాంతాన్ని ఎట్టప్పనాయక వారి వారసులకు ఇస్తాడు.

'అయ్యన్' అనే బిరుదును ఇచ్చాడు. రాజ్యంహద్దుల విషయంలో గోలవారి పట్టికి జగవీర రామ కెచ్చిల ఎట్టప్ప నాయక అయ్యన్ పరిష్కారానికి వెళ్తే అక్కడ ఉన్న సామంతులతో తగాదా ఏర్పడింది. సామంత రాజును ఓడించి పరుగెత్తించాడు.

**ఎట్టియాపురము సంస్థానము – సాహిత్య సేవ** : ఎట్టియాపుర సంస్థానాధీశులు తమిళ, తెలుగు, సంస్కృత భాషలలో నిష్ణాతులే గాక ఆభాషలను సమాదరించారు. గద్య, పద్య, నాటక, సంగీత, శిల్ప, చిత్రకళలను ఆదరించారు. వీరికి బ్రాహ్మణుల మంత్రాలతో పనిలేదట! వీరే శుభకార్యాలప్పుడు మంత్రాలు చదువుతారు. అందుకని వీరిని 'కోడంగి నాయకర్లు' అనికూడ పిలిచేవారు. జ్యోతిష్య , భూత, వైద్య శాస్త్రాలలో ఈ రాజులు నిష్ణాతులు. జక్కమ్మ వీరి కులదైవం. వెదురు చెట్లను ఆరాధిస్తారు.

**ఎట్టియాపురసంస్థానం–కవులు :** ముత్తుపులవర్, నమశ్శివాయ పులవర్, ఉమర్ పులవర్–మహాకవి సుబ్రహ్మణ్య భారతి, రామచంద్ర భాగవతార్, పుష్ప వనమ్ అయ్యర్, కాంచీపురం నైనా పిళ్ళై, కాంచీరామన్ పూండియ పిళ్ళై, దక్షిణామూర్తి పిళ్ళై, మధురై పొన్నుస్వామి పిళ్ళై, సెంబనార్ కోయిల్ రామస్వామి పిళ్ళై, రాజ రత్నమ్ పిళ్ళై, కారై కురిచి అరుణా చలం, నటేశన్, నయనక్కరర్, కారైకుడి వీణై సాంబశివ అయ్యర్ మొదలైన కవులనూ కళాకారులనూ ఎట్టయాపురం సంస్థానాధీశులు ఆదరించారు. అంతేగాక కళ్యాణ రామయ్యర్, ఎమ్.ఆర్. గోవింద స్వామి పిళ్ళై, విశ్వనాథదాస్, చిన్న మహాదేవ అయ్యర్, చిన్నస్వామి అయ్యర్, వేలు నాయర్, ఆనంద నారాయణ అయ్యర్ మరియు కిట్టప్ప సోదరులు మొదలైన నాటక కళాకారులను సమాదరించి గౌరవించారు. అలాగే గుబ్బి వీరణ్ణగారి ప్రఖ్యాత కన్నడ నాటక బృందాన్ని ఆదరించారు. భాషా ప్రాంతాలకు అతీతంగా కళాకారులను సమాదరించి కళారూపాలను పోషించారు ఎట్టప్పనాయకులు. 'కార్తీకేయ నాటక సంస్థ' ఆధ్వర్యంలో కళాకారులకు శిక్షణ ఇచ్చేవారు.

బాలయ్య , గోపాలయ్య, కేశవరాజు అనే తెలుగు పండితులు ఉండేవారు. అనల్ నట్టర్, రామలింగయ్య తెలుగు తమిళ పండితులు. 'సముద్ర విలాసం', 'కమరస మంజరి' అనే కావ్యాలు ముత్తు పులువరు రాశారు.

**సంగీత సాహిత్య విద్యలకు ఆదరణ :** దక్షిణ దేశంలో ఎట్టయాపురం సంస్థానాధీశులు సంగీతసాహిత్య విద్యలను పోషించేవారు. వేంకటేశ్వర ఎట్టప్ప మహారాజు క్రీ.శ. 1816 మొదలు క్రీ.శ. 1889 వరకు పరిపాలించాడు. వేంకటేశ్వర ఎట్టప్ప సంగీత విద్యా సంపన్నుడే గాక ఆంధ్ర ద్రావిడభాషా విశారదుడు. 1814 సం.లో కళుగు మలైలో సుబ్రహ్మణ్య స్వామి గుడిని కట్టించాడు. శివుడు, విష్ణువు, సుబ్రహ్మణ్య స్వామిపై శ్లోకాలు రాయించాడు.

ఇతని కుమారుడు జగవీర రామకుమార ఎట్టప్ప మహారాజు (క్రీ.శ.1850 –1856). ఎట్టప్ప నాయకులలో చాలా ప్రసిద్ధుడు. జగవీరుడు కూడా తండ్రిలాగా సంస్కృతంలో కావ్య నాటకాలంకారాది విద్యలను గ్రహించాడు. సంగీతంలో లక్ష్యలక్షణ సంప్రదాయముల నేర్చి 'వైణికోత్తముడ'ని పేరుపొందాడు. ఆంధ్ర ద్రావిడ భాషలలో సమర్థుడు. సంస్కృతాన దేవతా స్తుతులైన శ్లోకాలు సంగీతంలో 'శ్రీకార్తికేయ' ముద్రతో చూర్ణికలు రక్తి రాగకల్పనలతో గేయ రచనలు స్వయంగా చేశాడు. ఇతని ఆస్థానాన్ని అలంకరించిన కవి పండితులు వివిధ భాషల సంగీత సాహిత్య శాస్త్రాలను రాయడం మూలంగా వారిని ఏవిధంగా సమాదరించాడో తెలుస్తుంది. తెలుగుభాషలో కవులు, పండితులే గాక భట్రాజులు గూడ వీరి ఆస్థాన మలంకరించుట చేత తెలుగు భాష ప్రాధాన్యతను మనం గమనించవచ్చు.

**చతుశ్శాస్త్ర పండితులు** – శ్రీరంగం కుప్పయ్యంగారు తిరువలంగాడు విశ్వేపురి దీక్షితులు (వీరు అప్పయ దీక్షకుని వంశీయులు), మీమాంసా శాస్త్రవేత్త – తిరుక్కోడిశానలో కోదండరామశాస్త్రి, వైయాకరణ పండితుడు–విల్లి పుత్తూరు వీరరాఘవ తాతాచార్యులు, తార్కిక శిరోమణి–విట్లాపుర మన్నారయ్యంగారు, అష్టాదశాగమ వేత్త–ఆంధ్ర సంస్కృత పండితుఁడు– గుడుగుముల అహోబలశాస్త్రిగారు, ఆంధ్ర వైయాకరణి – విళాత్తియం కృష్ణయామాత్యులు, ఆంధ్రద్రావిడ మహాకవి – ఆవల్లత్తం రామలింగయ్య, ఆంధ్ర పండితులు – బాలయ్య, గోపాలయ్య, ఆంధ్ర కవీంద్రుడు – కేశవరాజు భట్రాజు, ద్రావిడకవీంద్రులు – కడిక్కైప్పులవర్, ముద్దుకుమారప్పులవర్, మున్నగువారు.

**మహాకవిసుబ్రహ్మణ్య భారతియార్** – భారతీయ రచయిత, కవి, ఉపాధ్యాయుడు, భారత స్వాతంత్ర్య సమర యోధుడు,సామాజిక సంస్కర్త మరియు బహుభాషావేత్త.

ఆయన రచనలలో భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో స్వరపరిచిన ప్రఖ్యాత దేశభక్తి గీతాలు ఉన్నాయి.

ఎట్టయాపురంలో 1882 డిసెంబర్11న సుబ్రహ్మణ్యం జన్మించాడు. తన ప్రాథమిక విద్యను తిరునెల్వేలిలో పూర్తి చేశాడు. సుబ్రహ్మణ్యం చిన్నతనంలోనే చక్కని పాండిత్యం కనబరిచాడు. తరువాత కొంతకాలం ఉన్నత విద్యను అభ్యసించడానికి కాశీ విశ్వవిద్యాలయానికి వెళ్ళాడు. హిందూ వేదాంత శాస్త్రంతో, కొత్తభాషలతో పరిచయం పెంచుకున్నాడు. ఎట్టయాపురం సంస్థానాధీశులు వేంకటేశ్వర ఎట్టప్పనాయకుడు కాశీకి వెళ్ళినపుడు సుబ్రహ్మణ్యం ప్రతిభను చూసి, తమసంస్థానానికి తిరిగి రావలసినదిగా ఆహ్వానించి తనతో పాటు తమ సంస్థానానికి తీసుకొని వచ్చాడు. అలాగే ఎట్టప్పనాయకులు సోమసుందర్ ఆధ్వర్యంలో తమిళ సాహిత్యంపై పరిశోధన చేయించారు. సోమసుందర్, సుబ్రహ్మణ్యం పాండిత్యాల్ని మెచ్చి 'భారతియార్' అనే బిరుదును ఇచ్చి ఇరువురిని సత్కరించాడు. నాటినుండే సుబ్రహ్మణ్య భారతియార్, సోమసుందర భారతియార్ అనే పేర్లతో పిలువబడ్డారు. మహాకవి సుబ్రహ్మణ్య భారతి వంటి తమిళ జాతీయకవి తెలుగుభాషా మాధుర్యంను కొనియాడాడు.

**సింధునదియిన్ మిశై నిల వినిలే**
**చేరనన్నాట్టిళం పెణ్ గళుడనే**
**సుందర తెలుగునిల్ పాట్టిశైత్తు**
**తోణిగళోట్టి విలై యాడి వరువోం**
*****************

**వెన్నెల రేయి సింధునదిలో**
**కేరళ కాంతలు తోడురాగా**
**సుందర తెలుగు గీతాలాపనతో**
**నావలు నడుపుతూ సాగిపోదాం.......**
*****************

**ఎట్టప్పమహారాజు కాలంలోసంగీతకారులు**

జగదీశ్వర మహారాజ రామ వెంకటేశ్వర ఎట్టప్ప నాయకర్ కాలాన(క్రీ.శ.1814- 1837) ప్రతిదినం సంగీత సాహిత్యవిద్యాగోష్ఠి నిర్వహించేవాడట. ఈకవి పండితబృందాన్ని వంశపారంపర్యంగా పోషించే ఏర్పాటు గావించినాడట.

ఒకసారి ఎట్టప్పనాయకుని సంస్థానంలో ఏనుగు మదమెక్కి నదిలోకి పోయి సుడిగుండంలో చిక్కుకొని మరణించినది. దీనిని అపశకునంగా భావించిన రాజు ముత్తుస్వామి దీక్షితుల దగ్గరకు వెళ్ళి ఇలా జరిగిందని మొరపెట్టుకొన్నాడు. ముత్తుస్వామి దీక్షితుల వారు వారి శిష్య బృందంతో కీర్తనలు పాడి స్వాంతన చేకూర్చాడు. వారి వంశాభివృద్ధికి ఆశీర్వదించాడు. ఆనాటినుండి వారి వంశంలో వారికి పేరులో 'ముత్తు'ను చేర్చి వారి గౌరవాన్ని చాటుకొన్నారు.

**సుబ్బరామదీక్షితులు** – దాక్షిణాత్య సంగీతప్రపంచంలో మూర్తిత్రయమని ప్రఖ్యాతిగాంచిన వారిలో ప్రథములైన శ్రీముత్తుస్వామిదీక్షితుల కనిష్ఠ సోదరులైన బాలస్వామి దీక్షితుల పెంపుడుకొడుకు సుబ్బరామ దీక్షితులు. ఇతడు క్రీ.శ. 1839లో జన్మించాడు. జగదీశ్వర ఎట్టప్పగారు సుబ్బరామ దీక్షితుల జాతకాన్ని చూసి గొప్ప విద్వాంసుడు కాగలడని తలచి ఇతనిని పుత్రునిగా స్వీకరింపమని తన ఆస్థాన విద్వాంసుడగు బాలస్వామి దీక్షితులను కోరాడు. కాబట్టి రాజాజ్ఞననుసరించి పుత్రునిగా స్వీకరించాడు బాలస్వామి దీక్షితులు. వెంటనే ఆ బాలునకు బ్రహ్మోపదేశము, శ్రీవిద్యోపదేశము చేశాడు. బాల్యంలో సంస్కృతంలో కావ్య నాటకాలంకార శాస్త్రాలే గాక సంస్థాన పండితులైన విళాత్తియం కృష్ణయామాత్యుల వారివద్ద మనుచరిత్ర, వసుచరిత్రాది మహాకావ్యాలను పఠించి, ఆంధ్ర వ్యాకరణ, ఛందస్సు శాస్త్రాలను సుబ్బరామ దీక్షితులు అభ్యసించాడు. వంశ పారంపర్యంగా వచ్చే సంగీతవిద్య ఇతనికి ఉగ్గుపాలతోనే అలవడింది. ఇతడు తన పదవ యేటనే శ్రీకార్తికేయ స్వామిపై ఒక 'తానవర్ణము' రచించెనట. క్రమక్రమముగా సంగీత సాహిత్య విద్యలందు పరిణితుడై వాగ్గేయకారాగ్రణియై, ముత్తుస్వామి దీక్షిత సంప్రదాయ ప్రవర్తకుడై, ఎట్టయాపుర సంస్థాన విద్వాంసుడై ప్రసిద్ధి పొందాడు. సుబ్బరామ దీక్షితులు సంగీత వాఙ్మయమునకు జేసిన సేవ అపారమైనది. సంగీత ప్రపంచమునకు శిరోభూషణమని చెప్పదగిన, 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' 1904 సం.లో వీరిచే రాయబడినది.

మార్గరీతి సంగీత, (ప్రిన్సిపల్ ఆఫ్ సంగీత) 1904 సం.లో ముద్రితమైనది. ఈ మహాగ్రంథాన్ని ఇతడు క్రీ.శ. 1904లో ఎట్టయాపుర సంస్థానాధిపతుల ఆదరణతో వెలువరించాడు. ఈ గ్రంథంలో తెలుగులో పీఠిక, 44 పుటలలో – ప్రసిద్ధ వాగ్గాయ కారులచరిత్ర, రాగతాళ

స్వరయుక్తంగా 300 సంకీర్తనలు ప్రకటితమయాయి. సంగీత విద్వాంసులకు, సంగీతశాస్త్ర పరిశోధకులకు ఈ గ్రంథము పెన్నిధి వంటిది. ద్రావిడ వాగ్గేయ కారుల గురించేకాక, తెలుగు వాగ్గేయకారుల గురించి తెలిపే ఈ ఉద్గ్రంథం, తరువాతి పరిశోధకుల కందరికీ ఆదర్శప్రాయమైంది. మొట్టమొదట సంప్రదాయసిద్ధంగా, చారిత్రకాంశాలను వివరించే వాగ్గేయ కారుల చరిత్ర తెలిపిన తొలివారు సుబ్బరామదీక్షితులవారే. దీనిలోని తెలుగు వచన రచన సులభంగా ఉంటుంది. అంతకు ముందు సంగీత శాస్త్రం గురించి ప్రధానంగా రెండు విధాలుగా ఉండేది.


సంగీతసంప్రదాయప్రదర్శిని
Part I
1904.

మార్గరీతి సంగీత ముఖచిత్రం

1. సంగీతలక్షణ ప్రాచీనమార్గం2. సంగీతలక్షణ సంగ్రహం.

పై రెండింటిలో సంగీత శాస్త్ర సంప్రదాయాలు, లక్షణాలు సరిగ్గా నిర్వచింపబడ్డాయి. ఇందులో 34 అంశాల గురించి వివరంగా ఉన్నాయి. 1973 సం.లో ఆంధ్ర సంగీత అకాడమీ వారు ఈ గ్రంథాన్ని పునర్ముద్రించారు.

**కవిత్రయ మహాభారతం – ద్రావిడానువాదం–** సుబ్బరామ దీక్షితులు ఆంధ్రభాషకు కావించిన సేవ అపూర్వమైనది. ఈయన కవిత్రయ మహాభారతాన్ని తెలుగు నుండి తమిళంలోనికి (ద్రావిడభాష)లోనికి వచనరూపముగా అనువదించినారు. ఈ రచన 'జగదీశ్వర రామకుమార ఎట్టప్ప మహారాజు' ప్రోత్సాహంతో జరిగింది. పై సంగీత సంప్రదాయ ప్రదర్శినిలోనే 39 పుటలో సుబ్బరామ దీక్షితులు ఈక్రింది విధంగా పేర్కొన్నారు.

*"జగదీశ్వర రామకుమార ఎట్టప్పమహారాజు హూణాంధ్రద్రావిడ భాషలలో నతిసమర్థులు, శ్రీ మహాభారతమందు బద్ధస్నృహులు, కవిత్రయము వారిచే తెనుగింపబడిన శ్రీ ఆంధ్ర మహాభారతము ఈ మహారాజు అనుమతివలన నేడు ద్రావిడీకరింపబడి యచ్చొత్త బడినది"*

పై రచనలను బట్టి దాక్షిణాత్య ఆంధ్ర వాఙ్మయమున సుబ్బరాయ దీక్షితుల స్థానమెంతటిదో తెలుస్తోంది.

**తి.సు. మురుగేశం పిళ్లై (1870–1930) –** 'త్రిశిరపురము' అనే పేరుగల నేటి తిరుచినాపల్లి వాస్తవ్యుడు. తెలుగు భాషలోను, ద్రవిడభాషలోనూ అసమాన పాండిత్యంగల విద్వాంసులలో తి. సు. మురుగేశం పిళ్ళైను మించినవారు అరుదని చెప్పవచ్చు. ఇతడు ఎట్టయాపురం సంస్థాన పండితుడు, తెలుగు భాషలో విద్వత్కవి! ప్రశస్త వచనరచయిత. సుబ్బరామ దీక్షితులకు దగ్గరివాడు. తెలుగు పద్య గద్యకవి, కంబకవి జీవితాన్ని తెలుగులో రాశాడు. 1918 సం.లో ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు దీనిని (general volume -7 ) ప్రచురించారు. వీరు శిలప్పదికారం కూడా తెలుగులో ముద్రించినారు. 'ద్రావిడ – ఆంధ్ర భాషల అన్యోన్య సంబంధం' మురుగేశం పిళ్ళై రాశాడు. క్రీ.శ. 1904లో ప్రకటితమై, ముందు పేర్కొనబడిన 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' ప్రకటన కాలంలో ఆ గ్రంథాన్ని ప్రశంసిస్తూ ఇతడు శ్లాఘ పద్యాలు రాసినాడు. టి. ఎస్. మురుగేశం పిళ్ళై క్రీ.శ. 1911లో 'ఆంధ్రసాహిత్య పరిషత్తు' స్థాపించిన నాటినుండి దానితో సంబంధం గలవాడు.క్రీ.శ. 1916లో మధురలో 'ఆంధ్రసాహిత్య పరిషద్వార్షికోత్సవసభ' జయప్రదంగా జరగడానికి ఇతడే కారణభూతుడైనాడు. మురుగేశం పిళ్ళై వృత్తిరీత్యా తెలుగు పండితుడు. ఈతని రచనలన్నీ ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలోనే ముద్రితమైనాయి.

**ద్రావిడాంధ్రభాషల అన్యోన్య సంబంధం–** భాషాతత్వశాస్త్ర సంబంధియగు 'ద్రావిడాంధ్ర భాషా అన్యోన్య సంబంధం' అనే ప్రశస్తవ్యాసం ఒక శతాబ్దం (1923.సం) క్రిందటే ప్రకటితమైనది. ఈ కోవకు చెందిన వ్యాసాలలో ఇదే మొదటిదని ఆచార్య శ్రీ చల్లా రాధకృష్ణ శర్మ గారి అభిప్రాయం. సూర్యారాయాంధ్ర నిఘంటు సంపాదకులు జయంతి రామయ్య పంతులుగారు మురుగేశంపిళ్ళై వ్యాసరచన చూసి, అతని పాండిత్యాన్ని గ్రహించి, నిఘంటువునకు ద్రావిడభాషా సజాతీయ పదాలను సమీకరించుటకు నియమించారు. ఆపని మురుగేశం పిళ్ళై అతిశ్రద్ధతో నిర్వహించి 7500 సజాతీయ పదాలను సేకరించాడు. దీనినిబట్టి ఇతని భాషాపాండిత్యం ఎంతటితో గ్రహించవచ్చు.( ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రిక, సంఖ్య 7. పుటలు 108–132.)

**కంబమహాకవి జీవితము–** ద్రావిడ భాషా మహాకవియు రామాయణ కర్తయునగు కంబ మహాకవి జీవితాన్ని ఇతడు

తెలుగు వచనంగా రచించారు. అది కూడా పై పత్రికలోనే ముద్రితమైనది. (సం. 12, పుటలు, 76-105.)

**కణ్ణకి లేక నూపురమహిమ-** ద్రావిడ భాషయందలి పంచమహాకావ్యాలలో 'శిలప్పదికారము', 'మణిమేఖల' అనే గ్రంథాలలో ఆబాలగోపాలమెఱిగిన కోవిలన్‌కణ్ణకి వృత్తాంతాన్ని, మురుగేశుడు సంగ్రహంగా వచన రూపములో రచించిచాడు. ఇది కూడా ముద్రితమైనది.

**కట్టబొమ్మన వంశస్థులకు ఎట్టప్పనాయక వంశస్థులకు మధ్య వివాదం-** ఆంగ్లేయ పాలకులు విభజించి, పాలించు అనే సూత్రాన్ని పాఠించారు. 1725 సం.లో కట్టబొమ్మన తాతకు అత్తనూరు కుప్పనాయకునికి మధ్య వివాదం ఏర్పడినది. దీనిని పరిష్కరించడానికి ఎట్టప్ప నాయకుడు శీనయ్య పిళ్ళైను కుప్పనాయకునికి మద్దతుగా పంపిస్తాడు. కాని శీనయ్య కట్టబొమ్మనకే సహాయం చేసి కుప్పయ నాయకుని మరణానికి శీనయ్యపిళ్ళై కారణభూతుడు అవుతాడు. ఎట్టప్పనాయకుని ఆగ్రహానికి గురి అవుతాడు. దానితో కట్టప్ప వంశస్థులకు, సంస్థానాదీశుల మధ్య వివాదానికి బీజం పడింది.

**ఎట్టప్పనాయకుల సమాజసేవ –** చిత్రానది, గంగై కొండవద్ద వారదులు కట్టించారు. సోమయాగం ముత్తుస్వామి దీక్షితుల ఆధ్వర్యంలో చేశారు. బ్రాహ్మణుల కోసం నీళ్ళబావిని తవ్వించారు. 1827 సం. యూషింగ్ టన్ దొర వీరి సంస్థానానికి అతిథిగా వచ్చాడు. అప్పుడు ఉన్న మట్టికోటను తీయించివేసి సున్నంతో కోటను కట్టించి దానికి 'షణ్ముగ విలాసం' అని పేరు పెట్టారు.

**తూత్తుకుడి నుండి కోవిల్పట్టుకు రైలుమార్గం-** 1875సం. డిసెంబర్‌లో ఆనాటి వేల్స్ యువరాజు (హెన్రీ vii) తూత్తుకుడి నుండి కోవిల్పట్టుకు (36.మైళ్ళు) రైలు మార్గం ప్రారంభించాడు. 1877 జనవరిలో ఢిల్లీలోని ఇంపీరియల్ దర్బార్‌కు 'జగవీర రామ కుమార ఎట్టప్ప నాయకుని' ఆహ్వానించి విక్టోరియా రాణి మెడల్, సర్టిఫికేట్ అందజేశారు. స్త్రీవిద్యకు ప్రాధాన్యతను కల్పించాలనే ఉద్దేశ్యంతో ఆడపిల్లలకోసం 150 సం. క్రిందటే ప్రత్యేక బాలికల పాఠశాలలు కట్టించారు. ప్రథమంగా పాఠశాలలకు మధ్యాహ్నం ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. అయితే ఎట్టప్పనాయకన్ ఆ భోజనం కొంత తెప్పించి ప్రతీరోజూ తాను తిని రుచిచూశాకే విద్యార్థులకు పెట్టేవారు. మామిడి మొక్కలను పాఠశాలలకు పంచిపెట్టేవారు.

1877 -78 సం.లో భయంకర క్షామం దక్షిణ భారతదేశంలో వచ్చింది. ఆ కష్ట సమయంలో వ్యవసాయ దారులను ఆదుకొని, పశువులను దానమిచ్చాడు రామ ఉదయ కుమార ఎట్టప్ప నాయకన్. ఆ సమయంలోనే దాయాది ఒకడు సంస్థానంలో భాగం కావాలని ఎట్టయాపురం రాజుపై తిరునల్వేలి కోర్టులో వాజ్యం వేశాడు. ఆ సమయంలో ముత్తుస్వామి దీక్షిత్ గారు రాసిన 'ఎట్టయాపుర చరిత్ర' సాక్ష్యం కీలకమైనది. ఇందులో క్రీ.శ. 803 నుండి 1877 సం. వరకు వారి వంశ వృక్షక్రమాన్ని వివరిస్తూ ఎట్టయాపురం చరిత్ర పుస్తకం ప్రధానసాక్ష్యంగా నిలిచింది. - ఏవిధంగా ఎట్టయాపురం పాలకులు వారిలో వారు ఎటువంటి వివాదం లేకుండా దాదాపు 10 శతాబ్దాలు ప్రజారంజకంగా పరిపాలించారో వివరించారు. ఇంకా బిషప్ కాల్వెల్ 'హిస్టరీ ఆఫ్ తిన్నవెల్లి', పాంజాల కురుచ్చి యుద్ధం, స్టూవర్ట్ మాన్యువల్ ఆఫ్ తిన్నవెల్లి, టైలర్స్ రాసిన రాతప్రతుల ఆధారంగా సుదీర్ఘ తీర్పును ఇచ్చారు. దాని సారాంశం "ఎన్నో శతాబ్దాలుగా వివాద రహితంగా, ప్రజారంకంగా పాలించిన ఎట్టియాపుర రాజుల చరిత్రను సమర్థిస్తూ, వాజ్యం వేసిన వారిని మందలించి, సంస్థానాన్ని విభజించడం కుదరదని" కేసు O(.S.No.23/1884 సబ్ ఆర్డినేట్ జడ్జి, తిరునల్వేలి) ను కొట్టివేశారు. చిన్న విషయాలకే మనస్పర్థలు వచ్చి కోర్టులకెక్కి విడిపోయే ఉమ్మడి కుటుంబాలకు ఆదర్శం ఎట్టయాపురం సంస్థానం. చరిత్ర అంటే రాజుల యుద్ధాలు, రాణుల కథలు కావు! రాజ్యాల పతనాలు కావు! చరిత్ర అంటే ఆనాటి రాజుల సంస్కరణలు, మానవ సమూహాల్లో వచ్చిన మార్పులు, సమాజాన్ని తీర్చిదిద్దిన ఆనాటి సాహిత్యం

డా. సగిలి సుధారాణి
ఫోన్ : 9490428825

# అర్క స్మృతి

**– విద్యాసాగర్ అంగలకుర్తి**

కీర్తి శేషులు ముంగర జాషువా గారు ఒక అపురూపమైన వ్యక్తి. ప్రప్రథమంగా ఆయన చింతనా పరుడు. లోతైన తాత్విక వివేచన కలిగిన వాడు. అన్ని తాత్విక ధోరణులను ఆకళింపు చేసుకొని తనదైన భాష్యం చెప్పగల సమర్థుడు. ఐనా ఆయన తన భావ ధారను ప్రాచుర్యంలోకి తేవడంపై ఎందుకో శ్రద్ధ పెట్ట లేదు.

తాను గురువులుగా భావించే వారి వ్యక్తిత్వాలను అవకాశం దొరికినప్పుడల్లా ప్రశంసించడంలోనే తన సంతోషాన్ని వెదుక్కున్నారు. ఆ వ్యాపకంలోనే పడి ఆయన తన భావనా సంపదను మనకు పంచడానికి ఆలశ్యం చేశారు. ఆ ఆలశ్యం నిజానికి ఒక జీవిత కాలం పాటు జరిగింది. అదే మనకు నిరాశను మిగిల్చింది. తనలో ఆ నిరాశ తనకు తెలియకుండానే గూడు కట్టుకుందేమో! నాతో ఆయన చేసిన సుదీర్ఘమైన సంభాషణల్లో తొంగి చూసేది. కానీ అంతలోనే ఆత్మ సమ్యమనం పాటించి సంభాషణను మరో ఆసక్తి కరమైన విషయానికి మళ్ళించేవారు. ఆ సంభాషణా చాతుర్యమే నన్ను ఆకట్టుకొంది. తనతో మాట్లాడడమంటే మనలను మనం మనకు తెలుసు కుంటున్న దానికే ఓ కొత్త కోణం ఉందని అంగీకరించ డానికి సిద్ధ పడాలి. అలాంటి ఎన్నో సందర్భాలు నా అనుభవం లోకి వచ్చాయి. అందుకే తనతో మాట్లాడుతూ ఉంటే సమయం తెలిసేది కాదు.

నూటికి నూరు పాళ్ళు స్వాభిమానం కలిగిన అరుదైన వ్యక్తిత్వం ఆయనది. అది గర్వం కాదు. స్వాతిశయం కాదు. తనను తాను పోగొట్టుకోలేని విలక్షణత. దానితో ఆయన ఎన్నో పోగొట్టుకున్నారు. కానీ తాను పోగొట్టుకున్న వాటిని ఆయన గుర్తు పెట్టుకోలేదు. నిరాశ పడలేదు. జీవితాన్ని ఆశావహ దృక్పథానికి వాహికగా చేసుకుని తన లోతైన తాత్విక చింతనను సజీవంగా ఉంచుకున్నారు.

మేమెలా కలుసుకున్నామో గుర్తు లేదు కానీ ఆయనతో మాట్లాడడం మరపురాని అనుభవం. తన ఆలోచనల విస్తృతి చాలా గొప్పది. తన ఆలోచనా ధారలను తనదైన తాత్విక స్రవంతి లోకి మళ్ళించగల సంభాషణా చాకచక్యం ఆశ్చర్యకరంగా ఉంటుంది. జాషువా గారి విషయ విశ్లేషణ విలక్షణంగా ఉంటుంది. తన అభిప్రాయ వ్యక్తీకర్ణకు ఒక ప్రామాణికతను అలవాటు చేసుకున్నారు.



ముంగర జాషువా

తన పాండిత్యాన్ని ఎందరికో గుప్త దానం చేసిన మహా సాహిత్య వితరణ శీలి. సాహిత్య పరంగా ఎందరినో అధికారిక స్థానాల్లోకి పంపడానికి తన సమయాన్ని చాలా వెచ్చించారు. అందులో ఏ కొంచెం సమయాన్నైనా తన స్వంత రచనల పట్ల పెట్టి ఉంటే చింతనా సహిత్యం ఓ మేలి మలుపు తిరిగి ఇండేదని నేను నిశ్చయంగా చెప్పగలను. ఎంత ప్రాచుర్యం సంపాదించుకున్నా తమ సాహిత్య క్రుషిపై ఆయన అభిప్రాయం కోసం ఎదురు చూసిన పేరొచ్చిన రచయితలను నేనెరుగుదును. తన సాహిత్య వివేచనా శక్తికి అదే నిదర్శనం. ఆరోగ్యం సహకరించక పోయినా వాళ్ళ ఆకాంక్ష తీర్చడానికి ఆయన తపన పడేవారు. తాను రాయవలసినవి ఎన్నో మిగిలి పోయాయి. అర్క స్మితిని ఎప్పుడో ప్రచురించి ఉండవలసింది. చాలా ఆలశ్యం చేశారు. కానీ అందుకు కారణం శ్రమకూ, ఖర్చులకూ ఓర్చి 'రసరేఖను 'సమయానికి తేవడానికి ప్రయత్నించ వలసి రావడమే! రస రేఖ జాషువా గారి సంపాదక హ్రుదయానికి దర్పణం. ఆరోగ్య పరంగా ఏ కొంచెం పుంజుకున్నా, ఆర్థికంగా ఏ కొంచెం వెసులుబాటు కలిగినా రసరేఖకు విస్తృతి, వైవిధ్యం కల్పించడానికే ప్రయత్నించే వారు. రసరేఖ తన మానస పుత్రిక. రస రేఖ తన ప్రాణ హేతువు. తాను లేని వెలితి నాకు స్పష్టంగా తెలుస్తోంది. వైవిధ్య భరిత దీర్ఘ సంభాషణలు నేనిప్పుడెవరితో చేయగలను? సాహిత్యానికి తాత్వికతే ఆయువుపట్టనే తన ధ్రుఢ నిశ్చయాన్ని మరి మరీ గుర్తు చేసే ఉద్వేగభరిత వ్యాఖ్యానలను ఇకపై నెనెవరించి వినగలను? జాషువా గారూ, ఇప్పుడు మీరు మాతో లేకపోయినా నా మనసులో మీ స్థానం స్థిరంగా ఉంటుంది. మీ మాటలు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. ఆ జ్ఞాపకాల వెలుగులో మీ రూపం కదలాడుతూనే ఉంటుంది. మీరెక్కడికీ పోలేదు. మాతోనే ఉన్నారు. మాతోనే ఉంటారు. మీ తాత్విక ధార జీవనది. అది మా మనసులను ఎప్పటికీ తడిగా ఉంచుతుంది. అదే మీరు మాకు వదలి వెళ్ళిన ఎంత తోడినా తరగని వూట చెలిమ. మీ జ్ఞాపకాల్లో మమ్మల్ని మేమెప్పుడూ తాజాగా ఉంచుకుంటాం. మీరు చిరంజీవి.

విద్యాసాగర్ అంగలకుర్తి. అయ్యేయస్ ( రిటైర్డ్)
స్పెషల్ చీఫ్ సెక్రెటరి,
వుమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము. హైదరాబాదు.

# తెలుగు నుడికి సరికొత్తముడి

– డా. బీరం సుందరరావు

**భా**వసృష్టికి భాషలో కొత్తపదాలు అవసరం. కొత్తపదాలు చేరే కొద్దీ భాష విస్తరిస్తుంది. భాషాశాస్త్ర పరిభాషలో కొత్తపదాలసృష్టిని 'నియోలజిజం' అంటారు. నియోలజిజం భాషాశాస్త్రంలో ఓ ప్రధానశాఖ. ఏదైనా ఒకమాట నిఘంటువుల్లో చేరడానికి ముందు జన వ్యవహారంలో ఉంటుంది. ప్రజలు తమ అవసరాల కనుగుణంగా కొత్తమాటలను సృష్టించుకుంటారు. అవి వాడుకలోకి వచ్చాక వాటి ప్రామాణికతను, గ్రంథాల్లో ప్రయోగార్హతను భాషావేత్తలు, వ్యాకరణవేత్తలు నిర్ణయిస్తారు. జనవ్యవహారంలో వున్న పదాలను కలపడం ద్వార కొత్తనుడులు (మాటలు) ఏర్పడతాయి. నుడులను ముడివేసి సరికొత్త పదాలను సృష్టించే వినూత్న పద్ధతులను పాఠకలోకానికి పరిచయం చేస్తున్న ప్రథమపరిశోధన గ్రంథం "తెలుగులో నుడిముడి".

శబ్దార్థ దాంపత్యంతో తెలుగులో పురుడు పోసుకున్న కొత్తశిశువు "నుడిముడి" అని రచయిత అభిప్రాయం. నుడిముడినే ఆంగ్లంలో "పోర్ట్మాంటూ"అంటారు. ఇదొక భాషాసంప్రదాయం. రెండు నుడులను ముడివేసి, కొత్త పదబంధాన్ని సృష్టించడాన్నే "నుడిముడి" అంటారు. తెలుగులో ఈ పరిభాషను ఈ రచయితే కల్పించారు. అల్పాక్షరాల్లో అనల్పార్థరచనకు నుడిముడి చెల్లెలు వంటిది. అంటే సూక్ష్మంలో మోక్షం. నుడిముడివల్ల భాషకు ఆర్థిక ఆర్థిక ప్రయోజనాలు ఏకకాలంలో నెరవేరుతాయి. ఇప్పటికే తెలుగులో వున్న నామవాచకం, క్రియ, విశేషణాది భాషాభాగాలకు అనుబంధంగా నుడిముడిని కూడ మనం చేర్చుకోవచ్చు–అంటారు రచయిత. భాషాశాస్త్రనిపుణులు, వ్యాకరణవేత్త, రచయిత డాక్టర్ పి.నాగమల్లీశ్వరరావు గారు నుడికి, సరికొత్తముడి ఎలా వేశారో – సాకల్యంగా చర్చించడం ప్రస్తుత సమీక్షావ్యాస ఉద్దేశం. డాక్టర్ నాగమల్లీశ్వరరావుగారు ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఎ.బి.యం.జూనియర్ కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షులుగా, ప్రిన్సిపాల్‌గా నాలుగు దశాబ్దాలు పనిచేశారు. 'సాహిత్యంతో సౌహిత్యం'చేశారు. పాఠకులకు, పాత్రికేయులకు, కవులు రచయితలకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడే "తప్పొప్పుల కోశం" ను 3600 పదాలతో రూపొందించి, దానికి అనుబంధంగా "పక్కసైడు పదాలు"చేర్చి ప్రచురించారు. ఒక మాట వ్యవహారంలో ఎలా వుంది? వ్యాకరణం ఏం చెబుతుంది? అనే విషయాల్ని పాఠకులకు తెలిసే విధంగా వ్యాఖ్యానంతో, అకారాది క్రమంలో రాసిన విలువైన వినూత్న నిఘంటు విది. ఒంగోలు జిల్లా గ్రామనామాలపై పరిశోధన చేశారు. వేలాదిమంది విద్యార్థులకు తమ పాఠ్యబోధనతో భాషాసాహిత్యాలపట్ల మక్కువ పెంచారు. నడకలోను, నడవడిలోను నిక్కచ్చిగా వుండే నాగమల్లీశ్వరరావుగారు వృత్తి నిబద్ధతలోను, సాహిత్యసృజనలోను ప్రమాణాలకు ప్రాణం ఇస్తారు. భాషావేత్తల పరిచయాలతో, పండిన అనుభవంతో, పఠించిన గ్రంథాల సారాన్ని సమన్వయించి "తెలుగులో నుడిముడి" అనే రచనను మన కందించారు.

నూతనపదాల సృష్టి ఏ భాషకయినా ఆవశ్యకమే! కాలాన్నిబట్టి, అవసరాన్నిబట్టి కొత్తపదాలు భాషలో చేరుతుంటాయి. ఇలా కొత్తపదాలు చేరడాన్నే ఆంగ్లంలో 'నియోలజిజం' అంటారు. దీన్నేతెలుగులో "క్రొన్నుడి" (క్రొత్తంనుడి) అన్నారు రచయిత. ఈ క్రొన్నుడులను కవులు, రచయితలు, పాత్రికేయులు తమ అవసరాల మేరకు సృష్టిస్తుంటారు. ఇవి జనవ్యవహారంలో ప్రాచుర్యం పొంది, నిఘంటువుల్లో స్థానం సంపాదిస్తాయి. మన తెలుగులో– మృగంలా ప్రవర్తించే వాణ్ణి 'మృగాడు' అంటున్నారు. విజయవాడను, విలయవాడ, విజలవాడగా (ఇటీవలి వరదల నేపథ్యంలో) అన్నారు. రాయబారాన్ని రాయబేరంగా, సమావేశాల్ని సమావేషాలుగా, అధికసంఖ్యలో ఓట్లు వేయడాన్ని ఓటెత్తడం(పోటెత్తడం)గా వ్యవహరించే వన్నీ కొన్నుడులుగానే పరిగణించాలి.

ఇంగ్లీషులో chef's kiss, bed rotting, girl dinner, simp వంటి వన్నీ కొన్నుడులుగా స్థిరపడ్డాయి. మాటల పొదుపు దీని ప్రధాన ప్రయోజనం. ఇక్కడొక ముఖ్య విషయాన్ని గమనించాలి. నియోలజిజం, పోర్ట్మాంటూ ఒకటి కావు. పోర్ట్మాంటూ, నియోలజిజంలో ఒక భాగం మాత్రమే! నియోలజిజంను (కొత్తపదాల చేరిక)

విస్తృతార్థంలోను, పోర్ట్మాంటూను పరిమితార్థంలోనూ వాడాలని రచయిత రేఖాచిత్రంతో సూచించడం సందర్భోచితంగా వుంది. అంటే క్రొన్నుడి అనేది ఒక పెద్ద నది అయితే , అందులో పాయ నుడిముడి. పూర్వపదం ఉత్తరపదం కలిసి నుడిముడి అవుతుంది. ఆంగ్లంలో breakfast+lunch రెండుపదాలు కలిసి brunch అయింది. బ్రేక్ ఫాస్ట్, లంచ్ అనేవి రెండు పదాంగాలు. వేరువేరు అర్థాలున్న రెండు పదాలవి. ఇవి రెండూ కలిసి సంక్షిప్తంగా బ్రంచ్ అనే కొత్తపదం ఏర్పడింది. రెండు నుడులను (మాటలు లేదా పదాలు) ముడి వేసి, కొత్త పదాన్ని సృష్టించడమే నుడిముడి సారాంశం. కొన్ని సార్లు రెండు కంటె ఎక్కువపదాలు కూడ కలిసి కొత్తపదం ఏర్పడుతుంది. Beautiful+fantastic+terrific ఈ మూడు కలిసి beautifantasterfic అయింది. Home+work అనే అర్థవంతమైన పదాలు కలిసి, వాటి అర్థాన్ని కోల్పోకుండా homework అనే కొత్తపదం ఏర్పడింది. అంటే ఇంటివద్ద చేసే పని. దీన్ని నుడిముడిగా చెప్పాలంటే homork అనాలి. బాగా వాడుకలో వున్న ఆంగ్లనుడిముడులు కొన్నింటిని గమనిద్దాం! Sin+cinema రెండూ కలిసి sinema అయింది. Web+seminar-webinar, web+magazine-webzine, feminine+seminar-feminar వంటి వెన్నో మనం నిత్య వ్యవహారంలో చూస్తున్నాం.

ఈ ఉదాహరణలతో బాటు, వీటి నిర్మాణవిధానాన్ని కూడ ఇందులో విశ్లేషించారు రచయిత. ఆంగ్లం విషయం అలా వుంచితే తెలుగులో నుడిముడి ఆవశ్యకతను, అవతరణ వికాసాలను డాక్టర్ నాగమల్లీశ్వరరావు గారు భాషాశాస్త్రకోణం నుంచి, వ్యాకరణసహితంగా పరిశీలించి, ప్రామాణికంగా విశ్లేషించారు. వారి మాటల్లోనే– ''నిత్యవ్యవహారంలో మన అవసరాలకోసం నూతన పదనిర్మాణం–ముఖ్యంగా సమాసకల్పనం (blending) అనేది ఎంత విస్తృతంగా పెరుగుతుందో మనం గమనించ వచ్చు. ఈ మార్పు, కొత్తదనం జీవనంలో భాషలో పదజాలంలో స్పష్టం"–(పుట–85). సంక్షిప్తత అనే అర్థంలో నుడిముడిని మనం గమనిస్తే, పాణిని ప్రత్యాహారసంజ్ఞ లన్నీ నుడిముడులే నంటారురచయిత. "అహోరాత్ర" అనే పదంలోని మొదటి అక్షరం 'అ', చివరి అక్షరం 'త్ర' ఇవి రెండు లోపించి 'హోరా' అనే కొత్తపదం ఏర్పడిందనీ, దానికి వాల్మీకిరామాయణోదాహరణతో బాటు, మిహిరుని బృహజ్జాతకాన్ని కూడ ప్రస్తావించారు రచయిత. 'అహోరాత్ర' అంటే 24 గంటల సమయం, హోర అంటే 1 గంట సమయం. ఈ 'హోరా' నుండి 'hour'అనే ఆంగ్లపదం కాలసూచికగా ప్రపంచం అంతా వాడుకలో వుంది. మన తెలుగు కవులు కూడ నుడులను చక్కగా ముడివేసి కొత్తపదాలను సృష్టించారని సోదాహరణంగా వివరించారు రచయిత. శ్రీశ్రీ, కసాయిబు (కసాయింసాయిబు) ఆరుద్ర, అహంతరిక్షమార్గం (అహం అంతరిక్షమార్గం) మొదలైన వాటిని ఉదాహరణలుగా ఇచ్చారు. హిందూ పత్రికలో యన్. కృష్ణస్వామి Indian+English రెంటినీ కలిపి Inglish అన్నారు. అంతకుముందే తెలుగునాట ప్రాచుర్యంలో వున్న నుడిముడి Telugu+English-Tenglish. ఫస్టంఅక్టోబర్–ఫస్టోబర్‌గా వాడుతున్నారు. వీటిని నుడిముడులుగానే పరిగణించాలంటారు నాగమల్లీశ్వరరావు గారు.

తెలుగులో నుడిముడికి ఇంకా ప్రాచుర్యం రాలేదు. మనవాళ్ళు దాని ప్రాధాన్యతను గుర్తించలేదు. "రెండు పదాలు కలిసి వేరే అర్థాన్ని స్ఫురింపజేసినపుడు మాత్రమే దాన్ని 'నుడిముడి' గా వ్యవహరించాలంటారు రచయిత. వీటి నిర్మాణ రీతులను అన్య దేశ్యంం అన్యదేశ్యం, దేశ్యందేశ్యం, అన్యదేశ్యందేశ్యం, దేశ్యంఅన్యదేశ్యంఅని నాలుగు విధాలుగా విశ్లేషించారు రచయితశివంవాణి–శివాణి, చేరాంరాతలు–చేరాతలు మొ.

"భాష అనేది శాశ్వతంగా కట్టుబాట్లకు కట్టుబడేది కాదు, పరిమితులకు పట్టుబడేది కాదు. అలా కట్టుబడడం, పట్టుబడడం జీవద్భాషాలక్షణమే కాదు'' అంటారు నాగమల్లీశ్వరరావుగారు. మనం చర్చించుకుంటున్న నుడిముడి భాషాపరిణామంలో భాగమే. దీన్ని వ్యాకరణసంబంధంగాను, సమాససంబంధిగాను, శబ్ద పల్లవాలలోను, వ్యవహారసంబంధంగాను, వ్యక్తినామాల్లోను మనం గమనించవచ్చు. క్రొన్నెల (క్రొత్తంనెల), వెన్నెల (వెల్లంనెల) వగైరాలను నుడిముడులుగానే చెప్పాలి. నిత్య వ్యవహారంలోను, ప్రసారమాధ్యమాల్లోను వ్యాప్తిలోకి వస్తున్న టీచరుం కీచకుడు – టీచకుడు, కిలాడింలేడి–కిలేడి, ఆహాం ఆశ్చర్యం–హాశ్చర్యం అనడం క్రొన్నుడులు. పార్టీల పేర్లను

సంక్షిప్తీకరించి భాజపా, తెదేపా, వైకాపా, భారాస వంటివి, వ్యక్తినామాల్లో బీనాదేవి, ఆనందారామం, కారా, కోరా, కొకు, రావిశాస్త్రి, జరుక్ శాస్త్రి, ద్వానాశాస్త్రి, వివినమూర్తి, భరాగో వంటివి, అరసం, విరసం, ప్రరసం, వంటి సంక్షిప్తనామాలు క్రొన్నుడులకు ప్రతీకలే. ఇక సెల్ ఫోన్ మెసేజీల్లో అధికభాగం సంక్షిప్తాలే. Thank you అనడానికి బదులు tq అనడం, take careను tc అనడం, గుడ్ బై, బై గా మారడం, గవర్నమెంట్, gov కావడం వగైరాలన్నీ ఈ తరం భాషకు సంక్షిప్త సంకేతాలుగాను, సందేశాలు గాను పేర్కొనాలి. ''ఈ-పరిభాషలో అధికశాతం నుడిముడులే" నని నాగమల్లీశ్వరరావుగారు స్పష్టం చేశారు. ఉదాహరణకు-ఈకాలం, ఈతరం, ఈవ్యాపారం, ఈసేవ, ఈటీవీ (ఈనాడు+TV), HMTV (Hyderabad Metro TV), earsky (earth+sky) కాలంలో మార్పును మనం శిరసావహించాల్సిందే. వేషం మారింది, భాష మారింది, అలాగే నట్టిల్లు- నెట్టిల్లు అయిందంటారు రచయిత." పురాణాలు పుక్కిట పట్టడం" నాటి నుడి అయితే మొబైల్ గుప్పిట పట్టడం నేటినుడి" అని నాగమల్లీశ్వరరావు గారుచమత్కరించారు. సమోసా తయారీలో మోసం వుంటే దాన్ని సమోసంమోసం-సమోసం అనడం దీనికి సరికొత్త ఉదాహరణ. భాషను నవీనీకరించడానికి వ్యవహారానికి అనుగుణంగా సంక్షిప్తీకరించడానికి నుడిముడి అవసరమా? అంటే, అవసరమే నంటున్నారు డాక్టర్ నాగమల్లీశ్వరరావు గారు. ముఖ్యంగా సోషల్ మీడియాతో కొత్తకొత్తపదాలు, మాటలు వాడుకలోకి వస్తున్నాయి. భాషాభిమానులంతా ఈ మార్పును స్వాగతించాల్సిందే.

డాక్టర్ నాగమల్లీశ్వరరావుగారు పరిశీలనాత్మకంగా, పరిశోధనాత్మకంగారచించి, ప్రచురించిన "తెలుగులో నుడిముడి", ఈ తరహా రచనల్లో తొలి పుస్తకంగా చెప్పాలి. ఆయన పరిశోధనానంతర పరిశోధన ఇది. ఈ పరిశోధన, మున్ముందు పరశోధనకు కూడా ఉపకరించాలని ఆయన తపన. పదాలు, పదాంశాలు, పదాంగాలు, విభక్తులు, ప్రత్యయాలు, ప్రాతిపదికలు, వ్యాకరణం, సమాసాలు, క్రియలు, ధాతువులు, శబ్దపల్లవాలు వగైరా లన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి, ముడిసరుకును సేకరించి, మేలిమి సరుకుగా మార్చి, ''తెలుగులో నుడిముడి'' ని ప్రయోగాత్మకంగా రాశారు. ఆంగ్లంలో ఇప్పటికే బాగా ప్రాచుర్యంలో వున్న portmanteau, neologism లు తెలుగులో ఎలా ప్రవేశించిందీ, ప్రాచుర్యంలోకి వస్తుందీ సోదాహరణంగా వివరించారు. మాటల్లోను, రాతల్లోను భాషకు సంక్షిప్తత ప్రాణం. దీన్నే మన ప్రాచీన ఆధునిక కవులు, సాహితీవేత్తలు, వ్యాకరణవేత్తలు, 'అల్పాక్షరాలలో అనల్పార్థరచన' అన్నారు. అంటే అక్షరాలు తగ్గించడం మాత్రమే కాదు, పదాలను కుదించడం, పదాలను కలవడం కూడ ఇందులో భాగవే అంటారు నాగమల్లీశ్వరరావు గారు.

నుడి, ముడి రెండూ మన తెలుగు మాటలే. ఇందులో నుడి అంటే పలుకు, మాట అని అర్థం. ముడి అంటే ముడివేయడం, బంధించడం. నుడులను ముడివేయడమే నుడిముడి. జుట్టుముడి, పీటముడి, బ్రహ్మముడి మన వ్యవహారంలో వున్నవే. తెలుగు నుడి కడలి అనే నిఘంటువు మనకున్నది. డాక్టర్ తిరుమల రామచంద్రగారు "నుడి-నానుడి" అనే పేరుతో విలువైన గ్రంథం రాశారు. తెలుగు జాతీయాల్లో నుడికారపు సొంపులు మనకు తెలిసినవే. నుడిముడిని,సమాసం అనే దానికి సమానార్థకంగా కూడా స్వీకరించవచ్చు. అనేకపదాలను ఏకపదంగా చేయడం నూతనత్వం అయితే, దాన్ని మరింత కుదింపజేసి దాని కొక నూతనపదాన్ని, నూతనార్థాన్ని కిట్టింపజేయడం అనేది నుడిముడిలో కనిపించే లక్షణం. సమసనంలో ఇదొక ముందడుగు అన్నమాట"-అని నుడిముడిని వివరించారు రచయిత. సంధిలో పూర్వోత్తరపదాల కలయిక లాంటిదే సమాసంలోని పూర్వోత్తరపదాల కలయిక. కాబట్టి నుడిముడికి సంహితత్వం (కలయిక) ప్రాథమికలక్షణం.

నాగమల్లీశ్వరరావు గారు నుడిముడికి మన వ్యాకరణవ్యవస్థ ఎలా ప్రాతిపదికగా నిల్చిందో సవివరంగా తెలిపారు. అందుకు ప్రాతంఇల్లు-ప్రాయిల్లు, లేతందూడ-లేదూడ, పూవుంరెమ్మ-పూరెమ్మ, వంటి వాటిని చర్చించారు. మన తెలుగులోని ద్వంద్వసమాసానికి, నుడిముడికి కొన్ని సాదృశ్యాలను మల్లీశ్వరరావుగారు చెప్పారు. సమాసంలో రెండు పదాలకు సమానప్రాధాన్యత వుండటాన్ని ద్వంద్వం అంటారు. ఉదాహరణకు తల్లిదండ్రులు. నుడిముడిలోనూ ఇదే లక్షణం కన్పిస్తుంది. కాబట్టి సమాసానికి నవ్యరూపవే నుడిముడి అని స్పష్టమవుతుంది. కాబట్టి నుడిముడి బంధం మూడుముళ్ళ

బంధం వంటిదని మల్లీశ్వరరావు గారు చమత్కరించారు. "మొత్తమ్మీద నుడిముడి అనేది నూతనపదకల్పనలో ఒక నూతననిర్మాణాత్మకనిరంతరప్రక్రియ, కాబట్టి దాని పరిధి కూడా దినదినాభివృద్ధికాదు, క్షణక్షణాభివృద్ధి చెందుతోంది. కోశనిర్మాణంలోను దాని పాత్ర పెరుగుతోంది. అది వాస్తవవిషయం" అంటారు రచయిత (పుట-122). ఇంగ్లీషులో వాడుకలో ఉన్న సుమారు రెండువేలకుపైగా నుడిముడులను కొన్నిటిని పుస్తకంలో అనుబంధంగాను, మరి కొన్నిటిని (ఒక వెబ్సైట్ రూపొందించి, అందులో) - యూ ఆర్ యల్ గాను ఇచ్చారు. దాన్ని కావలసినవారు ఇంటర్నెట్ నుండి దిగుమతి చేసికోవచ్చు.

నుడుల్ని ముడివేసి కొత్తపదాలను సృష్టించే నుడిముడివలన భాషకు ప్రయోజన మేమిటి?- అనే ప్రశ్న సహజంగానే వస్తుంది. మనం సాంకేతికయుగంలో వున్నాం. దైనందిన జీవితమంతా సాంకేతికత మీద ఆధారపడి సాగుతుంది. మన అవసరాలకు అనుగుణంగా భాషను కూడ మార్చుకోక తప్పదు. ఇంటర్నెట్‌లో మనం చూసేదంతా సాంకేతికభాషే (code language). మనం వద్దన్నా, కద్దన్నా ఈ సాంకేతికభాష మన నిత్యవ్యవహారం లోకి చొరపడుతుంది. మనల్ని ప్రభావితం చేస్తుంది. దబ్బు పోదుపు ఎలా వున్నా, మాటల పొదుపుకు అలవాటు పడ్డ మనం మాటల్ని కుదించి, సరికొత్త పదబంధాల్ని సృష్టించు కుంటున్నాం. అలా పుట్టినవే వెబినార్, బ్రంచ్, వందపప్పు (కందిపప్పు ధర వందకు చేరిన నేపథ్యంలో మీడియా సృష్టి), శివాణి వంటివి సరికొత్త నుడిముడులు.

సైన్సులో నిత్యం ప్రయోగాలు జరిగినట్లే భాషలోనూ జరగాలి. నూతనత్వం, చేతనత్వం భాషకు ప్రాణ వాయువులు. 'ఎవరూ సృష్టించకుండా కొత్తపదాలు ఎలా పుడతాయి?'అన్న సినిమా సూక్తి, నుడిముడికి ఆద్యోక్తి. నుడికారానికి పుట్టిల్లయిన తెలుగులోని నుడిముడులను ముడివేసి, భాషాశాస్త్రంలో సరికొత్త ఆలోచనకు, రచనకు శ్రీకారం చుట్టిన డాక్టర్ పి.నాగమల్లీశ్వరరావుగారికి తెలుగు సాహితీలోకం పక్షాన మనసారా అభినందనలు.

*"తెలుగులో నుడిముడి" పుస్తకం కావలసిన వారు 99499 71261 నెంబరుకు ఫోను చేసి రూ.220/- చెల్లించి,పొందవచ్చు.*

**డాక్టర్ బీరం సుందరరావు, ఫోన్ : 63034 43302**

## కమ్మతెమ్మెరలు

చాలాకాలం నుండి **మిసిమి**ని చదివే వారిలో నేనొకణ్ణి, (రెగ్యులర్ చందాదారుణ్ణి కూడా) ప్రతి పత్రిక విశేష విషయాన్వితం - చిత్రకళా పరిపూర్ణం కావడం ఆనందదాయకంగా వుంటున్నది. ఈ ఫిబ్రవరి (2025) సంచికలో శ్రీమాన్ ఎం. పురుషోత్తమాచార్యుల వారి 'లలిత సంగీత పరిమళం' చాలా బాగున్నది. 'ఏడు కొండల సామీ..' 'నమో వేంకటేశా....' పాటలు - రాగపద్ధతులు తెల్పటమేగాక వాటిలోని పాఠాంతరాలను యిచ్చి అర్థ వివరణ చేయటం ప్రశంసనీయం. 'పట్నంలో శాలిబండా'.. పాటను రచించిన ఆచ్చి వేణుగోపాలాచార్య గారు కూడా ఇదే పద్ధతి వేంకటేశ్వర - గేయం రచించినారు. దాన్నికూడా సమయ సందర్భాలను చూచి - విశ్లేషించగలరని ఆశంస.



'వేమన మానవతా వాద దృక్పథం' - వ్యాసం బాగున్నది. కాని - రచయిత (త్రి) 'వేమన శతకం' అనటం బాగాలేదు, అవి వేమన పద్యాలే కాని 'శతకం' కాదు, ఎవరైనా నూరు పద్యాలను వేసి 'శతకం' అనవచ్చునేమో! అప్పాజోస్యుల వారి పద్యాలను నూతన పద్ధతిలో తెల్పిన 'సమీర పద్య తారావళి' చాల బాగున్నది. రచయిత్రికి ధన్యవాదాలు - ఇట్లా **మిసిమి** ప్రతి విషయం నిరంతరం ఆలోచనీయం. ఈరోజుల్లో ఇంత విలువైన చింతనాత్మక సాహిత్య పత్రికను వెలువరిస్తున్న తమరికి ధన్యవాదాలతో -

*- డా. శ్రీ రంగాచార్య, హరిపురి కాలనీ, హైదరాబాద్*




**– డా. జొన్నలగడ్డ మార్కండేయులు**

**కా**ళ్ళు,చేతులు కడుక్కోండి. భోంచేసేద్దురుగాని పిలుపు ఎప్పుడూ ఉంటుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటితే లంచ్. రాత్రి ఎనిమిదిదాటితే డిన్నర్. నేటి నాగరికత ఆతిధ్య ధర్మం ‘భోజనానికి రండి’ సమానార్థముగ తెలుగు పిలుపు. ఆంగ్లపదాలు. ఆత్మీయ ధ్వని. వివాహ భోజనంగ విందు పిలుపులో శుభలేఖాహ్వానముగ వియ్యాలవారి విందుకు కూడ ప్రశంస పదము సందడి జాతరలు, దేవుడి కల్యాణోత్సవాలు, లక్షపత్రిపూజలు, వనభోజనాలు, పుట్టినరోజు పండగలు, షష్టిపూర్తి వేడుక విందు (get,together), దివ్యాశీస్సుల సంవత్సరీకములలో భోజనాల సందడికి పిలుపు ఉంది. అన్నదానం, సంతర్పణ, సమారాధన సంప్రదాయక పేర్లు గౌరవాహ్వానం భోజనసమయం పిలుపు మాత్రం ఉమ్మడి సహకార భోజనం లంచ్, డిన్నర్ పదాలు యాదృచ్ఛికము... అయినా విందు, సమారాధన, సహపంక్తి భోజనము చేసిన సమయాన్ని బట్టి భోజనానానికి రండి పిలుపును లంచ్ డిన్నర్ చేసాము కొందరి అలవాటు పదాలు ఆరగింపు సజీవం ధ్వనిస్తాయి. పంక్తివేసేసారు. వడ్డనలు అయిపోతున్నాయి. వచ్చి పంక్తిలో కూర్చోండి. ఇది అచ్చమైన ఈ భోజన సమయం తెలుగు పిలుపు లేదనడం నా ఉద్దేశం కాదు. పంక్తి అంటే కింద కావచ్చు, టేబిళ్ళమీద కావచ్చు భోజనపత్రము, లేదా పాత్రలలో విందుపదార్థాల వడ్డన ఆస్వాదనకు పిలుపు.

అప్పుడు భోజనపత్రమును విస్తరి అనేవారు. ఇప్పుడు వాడుకలో తక్కువ. బఫే?! ఇప్పుడు బఫే హస్తవిస్తరిగ భోజన పదార్థాలు నింపుకోవాలి. హస్తవిస్తరి ఎవరికోసం ఆగదు. పంక్తి పేరు మారలేదు.“లంచ్ రెడీ” “డిన్నర్ రెడీ” అని ఉచిత భోజనానికి విందు కావచ్చు లేదా బలవంతపు బ్రాహ్మణార్ధము తప్పనిసరి ఆరగింపు కావచ్చు ఓపనైపోతుంది బాబు అని వరుస (పంక్తి)లో నిలబడి ఆరగింపు పరుగు విందుభోజనానికి ’బఫే’ అని పేరు. అదో భోజన తృప్తి విస్తరి! నేటికాలపు బహుళము. వింతైన సహపంక్తి తృప్తి విందు. ఈ సహ పంక్తికి బఫే పేరుగ ఘటోత్కచ ఉత్సాహము పెళ్ళి విందు అపూర్వము. వింతైన వంటకంబు అని పేరుపేరునా ఘటోత్కచ వంటకాలులోని తెలుగు వంటకాలను మరపించేస్తారు. ఔరౌర ఫిజ్జా, ఒహొహ్హొ పానీపూరి, జిహ్వ జిల్లుమను ఐస్ క్రీం ఎవరికి వారె ఘటోత్కచులైపోయే సందడే సందడి.. స్థిమితముగ ఒకచోట నిలువదు. హస్త విస్తరి భోజనపళ్ళెం పుచ్చుకుని వరుసలో నుంచునే బఫేవిందు కనువిందు పసందు వడ్డన, విస్తరి మాట మరుగుపడిన గోల వినేవారెవరు?. వియ్యాలవారి విందువహ్వా ఏమిరుచి పెళ్ళిసందడి మధురము. బఫే వడ్డనదారుని ‘మమదేహి ఇష్టాహారం’ అంటూ చేయిచాస్తుంది. లేదా స్వయం వడ్డన. సామూహిక పంక్తి భోజనపత్రంను తలపించే హస్త విస్తరి భోజనపాత్ర విందుకు బంధుమిత్ర సపరివార విహారమునకు. విస్తరి పేరు కొత్తది కాదు. సహపంక్తివిస్తరిగ చరిత్ర ఉంది.

విస్తరి అంటే భోజన పత్రంగ విందుకు కూడ ఉంటుంది.. వడ్డించిన పదర్థాలు కలది. వరుసలో కూర్చుని వడ్డించిన భోజనపత్రము బాసింపట్టు వేసుకుని ముందు పెట్టుకుని ఆరగిస్తాము. చాపకూడుగ హెచ్చుతగ్గులు లేని సర్వజన సహపంక్తి. బంతికూడు సంఘసమతాభావ సాక్ష్యము.బంతిలో బాసింపట్టు వేయలేని రోజులివి. అయినా ప్రత్యామ్నాయం బంతి టేబిలుమీల్సు సమతా భావము విస్తరివేయడం భోజనానికి బంధుత్వ ఆత్మీయ గౌరవం. నీ ఇంట్లో విస్తరి వేయనంటే బంధు కలహం అనే మాట తెలుగువారిది. విస్తరిముందు నుంచి లేచిపోవడం అహంకారం. విస్తరి అందమైన పదం. విస్తరి భుజింప పదార్థాలు కలదిగ తెలిసికోదగ్గది. ఈనాడు విస్తరి పదంవాడము. కాని వడ్డించిన పదార్థాలకు పత్రమో, కంచమో విస్తరే అవుతోంది.

బఫేను హస్తవిస్తరికి విందు స్వయంవడ్డన అనొచ్చు. భోజనపత్రంగ భోజన కంచంగ స్వయం వడ్డనగ పదార్థాలుతో విస్తరే అనొచ్చు. టెబిలైనా, కిందయినా కూర్చునే వ్యక్తికి వడ్డించిన పదార్థాలుగ కూడ టేబిలు మీద వడ్డన కంచంకు విస్తరిపత్రంకు గుర్తింపు ఉంది.. ఇంతకీ విస్తరికి ఉపయోగిస్తున్నవి ఏమిటి?

విస్తరికి ఉపయోగించేవిగ పేరు అరిటాకులు శ్రేష్టం. కుట్టుదాకులకు విస్తరిగ పేరుంది. కుట్టి వృత్తిగా అమ్మేవారివి అంగడిలో దొరుకుతాయి. అడ్డాకులుగ పేరు.. భోజనానికి కూర్చున్నవారి ముందు వేసి వడ్డన చేస్తారు కాబట్టి విస్తరి అంటే అర్ధవివరణకు నిఘంటువు వెదక్కరలేదు. పెళ్ళికట్నంలో పెళ్ళికొడుకుకు బహుమతిపళ్ళెం వెండిది అరిటాకు, అడ్డాకు అనుకరణ వెండికంచం ఇస్తాము కాని చేత్తో బఫేలో దేహి అని అడగాలి కాబట్టి పట్టుకోలేము. వెండివి అందరికీ ఇవ్వలేము. కాబట్టి పింగాణి కంచం, అనుకరణ అరిటాకు, అడ్డాకు కంచాలుగ కుంగనా, మాననా అని నాట్యంచేసే ప్లాస్టిక్ కంచం, టిఫిను ప్లేటు భోజనపత్రం సంప్రదాయాన్ని గౌరవిస్తున్నాయి. దళసరి విస్తరి బఫే వడ్డన హస్తవిస్తరి విందు విత్తంకొద్దీ విభవంగ భోజనపత్రం ఖరీదుకు దొరుకుతున్నాయి.. అరచేత్తోపట్టుకు తిరగాలి గనక చేతిపట్టువిస్తరి అందాం. స్వయం వడ్డన విస్తరి చేతికొస్తుంది బఫేకైనా, పంక్తికైనా. వడ్డన చేసేవారు లేకపోలేదు. అందమైన టేబిలు మీల్సు పదంగా సహపంక్తి భోజనం హొయలు వలికిస్తూ ఆడ మగ ఆప్యాయతల కొసరి కొసరి వడ్డింపు నడుంపట్టనంతసేపు మాత్రమే హుషారు. సమయం గడిచేకొద్దీ తప్పించుక తిరుగువాడు ధన్యుడుగ ఉన్నాననిపిస్తాడు. నుంచున్నందుకు కాళ్ళుపీకినా అభయహస్త విస్తరి సందడి నిలకడ వహ్వా తృప్తికి కొలబద్దలేదు..

బఫే వచ్చేక సహపంక్తి భోజనం ఐచ్చికం. కింద నేలమీద సహపంక్తి విస్తరి వడ్డన దాదాపు కనుమరుగైంది. విస్తరి వడ్డన సహపంక్తి భోజనం ఐచ్ఛికం. ఒకప్పటి విస్తరి వడ్డనలు గుర్తుచేసుకుందాం. వంటవారు దొరకడం పెద్దసమస్య. కట్టెలకు సమస్య, గాడిపొయ్యి సమస్య. వంటాసామాగ్రి కనీసం మూడు నాలుగు పెద్దపెద్ద పాత్రలు పొయ్యికింద కట్టెలమంటకు కావాలి.. కులసంఘాలు ఒకరికొకరు సహాయముగ మాత్రమె వంటవారు అడిగే వంట పాత్రసామాగ్రి ఇవ్వగలిగేవారు.. ఒకటీ అరా గుండిగలు, అడ్డెడు గిన్నెలు గల గృహాలు ఉండేవి. సేకరణ ప్రయత్నం నియమ నిబంధన సాధకబాధకాలు టెంటుహౌసు నాగరికతలో మిలీనియం క్రీస్తుపూర్వము కబుర్లనిపిస్తాయి. భోజనాలు చేసేవారికి సరిపడస్థలములో నీడకు తాటాకు పందిళ్ళు వేసేవారు. వినాయకచవితి. నవరాత్రి ఉత్సవాలకు పందిళ్ళు హడావుడి పేరు మరిచి పోయాము. టెంటులు వేస్తున్నారు.. పిడుక్కి, బియ్యానికి శుభాశుభానికి టెంటు తాత్కాలిక ఆక్రమణ..

ఒకప్పుడు అరిటాకులు అడ్డాకులు విరివిగా దొరికేవి, అరిటాకులు సేకరణ శ్రమతో కూడినది. కాని అడ్డాకులతో విస్తరిని పుల్లలతో కుట్టేవారు. విస్తళ్ళు కుట్టడం కుటీరపరిశ్రమ. ఇప్పటికీ దేవాలయ ప్రాంగణములో ప్రసాద వితరణ దొన్నెలు విస్తరాకులకు ఉపయోగిస్తున్న ఆకులుగ విస్తరాకును గుర్తుచేస్తాయి. అమ్మకానికి దొరకినా గొంతుకు అడ్డపడే పుల్లలు చికాకును భరించలేకపోయాము. ప్లాస్టిక్కును. నిషేధిద్దాము నాలిక చివరిమాట అంది. ప్లాస్టిక్కే దిక్కు. ఇంచక్కా బాసింపట్టు (కిందకూర్చోవడం) వేసుకుని అరిటకు లేదా అడ్డాకు విస్తరిలో పదార్థాలు వడ్డన మధురానుభూతికి అడ్డాకులు, అరిటాకులు పోలికలు అనుకరణ తప్పనిసరయింది. తయారీగా ప్లాస్టిక్ ఈబాధ తొలగించింది. మంచినీళ్ళకు త్రాగడానికి సామూహిక భోజనాలకు గ్లాసులు ఇంటినుంచి తెచ్చుకునేవారు. పల్లెటూరులో వంటపాత్రసామాగ్రిలో కూడ ఉండేవి. ఇప్పుడు పూర్తిగా అద్దె దుకాణలు వచ్చేసాయి. వంటపాత్ర సామాగ్రి అద్దె దుకాణాలు అన్నిచోట్లా వచ్చేసాయి. విందు పసందుకాని సోది కబుర్లకు స్వస్తి చెప్పెయ్యక తప్పదు.

బఫే విందులో హెచ్చుతగ్గులుండవు. ఆదరణ, నిరాదరణ చర్చకురావు. ఒకప్పుడు బంతివేసాక వడ్డన సాగేది. వడ్డన అయ్యేదాకా ముట్టేవారు కాదు. ముఖ్యుల కోసం ఎదురు చూసేవారు. ఇప్పుడు ఎవరి హడావుడి వారిది.. విందుపదార్థాలు పప్పుదప్పళం, గుత్తివంకాయ కూర, కొత్తావకాయ, దోసావకాయ, గోంగూర పచ్చడి, కందిపొడి రసం సర్వసాధారణం.

“చందమామరావే” అంటూ వెండిగిన్నెలో పాట బాగుంటుంది. అమ్మ గోరుముద్దలు తినిపించడం మనకు తెలియదు. కాని తమ్ముడికి, చెల్లాల్లయికి తినిపించడం చూసిన గుర్తు ఉంది. జాబిల్లి రావే అని పిలిచి పెట్టక పోయినా “ఆకేసి పప్పేసి” అత్తారింటికి పంపే కితకితలు గుర్తున్నాయి. పప్పు ముందు తినడం అత్తారింటిమీద ఆశే అనిపిస్తుంది. పప్పన్నం ఎప్పుడు పెడతారన్నది అనడగడం అత్తారింటికి దారేనన్నది నిలిచిన మాట. అప్పుచేసి అయినా ఆడపిల్లను అత్తారింటి పంపుతాము. అప్పు చేసిన

పప్పుకూడుకు అంత ప్రాధాన్యముంది. పప్పులేని విందు ఊహించలేము. పెళ్ళి విందులో తప్పనిసరి. ఏ విందుకైనా పప్పులేని భోజనము ఉండదు. పప్పు చులకన. కాని వడ్డనకు అది ముందు పసందు.

ముద్దపప్పు, పెసరపప్పు, మామిడి, దోసకాయ, టొమోటా కలగాపులగం వింతైన వంటకము. పప్పు తిన్నాడు, పప్పుచేసేస్తాను, పప్పుగాడు ముద్దపప్పు గాడు నాతో పెట్టుకున్నాడు అని కసిగా పప్పుకు చులకన భావము. నిందాస్తుతిలో తెలుగు భోజనము పప్పు దప్పళము వింత వంటకము. పప్పుతో పదికబళాలు చాలు పులుసెందుకు బుగ్గిలోకి అని సామెత ఉంది. బుగ్గి అంటే బూడిద. కాలే కడుపుకు ఇంత మండే బూడిద అన్నది వేదాంతధోణి. కాని పప్పు దప్పళం అని పప్పుకు దప్పళంతో జతగ తెలుగు వారికి ప్రియమైన భోజన వంటకము. పప్పుదప్పళము అనేది మరిచిపోలేని పసందు ఏ విందుకైనా సరే ముఖ్యంగా వివాహవిందు భోజనములో ఇప్పుడూ ఆత్మీయమైన మాట.

వివాహ భోజనంబు, వింతైన వంటకంబు వియ్యాల వారి విందు, అహహ్హ నాకెముందు" అని ఘటోత్కచుడు పెళ్ళివిందు ఆరగించాడు. వింతైన వంటకంబు ఆరగింపు చలనచిత్రము.. వింతైన వంటకంబులో పప్పుదప్పళం ఉందా? ఉండే ఉంటుంది. వింతైన వంటకంబుగ అహహ్హ నాకెముందు అనుకున్నది పప్పుఅన్నం అనిపిస్తుంది. పప్పు వడ్డనలేని పెళ్ళివిందు ఉండదు మరి. పప్పు అన్నం వింతైన వంటకము. ఎవరూ సృష్టించక పోతే పదాలెలా పుడతాయని వీరతాళ్ళు అడగను. అందుచేత ఘటోత్కచుడు పప్పు తిన్నాడని వ్యాసంలో కించ పరచలేదు. సరదాగా పప్పన్నంగ ప్రస్తావనను నాకె ముందు అన్నాడన్న చలోక్తిగ ముచ్చటయిది. వ్యంగ్యము కాదు. కాదేది కవిత కనర్హం. అలాగే వ్యాస ముచ్చటగా పప్పన్నం వస్తువు వ్యాసాని కనర్హము కాదు. నలభీముల వంటి వారు పాకశాస్త్ర ప్రవీణులు. రుచికరమైన వంటలతో నేటి పెళ్ళివిందు పోల్చదగినదే. అపూర్వము. వంటవారిగ నలభీముల ఆనాటి రుచులు లొట్ట లేయించేస్తున్న చెఫ్స్ విశేషాలు మాత్రం కావివి. ఎందుకంటె నలభీముల పేర్లు విన్నవారము. కాబట్టి ఒకప్పుటి ఇప్పుడు "చెఫ్స్ వంటశాస్త్ర" సాధికార నలభీమపాకనిపుణులుగ అభినందనీయులే! కాని దేశాన్నేలిన మహారాజులుగా వంటచేసిన ఖ్యాతి నలభీములది. నలభీములు చేసిన వంటకమువునో కాదు తెలియదు. కాని పాతకాలపు పెళ్ళి విందులోని నిత్య ప్రస్తావన పప్పన్నంకు ప్రశంస ఈ వ్యాసము. ఎన్నివేషాలు వేసినా బ్రాహ్మణవేషం పప్పుతినాల్సిందే.. పప్పుతిన్నాడు అన్నది చులకనగా చేసి వాడేమాట. కాని కృష్ణభగవానుడి నటనలో పండిపోయిన చతురుడు నటరత్న ఎంటీయారు గారు భీముడి చేత పప్పు తినిపించారు. పాండవ వనవాసంలో ఏకచక్రపురంలో భీముడు క్షత్రియుడు కాదు. ఎవరూ అనుమానించలేనంత శుద్ధ బ్రాహ్మణుడుగ పప్పన్నము మీద మోజు పడ్డాడు బకాసురుడిని చంపాల్సిన సమయంలో భీమునికోసము ఏర్పాటు చేసిన బండిలో ఆహార పదార్థాలతో బయలుదేరాడు. పప్పు తినిపించాల్సిన బకాసురుడితో బలంకోసం పప్పు తిన్నాడు? పప్పుతిన్నాడని చులకన చేయలేము."బళాబళి నాబండి పరుగులుతీసే నాబండి" మనచేతకూడ పాడించాడు. కరకర ఆకలి మండుతుంటే గుటకలు మింగుతు చూసేవాడు వెఱ్ఱివాడు. ఆ కమ్మటి భోజనాన్ని భీముడు "పప్పుతోటి ముద్దకలిపి పచ్చడితో అనుపానమేసి" అని ఆరగిస్తాడు, ఏకచక్రపురం కాలంనుంచీ మహాభారత కాలంనాటికే ఈ పప్పన్నం జానపద సీమలోకి వచ్చేసింది.

ఏకచక్రపుర బ్రాహ్మణ స్మరణ పప్పన్నం బ్రాహ్మణులు అర్జునుడు మత్స్యయంత్రము కొట్టినా బ్రాహ్మణులు ఆ పప్పు వీరత్వాన్ని ఖాతాలో వేసుకోలేక పోయారు. పప్పుతిన్న భీమబలుడి తృప్తి పప్పన్నం మాట, పప్పన్నము = పప్పు అన్నము ఉత్సాహపరుస్తుంది. పప్పు వడ్డనలేని పెళ్ళి విందు ఉండదు. కాని పప్పన్నము పెళ్ళివిందు అని పేరు ఎందుకు తగిలించము? మాంసాహారము ప్రత్యేక మెనూ పెళ్ళి విందులో కూడ పప్పు వంటకము ఉంటోంది. ఎందుకంటే మాంసా హారము తినని భీషణ ప్రతిజ్ఞులు కులాతీతము. శాకాహారముతో దుష్టము దృశ్యము గ్రాహ్యము.

బ్రాహ్మణవిందుగ ఒకప్పుడు పప్పన్నం ఎప్పుడు పెడతారు? పెళ్ళీడుకొచ్చిన ఆడపిల్లను చూసినపుడు దీవించిన పెద్ద మనసు గలవారి కులాతీత ఐకమత్య దీవనది. శ్రేయోభిలాషులుగ ఆడపిల్ల తల్లిదండ్రులకు పులకరింపు పలకరింపు. జానపదం పదం శుభాకాంక్షలు. తొందరలోనే పెళ్ళిజరుగుతుందన్న ఆ ఆశీస్సు పెళ్ళి

విందు. పప్పన్నం విందు. ఆహ్వానించ దగ్గ అరుదైపోతున్న అచ్చతెనుగుతేట తేనియ విందు పలుకు. కుల సమాజము ధ్వనించే దద్యాజ్యశాల్యోదన కనువిందులో కులాతీత ప్రియత్వ మహారాజ భోజనవిందుగ ఆహ్వానపత్రము. అందుచేత 'డిన్నర్' పదం నిలద్రొక్కుకుంది.. పప్పన్నం విందు బ్రాహ్మణాధిక్యత పదం కాదు. శాకాహార, మాంసాహార విభాగాలు ఐచ్చిక విందు భోజనముగ పప్పన్నంగా నేడుపయోగములేని పదము..

ఎవరికి కావలసినది వారికి అందించే విందు. ఫిజ్జా బర్గరు పానీపూరి వంటివి' దోసెలు వడలు పెసరట్టుప్మాలు విత్తం కొలదీ విభవం ఆరిపోని పొయ్యిలమీద అప్పటికప్పుడు వేడిగా తినొచ్చు. చేయి చాచి అడగాలి. స్వయంగా కూడ వడ్డించుకు తినొచ్చు. ఒకప్పుడు నలభీముల కాలంలోను ఉండేది అంటే ప్రమాణము చూపు అని వెక్కిరిస్తారు. ఇలా వేడిగా అప్పటికప్పుడు పదార్థాల సరఫరా నలుడికి తెలుసు. నలమహారాజు చిన్నగడ్డిపరక మంత్రించి పొయ్యి వెలిగించేవాడు. ఇది కచ్చితంగా గ్యాసు స్టవ్. ఎందుకంటే వంట పూర్తయేదాకా అలా వెలుగుతూనే ఉండేది. ఉప్పు బుట్టను పైకెత్తి వంచేవాడు. ఎంత ఉప్పు కావాలో అంతవరకే ఉప్పు పడేది. మహాభారతం నలదమయంతుల కథలో ఈ విషయం ఉంది. కాసేపు విందు మాటపక్కన పెడదాము. నలుడు భీముడు సాధారణ భాషలో వంటవారిగా పేరుపడ్డారు. కాని వారు పాకశాస్త్ర నిపుణులు. పాకశాస్త్రము అంటే వంటవండే కళ అనుకుంటే తప్పు. పాకశాస్త్రము అన్నది ఆయుర్వేదములో ఒక భాగము. అందులో మందులను వండుతారు. మందులకు ఔషదము అనిపేరు. వాటి తయారీకి వాడే దినుసులు, మూలికలకు ఔషధసిద్ధిగ సరియైన పాకము వచ్చే వరకు చేసిన పచనమునకు వంట పేరుగ పాకశాస్త్రము అని పేరు వచ్చింది.

ఆరోగ్యమే మహాభాగ్యములో ఆహారము కూడ సశాస్త్రీయమైన పాకముగ నలభీములు తయారుచేసిన పాకశాస్త్ర నిపుణులు. పాకశాస్త్రములో ఋజు వుంది. అజ్ఞాత వాసములో విరాటకొల్వులో భీముడు మనం ఇప్పుడు ఆప్యాయంగా ఆదరిస్తున్న చారు ఆరోగ్య ప్రదాయినిని తయారు చేసాడు. అది ఇప్పటి విందుకు ముందు సరఫరాచేసే 'సూపు' లాంటిది. విందుకు ముందు ఇలాంటిది. విరాటుడు సభ జరుగుతుండగా భీముడు అందరికీ అది ఇవ్వలనుకున్నాడు. ఆనాటి సూపు పేరు 'చారు' అన్నయ్యంటే భక్తికదా! ముందు రుచి చూపించాడు. అది గనక రుచి చూసి మెచ్చుకుంటే భీముడి ఖ్యాతి అతనితోబాటు పాండవులు బయటపడిపోతారని ధర్మరాజు విసిరి కొట్టాడు. ఆ చారు అక్కడ ఉన్న కొయ్య స్తంభము మీదపడి చిగురించింది. ఎండిపోయిన మ్రానును కూడ చిగురింపచేసిన భీముని చారు లేని విందు గాని గృహము కాని లేవంటే అతిశయోక్తి కాదు. చారు ఆరోగ్య ప్రదాయిని.

పాకశాస్త్ర నిపుణత అంటే రుచికరమే కాదు ప్రాణం లేచి వచ్చేంత పాకశస్త్ర నిపుణత. సావిత్రీపాకము సీతపాకము దమయంతీపాకము లేవు. నలభీములకొక్కరికే ఖ్యాతి. చారు ఎంత గొప్పదో 'దప్పళము' అంటే ముక్కల పులుసు లేని విందు ఉండదు. పచ్చడి, పులుసులు అనుపానము పప్పుదప్పళముగ పప్పన్నము విందు ఆరోగ్య ప్రదాయిని నలభీములను జ్ఞాపకము చేస్తుందని చెప్పడము ఉద్దేశము తప్ప పప్పుదప్పలములకు న్యూట్రిషియన్ ఆమోదముద్ర అక్కరలేదు.

అయితే ఒకప్పుడు బ్రాహ్మణ కులస్థులు ఎక్కువుగా ఉన్న గ్రామీణ ప్రాంతములో బ్రాహ్మణేతరులు వారిని, గౌరవంగా ఆప్యాయంగా పప్పన్నం ఎప్పుడు అని పలకరించిన మాట అని సాధికారంగా చెప్పగలను.. ఇంచుమించు కనుమరుగయింది. చాలా పదాలను ఆంగ్లభాష మింగేసింది. డిన్నర్ అనే పదముగ పెళ్ళివిందులో పప్పన్నం అంటే పప్పు అన్నం కాదు. అచ్చమైన బ్రాహ్మణ భోజనం.

బ్రాహ్మణ కులవాచకము ధ్వనించ కూడదు కాబట్టి ఇప్పటి వారి తృప్తికి శాకాహార భోజనము అని అర్థం. ఒకప్పుడు శాకాహార భోజన ఫలశాలలు లేవు. ఎవరు నడిపినా ముందు బ్రాహ్మణ శబ్దం తగిలించుకుని నడిచాయి. మరీ పాతకాలానికి వెళితే పూటకూళ్ళు. శ్రీనాథునిదని చెప్పబడు క్రీడాభిరామములో "పూట కూటింటికిన్ గుడువబోదమె లెక్కయిచ్చి. కడునాకటి కొన్నార మిప్పట్టునన్" అని వెళ్ళే భోజనశాలలుండేవి.

మంచి అర్థములోనె కాని బ్రాహ్మణుడికి పప్పుకి అవినాభావ సంబంధం ఉందని మనవి. పిల్లనిచ్చిన మావగారి కన్న అల్లుడికి భార్య తల్లి అత్తమీద ఎక్కువ

గౌరవం. అందుచేత అల్లుడికి అత్తాశ అన్నారు. కమ్మని పిండివంటల భోజనం పెడుతుందనా? ఎందుకంటె అడిగిన కానుకలకు తాళికి తలవంచిన కూతురులా మావ ఎప్పుడో తలవంచేశాడు. కాని ఎందుకు అంతటితో ఊరుకోక బ్రాహ్మణుడికి పప్పాశలాపోల్చి జతకలిపారో తెలియరు. అల్లుడికి అత్తాశయేమొ కాని బ్రాహ్మణుడికి మాత్రమే కాదు ఆంధ్రులందరికీ అక్షరలక్షలు చేసే పప్పు భోజనం ఇష్టం అన్నది నిజం..

సంస్కృత సాహిత్యంలో ఉదాహరణ చూపించకపోతే పండితరంజనము కాదు. భోజమహారాజు కవిత్వానికి అక్షరలక్షలిచ్చేవాడు. అయితే అప్పుడుకూడ పప్పు అన్నమే అడిగాడు కవి. "భోజనం మమదేహి, రాజేంద్ర ఘృతసూప సమన్వితం" అంటే రాజా! నెయ్యివేసి పప్పు అన్నంపెట్టు అని అర్ధము. అక్షరలక్షలు కవిత్వానికి పప్పు అన్నం సంపాదించింది. అయితే మనసు ఒప్పలేదు. "మాహిషంచ శరశ్చంద్రికా ధవళందధి" శరత్కాలవెన్నెల కాంతి పెరుగుతో భోజనం పూర్తి చేయకపోతే పప్పన్నం తిన్న తృప్తిరాదు భోజనము చేసి వెళ్ళవయ్యా అని కాళిదాసు పప్పన్నానికి ఖ్యాతి తెచ్చాడు. శ్రీకృష్ణదేవరాయలు ఆముక్త మాల్యద పద్యాలలో రచించారు. గోదాదేవి.. రంగనథుల కల్యాణ గాథది ఆయన రచించిన ఆముక్తమాల్యదను రంగాచార్యులనే కవి పాడుకునే వీలుగా రచించాడు. అందులో ఆయన పెళ్ళి ఐదురోజులు జరిగినట్లు చెప్పాడు. రంగనాథుడుకి పెళ్ళికొడుకుగ చూడికొడ్త అని వాడాడు. బ్రాహ్మణ అతిథులు ఆశించిన పెళ్ళివిందులో ముంతమామిడి పప్పు ప్రస్తావన ఉంది.

**"సుబ్బంభొట్లూ విన్నావషరా, చూడికొడ్త పెళ్ళషరా**
**అబ్బాయిని అచ్చయ్యను మరిమన అవధానులను కేకయిరా**
**సంతర్పణమష సంతస మొదవగ గొంతువరకు తిందాం**
**ముంతమామిడి పప్పు మిషాయిష ముందు మనము పోదాం**
**అడిగినంతమటుకొడ్డిస్తారష అరటికాయ యిగురు**
**వడియము లప్పడమటుకులు తేనెయు వడలు పొంగలియు**
**చారు**
**చెయ్యి దిగజార గోహ్రృతమషరా చెప్పతరమెబ్రాహ్మణోభ్జన**
**ప్రియత్వము వ్యంగ్యమా?**

కవిశేఖర పానుగంటి లక్ష్మీనరసింహారావు పాచక మహాజనసభ పేరిట ఒక వ్యాసము సాక్షిలో రాశారు. అది వంట వాళ్ళను గురించి వ్యంగ్య రచన."అధిపాన్నరాయలే ఆస్థాన పండితుల్ ఘనుడగు పెద్దన్న కందిపప్పు" అన్న సీసపద్యము ఆవ్యాసములో పాచక కళమీద కొంచెం చిన్నచూపు అనిపిస్తుంది. నలభీములను కూడ వ్యంగ్యానికి గురిచేసారు. కవి ముదిరికాని, వంటవాడు కాలేదని వ్యంగ్యబాణం వ్యాసంలో హాస్యధోరణికి అర్ధముగా అవసరమే అయినా ముగింపు మాత్రం వంటవారిని కించపరిచేదిగ అనిపిస్తుంది. కాని ఈనాటి పెళ్ళివిందులు వారికి గౌరవస్థానాన్నిచ్చాయి. నిజానికి ఆతిథ్య ధర్మములో పచనానినికి ఎంతకష్టపడాలో చెబుతారు. మగవాడు భోజనానికి ఆహ్వానిస్తాడు. గృహిణి వండాలి.

ఇప్పుడు చిటికలో వంట చేసి డిన్నరుకైనా, లంచ్ కైనా అహ్వానము. పప్పు తప్పకుండా ఉండే వంటకముగా ఆహ్వాన భోజనము భార్యభర్తలిద్దరూ కృష్ణదేవరాయల కాలములోని ఆత్మీయ కష్టము పద్యరూపములో చెప్పాడు ఎంత కష్టపడాలో ఆముక్తమాల్యదలో కనిపిస్తుంది. ఆకాశము, నేలఏకమైన వానజడిలో వర్షాకాలంలో అథిధులకు భోజనము వండడం కష్టము. పొయ్యి మండక పొగకు కళ్ళు మసకబారుతాయి. కాని విష్ణుచిత్తుడు ఆ సమయంలో భార్యకు వంటకు సహకరించాడు వర్షాకాలమునన్ని రోజులు బొరియలు చేసి నీరు వెడలించిన కొబ్బరి బొండాలు చిప్పలు వేసవిని ఎండినవి తవులించి వంట పొయ్యికి మంటకు దగ్గరుండి సహకరించేవాడు.

**గగనము నీరుబుగ్గ కెనగా జడివట్టిననాళ్ళు భార్యక**
**న్భొగ సొరకుండ నారికెడపుం బొఱియల్దవులించివండన**
**య్యపగల ముంచిపెట్టు గలమాన్నము నొల్చిన ప్రప్పు నాలుగే**
**న్భొగిసిన కూరలు న్వడితముల్వరుగు ల్పెరుగు న్ఘృత ప్లుతిన్**

పప్పు ప్రసక్తి ఉంది. నాలుగు కూరలు, వడియములు, పెరుగు,వడపిందెలు చల్లనీరు, చల్లని మజ్జిగ వేసవి తృప్తిని మించిన భోజనానికి రండన్న వర్షాకాలములో కూడ దొరికిన పప్పన్నం పిలుపు స్వర్ణయుగము మాంసాహారాన్ని గొప్పగా భావిస్తూ జీవహింస చేయకండని ప్రబోధిస్తుంది.

డా. జొన్నలగడ్డ మార్కండేయులు
ఫోన్ : 9440219338

# ప్రవాస సాహిత్య దీపాల వెలుగులు

ఆసక్తి, అభిరుచి, పేషన్ వీటికి వయసుతో నిమిత్తం లేదని మరోసారి నిరూపించారు డా. రమేష్ ప్రసాద్ రావెళ్ళ. అమెరికాలో కంప్యూటర్ శాస్త్రవేత్త గా స్థిరపడిపోయి నలభై ఏళ్ళయిపోయినా వారికి చిన్నప్పుడు చదువుకున్న తెలుగు పుస్తకాలంటే అభిమానం పోలేదు. చదవటం అనే అలవాటు ఆయనకు ఎందరెందరినో పరిచయం చేసింది. ఆయా పుస్తకాల్లో ఆ రచయితలేం చెప్పారో తనతోటివారికి చెప్పాలనిపించి రచనా వ్యాసంగంలోకి దిగారు. ఎక్కడ కొత్త ఆలోచన మొలకెత్తినా దానికి పాదు చేసి పెంచే **మిసిమి** పత్రిక వారిలోని అక్షరాలను చిత్రిక పట్టి చక్కటి చిక్కటి వ్యాసాలు వెలువరించింది.

మంచి విమర్శకుడవ్వాలంటే ముందు మంచి పాఠకుడై ఉండాలనేది అందరు చెప్పేమాట. ఆ విషయంలో ప్రసాద్ గారిది చెదరని ఏకాగ్రత. నిరంతర పఠనశీలి. భారతీయ రచయితలు అనేకమంది ఆంగ్లంలో సాహిత్యాన్ని వెలువరించారు..వెలువరిస్తున్నారు.. ఆ రచనలు తెలుగువారికి అవసరమైన మేర పరిచయం అవటం లేదని ఆయన భావన. ఆ లోటు భర్తీ చేసేందుకు డా. రమేష్ ప్రవాస సాహిత్యం శీర్షికన ఓ ఇరవై వ్యాసాలు **మిసిమి** పత్రికలో వెలువరించారు. అవన్నీ ఇప్పుడు సంకలనంగా వచ్చాయి. ఎప్పుడు కూడా సంకలనం చదివినప్పుడు రచయిత దృక్పథం తెలియ వస్తుంది. దానర్థం ఆయన లెఫ్టా,రైటా అనికాదు. విశ్లేషణలో ఒక సూత్రత ఉంటుంది. ఆ సూత్రత ఈ పుస్తకం ద్వారా చదువరి పట్టుకోగలుగుతాడు. ఈ వ్యాసాల్లో ఆయన వీలైనంతవరకు రచయిత ఆత్మను మన ముందుంచుతారు. రచయిత పెరిగిన తీరు, ఆ రచయితను ప్రభావితం చేసిన అంశాలు, ఆతని సృజనలో ఎలా ప్రతిఫలిస్తాయో చాలా సూటిగా వివరిస్తారు. ఆయా రచయితలను విశ్లేషించే క్రమంలో రచనే కొలమానం కానీ రచయితకున్న స్థాయితో ఆయనకు సంబంధం లేదన్నది ఆయన నమ్మకం అందుకే ఈ వ్యాసాలన్నీ రచనలను నిష్పాక్షికంగానే తూకం వేస్తాయి. అరుంధతీరాయ్, విక్రంసేథ్ రచనలను విశ్లేషిస్తూ వారిరువురూ తమ తర్వాత రచనల్లో ఎలా తేలిపోయారో, ఎందుకు తేలిపోయారో కూడా చెప్తారు. ఉదాహరణకు గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్ నవల ఎందుకంతగా పాశ్చాత్య దేశాల వారిని ఆకర్షించిందో రమేష్ గారు చేసిన విశ్లేషణ మనల్ని ఆలోచనలో పడేస్తుంది. ఆ నవల్లోని లోపాలు చెప్పేందుకు కూడా ఆయన వెనుకాడరు. మొదటి నవల ఇంత బావుంటే రెండో నవల మినిస్ట్రీ ఆఫ్ అట్మోస్ట్ హేపీనెస్ ఎందుకు అదే దేశాల వారికి నచ్చలేదో సహేతుకంగా చెబుతారు. ఇదే లాజిక్ ఆయన విక్రంసేథ్ నవల్లోను ఉపయోగిస్తారు. వాక్యాల మధ్య ఉండే అంతరార్థాన్ని విశ్లేషించట విమర్శకుడి బాధ్యత. ఆ పని సవ్యంగా చేసినట్టనిపిస్తుంధి డా. రమేష్ ఈ వ్యాసాల్లో. ఇందులో ఝుంపాలహరి, అమితావ్ ఘోష్, గీతా మెహతా వంటి కాల్పనిక రచనలతో పాటు తెలుగు క్లాసిక్స్‌ను ఆంగ్లంలోకి అనువదించి చాలా కాలం విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో పనిచేసిన వెల్చేరు నారాయణరావు రచనలను సమ్యక్ దృష్టితో పాటు కొంత అడ్మిరేషన్‌తో పరిశీలంచడం విశేషంగా అనిపిస్తుంది. ఒకవిధంగా చెప్పాలంటే వెల్చేరు వారి కృషిని అంత చక్కగా అరటిపండు వలిచి చేతిలోపెట్టినంత సుతారంగా వివరిస్తారు. ఆయనను తెలుగు సాహిత్య సమాజం అంతగా పట్టించుకోలేదన్న నిష్టూరం కూడా ఉంది.




అలాగే రాజారావు **సర్పెంట్ అండ్ రోప్**ను **రజ్జు సర్పభ్రాంతి**గా అనువదించిన అశ్వినీకుమార్ శైలిని పరిచయం చేసినప్పుడు, అనువాదకులకు ఒక శైలి ఉంటుందని మనలో చాలామంది గ్రహించం కదా అనిపిస్తుంది. చాలా సందర్భాల్లో అనువాద నియమాలు ఎలా రచయితలు లెక్కచేయరో కూడా చెబుతారాయన. ఒకవిధంగా ప్రవాస సాహిత్యం అన్నారు కానీ, తెలుగు సాహిత్యం పరిణామ క్రమాన్ని పట్టించే వ్యాసమొకటుంది. ఆ వ్యాసం శీర్షిక తెలుగు సాహిత్యం మార్గదర్శకులు. రచయిత అభిప్రాయాలతో మనం ఏకీభవించకపోయినా ఆయన విశ్లేషణకు వంకపెట్టలేం.. భారతీయ సాహిత్యంలోని తాత్వికతను ఆంగ్ల సాహిత్యం సృజించిన భారతీయ రచయితలు ఎలా ఆ తాత్వికతను స్వీకరించి తమ రచనల్లో ఇమిడ్చారన్న పరిశీలన చేస్తారు డా. రమేష్ ఈ పుస్తకం ద్వారా. దీన్ని మనం అంగీకరించినా, అంగీకరించకపోయినా కలిగే నష్టమేమీ లేదు కానీ.. ఒక పాఠకుడిగా ఒక నవలో, కథనో, విమర్శనో ఎలా చదవాలో దీపం వెలుగులా ప్రసరిస్తుంది ప్రవాససాహిత్యం పుస్తకం.



డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల

*- చెన్నూరి సీతారాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి, రిటైర్డ్)*

# మధురవాణి

## డాఫొడిల్స్ - పుష్పవిలాపం

*– డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల*

**మధురవాణి :** నమస్తే ఎడిటర్ గారూ

**మిసిమి సంపాదకులు :** మధురవాణీ, రమ్ము రమ్ము.

**మధుర :** క్షమించాలి సార్, రమ్ము లేదు, విస్కీ పట్టుకు వచ్చాను.

**మిసిమి :** చింతనాత్మకతకు ఏదైనను సమ్మతమే. కొత్త కబుర్లేమిటి చెప్పరాదో!

**మధుర :** మీరు మా విజ్జినారం (విజయనగరం) రావాలి సార్. రోజూ మాకు సాహిత్య ఘోషలే.

**మిసిమి :** ఘోషలు కాదు, గోష్ఠులు, సాహిత్యగోష్ఠులు.

**మధుర :** సరి సరి. ప్రతి శుక్రవారం మాయింటికి ఒక ఆచార్యుల వారు వస్తారు సార్. ఆయన పెద్ద భాషాపండితుడు. ఆయన ఉపన్యాసాలు వినటానికి ఇంకా కొందరు పండితులు వస్తారు. మా అమ్మాయిలు వారికి మంచి తాంబూలం కట్టి ఇస్తారు. వారు జేబు లోంచి తమ బుడ్డి తీసి, ఒక గంట, రెండు గంటలు అనర్గళంగా ఉపవాసాలు చేస్తారు!

**మిసిమి :** అయ్యో! దేనికమ్మా?

**మధుర :** రెండు వారాల క్రితం పుష్పాల గురించి మాట్లాడారండీ. నాకు ఇంగ్లీషు చదువు రాదుగాని, మీలాంటి వారు చదివి ఉంటారు, విలియమ్వర్డ్స్ వర్త్ రాసిన డాఫొడిల్సని పేరు అట.

**మిసిమి :** అవునవును, ఎంతో ప్రసిద్ధిగాంచిన కవిత అది.

**మధుర :** మా శుక్రాచార్యులు (శుక్రవారం వచ్చే ఆచార్యులు) అంటారూ, ఆ కవితలో కవిత్వమెక్కడ, సందేశమేమి. పైగా, పగలు నీరెండలో గాలికి నాట్యం చేసే పుష్పాలను, రాత్రి కనపడే ఆకాశతారలతో పోల్చడం అదేమి కవిసమయం, అలంకారం ఎక్కడ అన్నారు అండీ?

**మిసిమి :** ఏమిటి మధురవాణీ, నీవు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వర్డ్స్ వర్త్ గేయాన్నే విమర్శించుతున్నావా?

**మధుర :** నేను కాదు సార్, మా శుక్రాచార్యులు చెప్పిందే మీకు చెప్పుతున్నా. ఇవన్నీ నాకు ఎలా అర్థం అవుతాయి.

**మిసిమి :** ఇంకా ఏమన్నారు మీ ఆచార్యులు వారు?

**మధుర :** ఆ డాఫొడిల్స్ గేయాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పుష్ప విలాపంతో పోల్చారు సార్. ఆచార్యులంటారూ – వర్డ్స్ వర్త్ పువ్వులు ఊరికే గాలిలో డాన్సు చేస్తూ,పసుపు రంగులో అందంగా కనపడతాయి అంతే. ఆ గేయంలో మంచి అలంకారాలుండవు, గొప్ప వర్ణనలుండవు, కవి చమత్కారాలు లేవట. సంస్కృతంలోనూ, తెలుగులోనూ శతాబ్దాల నుండి మనకు అలంకార శాస్త్ర గ్రంథాలున్నాయని, కాళిదాసు నుండి నేటి సినిమా కవులవరకూ, ఆ అలంకారాలను అధ్యయనం చేసి, కొత్త ప్రయోగాలు చేస్తుంటారని,బ్రిటిష్ కవులకు అట్టి వ్యవస్థ లేదని ఆచార్యులవారి ఉవాచ!

**మిసిమి :** అది సబబే. సందేహం లేదు.

**మధుర :** కరుణశ్రీ గారి పుష్ప విలాపం పద్యాలూ చదివితే, ఎంతో లోతయిన అర్థం ఉంటుంది, కరుణ రసం చిప్పిలుతుంది. పుష్పం, దేవుడి కోసం పూలు కోసుకోవటానికి వచ్చిన భక్తుడిని జాలిగా అడుగుతుంది, తిడుతుంది. మా తల్లి వడిలో ఆడుకొనే మమ్ములను తుంచి ఆ దేవుడి కిస్తే, నీకు మోక్షం ఎలా వస్తుంది అంటుంది. మేము గాలిని గౌరవిస్తాము, సుగంధాన్ని విరజిల్లుతాము, తుమ్మెదలకు తేనియనిస్తాము. నీవేమో మా గొంతులు కోసి,ఆ నెత్తుటి పుష్పాలని దేవుడికి సమర్పిస్తావా అని అడుగుతుంది.

**మిసిమి :** బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు అని కూడా అంటుంది గదా!

**మధుర :** అవును, ఆ పదం మీ **మిసిమి** వారికిష్టమని నాకు తెలుసు. పైగా స్త్రీలు ఆ పుష్పాలను జడలో మాలలు పెట్టుకోవటానికి సూదితో గుచ్చి, హింస పెట్టి, తాము ఆనందించుతారు. పువ్వుల నుండి అత్తరు తీసి, వడలిపోయిన పువ్వులను, చీపురితో ఊడ్చేస్తారని విలపిస్తుంది ఆ పుష్పం.

**మిసిమి :** మధురవాణీ, ఆ కవి మీలాంటి వాళ్ళ జీవితాల గురించి కూడా అర్థం వచ్చేటట్లు వ్రాసినాడు గదా.

**మధుర :** అవును సార్, ఆచార్యులు అది కూడా విశదంగా చెప్పారు. ఖిన్నురాలను. ఇలాంటివి మీలాంటి వారితో చెప్పుకుంటే, మా అమ్మాయిల జీవితాలు బాగు పడతాయని నా తపన. కరుణశ్రీ గారి పద్యాలను మనం ఎన్నో కోణాల్లో చూడవచ్చును. ఆ పద్యాలలో కొత్త ధోరణి ఉండటమే కాకుండా, మంచి సామాజిక సందేశం కూడా మిళితమయి ఉన్నదని మా శుక్రాచార్యులు అన్నారు. పైగా ఘంటసాల మాష్టారు పుష్ప విలాపం పద్యాలను వరసకట్టి గ్రాంఫోను రికార్డుగా విడుదల చేయటంతో ఈ పద్యాలు సామాన్య ప్రజల అందుబాటులోకి చేరినవి. ఘంటసాల వారి గాత్రంతో ఈ పద్యాలు మరింతగా కరుణ రసాత్మకంగా ప్రసిద్ధి చెందాయని మా మాస్టారు అన్నారు. కరుణశ్రీ గారి పుష్ప విలాపంతో పోలిస్తే, వర్డ్స్ వర్త్ గేయం చాలా పేలవంగా వుంటుంది అన్నారు మాష్టారు. ఇంకా కొందరి బ్రిటిష్ కవుల పేర్లు చెప్పారండీ. అవి నాకు గుర్తుకి రావటం లేదు.

**మిసిమి :** షెల్లీ, కీట్స్, బైరన్, పోప్, కాలరిడ్జి లాంటి వారు ఉన్నారులే. వాళ్ళను రొమాంటిక్ కవులుగా పరిగణిస్తారు.

**మధుర :** అవునవును. మీరు వాళ్ల జీవిత చరిత్రలు పుస్తకాలు కూడా వ్రాసారు గదా. మాస్టారు ఇంకా ఏమన్నారంటే మా గురజాడ వారితో కాని, రాయప్రోలు, కృష్ణ శాస్త్రి, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు వంటి భావకవులతో కాని పోలిస్తే,ఆ బ్రిటిష్ కవులు వ్రాసిన కవిత్వం చాలా తక్కువ స్థాయి అనీ, వాటిలో అంత పస లేదని అన్నారు. ఆ కవితలు ఇంగ్లీష్‌లో ఉండటం మూలంగానూ, బ్రిటిష్ వాళ్ళు వలస రాజ్య వ్యవస్థలో తమ ఆధిక్యతను నిరూపించుకోవటానికి షేక్స్పియర్‌ని, రొమాంటిక్ కవులను వాడుకోవటంతోనూ, వాళ్లకు అంత పేరు వచ్చింది గాని, మన సంస్కృతాంధ్ర కవులతో పోలిస్తే వారి సామర్థ్యం చాలా తక్కువ అనీ మా ఆచార్యులు వారు అన్నారు సార్.

**మిసిమి :** అది నిజమే – మన సంస్కృతాంధ్ర కవులు కూడా ప్రకృతి వర్ణనలు చేశారు – మనది కర్మ భూమి. మనకు ప్రకృతి అంటే ఆధ్యాత్మికం – పాశ్చాత్యులకు ప్రకృతి – కేవలం భౌతికమే సుమా – కైపులో చెప్పినా – మీ ఆచార్యులు సత్యమే చెప్పారనుకోవాలి.

**మధుర :** అవునండీ, వారికి కవిత్వపు కైపు చాలా ఎక్కువ. మళ్ళీ దర్శిస్తాను సార్. సెలవు.

*- డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల, మానసాస్, వర్జీనియా*

---

## .....ఆబాలగోపాల కృష్ణప్రసాది.......

**ఈ**నాడు ప్రచారంలో ఉన్న అన్నమయ్య కీర్తనలలో దాదాపు 90శాతం ప్రజామోదం పొందిన స్వరరచనలు బాలకృష్ణ ప్రసాద్ గారివే. అన్నమయ్య కీర్తనలను తన నరనరానా, స్వరస్వరాన జీర్ణించుకున్న ఆధునిక వాగ్గేయకారులు ఆయన. 30ఏండ్ల క్రితం మా సంస్థలో ఆయన్ను కచేరీకి ఆహ్వానించినపుడు ఏ భేషజాలకు పోకుండా వచ్చి గానం చేసిన సహృదయులు. ఆనాటి నుండి మేము ఫోనులో చాలాసార్లు మాట్లాడుకున్నాం. ప్రతిసారీ ఆయనే అన్నమయ్య కీర్తనల గురించి పారవశ్యంతో మాట్లాడుతూ నా సందేహాలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పేవారు. ఆయన స్వరపరిచిన కీర్తనలను పొగుడుతున్నప్పుడు చిన్న పిల్లాడిలా మురిసిపోయే వారు. నేటికాలంలో దేవుని కల్యాణోత్సవాలలో,మన యింటి పెళ్ళిళ్ళలో ఆయన స్వరపరిచిన "పిడికిట తలంబ్రాల పెళ్ళికూతురు" "జగడపు చనవుల" వంటి వందలాది కీర్తనలు విధిగా వినిపించడం ఆయన ధన్యజీవితానికి ప్రబలతార్కాణం. ఆయనకు సంగీతాభిమానులు ఋణపడివుంటారు. ఆయన మాత్రం అన్నీ త్రెంచుకుని అన్నమయ్య చూపిన కైవల్యాన్ని చేరుకున్నారు.



గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్

*- డా. పురుషోత్తమాచార్య*

## చింతన, చేతనల కూడలి-బహుముఖ బనారస్




తెలుగు వారందరికీ కాశీ నగరం అంటే ఒక ఉద్వేగంతో కూడిన ప్రయాణం.జీవితంలో ఒకసారైనా కాశీ విశ్వనాథుడి దర్శనం చేసుకోవాలని తహతహలాడుతుంటారు.చాలామంది అక్కడే చివరి మజిలీ గడపాలని ప్రయత్నిస్తారు.ఉండేందుకు గూడు ఏర్పాటు చేసుకుని కొందరు నెలల తరబడి తిష్ట వేస్తారు.కాశీ ముక్తిధామం మనకు.అందుకే తెలుగు వారు అత్యధిక సంఖ్యలో కనపడతారు. కాశీ మీద  పుస్తకాలు అనేకం వచ్చాయి.మరి బనారస్ అంటారేమిటి.మనకు తెలిసింది కాశీ లేదా వారణాసి కదా. ఇక్కడ మనకు కిల్లాడ సత్యనారాయణ గారు కాశీ నగరం విశ్వరూప దర్శనం చేయిస్తారు.కాశీకి వేల రూపాలున్నాయంటూ కాశీకున్న కాలాతీత రహస్య సౌందర్యాన్ని వివరిస్తూ కాశీ బనారస్ ఎలా అయిందో తెలియపరుస్తారు.బహుముఖాల కాశీయే బనారస్ అన్న సత్యం ఈ పుస్తకం చదివితే బోధపడుతుంది.

కాశీకో ఆధ్యాత్మిక వాతావరణం ఉంది.ఆ ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్గుణ సంగీతముంది.ఈనగరంలో నిరంతర సంగీత సాహిత్య సాంస్కృతిక స్రవంతి పున్నమి వెలుగై ప్రకాశిస్తూ ఉంటుంది. వారణాసి పట్టణంలోని వీధి వీధి మనచేత దర్శింపచేస్తుంది పుస్తకం.మిగిలిన నగరాలు ఎందుకు కాశీకి సాటిరావో కూడా చెబుతుంది.కాశీలో దేవుళ్ళకు మాత్రమే కాదు ఉత్సవాలు, సంగీతానికి పండుగ గంగానది సాక్షిగా జరగటమో విశేషం. ఆ పండుగ "గులబ్బారీ -బుడవా మంగళ్". పడవలన్నీ ముస్తాబవుతాయి ఈ ఉత్సవం కోసం.. కొన్ని పడవల్లో నృత్యం, కొన్ని పడవల్లో సాహిత్యం , కొన్ని పడవల్లో సంగీతం .. గంగానది కళామతల్లికి నీరాజనం పలుకుతుంటాయి.హోలీ తర్వాత వచ్చే మంగళవారం నాడు ఈ వేడుక నిర్వహిస్తారు. కాశీ గాయకులు పాడే టుమ్రీలకు ఓ ప్రత్యేకత ఉంది. టుమ్రీ గాయని రసూలన్ బాయి ఇక్కడి వారే.పేదరికంతో పోరాడారు.కానీ పాటను మాత్రం వదల్లేదు.గంగాజలం ఆవిడ టుమ్రీగానాన్ని పరిరక్షించింది. టీ షాపు నడుపుకుంటూ సాధన చేశారు. రేడియోలో ప్రోగ్రాములిచ్చారు.ఇలాంటి గాయకులెందరో కాశీ కర్మభూమిని సుసంపన్నం చేశారు. కాశీలో కబీర్ చౌరా ఉంది. ఇక్కడే కబీర్ జ్ఞానోదయం పొందింది.ఆ వీధంతా కళాకారుల నిలయం.వారిలో అధికులు పద్మపురస్కారాలందుకున్నవారు. మరెక్కడా ఈ వింత కనపడదు మనకు.ఇదే వీధిలో కబీర్ మఠం కూడా ఉంది.ఇదీ కాశీ నగరం మహోన్నత సంస్కృతి. కాశీ నగరం పితృదేవతల తర్పణాలకు, పిండ ప్రదానాలకు ప్రసిద్ధి.పీడించుకుతినే పండాలకు కూడా.పూజలు కూడా చేయిస్తారు.నోటితో తక్కువ,కళ్ళతో ఎక్కువ మాట్లాడతారు. మీ జేబు బరువుని బట్టి తారతమ్యాలుంటాయి కానీ కులం బట్టో మతం బట్టో కాదు.పండాలకు సహాయంగా పనిచేసే భండర్ వ్యవస్థ ఉంటుంది.వీరు పండాలకు గుమాస్తాల్లాంటివారు.దక్షిణ తక్కువ ఇచ్చారో దండించినంత పని చేస్తారు. మహాత్మా గాంధీ అంతటి వాడికి కూడా దక్షిణ ఇవ్వనందుకు నరకానికి పోతావు అన్న దీవెన తప్పలేదు.ఎవరిని లెక్క చేయకపోవడమే కాశీ వైశిష్ట్యం..

కాశీలోని మార్మికత భంగు సేవనంతో మరింత విస్తరిస్తుంది. ఇక్కడి భంగు జగత్ప్రసిద్ధి. కాశీనగరం మస్తీకి భంగ్ ప్రతీక. ఆఖరికి మహాశివరాత్రి నాడు ఆ విశ్వనాథుడికి కూడా భంగ్ నివేదిస్తారు. కాశీ సాహితీకారులు భంగ్ సేవనంతో పునీతులవుతూనే వాదోపవాదాలకు దిగటం ఒక సరదా ఇక్కడ అంటారు రచయిత. బెనారస్ అంటే కబీర్‌కు ఎంత ప్రేమో మీర్జా గాలిబ్‌కు అంతే ప్రేమ. యవ్వనంలో ఇక్కడికి వచ్చుంటే ఈ నగరాన్ని విడిచే వాడిని కాదంటారు.బనారస్ నగరం దేవాలయానికి దీపం లాంటిదని ఆర్తితో చెబుతారు. కాశీ నగరం నిత్యం వసంతశోభితమై విలసిల్లుతుందని ప్రశంసిస్తాడు గాలిబ్. ఇక్కడ బెనారస్ విశ్వవిద్యాలయం నెలకొల్పడానికి పండిట్ మదన్ మోహన్ మాలవీయ చేయని ప్రయత్నం లేదు. జోలె పట్టారు.రాజాస్థానం చేరి రాజును అర్థించారు. మీవంతు కృషి చేయమంటూ.సూర్యోదయం నుండి సూర్యాస్తమయ సమయం వరకు ఎంత దూరం నడిస్తే అంత భూమి మీ విశ్వ విద్యాలయం కోసం ఇస్తాను అన్న రాజు సూచన మేరకు నడిచారు.. పదమూడు వందల ఎకరాల భూమిని విశ్వవిద్యాలయం కోసం సేకరించారు. ఇంకే నగరంలోనూ ఇలా జరగలేదు..

ఆదిశంకరుల జ్ఞాన చక్షువు తెరుచుకున్న స్థలం కాశీ.తులసీదాసు నడిచిన మట్టి కాశీది. బుద్ధుడు లోకానికి ధర్మ ప్రవచనం చేసిన చోటు కాశీది. కబీరు, రవిదాసుల జన్మస్థలం కాశీది. భారతీయ సంస్కృతికి రాజధాని కాశీ..

అందుకే కాశీకి బహుముఖాలు. ఈ అలౌకిక, లౌకిక ప్రపంచాల కూడలిలో మనలను కలయదిప్పుతారు కిల్లాడ వారు.కాశీని దర్శించి భౌతికంగా పునీతులమవుతామేమో, బహుముఖ బెనారస్ పుస్తకం చదవటం ద్వారా కాశీ నగరం మనలను మానసికంగా ప్రక్షాళిస్తుంది..మనలో చిరంతన వెలుగును నింపుతుంది. చింతలకు దూరం చేస్తుంది.

*- సి.ఎస్.ఆర్.*

**బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్ 78 బ్యాచీ, మాకు జరిగిన పేచీ-అంతంలేని హేమంతంలో వసంతంగా సంజీవదేవ్‌తో లాలూచి**

**మొన్న 3.3.25న మిసిమి ఆఫీస్‌లో :** ఒకో రీడింగ్, ఒకో రైటింగ్, ఒకో పత్రిక ఎడిటింగ్, మరో బుక్ ముందుమాటగా-అనేకపదాల ఆటుపోటులో-అన్నీ తనేగా-ఉచ్ఛ్వాసనిశ్వాసల ఎడిటర్ అశ్విని మధ్యలో "ఇది ఏమిటండీ ఇలా రాశారు! మీ గురువు గారు?" అని శ్రీ సంజీవ్ దేవ్ లేఖలు-కొత్త ఎడిషన్ డ్రాఫ్ట్ రెవ్యూ చూస్తూ నన్ను నిలదీశారు ఏదో అప్పు ఉన్నట్లుగా!. "సార్! 1988లో నేను విద్యార్థిగా చదివాను - కొన్ని లేఖలు 1997 వరకు రాసుకొన్నాము, అంతే" అన్నట్లు చూశాను.



శ్రీ సంజీవదేవ్ గారు శ్రీమతి కృష్ణాభాయికి రాసిన ఓ లేఖ అంశంగా-"అందంలో ఆనందంలో ఉండడం" ఇప్పుడెలా పండటం? దేశాలు-దేశాలు, కాలం-కాలం సంబంధం-వారిద్దరకి వర్తించదా?ఎలా అన్వయించగలరు-మీరే చెప్పగలరు"యని ఎదురుగా ఉన్న 1978 to 1982 బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్-బంధం 78-Reunion 2022-ఒక ఆల్బమ్ లాంటిది చూపించి తన పనిచేసుకోవడం, మరల సాయంకాలం 6గం వరకు ఉ ఒడండని ఓ ఆదేశం-ఏదో తెలియని సందేశంగా!. అక్కడే Mylife వెనిగళ్ల కోమల ఆంగ్లంలో రచనా ఆల్బమ్ అటుఇటుగా తిప్పుతూ, బాపట్ల అగ్రికల్చరల్ కాలేజ్-బంధం 78-Reunion 2022 తగిలిన కొప్పును, కాఫీకప్పు అనుకొని ఆస్వాదించాను. వారి 1978 గుంపులో 167 మందిలో 141 నందులు- పసందులు ప్రతిఏటా చేసుకొనే విందులుగా-ఏవో వైబ్రేషన్స్ ఉన్నాయబ్బా! ఇది నిజంగా ఒక కాఫీ టేబుల్ బుక్, ఎంతోటెంపో ఉండడం-నాలుగు దశాబ్దాల కాలం కరిగిపోయినా ఈకాలంలో ఏదో ప్రదేశంలోనున్న మాకు గేలం వేసి లాగడంలో- దాగుంది వారి 78 బంధం-అదిగో ఆనాటి శ్రీ సంజీవదేవ్ శ్రీమతి కృష్ణాభాయికి రాసిన ఓ లేఖ సంబంధం.

సాయంకాలం 6గంటలకు-పెళ్లి కొడుకులా ఆయన తయారు, ఎక్కడికి యని నాకు కంగారు! "బానిసలు ప్రశ్నలు వేయకండి, పదండి, బంజారా హిల్స్-డైన్ ఓ చైనాకు క్యాబ్ బుక్ చేసి, మంచి బొకే కొనిపించండి" యని తీసుకెళ్లారు నన్ను ఒక పరిచయం లేని ఓ అమెరికా నివాసి బర్త్ డే సెలబ్రేషన్స్‌కు. ఆరుఅడుగుల నిలువెత్తు-కదిలే కొవ్వొత్తు-సూట్లో ఓ గమ్మత్తు-ఎదురువచ్చి "అన్నా" యని అశ్వనీని హత్తుకొన్నారు. నాలుగుదశాబ్దాల స్నేహం నాతో ఉన్నట్లు-నా అనుమానపు దాహం తీర్చారు, ఆయనే-అక్కడే జరుగుతున్న కచేరీలో మహమ్మద్ రఫీ సంగీతం తెచ్చిన హేమంతం, డా.నవీనాకు పతిదేవులట!

Déjà vu! ఎవరునీవు?ఎక్కడ చూసిన పూవు!, అది "Mylife వెనిగళ్ల కోమలబుక్", ఉదయం నేను తిరగేసిన ఆమె తెగిన జ్ఞాపకాలకు-స్వయంగా అల్లుడట! అశ్వినిగారు కోరగా-అనేక మహమ్మద్ రఫీ పాటలు-కచేరీ సింగర్ని కరిగించేలా తన గానం-అదనపుదానంగా చేస్తూ-అనేక అల్పాహారాలు ఆయనే అడిగిఅడిగి వడ్డించారు-ఆ బర్త్ డే అమెరికన్ తెలుగబ్బాయి శ్రీ హేమంత్ గారు. బహుశా ఉదయం తనే అడిగిన శ్రీ అశ్వనీ ప్రశ్నకు-దేశం నుండి దేశం, ఒక కాలం నుండి మరో కాలం విడదీయని అనుబంధం - సమాధానంగా తను మైమరచి వింటున్న హేమంత్ హిందీ గీతంలో సాగుతుందని చూపించినట్లుగా.

ఎక్కడ డా. ఇన్నయ్య-అక్కడ ఆదికవి నన్నయ్య, ఇక్కడ నా సంజీవదేవ్ తెగిన తెనుగుపాకాన్ని పంచుకొంటూ, ఓ కాఫీటేబుల్ బుక్ పట్ల అగ్రికల్చరల్ కాలేజ్ 78 బ్యాచీతో మాకు జరిగిన పేచీ-అంతంలేని హేమంతంలో వసంతంగా పాత+కొత్త కదిలే సంజీవదేవ్‌తో లాలూచి పడ్డాము. పాపం మా రాంబాబు మిస్సయ్యారు.

*- ఐ.వి.రామరాజు, ఫోన్ : 9912644386.*

# వాయులీనం

**– చాగంటి సోమయాజులు**

వాస్తవ సంఘటనల, నిజజీవితాల ప్రతిబింబాలు 'చాసో' అనబడే, చాగంటి సోమయాజుల గారి కథలు. ఏమాత్రం నాటకీయతలేని, అసలు సిసలు తెలుగు కథలు. కష్ట సుఖాలనే కాక, మనుషుల నైజాల్ని, తీరుతెన్నుల్ని డబ్బు ఎలా నియంత్రిస్తుందో వెతికి పట్టుకున్న నిశిత దృష్టి ఆయనది. 1915లో పుట్టి, 1994లో మరణించిన చాసో ఇంచుమించు జీవితమంతా విజయనగరంలోనే గడిపారు. ప్రాంతీయ నుడికారం, యాసలోనేకాక, మొత్తం ఆంధ్రదేశపు పలుకుబడిని, మాటతీరుని తన కథల్లో సజీవంగా ప్రతిష్ఠించారు. చాలా మామూలు జీవితాలు, సంఘటనలే ఆయన కథల్లో. కానీ అవే సామాన్యమైన జీవిత సత్యాల్ని చెపుతాయి. 'వాయులీనం' కథ అలాంటిదే. పోతే ఈ కథలో ప్రత్యేకం, ఓ మధ్యతరగతి గృహిణి జీవితంలోని సద్దుబాటు. ఆ సద్దుబాటులోని ఔన్నత్యం. వాయులీనం ప్రధానంగా రాజ్యం కథ. ఆమె ముగ్గురు కొడుకులకి తల్లి. చెన్నై, ఆంధ్ర ఉమ్మడి రాష్ట్రంలోని ఎల్.డి.సి వెంకటప్పయ్య భార్య. అంటే కథాకాలం 1956కి ముందు రాజ్యం జీవితంలోని రెండు మూడు సంఘటనలే ఈ కథ. అయినా వాటి ఆధారంగా మొత్తం రాజ్యం జీవితాన్ని, నైజాన్ని అద్భుత కథాశిల్పంతో మనకి అందించారు చాసో.

రాజ్యం సాధారణ గృహిణి. సాధారణంగానే పెరిగింది. పోతే ప్రత్యేకత ఏమిటంటే చిన్నతనంలోనే సంగీతం నేర్చుకుంది. వాయులీనం ఆమె ప్రాణం. స్వభావ సిద్ధంగా సంగీతం సమ్మోహపరుస్తుంది. చిన్నవయస్సు నుంచి కాస్తంత రాగతాళ జ్ఞానం కలిగిస్తే, జీవితంలో సంగీతం ప్రవేశించి ఆజన్మాంతం ఆనంద హేతువు అవుతుంది అంటారు చాసో కథలో. రాజ్యం జీవితంలో ఎన్ని అపశృతులు ఉన్నా, ఆమెకి కొద్దిగానేనా సంతోషాన్ని ఇస్తున్నది ఆ సంగీత జ్ఞానమే, చిన్నతనంలో చేసిన ఫిడేలు సాధనే. పుట్టింటిలోని అన్నింటికీ దూరమైనా, కాపరానికి వస్తూ ఆమె తెచ్చుకున్నది ఆ వాయులీనాన్నే. రాజ్యం పెద్ద కొడుక్కి అయిదేళ్ళు, రెండోవాడికి నాలుగు, మూడోవాడు వాళ్ళ తమ్ముడు. రాజ్యానికి టైఫాయిడ్ జ్వరం వచ్చి మూడు వారాలు బాధించింది. తగ్గినట్టే అయి, తిరగపెట్టి మరో మూడు వారాలు పీల్చి పిప్పి చేసింది. రాజ్యం ఎముకల గూడులా మిగిలింది. భార్య బతికిందే మహాభాగ్యం అనుకున్నాడు వెంకటప్పయ్య. అతనే చెయ్యి కాల్చుకుని పెళ్ళానికి పిల్లలకి చేసి పెడుతున్నాడు. రాజ్యానికి చేయించింది, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యమే అయినా, రెండు నెలల జీతం హరించుకుపోవటమే కాక, రెండొందలు అప్పయింది. తప్పనిసరై, రాజ్యం ప్రాణానికి ప్రాణం, ఆమె సంతోష స్వస్వం ఆ వాయులీనం అని తెలిసినా, రెండొందల యాభైకి అమ్మేశాడు. ఆ విషయం ఇంకా రాజ్యానికి తెలియదు. కొంతేనా, పాప పరిహారం చెయ్యాలని భార్యకి చెప్పి, ఆ సాయంత్రం బైటికెళ్ళాడు. వచ్చేటప్పుడు ఓ కాయితం పొట్లం తెచ్చాడు. ఆ పొట్లంలో రాజ్యానికి ఓ జరీచీర, రవిక ఉన్నాయి. చేతిలో డబ్బు అయిపోతోందని వెంటనే అవి కొన్నానని, ఆమె ఫిడేలు అమ్మేసిన పనికి కొంతేనా పాపపరిహారం అనీ అన్నాడు.

అంత చేసినా, వెంకటప్పయ్య అపరాధ భావం తొలగిపోలేదు. దొంగతనం కన్నా హీనమైన పనిలా ఉంది. చేసిన తప్పనిసరి తప్పు నిలువునా ముల్లై పొడుస్తోంది. రాజ్యం హతాశయురాలైంది. ఆమెకున్న ఏకైక ఆసక్తి, ఆస్తి ఆ వాయులీనం ఇల్లు దాటి వెళ్ళిపోయింది.

"నీకు కష్టంగా ఉంటుందని తెలుసు. నేను చేసింది తప్పే" అని నేరస్తుడిలా అన్నాడు వెంకటప్పయ్య. రాజ్యం గృహిణిగా తెలివి తెచ్చుకుంది. "మీరే తప్పు చెయ్యలేదు. ఏ సంసారేనా అదే చేస్తాడు" అని నిండు మనసుతో ఆ సందర్భాన్ని సద్దేసింది. అంతేకాదు, "నా నోరు ఏనాడో నొక్కుకు పోయింది. సరస్వతి కటాక్షం నాకు అంతే ఉంది. తల్లి సరస్వతి వెళ్ళిపోతూ, తల్లి గుణాన్ని చూపించి నాకు ప్రాణం పోసింది. బతికిన నాకు ఓ చీరా, రవికల గుడ్డ కూడా పెట్టింది" అంది.

ఫిడేలు బదులు ఆ చీరే ఓ గుర్తు ఆమెకి. ఓ స్త్రీగా భర్తకి నిండైన తోడు, ఓ గృహిణిగా అత్యున్నత సద్దుబాటు రాజ్యం. గొప్ప ఔన్నత్యం, ఔదార్యాల ప్రతిబింబం వాయులీనం. అయినా సాధారణ జీవితంలోని చాలా మామూలు సంఘటనగానే కనిపించటం ఈ కథ ప్రత్యేకత.

చాసో గారు మరీ ఎక్కువ సంఖ్యలో కథలు రాయలేదు. ఏ కథకి ఆ కథ విలక్షణం. ఓ కథలో ఉన్న శిల్పం, మాట, వ్యవహారం తీరు మరోకథలో కనిపించదు. చాసో కథా సముద్రంలో విలక్షణ కెరటం 'వాయులీనం' కథ.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

# చదవండి...

– మిసిమి

**డా. టీ.వీ. భాస్కర్ ఆచార్య -జీవితం, సాహిత్యం, కళావికాసం:** ఇది సిద్ధాంత వ్యాసం. సాహిత్యంలోని అన్ని ప్రక్రియలలో విశేష కృషి చేసిన డా. భాస్కర్ ఆచార్య ప్రతిభకు పట్టాభిషేకం లాగా నిలిచిన పరిశోధనా గ్రంథం ఇది.



పేజీలు : 204, వెల : 200, ప్రతులకు : శ్రీశ్రీ ప్రింటర్స్, ఫోన్ : 8490634849

**విఠ్ఠలేశ్వర శతకం-డా. కూరెళ్ళ విఠలాచార్య :** డా. కూరెళ్ళ విఠలాచార్య వారి గ్రంథాలయం సాయి సాహితీ కుటీరం ద్వారా దేశ ప్రజలకు ప్రధాని మన్ కీ బాత్ ద్వారా సుపరిచితులు. ఈ శతకం వారు విఠ్ఠలేశ్వరుని ఉద్దేశించి రాసినదే. ఈ శతకం పచ్చని పతకం అని డా. ఎన్. గోపి ప్రస్తుతించారు. సమకాలిన సామాజిక చిత్రణ ఈ పద్యంలో కనిపిస్తుందని డా. సి. నారాయణరెడ్డి ప్రస్తుతించారు.




పేజీలు : 128, వెల : 200/–, ప్రతులకు : ఫోన్ : 9949539765, 9966906611

**లింగమూర్తి శతకం - శతక కర్త వైద్యం వెంకటేశ్వరాచార్యులు:** ఈ శతకం మైత్రీ అక్షర బంధం. అంటే సారస్వత మిత్రత్వానికి సంబంధించిన అక్షరాల బంధం అని. పూర్వం దాతలు గాని, శ్రోతలు గాని తమపై కృతులు రాయించుకునేవారు. కవులను చందన తాంబూలాలతో సత్కరించి, ఫలానా శతకం రాయమని అడిగేవారు. ఇప్పుడు ఆరోజులు పోయినాయి. ఎవరి శతకం, ఎవరి గురించైనా రచయితే రాసుకుని ఆ వెంకటేశ్వరుడే బుద్ధి పుట్టించినట్లు చెప్పుకోవాలి.




పేజీలు : 200, వెల : 200, ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, ఫోన్ : 8790727772, 9440206387

**హర్షయానం - హర్షవర్ధన్ :** యాత్రాకథనాలు రాయడం అంత తేలిక కాదు. తిరిగినంత వీజీ కానేకాదు. తిరిగి చూసినప్పుడు ఉండే ఉత్సాహం తరువాత అలసి ఇంటికి చేరినప్పుడు కలం పట్టుకుని చూసిన విశేషాలు తిరగతోడటం తనలోని రచయితను బైటకి తేవటమే. అదిగో ఆ పని హర్షవర్ధన్ చాలా చక్కగా 'పంచ్‌లతో' చెప్పగలగటం హర్షించ దగిన విషయం. వీరి రచనలో ఎక్కడ వీలైతే అక్కడ ఒక చికిలింత ఉంటుంది. అలాగే ఒక వ్యతిరేకార్థం తోస్తుంది. ఇవన్నీ యాత్రాకథనానికి అవసరం లేకపోయినా, హర్షవర్ధన్‌లోని రచయిత అలా తొంగి చూస్తూనే ఉంటాడు. ఇందులో ఎన్నో విషయాలు చదివి ఆనందించదగినవి.




పేజీలు : 120, వెల : 200, ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హర్షవర్ధన్, ఫోన్ : 9949992880.

**జాయప సేనాపతి - మత్తి భానుమూర్తి :** జాయప సేనాని జీవితానికి ఆధారాలు అయిదు. వెలనాడు మండలేశునిగా ఆయన తన పాలనాకాలంలో వేసిన నాలుగు శాసనాలు, ఐదవది ఆయన రచించిన నాట్య గ్రంథం నృత్తరత్నావళి. ఈ అయిదింటిలోనూ చారిత్రక అంశాలను ఆధారం చేసుకుని, జాయప బాల్య కాలాన్ని పన్నెండు, పదమూడు శతాబ్దాల తెలుగు జనజీవితంతో మేళవించి, రచయిత చిత్రీకరించిన ఈ చారిత్రక కాల్పనిక నవల అమోఘమైనది. ఇది చారిత్రక అంశాలు ఉన్నా, నిజంగా మన కళ్లముందు జరుగుతున్నట్లు అప్పటి వ్యక్తులను మూర్తిమంతం చేసి వారితో కథ నడపడం గొప్ప విషయం. దీనికి ఎంతో ఓర్పు, నేర్పు, భాషాపటిమ అవసరం. భానుమూర్తి గారు చదివించే భాషతో పాఠకుల్ని కథలో నిమగ్నం చేస్తూ రచన చేసిన తీరు ముదావహం. తప్పక చదవవలసిన చారిత్రక, కాల్పనిక నవల.



పేజీలు : 240, వెల : 280, ప్రతులకు : ఫోన్ : 9989371284.

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి    బహుమతిగా పంపండి**

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణంగా వారికి పత్రికను పంపడం ఆపేస్తున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi  A  Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు


**నోబెల్ వ్యాసాలు**


**మిసిమి** పార్థసారథి వ్యాసాలు


**చిత్రకళా నీరాజనం**


**దూరతీరాలలో...**


**బహుముఖ బనారస్**


**ఐరోపా శిల్ప - చిత్రకళావైభవం**


**పురస్కార సాహిత్యం**


**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**


**చార్లీ చాప్లిన్**


**రజ్జు సర్ప భ్రాంతి**


**బైరన్**


**యాత్రా కథనాలు**


**షెల్లీ జీవిత కథ**


దోసిట చినుకులు


**నృత్యభారతి**


పారిజాతం


సిద్ధార్థ


సప్తపర్ణి


ప్రవాస సాహిత్యం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**